

'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 56

శనివారం 18-5-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



రెండో రోజూ లాభాలు

మెటల్, ఆటో, కన్సూమర్ షేర్లకు డిమాండ్.. 253 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్ - 15లో



విజయంతో లక్నో ముగింపు

చివరి మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌పై 18 పరుగుల తేడాతో గెలుపు - 15లో

ప్రతిపక్షాలు గెలిస్తే అయోధ్యపైకి బుల్డోజర్లు



ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలను ఈ ఎన్నికల్లో గెలిపిస్తే అయోధ్య రామమందిరంపైకి బుల్డోజర్లను పంపిస్తాయని ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. ఆ పార్టీలు గెలిస్తే బాలరాముడు మళ్లీ టెంట్‌లోకి వెళ్లాల్సి వస్తుందన్నారు.

- వివరాలు 6లో

రాహుల్‌ను మీకు అప్పగిస్తున్నా: సోనియా



'నా కుమారుడిని రాయ్‌బరేలీ ప్రజలకు అప్పగిస్తున్నా. రాహుల్ మిమ్మల్ని నిరాశ పర్చడు' అని కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ ప్రచార సభలో అన్నారు. ఎంపీగా 20 ఏళ్లు సేవ చేసే చాన్స్ ఇచ్చినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

- వివరాలు 6లో

ఛాతీపై కొట్టాడు, పొట్టలో తన్నాడు



ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ వ్యక్తిగత కార్యదర్శి బిభవ్ కుమార్ తనపై చేసిన దాడిపై ఆప్ రాజ్యసభ ఎంపీ స్వాతి మలివాల్ సంచలన ఆరోపణలు చేశారు. ఛాతీపై కొట్టాడని, పొట్టలో తన్నాడని, చంపుతానన్నాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- వివరాలు 6లో

సగటు జీవితకాలం పైపైకి..



ప్రపంచవ్యాప్తంగా మనుషుల సగటు జీవిత కాలం పెరుగుతున్నట్లు అంతర్జాతీయ అధ్యయనం ఒకటి వెల్లడించింది. 2022 నుంచి 2050 మధ్య పురుషుల్లో 4.9 సంవత్సరాలు, మహిళల్లో 4.3 సంవత్సరాలు పెరుగుతుందని తేల్చింది.


- వివరాలు 6లో

సోనియా బర్త్‌డే కటాఫ్?

పంట రుణాల మాఫీపై రాష్ట్ర ప్రభుత్వ సూత్రప్రాయ నిర్ణయం

గత డిసెంబర్ 9 వరకున్న రుణాలకు మాఫీ వర్తింపు

- తెలంగాణ ప్రకటన తేదీ కూడా కావడంతో సెంటిమెంట్‌గా భావిస్తున్న సర్కారు
- గత రుణమాఫీ కటాఫ్ నుంచి ఈ తేదీ వరకు లెక్క... నాలుగేళ్ల కాలంలో తీసుకున్న రుణాల మాఫీ
- రైతు కాకుండా రైతు కుటుంబం యూనిట్‌గా అమలు
- ఒకేసారి రుణమాఫీ ఎలా జరుగుతుందోనని అధికారుల్లో చర్చ
- వడ్డీతో కలిపి దాదాపు రూ.40 వేల కోట్ల వరకు అవసరమని అంచనా
- మార్గదర్శకాల రూపకల్పనపై కసరత్తు చేస్తున్న వ్యవసాయశాఖ



రుణమాఫీపై నేడు నిర్ణయం

- మంత్రివర్గ సమావేశంలో చర్చించే అవకాశం
- ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే శాఖలపై కూలంకషంగా చర్చ... కాళేశ్వరం బ్యారేజీలకు మరమ్మతులపై కీలక నిర్ణయం తీసుకునే చాన్స్
- విద్యార్థులకు యూనిఫామ్‌లు, పుస్తకాలపైనా దృష్టి పెట్టనున్న కేబినెట్

5 లో

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ పుట్టిన తేదీ అయిన డిసెంబర్ 9ని పంట రుణ మాఫీకి కటాఫ్ తేదీగా ప్రకటించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు వ్యవసాయ శాఖ వర్గాలు వెల్లడించాయి. అదేరోజు తెలంగాణ ప్రకటన తేదీ కూడా కావడంతో దీన్ని సెంటిమెంట్‌గా కూడా ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన డిసెంబర్ 7ను రుణ మాఫీకి కటాఫ్ తేదీగా చేయాలనే చర్చ కూడా జరుగుతోందని చెబుతున్నారు. ఈ రెండు తేదీల్లోనూ సోనియా పుట్టిన రోజునే కటాఫ్ తేదీగా తీసుకునే అవకాశం ఎక్కువగా ఉందని అంటున్నారు.

గతంలో డిసెంబర్ 11వ తేదీ కటాఫ్

గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా లక్ష రూపాయల రుణమాఫీ చేసిన సంగతి తెలిసిందే. అప్పుడు 2019 డిసెంబర్ 11వ తేదీని కటాఫ్‌గా ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆ తేదీ నుంచి 2023 డిసెంబర్ 9వ తేదీ వరకున్న రైతుల వ్యవసాయ పంట రుణాలను మాఫీ చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అంటే సరిగ్గా నాలుగేళ్ల మధ్య కాలంలో రైతులు తీసుకున్న పంట రుణాలు మాఫీ చేస్తారని, దీనిపై మరింత స్పష్టత రావాల్సి ఉందని అంటున్నారు. గత డిసెంబర్ 9 తర్వాత నుంచి ఇప్పటివరకు రైతులు తీసుకున్న పంట రుణాలు మాఫీ కాబోవని అధికారులు

మిగతా 2వ పేజీలో ▶

చేతులు కాలాక 'సిట్'!

- ఏపీలో పరిస్థితులకు ఈసీ పక్షపాత వైఖరే ప్రధాన కారణం
- శాంతిభద్రతలకు విఘాతం వాటిల్లాక తాపీగా మేలుకున్న ఈసీ
- వినీత్ బ్రిజ్‌లాల్ నేతృత్వంలో 13 మందితో 'సిట్'.. రెండు రోజుల్లో నివేదికకు ఆదేశం

11 లో

టీడీపీ దాష్టీకానికి పరాకాష్ట

- కుట్ర రాజకీయానికి మహిళా వాలంటీర్ బలి

11 లో

త్వరలో గ్రూప్-4 ఎంపిక జాబితా

- 1:3 నిష్పత్తిలో ప్రకటించనున్న టీఎస్‌పీఎస్సీ
- వెంటనే అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

3 లో



శుక్రవారం మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి గాంధీపురం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని చూస్తూ దిగాలుగా రైతు కుటుంబం

ధాన్యం... దయనీయం

- అన్నదాతను దెబ్బతీసిన అకాల వర్షాలు
- తడిసిపోయిన కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం
- కొన్నిచోట్ల ధాన్యం రాశులు కొట్టుకుపోయిన వైనం

10 లో

మరో రెండ్రోజులు వానలు

- పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్
- 19న దక్షిణ అండమాన్ సముద్రంలోకి నైరుతి
- రాష్ట్రవ్యాప్తంగా 1.71 సెం.మీ. సగటు వర్షపాతం
- 2 నుంచి 4 డిగ్రీల వరకు తగ్గిన ఉష్ణోగ్రతలు

- వివరాలు 16లో

ఎంబీబీఎస్ సీట్లలో ఉమ్మడి కోటా రద్దు!

- రాష్ట్ర ప్రభుత్వానికి కాళోజీ వర్సిటీ ప్రతిపాదనలు
- జూన్ 2 తర్వాత ఏపీ విద్యార్థులకు తెలంగాణలో సీట్ల కేటాయింపు ఉండదు... విభజన చట్టం మేరకు పదేళ్లుగా 15% సీట్లు ఇరు రాష్ట్రాల విద్యార్థులకు కేటాయింపు
- ఉమ్మడి కోటా రద్దయితే రాష్ట్ర విద్యార్థులకు అదనంగా అందుబాటులోకి 200కుపైగా సీట్లు

2 లో

నేడు ఈఏపీసెట్ ఫలితాలు

- వివరాలు 11లో

క్లుప్తంగా...

ఆ ఓట్లు తొలగించండి

ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ లేఖ



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఒక వ్యక్తికి ఒక ఓటు మాత్రమే ఉండాలని, కానీ తెలంగాణలో బోగస్, డూప్లికేట్ ఓట్లతో పాటు మరణించిన వారికి కూడా ఓట్లు ఉన్నాయని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్ చెప్పారు. అందుకే హైదరాబాద్ పార్లమెంటు పరిధిలో గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పోలింగ్ శాతం తగ్గిందన్నారు. ప్రజాస్వామ్యంలో ఈ పద్ధతి సరికాదని ఆయన చెప్పారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారితో పాటు తెలంగాణలోని ఇతర ప్రాంతాలకు చెందిన వారికి కూడా జీహెచ్ఎంసీ పరిధిలో ఓటు అవకాశం ఉందని, వాటిని వెంటనే తొలగించాలని నిరంజన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసినట్లు తెలిపారు. త్వరలోనే గ్రామీణ స్థానిక సంస్థలకు, ఆ తర్వాత మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, అనంతరం జీహెచ్ఎంసీ ఎన్నికలు జరగనున్నాయని, ఈ ఎన్నికల సమయానికల్లా రెండు ప్రాంతాల్లో ఓట్లు ఉన్న వారు ఎక్కడ ఓటు వేశారో గుర్తించి వేరే చోట ఆ ఓట్లను తీసివేయాలని కోరినట్లు నిరంజన్ చెప్పారు.

టికెట్ ఇస్తానని రూ.50 లక్షలు తీసుకున్నారు

కేఏ పాల్‌పై ఫిర్యాదు.. కేసు నమోదు

పంజగుట్ట (హైదరాబాద్): ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్‌పై పంజగుట్ట పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... రంగారెడ్డి జిల్లా, జిల్లెలగూడకు చెందిన కిరణ్‌కుమార్ ప్రజాశాంతి పార్టీ తరఫున ఎల్.బీ నగర్ ఎమ్మెల్యే టికెట్ తనకు కేటాయించాలని పాల్‌ను కోరారు. టికెట్ ఇస్తానని హామీ ఇచ్చి గత సంవత్సరం జనవరి నుంచి నవంబర్ వరకు పలుదఫాలుగా మొత్తం రూ.50 లక్షలకు పైగా పాల్ తన దగ్గర తీసుకున్నట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇందులో రూ. 30 లక్షల వరకు ఆన్‌లైన్ పేమెంట్ చేశానని, మిగిలినవి నగదు రూపంలో ఇచ్చానని తెలిపారు. అయినా తనకు టికెట్ కేటాయించకుండా పాల్ మోసం చేశారని, తన డబ్బులు తిరిగి ఇవ్వాలన్నా స్పందన లేదని పంజాగుట్ట పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు పాల్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్సీ విఠల్‌కు ఊరట

అనర్హతపై సుప్రీంకోర్టు స్టే




సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్ఎస్ నేత దండె విఠల్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. విఠల్ ఎమ్మెల్సీ ఎన్నిక చెల్లదంటూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై అత్యున్నత న్యాయస్థానం స్టే విధించింది. ఆదిలాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నిక చెల్లదని హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ విఠల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఇరుపక్షాల వాదనల అనంతరం హైకోర్టు ఆదేశాలపై స్టే విధిస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. తదుపరి విచారణ జూలై 10కి వాయిదా వేసింది.

ప్రభుత్వోద్యోగులకు 42% ఫిట్‌మెంట్ ఇవ్వాలి

పీఆర్సీ చైర్మన్‌తో టీఎస్ఎస్ఏ ప్రతినిధి బృందం భేటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 42 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని పీఆర్సీ చైర్మన్ శివశంకర్‌ను తెలంగాణ స్టేట్ సెక్రటేరియట్ అసోసియేషన్ (టీఎస్ఎస్ఏ) కోరింది. శుక్రవారం టీఎస్ఎస్ఏ అధ్యక్ష, కార్యదర్శులు సురేశ్‌కుమార్, దేవేందర్ తదితరులు పీఆర్సీ చైర్మన్‌తో సమావేశమై ఉద్యోగుల సమస్యలను వివరించారు. సెక్రటేరియట్ ఉద్యోగుల పేస్కేల్‌తో పాటు పనిదినాల కుదింపు తదితర అంశాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

ఇదంజగత్



ఎంబీబీఎస్ సీట్లలో ఉమ్మడి కోటా రద్దు!

రాష్ట్ర ప్రభుత్వానికి కాళోజీ వర్సిటీ ప్రతిపాదనలు	జూన్ 2 తర్వాత ఏపీ విద్యార్థులకు తెలంగాణలో సీట్ల కేటాయింపు ఉండదు	విభజన చట్టం మేరకు పదేళ్లుగా 15% సీట్లు ఇరు రాష్ట్రాల విద్యార్థులకు కేటాయింపు	ఉమ్మడి కోటా రద్దయితే రాష్ట్ర విద్యార్థులకు అదనంగా అందుబాటులోకి 200కుపైగా సీట్లు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ఉమ్మడి కోటా కింద ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు ఎంబీబీఎస్‌లో సీట్ల కేటాయింపునకు స్వస్తి పలకాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఈ మేరకు సర్కారు ఆదేశాల మేరకు కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తైపోతున్న సందర్భంగా జూన్ 2వ తేదీ తర్వాత నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి తెచ్చేందుకు కసరత్తు జరుగుతోంది. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం పదేళ్లుగా అన్ని రకాల విద్యా సంస్థల్లో 15 శాతం కన్వీనర్ కోటా సీట్లను ఇరు రాష్ట్రాల విద్యార్థులకు కేటాయిస్తున్నారు. రెండు రాష్ట్రాల విద్యార్థుల్లో ఎవరికి మెరిట్ ఉంటే వారికి సీట్లు కేటాయిస్తున్నారు. గత పదేళ్లుగా ఇదే పద్ధతిని పాటిస్తున్నారు. ఏపీలో కాలేజీల్లో కూడా ఇదే విధంగా ఉమ్మడి కోటా అమలవుతోంది. అయితే మెడికల్ కాలేజీల విషయంలో ఇక్కడి విద్యార్థులు అక్కడ దరఖాస్తు చేసుకోవడం తక్కువ. కానీ ఏపీ విద్యార్థులు మాత్రం ఉమ్మడి కోటాను ఉపయోగించుకుని ఇక్కడ సీట్లు పొందుతున్నారు. విభజన చట్టం జూన్ రెండో తేదీతో ముగిసిపోనుంది. దీంతో ప్రభుత్వం కూడా ఏపీతో ముడిపడి ఉన్న అంశాలపై దృష్టి పెట్టింది. ఈ నేపథ్యంలో మెడికల్ కాలేజీల్లోని ఎంబీబీఎస్ సీట్లలో ఉమ్మడి కోటాను రద్దు చేస్తే, ఇక నుంచి అన్ని సీట్లు తెలంగాణ విద్యార్థులకే వస్తాయి. పీజీ మెడికల్‌లోనూ ఇదే పద్ధతి పాటిస్తారు. ఆ ప్రకారం రానున్న కౌన్సెలింగ్‌లో నిబంధనలు మార్చాలని, ఆ మేరకు నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపారు.

తప్పనిసరిగా రద్దు చేయాలనే రూల్ లేదా?

మరోవైపు విభజన చట్టం పదేళ్లతో ముగిసినా ఉమ్మడి కోటాను తప్పనిసరిగా రద్దు చేయాల్సిన రూలేమీ లేదని అధికారులు అంటున్నారు. ఇంజనీరింగ్, ఇతర ఉన్నత విద్యా సంస్థల్లో ఇలాంటి ప్రతిపాదనలపై అసలు చర్చే జరగడం లేదని చెప్పడం గమనార్హం.

విభజనకు ముందున్న కాలేజీల్లోనే అమలైన కోటా

రాష్ట్రంలో ప్రస్తుతం 26 ప్రభుత్వ, 27 ప్రైవేటు మెడికల్ కాలేజీలు ఉన్నాయి. 2022 వరకూ అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో ఉమ్మడి కోటా అమలైంది. అయితే రాష్ట్రం ఏర్పడిన తర్వాత వచ్చిన కొత్త మెడికల్ కాలేజీల్లోనూ ఉమ్మడి కోటాను అమలు చేయడంపై విమర్శలు రావడంతో బీఆర్ఎస్ ప్రభుత్వం నిబంధనల్లో మార్పులు తెచ్చింది. కొత్తగా ఏర్పడిన కాలేజీల్లో ఉమ్మడి కోటాను అప్పటి ప్రభుత్వం రద్దు చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పడిన 5 ప్రభుత్వ, 15 ప్రైవేటు మెడికల్ కాలేజీల్లోనే కోటా అమలు చేసింది. ఈ 20 కాలేజీల్లో కలిపి 1,950 కన్వీనర్ కోటా సీట్లు ఉన్నాయి. ఇందులో 15 శాతం అంటే 292 సీట్లను ఉమ్మడి కోటా కింద భర్తీ చేస్తున్నారు. ఇందులో 200కు పైగా సీట్లు ఏపీ విద్యార్థులకే దక్కుతున్నాయి. ఉమ్మడి కోటా రద్దు చేస్తే ఇక నుంచి ఆ 200 సీట్లు తెలంగాణ విద్యార్థులకే అందుబాటులోకి వస్తాయి.

విజయవాడ రోడ్డును వెంటనే విస్తరించాలి

- ఆలస్యమయ్యేకొద్దీ ప్రమాదాలతో ప్రాణనష్టం పెరుగుతుంది
- ఆర్ఆర్ఆర్ పనుల ప్రారంభంలో జాప్యం సరికాదు
- అధికారులతో సమీక్షలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై 17 ప్రాంతాల్లో ఉన్న బ్లాక్ స్పాట్స్ కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుంటూ ప్రాణనష్టం జరుగుతున్నందున ఆ రోడ్డును వీలైనంత తొందరలో విస్తరించాల్సిన అవసరం ఉందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రమాదాలకు కారణమవుతున్న లోపాలను ముందుగా మరమ్మతు చేయాలని అధికారులను ఆదేశించారు. మరమ్మతులతో వాహనాలకు ఇబ్బంది ఎదురుకాకుండా, ముందుగా ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేసి పనులు చేపట్టాలని సూచించారు. అధికారిక అనుమతుల పేరిట ఇంకా జాప్యం చేస్తే ప్రమాదాలు కొనసాగుతూనే ఉంటాయని, అనుమతుల ప్రక్రియను వేగవంతం చేసి పనులు ప్రారంభమయ్యేలా చూడాలని పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఎన్‌హెచ్ఏఐ, రాష్ట్ర ప్రభుత్వ అధీనంలోని జాతీయ రహదారుల విభాగం అధికారులతో సమీక్షించారు. విజయవాడ రహదారిపై ప్రమాదాలు జరుగుతున్న చోట్ల వాహనచోదకులు గమనించేలా హెచ్చరిక, సూచిక బోర్డుల ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. అతివేగం నియంత్రణ చర్యలు చేపట్టడం, అవసరమైన ప్రాంతాల్లో ఆరు వరుసలకు రోడ్డును విస్తరించటం, కావాల్సిన చోట్ల వెహికిల్ అండర్ పాస్‌లు, రెండు వైపులా సర్వీసు రోడ్ల నిర్మాణం వంటి చేపట్టాలని తెలిపారు. 2021లో మంజూరైన రీజినల్ రింగ్ రోడ్డు పనులు ఈ పాటికే ప్రారంభమై ఉంటే అది ఆ ప్రాంత అభివృద్ధికి దోహదం చేసి ఉండేదని మంత్రి అభిప్రాయపడ్డారు. రీజినల్ రింగురోడ్డు ఉత్తర భాగానికి సంబంధించి 70 శాతం భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని, అటవీ భూములు, కోర్టు కేసుల వల్ల మిగతా దానిలో జాప్యం జరుగుతోందని ఎన్‌హెచ్ఏఐ రీజినల్ అధికారి రజాక్ మంత్రి దృష్టికి తెచ్చారు. సమావేశంలో రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి విజేంద్రబోయీ, ఈఎన్‌సీ గణపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన కాదు.. పన్నుల పాలన

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దేవీప్రసాద్



సాక్షి, హైదరాబాద్: ప్రజాపాలన అంటూ అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి పన్నుల పాలన చేస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దేవీప్రసాద్ విమర్శించారు. రైతాంగం తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నా రాష్ట్రంలో రైతులకు భరోసా ఇచ్చే ప్రభుత్వం రాష్ట్రంలో లేదన్నారు. అకాల వర్షాలతో తడిసినా కొనే నాథుడు కరువయ్యాడని ఆవేదన వ్యక్తంచేశారు. మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ నేత చిరుమళ్ల రాకేశ్‌కుమార్‌తో కలిసి శుక్రవారం తెలంగాణభవన్‌లో దేవీప్రసాద్ మీడియాతో మాట్లాడారు. రైతులను ఆదుకుంటామనే ప్రభుత్వ ప్రకటనలు కాగితాలకే పరిమితమయ్యాయని, రేవంత్ ప్రభుత్వ పనితీరు మాటలు ఎక్కువ, చేతలు తక్కువ అనే రీతిలో తయారైందని విమర్శించారు. ఎన్నికలు ముగియగానే ప్రజలపై రాష్ట్ర ప్రభుత్వం పన్నుల భారం మోపేందుకు సిద్ధమవుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వాన్ని సోషల్ మీడియాలో విమర్శించే వారిపై కేసులు పెడుతోందన్నారు.

ఇతర రాష్ట్రాల్లో కాంగ్రెస్ ముఖ్యుల ప్రచారం

- ఒడిశాలో భట్టి విక్రమార్క.. మహారాష్ట్రలో పొంగులేటి
- రాయ్‌బరేలిలో సీతక్క, వీహెచ్, మల్లు రవి బృందాలు



ముంబైలో ప్రచారం నిర్వహిస్తున్న పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారానికి బయల్దేరారు. ఇక్కడ ఎన్నికలు ముగిసిన వెంటనే ఒడిశా రాష్ట్రంలో ప్రచార బాధ్యతలు తీసుకున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గత మూడు రోజులుగా అక్కడే ఉండి ప్రచారంలో పాల్గొంటున్నారు. హైదరాబాద్ నుంచి ఢిల్లీ వెళ్లి, అక్కడి నుంచి రాహుల్ గాంధీతో కలసి ప్రత్యేక విమానంలో ఒడిశా వెళ్లిన ఆయన బొలంగీర్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ప్రచారంలో పాల్గొన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో పాల్గొన్న అనంతరం రాహుల్‌తో కలసి ఢిల్లీ వచ్చిన భట్టి.. మళ్లీ భువనేశ్వర్‌కు వెళ్లారు. అనంతరం పుల్బనీ లోక్‌సభ నియోజకవర్గంలో జరిగిన భారీ బహిరంగ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో కలసి హాజరయ్యారు.

ముంబైలో పొంగులేటి..

రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మహారాష్ట్ర ఎన్నికల ప్రచారానికి వెళ్లారు. ముంబైలోని సౌత్‌సెంట్రల్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఆయన ప్రచారం నిర్వహించారు. ధారవి, సియాన్, కోలివాడ తదితర ప్రాంతాల్లో తెలుగు ప్రజలను కలసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఇదిలా ఉండగా ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ పోటీ చేస్తున్న యూపీలోని రాయ్‌బరేలి నియోజకవర్గంలో ప్రచారం కోసం రాష్ట్ర కాంగ్రెస్ నేతలు క్యూలు కడుతున్నారు. మంత్రి సీతక్క ఇప్పటికే తన బృందంతో అక్కడకు చేరుకుని విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మాజీ ఎంపీ వి.హనుమంతరావు కూడా రెండు రోజులుగా రాయ్‌బరేలీ ప్రచారంలో ఉన్నారు. మరో సీనియర్ నేత, మాజీ ఎంపీ మల్లురవి కూడా తన బృందంతో కలసి రాయ్‌బరేలీ చేరుకుని రాహుల్‌ను గెలిపించాలని అక్కడి ప్రజలను కోరుతున్నారు. వీరే కాకుండా టీపీసీసీకి చెందిన పదుల సంఖ్యలో నేతలు ఇప్పటికే రాయ్‌బరేలీలో మకాం వేయగా, మరికొంత మంది కూడా వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

బీఆర్ఎస్ ఉండదు అనడం సరికాదు: విజయశాంతి



సాక్షి, హైదరాబాద్: 'తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ ఇకపై ఉండదు అంటున్న కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అభిప్రాయం సమంజసం కాదు. ప్రాంతీయ భావోద్వేగాలు, ప్రజల మనోభావాలను వారి ఆత్మాభిమానం వైపు నడిపించడం దక్షిణాది రాష్ట్రాల సహజ విధానం' అని సినీ నటి, మాజీ ఎంపీ విజయశాంతి అన్నారు. ఇక్కడి ప్రజల మనోభావాలు అర్థం చేసుకోకుండా వ్యవహరిస్తున్న వారు.. దక్షిణాది రాష్ట్రాల్లో దశాబ్దాలుగా కరుణానిధి, ఎంజీఆర్, ఎన్టీఆర్, రామకృష్ణ హెగ్డే, జయలలిత మొదలుకుని ప్రస్తుత బీఆర్ఎస్, వైఎస్సార్సీపీ వరకు వస్తున్న ప్రజాదరణను విశ్లేషించుకోవాలని హితవు పలికారు. దక్షిణాది స్వీయ అస్తిత్వ సత్యాన్ని కాంగ్రెస్ అర్థం చేసుకున్నట్లు బీజేపీ అర్థం చేసుకోలేదని కిషన్‌రెడ్డి ప్రకటనను బట్టి అర్థమవుతోందని విజయశాంతి సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. ఈ విషయంపై విజయశాంతి 'సాక్షి'తో మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాల ప్రజల మనోగతాన్ని మాత్రమే తాను వెల్లడించానన్నారు. అప్పులు, అభివృద్ధి వంటి విషయాల్లో బీఆర్ఎస్ విధానాలను మాత్రమే తాను గతంలో విమర్శించానని చెప్పారు. తెలంగాణ సాధనలో ఆ పార్టీ పాత్రను తాను ఎన్నడూ తప్పు పట్టలేదని ఆమె గుర్తుచేశారు.

సోనియా బర్త్ డే కటాఫ్?

▶ మొదటి పేజీ తరువాయి

స్పష్టం చేస్తున్నారు.

మాఫీ కసరత్తు ముమ్మరం

రుణమాఫీపై ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. తాము అధికారంలోకి వస్తే రూ.2 లక్షల వరకు రైతు రుణాలు మాఫీ చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఒకేసారి రుణమాఫీ చేస్తామని కూడా స్పష్టం చేసింది. అంతేకాదు ఈ ఏడాది ఆగస్టు 15వ తేదీలోపుగా హామీ నెరవేరుస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీంతో విధివిధానాలపై కసరత్తు వేగంగా జరుగుతోంది.

వడ్డీపై తర్జనభర్జన

రైతు యూనిట్‌గా కాకుండా, రైతు కుటుంబం యూనిట్‌గా రుణమాఫీని అమలు చేస్తారని అధికారులు చెబుతున్నారు. రూ.2 లక్షల వరకు రుణమాఫీ కాబట్టి రైతుల సంఖ్య పెరుగుతుందని అంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో మొత్తంగా 36.68 లక్షల మంది రైతులకు చెందిన రూ.19,198.38 కోట్ల రుణాలను మాఫీ చేయాల్సి ఉంటుందని అప్పట్లో అంచనా వేశారు. 2020లో రూ.25 వేల లోపు రుణాలు మాఫీ (రూ.408.38 కోట్లు) చేశారు. ఆ తర్వాత రూ.25 వేల నుంచి రూ.37 వేల లోపు రైతులకు చెందిన కొందరికి రూ.763 కోట్ల రుణాలను మాఫీ చేశారు. ఇలా విడతల వారీగా మాఫీ చేశారు. తాజాగా కటాఫ్ తేదీని డిసెంబర్ 9వ తేదీగా ప్రకటిస్తే..అప్పటివరకు రైతులు తీసుకున్న 2 లక్షల రూపాయలలోపు రుణాలను మాఫీ చేస్తారు. అయితే రుణ బకాయిలకు వడ్డీ కూడా తోడు కానుంది. అంటే బ్యాంకులకు వడ్డీ కూడా చెల్లించాల్సి ఉంటుంది. దీనిపై ఏం చేయాలన్న దానిపై అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. వాస్తవ రుణ బకాయిలు రూ.30 వేల కోట్లు ఉంటే, వడ్డీతో కలిపి దాదాపు రూ.40 వేల కోట్ల వరకు అవ్వొచ్చని అంచనా వేస్తున్నారు. దీనిపై స్పష్టత రావాల్సి ఉంటుంది. కటాఫ్ తేదీని బట్టి ఇది మారుతుందని అంటున్నారు.

గత ప్రభుత్వ హయాంలో రుణమాఫీకి సంబంధించిన వివరాలు

లక్ష లోపు రుణాలు	రైతులు	రుణాలు
0- రూ.25 వేలు	2.96 లక్షలు	రూ.408.38 కోట్లు
రూ.25 వేలు- రూ.50 వేలు	5.72 లక్షలు	రూ.1,790 కోట్లు
రూ.50 వేలు- రూ.75 వేలు	7 లక్షలు	రూ.4,000 కోట్లు
రూ.75 వేలు - రూ.లక్ష	21లక్షలు	రూ.13,000 కోట్లు
మొత్తం	36.68 లక్షలు	రూ.19,198.38 కోట్లు

బంగారం కుదవబెట్టి, సాగు చేయని భూములకు రుణాలు తీసుకుంటే..?

బంగారం కుదువబెట్టి తీసుకున్న పంట రుణాలకు కూడా మాఫీ వర్తింపచేయాలా వద్దా అన్నదానిపై చర్చ జరుగుతోంది. రైతుబంధు సొమ్మును అందరికీ ఇచ్చి దుర్వినియోగం చేశారంటూ విమర్శలు వచ్చిన నేపథ్యంలో రుణమాఫీని కూడా సమగ్రంగా పరిశీలించాకే వర్తింపజేయాలనే ఆలోచన ఉన్నట్లు చెబుతున్నారు. కొందరు రైతులు సాగుచేయని భూములకు, కొండలు, గుట్టలకు కూడా పంట రుణాలు తీసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సొంత అవసరాలకు కూడా ఏదో రకంగా పంట పేరుతో రుణాలు తీసుకున్నారనే చర్చ జరుగుతోంది. ఇటువంటి వారికి కూడా రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తారా? అనే సందేహం వ్యక్తమవుతోంది. అయితే గత ఐదేళ్లలో ఎవరు సాగు చేశారో చేయలేదో ఇప్పుడు తెలుసుకోవడం కష్టం అవుతుందని, కొండలు, గుట్టల పేరుమీద రుణాలు తీసుకుని ఉంటే వాటిని గుర్తించగలమా లేదా అనే చర్చ అధికారుల్లో జరుగుతోంది. ప్రధానంగా ఒకేసారి రుణమాఫీ అనేది ఎలా జరుగుతుందోనన్న చర్చ కూడా వ్యవసాయ శాఖ, బ్యాంకు అధికారుల మధ్య జోరుగా సాగుతోంది. అన్నిఅంశాలను పరిగణనలోకి తీసుకుంటూ రుణమాఫీకి మార్గదర్శకాలను ఖరారు చేసే పనిలో వ్యవసాయ అధికారులు నిమగ్నమయ్యారు.

యుద్ధం మిగిలే ఉంది: కేసీఆర్

'భూమి పుత్రుడు' పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ సీఎం కేసీఆర్. చిత్రంలో హరీశ్‌రావు తదితరులు

సాక్షి, హైదరాబాద్/రంగారెడ్డి జిల్లా: కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని, రాష్ట్రంలో యుద్ధం ఇంకా మిగిలే ఉందని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. ఉద్యమ శక్తులను మరోసారి పునరేకీకరణ చేసి కార్యక్షేత్రానికి రూపకల్పన చేస్తున్నట్లు చెప్పారు. రాజకీయ, సామాజిక అంశాల్లో వచ్చిన మార్పులు, రాష్ట్ర ప్రగతి తదితర అంశాలపై తెలంగాణ ఉద్యమకారుడు గోసుల శ్రీనివాస్ యాదవ్ ఎడిటోరియల్ వ్యాసాలతో రూపకల్పన చేసిన 'సన్ ఆఫ్ ద సాయిల్' (భూమిపుత్రుడు) పుస్తకాన్ని శుక్రవారం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా పుస్తక రచయిత శ్రీనివాస్ యాదవ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో, తెలంగాణ ప్రగతిని సాధారణ శైలిలో, ప్రజలకు అర్థమయ్యేలా వివరించారని ప్రశంసించారు. త్వరలో ఉద్యమ రచయితలతో ఒక సమావేశం పెట్టుకుందామని, రచయితలకు అన్ని విధాలుగా తోడుగా ఉంటానని చెప్పారు. రచయితలు ప్రజల పక్షాన ఉండాలని కేసీఆర్ ఈ సందర్భంగా సూచించారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో భావ వ్యాప్తితో ఉద్యమం ఉధృతమైందని గుర్తు చేస్తూ మరోసారి కవులు కళాకారులు ఏకం కావాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను ఇప్పటి కాంగ్రెస్ సర్కారు తిరోగమన దిశగా ఆలోచించడాన్ని కేసీఆర్ తప్పుబట్టారు. పదేళ్ల తెలంగాణ పాలనలో ప్రజలకు చిన్న ఇబ్బంది కూడా కలగలేదని కేసీఆర్ తన పాలన మజిలీలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి హరీశ్ రావు, బాలమల్లు, శరత్, తదితరులు పాల్గొన్నారు. కాగా, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తనయుడు, బీఆర్ఎస్ యువ నేత పటోళ్ల కార్తీక్‌రెడ్డి రాసిన 'హౌ టు బయ్ ఆన్ ఇండియన్ ఎలక్షన్' పుస్తకాన్ని కూడా కేసీఆర్ శుక్రవారం ఆవిష్కరించారు. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఉన్న భారతదేశంలో సమగ్ర ఎన్నికల ప్రక్రియలో పార్టీల పాత్ర, ఓటర్లు, తదితర అంశాలతో ఈ పుస్తకం రాశారు.



తాను రాసిన పుస్తకాన్ని కేసీఆర్‌కు అందిస్తున్న పటోళ్ల కార్తీక్‌రెడ్డి

కేసీఆర్‌ను ఢీకొట్టలేక కవితను జైలుకు పంపారు

తిహార్ జైల్లో కవితను కలిసిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బాల్క సుమన్



శుక్రవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న ప్రవీణ్ కుమార్. చిత్రంలో బాల్క సుమన్

సాక్షి, న్యూఢిల్లీ: రాజకీయంగా మాజీ సీఎం కేసీఆర్‌ను ఢీకొట్టలేక ఆయన కుమార్తె ఎమ్మెల్సీ కవితను బీజేపీ జైలుకు పంపిందని బీఆర్ఎస్ నేతలు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్, బాల్క సుమన్ ఆరోపించారు. మాట వినని, అడ్డుగా ఉన్న ప్రతిపక్ష నేతలపై ఐటీ, సీబీఐ, ఈడీలతో దాడులు చేయిస్తూ అక్రమ కేసులను బనాయిస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని, దయచేసి బీజేపీకి ఎవరూ ఓటు వేయొద్దంటూ అభ్యర్థించారు. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న ఎమ్మెల్సీ కవితతో తిహార్ జైల్లో ఆర్.ఎస్.ప్రవీణ్, బాల్క సుమన్ అరగంట పాటు ములాఖత్ అయ్యారు. అనంతరం తెలంగాణ భవన్ వద్ద మీడియాతో మాట్లాడారు. కవిత చాలా ధైర్యంగా ఉన్నారని, నిర్దోషిత్వాన్ని నిరూపించుకుంటా అనే నమ్మకంతో ఉన్నట్లు చెప్పారు. కేవలం రాజకీయ దురుద్దేశంతోనే కేసు పెట్టి, ఆమె తరపు న్యాయవాదికి నోటీసులివ్వకుండా సీబీఐ అరెస్టు చేసిందంటేనే ఈ కేసు ఎవరి చెప్పుచేతల్లో నడుస్తుందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఆర్థిక నేరాలకు, ఇతర దేశాల నుంచి నగదు లావాదేవీలకు పీఎంఎల్ఏ కేసు నమోదు చేస్తారని, అసలు ఏ ఆధారాలున్నాయని పీఎంఎల్ఏ నమోదు చేశారో చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ప్రముఖుల పేర్లు చెప్పాలంటూ కవితపై అధికారులు ఒత్తిడి తెస్తున్నారనే విషయం కవిత చెప్పినట్లు తెలిపారు. తాము చెప్పినట్లు వింటే బయటకు పంపిస్తాం లేదంటే ఎన్ని రోజులైనా జైల్లోనే ఉంచుతామనే సంకేతాలను బీజేపీ ఇస్తోందని మండిపడ్డారు. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం అంతా బీజేపీనే అని బాల్క సుమన్ ఆరోపించారు. లిక్కర్ స్కాంలో అరెస్టు అయ్యే వారి పేర్లను 2020లో బీజేపీ నేత మీడియా సమావేశం ద్వారా చెప్పడం.. ఆ తర్వాత నుంచి దేశవ్యాప్తంగా అరెస్టులు జరగడాన్ని మనమంతా చూస్తూనే ఉన్నామన్నారు. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికలు, ఇంకా జరగాల్సిన ఎన్నికల్లో బీజేపీకి 220 ఎంపీ సీట్లు కూడా రావని సుమన్ జోస్యం చెప్పారు.

ఆరు గ్యారంటీలపై అడుగడుగునా మోసం


హామీల అమలు చేతగాకే తెరపైకి స్థానిక సంస్థల ఎన్నికలు: బండి



సాక్షి, హైదరాబాద్: ఆరు గ్యారంటీల అమలుపై ప్రజలను కాంగ్రెస్ మోసం చేస్తోందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ మండిపడ్డారు. ఈ గ్యారంటీల అమలు చేతగాక దాటవేత ధోరణితో స్థానిక సంస్థల ఎన్నికలను తెరపైకి తీసుకువస్తోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటినా గ్యారంటీలు అమలు చేయకుండా పార్లమెంట్ ఎన్నికల సాకు చూపి దాటవేత ధోరణి ప్రదర్శించిందన్నారు. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ పేరుతో ఆ హామీలను అమలు చేయకుండా మళ్లీ దాటవేసేందుకే ప్రయత్నిస్తున్నట్లు కన్పిస్తోందని ఆయన ఆరోపించారు. 'స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ వ్యతిరేకం కాదు.. కానీ ఆ పేరుతో గ్యారంటీలను అమలు చేయకుండా దాటవేస్తూ ప్రజలను మోసం చేయడాన్ని వ్యతిరేకిస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణ పాఠం చెప్పాలని కోరుతున్నాం' అని సంజయ్ పేర్కొన్నారు. కేంద్రం మంజూరు చేసే నిధులు గ్రామ పంచాయతీలకు నేరుగా అంది అభివృద్ధి పనులు జరగాలంటే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని ఆయన కోరారు. గతంలో మోదీ ప్రభుత్వం జీపీల అభివృద్ధి కోసం మంజూరు చేసిన నిధులను కేసీఆర్ సర్కార్ దారిమళ్లించి జీతాలకు, కరెంట్ బిల్లులకు, ఇతరత్రా అవసరాలకు వాడుకుందని గుర్తు చేశారు.

వెంకట్రామిరెడ్డిని అనర్హుడిగా ప్రకటించాలి

- బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు
- ఓటర్లకు డబ్బులు పంచారని సీఈఓకు ఫిర్యాదు



సాక్షి, హైదరాబాద్: ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసి ప్రలోభాలకు గురిచేసిన బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని అనర్హుడిగా ప్రకటించాలని బీజేపీ నేత, ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్‌కు విజ్ఞప్తి చేశారు. పోలింగ్ నేపథ్యంలో ఒక్కో ఓటర్‌కు రూ. 500 చొప్పున పంపిణీ చేశారని, పోలింగ్ బూత్‌ల వారీగా లెక్కలేసి కవర్లలో ఒక్కో గ్రామానికి డబ్బులు పంపిణీ చేశారని ఆయన సీఈఓ దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు శుక్రవారం సీఈవోకు రఘునందన్‌రావు ఫిర్యాదు చేశారు. పోలింగ్ ముందు రోజు అర్ధరాత్రి 20 కార్లలో డబ్బు పంపిణీకి ఏర్పాట్లు చేశారని, దీనిని ఆధారాలతో సహా సిద్దిపేట సీపీ, మెదక్ ఎస్పీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. చివరకు చేగుంట ఎస్ఐ ఒక కారును అడ్డుకుంటే రూ.88 లక్షలు దొరికాయని తెలిపారు. దీనిపై ఎఫ్ఐఆర్ కూడా నమోదు అయ్యిందని చెప్పారు. ఇందులో వెంకట్రామిరెడ్డిని ఏ-5గా చేర్చారనే విషయాన్ని ఎన్నికల సంఘం గుర్తించాలన్నారు. ఓ ఫామ్‌హౌస్‌లో మాజీమంత్రి హరీశ్‌రావు, మరో ఆరుగురు ఎమ్మెల్యేలు డబ్బులు పంపిణీ చేశారని ఆరోపించారు. ఈ అంశంపై చర్యలు చేపట్టని పక్షంలో న్యాయం కోసం ఢిల్లీకి వెళ్లి ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

ఇక నుంచి టీఎస్ కాదు టీజీ

అన్ని ఉత్తర ప్రత్యుత్తరాలు, ఉత్తర్వుల్లోనూ టీజీనే వాడాలని ఆదేశాలు... ఉత్తర్వులు జారీ

సాక్షి, హైదరాబాద్: ఇకపై ప్రభుత్వ శాఖల్లో, ఉత్తర ప్రత్యుత్తరాల్లో అన్నింటా టీఎస్‌కు బదులు టీజీనే వినియోగించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఈ ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వస్తాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం అన్ని ప్రభుత్వ శాఖలకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ శాఖలు, ఏజెన్సీలు, ప్రభుత్వ రంగ సంస్థలు, అటానమస్ సంస్థలతో పాటు ఇతర ప్రభుత్వ విభాగాలు, అధికారిక డాక్యుమెంట్లు, జీవోలు, నోటిఫికేషన్లు, సర్క్యులర్లు, రిపోర్టులు, లెటర్ హెడ్‌లలో ఈ షార్ట్ ఫామ్‌నే వినియోగించాలని పేర్కొన్నారు. ఈ-కాపీలు, హార్డ్ కాపీల్లోనూ టీజీనే వాడాలని చెప్పారు. ఈ మేరకు అన్ని శాఖలు నివేదికలు అందజేయాలని సీఎస్ కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి విడిపోయి.. తెలంగాణ రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత తెలంగాణ స్టేట్ అని వచ్చేలా టీఎస్ అని షార్ట్ ఫామ్‌ని ప్రభుత్వం రిజిస్టర్ చేయించింది. దీంతో అన్ని ప్రభుత్వ సంస్థలకు కూడా తెలంగాణ స్టేట్ అని వచ్చేలా పేర్లు మారిపోయాయి.

వివాదాస్పదులైతే పక్కకే..

వీసీ పోస్టులకు దరఖాస్తులపై సర్కారు దృష్టి

- ఆరోపణలుంటే పరిశీలించొద్దంటూ స్పష్టమైన ఆదేశాలు
- వర్సిటీల్లో పరిస్థితులపై ప్రభుత్వం వద్ద నివేదికలు
- నియామకాలకు సంబంధించి త్వరలోనే మార్గదర్శకాలు!



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వైస్ చాన్స్‌లర్ల పోస్టుల కోసం వచ్చే దరఖాస్తుల పరిశీలనకు సెర్చ్ కమిటీలు రంగంలోకి దిగుతున్న నేపథ్యంలో ప్రతి విశ్వ విద్యాలయంపై ఉన్నతాధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ప్రభుత్వం అంతర్గత ఆదేశాలు జారీ చేసింది. విశ్వవిద్యాలయాలు ఎందుకు వివాదాస్ప దమవుతున్నాయి? అక్కడున్న లోపాలు ఏంటి? అధ్యయనం చేయాలని సూచించింది. వీసీ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకునే వారి వ్యక్తిగత వివరాలను కూడా లోతుగా పరిశీలించాలని స్పష్టం చేసినట్లు సమాచారం. సర్వీస్‌లో ఏమాత్రం వివాదాస్పద రికార్డు ఉన్నా.. వారిని పక్కన బెట్టాలని ఆదేశించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇప్పటికే వీసీలుగా ఉన్న వారితో అంటకాగే వ్యక్తుల దరఖాస్తులను కూడా పక్కన పెట్టాలనే ఆదేశాలు వెళ్లినట్లు సమాచారం. వర్సిటీల వారీగా సెర్చ్ కమిటీలను ప్రభుత్వం ప్రకటించింది. సీఎస్ శాంతికుమారికి అన్ని కమిటీల్లో భాగస్వామ్యం కల్పించింది.

ప్రభుత్వం వద్ద సమగ్ర నివేదికలు

రాష్ట్రంలో పది విశ్వవిద్యాలయాలకు వీసీలను నియమించేందుకు ఎన్నికల కమిషన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. కాగా వర్సిటీల్లో ఇన్నేళ్లుగా చోటు చేసుకున్న వివాదాలపై ప్రభుత్వం గతంలోనే నివేదిక కోరింది. ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల్లోనే అన్ని వర్సిటీల్లోని వ్యవహారాలపై సమగ్ర నివేదికలు తెప్పించుకుంది. ఉన్నత విద్యలో కీలక పదవులు నిర్వహించిన వారు, అధికార పార్టీకి అనుకూలంగా ఉండే కొన్ని అధ్యాపక సంఘాలు వర్సిటీల్లో జరుగుతున్న వ్యవహారాలపై సీఎంకు నివేదికలు ఇచ్చారు. ఈ నివేదికలు పరిగణనలోకి తీసుకుని ప్రక్షాళన చేపట్టాలని ముఖ్యమంత్రి భావిస్తున్నట్టు సమాచారం.

రాజకీయ ప్రాధాన్యతతో దుష్పలితాలు


వైస్ చాన్స్‌లర్ల నియామకంలో రాజకీయ ప్రాధాన్యత అనేక దుష్ఫలితాలకు దారితీస్తోందని పలువురు ప్రొఫెసర్లు సీఎం దృష్టికి తెచ్చినట్టు తెలిసింది. హైదరాబాద్‌లోని యూనివర్సిటీల్లో వీసీల ఇష్టారాజ్యం నడుస్తోందని ఓ ఆచార్యుడు పేర్కొన్నట్లు తెలిసింది. బాసర ట్రిపుల్ ఐటీపై అనేక ఆరోపణలున్నాయి. ఇప్పటికీ అక్కడ ఇన్‌చార్జి వీసీనే కొనసాగుతున్నారు. గత కొన్నేళ్లుగా వర్సిటీపై అనేక రకాల ఫిర్యాదులు వస్తున్నాయి. విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. పేరుకు సెర్చ్ కమిటీలు నియమిస్తున్నా వాటికి ఏమాత్రం ప్రాధాన్యత ఉండటం లేదని వారు వివరించినట్లు తెలుస్తోంది. ఓ వర్సిటీ వీసీ నియామకాన్ని సెర్చ్ కమిటీ తీవ్రంగా తప్పుబట్టినా పెద్దగా పట్టించుకోలేదని గుర్తు చేస్తున్నారు. మరోవైపు గత కొంత కాలంగా విద్యాశాఖ కమిషనర్ల పాత్ర కూడా విశ్వవిద్యాలయాల్లో కొత్త సమస్యలకు దారి తీస్తోంది. గత ఏడాది ఓ ఐఏఎస్ అధికారి నిర్ణయాలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. ఆయనకు నచ్చిన అంశాలపై వర్సిటీ పాలక మండలిలో ఆమోదం పొందేందుకు తీవ్ర ఒత్తిడి తెచ్చారనే విమర్శ లున్నాయి. ఈ క్రమంలో ఆయనకు, వీసీకి మధ్య జరిగిన ప్రచ్ఛన్న పోరు వర్సిటీ పరువు ప్రతిష్టలకు భంగం కల్గించిందని పలువురు సీఎం దృష్టికి తెచ్చారు. మరో వర్సిటీలో రిటైర్ అయిన వ్యక్తిని రిజిస్ట్రార్‌గా కొనసాగించిన తీరు కూడా అనేక విమర్శలకు కారణమైంది. దీని వెనుక వీసీ ప్రమేయం కూడా ఉందని చెబుతున్నారు. ఇలాంటి పలు వివాదాలు, వీసీల అవినీతి, అక్రమ వ్యవహారాలపై ముఖ్యమంత్రికి నివేదికలు అందినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం వీసీల నియామకంపై దృష్టి సారించినట్లు చెబుతున్నారు. ఇందుకు సంబంధించి త్వరలోనే మార్గద ర్శకాలు విడుదల చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

సెర్చ్ కమిటీలు ఇవే

ఓ.యూ:	ప్రొఫెసర్ వీఎస్ ప్రసాద్, ప్రొఫెసర్ అఖిలేష్ కుమార్ పాండే, శాంతికుమారి
తెలంగాణ వర్సిటీ:	ప్రొఫెసర్ సులేమాన్ సిద్ధిఖీ, ప్రొఫెసర్ రాజేశ్వర్ సింగ్ ఛందేల్, శాంతికుమారి
మహాత్మా గాంధీ వర్సిటీ :	ప్రొఫెసర్ విజయ్ జె పులారి, ప్రొఫెసర్ సట్ ప్రకాష్ బన్సల్, శాంతికుమారి
పాలమూరు వర్సిటీ:	ప్రొఫెసర్ బట్టు సత్యనారాయణ, ప్రొఫెసర్ సాంబశివరావు, శాంతికుమారి
జేఎన్ఏ ఎఫ్ఏయూ:	ప్రొఫెసర్ తిరుపతిరావు, ప్రొఫెసర్ పంచనాథం, శాంతికుమారి
తెలుగు వర్సిటీ :	ప్రొఫెసర్ తిరుపతిరావు, ప్రొఫెసర్ బట్టు సత్యనారాయణ, శాంతికుమారి
అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ :	ప్రొఫెసర్ వాయునందన్, ప్రొఫెసర్ అమీ యు ఉపాధ్యాయ, శాంతికుమారి
జేఎన్టీయూ :	ప్రొఫెసర్ ఎస్ఎస్‌హెగ్డే, ప్రొఫెసర్ జీపీ సింగ్ జూరెల్, శాంతికుమారి
శాతవాహన వర్సిటీ:	ప్రొఫెసర్ సాయన్న, ప్రొఫెసర్ దేవ్‌దత్ శర్మ, శాంతికుమారి

త్వరలో గ్రూప్-4 ఎంపిక జాబితా

- 1:3 నిష్పత్తిలో ప్రకటించనున్న టీఎస్‌పీఎస్సీ
- వెంటనే అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన




సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) అతి త్వరలో గ్రూప్-4 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల ప్రాథమిక జాబితాను ప్రకటించనుంది. ఈ కేటగిరీలో 8,180 ఉద్యోగాలకు గాను 9,51,321 మంది దరఖాస్తు చేసుకున్నారు. గతేడాది జూలై 1వ తేదీ ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో ఓఎంఆర్ ఆధారిత అర్హత పరీక్షలను టీఎస్‌పీఎస్సీ నిర్వహించింది. ఉదయం జరిగిన పేపర్-1 పరీక్షకు 7,62,872 మంది, మధ్యాహ్నం జరిగిన పేపర్-2 పరీక్షకు 7,61,198 మంది హాజరయ్యారు. జవాబు పత్రాలను మూల్యాంకనం చేసిన టీఎస్‌పీఎస్సీ.. ఈ ఏడాది ఫిబ్రవరిలో అభ్యర్థులు సాధించిన ర్యాంకులు, మార్కుల జాబితాతో కూడిన జనరల్ ర్యాంకింగ్ జాబితాను (జీఆర్ఎల్) వెబ్‌సైట్‌లో ఉంచింది. ఈ నేపథ్యంలోనే వీలైనంత త్వరగా ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల ప్రాథమిక జాబితాను విడుదల చేసేందుకు కమిషన్ సిద్ధమవుతోంది. 1:3 నిష్పత్తిలో అభ్యర్థుల జాబితాను విడుదల చేయనుంది. అయితే డిజేబుల్డ్ (దివ్యాంగులు) కేటగిరీలో మాత్రం 1:5 నిష్పత్తిలో ఎంపిక చేపట్టనుంది. ప్రాథమిక ఎంపిక జాబితా విడుదల చేసిన వెంటనే ధ్రువపత్రాల పరిశీలన చేపట్టేలా టీఎస్‌పీఎస్సీ కార్యాచరణ రూపొందించింది. అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని స్పష్టం చేసింది. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 2021-22 సంవత్సరం తర్వాత తీసుకున్న సర్టిఫికెట్‌ను అందుబాటులో ఉంచుకోవాలని సూచించింది. అదే విధంగా రిజర్వేషన్ ఉన్న అభ్యర్థులు, వివిధ కమ్యూనిటీలకు చెందిన అభ్యర్థులు కమిషన్ నిర్దేశించిన తేదీలతో కూడిన ధ్రువపత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలి. ఏ క్షణంలోనైనా సర్టిఫికెట్ల పరిశీలన తేదీలు ఖరారు కావచ్చునని టీఎస్‌పీఎస్సీ తెలిపింది.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ హాల్ టికెట్లు సిద్ధం

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థుల హాల్ టికెట్లు శుక్రవారం నుంచి డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం కల్పించినట్లు ఇంటర్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. విద్యార్థులు వాటిపై అన్ని వివరాలు సక్రమంగా ఉన్నాయా? లేదా? అని పరిశీలించాలని సూచించింది. సవరణలు చేయాల్సి ఉంటే వెంటనే సంబంధిత కాలేజీ ప్రిన్సిపల్, జిల్లా ఇంటర్ విద్యా అధికారిని సంప్రదించాలని తెలిపింది. ఇంటర్ అడ్వాన్స్‌డ్ పరీక్షలు ఈనెల 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు జరగనున్నాయి.

ఏడేళ్ల తర్వాత సవాల్ చేస్తారా?

- భూ కేటాయింపు పిటిషన్‌లో హరీశ్‌రావును తప్పుబట్టిన హైకోర్టు
- 2008లో నాటి ప్రభుత్వం ఇచ్చిన జీవో సమర్థనీయమేనని వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: పలు ఫిల్మ్ సిటీలకు ప్రభుత్వ భూ కేటాయింపు సమర్థనీయమైనప్పుడు.. ఆనంద్ సినీ సర్వీసెస్‌కు ఇవ్వడం తప్పెలా అవుతుందని పిటిషనర్, మాజీ మంత్రి హరీశ్‌రావును హైకోర్టు ప్రశ్నించింది. అలాగే 2001లో తొలిసారి జీవో జారీ చేస్తే.. 2008లో సవాల్ చేయడం సరికాదని, ఆలస్యానికి కారణాలు కూడా తెలుపలేదని వ్యాఖ్యానించింది. ఈ పిటిషన్‌లో ఎలాంటి మెరిట్స్ కనిపించనందున కొట్టివేస్తున్నామని స్పష్టం చేసింది. 2001, ఆగస్టు 21న సాధారణ పరిపాలన (ఐఅండ్‌పీఆర్) విభాగం జీవో 355ను జారీ చేసింది. హైదరాబాద్ షేక్‌పేట్‌లోని సర్వే నంబర్ 403లో 5 ఎకరాల భూమిని ఆనంద్ సినీ సర్వీసెస్‌కు ఎకరం రూ.8,500లకు కేటాయించాలని ఏపీ రాష్ట్ర ఫిల్మ్, టీవీ అండ్ థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్ఎఫ్‌డీసీ)కు ఆదేశాలు జారీ చేసింది. ఆ తర్వాత ఎందుకో భూమి అప్పగింతను నిలిపివేస్తూ ప్రభుత్వం ఏపీఎస్ఎఫ్‌డీసీకి లేఖ రాసింది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక డిసెంబర్, 2008లో మరో జీవో 744ను జారీ చేసి.. భూమిని అప్పగించింది. ఈ రెండు జీవోలను సవాల్ చేస్తూ మాజీ మంత్రి హరీశ్‌రావు 2008లో పిటిషన్ దాఖలు చేశారు. భూ కేటాయింపు చట్టవిరుద్ధమని, జీవోలను కొట్టివేయడంతో పాటు ఈ అంశంపై విచారణ జరిపించాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 'సినీ పరిశ్రమ అభివృద్ధి కోసం ఏపీఎస్ఎఫ్‌డీసీకి 1982లో ప్రభుత్వం 50 ఎకరాలు కేటాయించింది. అలాగే పద్మాలయా స్టూడియోకు 9.5 ఎకరాలు, సురేశ్ ప్రొడక్షన్స్‌కు 5 ఎకరాలతో పాటు ఆనంద్ సర్వీసెస్‌కు కూడా 5 ఎకరాలు కేటాయించారు. దీన్ని సవాల్ చేస్తూ 2004లో దాఖలైన పిల్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఇది సినీ రంగ అభివృద్ధికి 1982లో ప్రభుత్వం తీసుకువచ్చిన ఓ అద్భుతమైన పాలసీ. 2011లోనూ పలు పిటిషన్లు డిస్మిస్ అయ్యాయి. సుప్రీంకోర్టు కూడా ఈ పిటిషన్లను కొట్టివేసింది. అంతేకాదు దర్శకుడు ఎన్.శంకర్‌కు 5 ఎకరాల కేటాయింపును ఇదే హైకోర్టు సమర్థించింది' అని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. జీవో ఇచ్చిన ఏడేళ్ల తర్వాత పిటిషన్ వేయడం సరికాదని స్పష్టం చేసింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 226 ప్రకారం విచక్షణాధికారాన్ని వినియోగించుకుని జాప్యానికి కారణం లేనందున ఈ పిటిషన్‌ను కొట్టివేస్తున్నామని తెలిపింది.

సమాజహితం కోసం సామాజిక శాస్త్రాలు

రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ లింబాద్రి



బంజారాహిల్స్ (హైదరాబాద్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, సామాజిక శాస్త్ర విభాగం, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో 'భారతదేశంలో 75 సంవత్సరాల పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్-సమకాలీన స్థితిగతులు' అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆర్.లింబాద్రి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏటా 3 లక్షల మంది విద్యార్థులు డిగ్రీలో చేరుతున్నారని, ఇందులో 14 శాతం మంది విద్యార్థులు మాత్రమే సామాజిక శాస్త్రాల్లో నమోదు చేసుకుంటున్నారని వెల్లడించారు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అభ్యసించిన విద్యార్థి ప్రజా ప్రయోజనాల కోసం పనిచేసేలా, సమాజహితం కోరే వ్యక్తిలా, సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించే వ్యక్తిలా రూపుదిద్దుకోవాలని ఆయన ఆకాంక్షించారు. అంబేడ్కర్ వర్సిటీ మాజీ ఉపకులపతి, న్యాక్ మాజీ డైరెక్టర్ వీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచమంతా టెక్నాలజీ కోర్సుల వెనుక పరుగెడుతోందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఏవీఆర్ఎన్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ పుష్పా చక్రపాణి, సామాజిక శాస్త్రం విభాగం డీన్ వడ్డాణం శ్రీనివాస్, సదస్సు డైరెక్టర్ పల్లవి కాబ్డే, కో డైరెక్టర్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

నరేశ్‌మోహన్ మృతిపై ఐఎన్ఎస్ సంతాపం



సాక్షి, హైదరాబాద్: ఇండియన్ న్యూస్ పేపర్ సొసైటీ (ఐఎన్ఎస్) మాజీ అధ్యక్షుడు నరేశ్ మోహన్ మృతిపట్ల ఐఎన్ఎస్ సంతాపం తెలిపింది. ఆయన మృతి మీడియా రంగానికి తీరని లోటని ఐఎన్ఎస్ అధ్యక్షుడు రాకేశ్ శర్మ పేర్కొన్నారు. అధ్యక్ష పదవి నిర్వహించిన కాలంలో ఆయన దార్శనికత, నాయకత్వంతో సొసైటీకి ఉత్తమ సేవలందించారని గుర్తుచేసుకున్నారు. నరేశ్ మోహన్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్టకాలంలో భగవంతుడు వారి కుటుంబానికి అండగా ఉండాలని ప్రార్థించారు.

> సర్వశక్తిమంతుడైన పరమాత్మ నుండే ప్రాణం ఉత్పన్నమవుతుంది. అలాగే మనస్సు, సకలేంద్రియాలు; ఆకాశం, వాయువు, తేజస్సు, నీరు, భూమి– అనే పంచ మహాభూతాలు ఉత్పన్నమవుతాయి.
> – ముండకోపనిషత్తు (హైందవ ధర్మం)

సాక్షి
శనివారం, 18 మే 2024

చైనా-రష్యా కరచాలనం!

తాము చైనాను పీపుల్స్ రిపబ్లిక్‌గా గుర్తించి 75 యేళ్లు అవుతుండగా... ఉక్రెయిన్ దురాక్రమణ యుద్ధంలో పట్టు సాధించిన ఛాయలు కనబడుతుండగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ బీజింగ్‌లో అడుగుపెట్టారు. రెండు రోజుల పర్యటనలో ఇరు దేశాలమధ్యా వివిధ ఒప్పందాలు కుదరటంతోపాటు సంయుక్త ప్రకటన కూడా విడుదలైంది. ప్రచ్ఛన్నయుద్ధ కాలంనాటి మనస్తత్వాన్ని విడనాడాలని రెండు దేశాలూ అమెరికాకు హితవు పలికాయి. ప్రాంతీయ భద్రత, రక్షణ బేఖాతరు చేస్తూ కొన్ని బృందాలకు మద్దతుగా నిలిచే వినాశకర విధానాలకు స్వస్తి పలకాలని సూచించాయి. పుతిన్ వరసగా ఆరోసారి ఎన్నికై దేశాధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసి తొమ్మిది రోజులవుతోంది. 2030 వరకూ ఆయనదే రాజ్యం. అయితే ఉక్రెయిన్ యుద్ధం తర్వాత ప్రపంచం మునపట్లా లేదు. ఆంక్షల చక్రబంధంలో బిగించి రష్యాను పాదాక్రాంతం చేసుకోవాలని అమెరికా, దానికి మద్దతుగా నిలిచిన యూరోప్ దేశాలూ పట్టుదలగా వున్నాయి. పర్యవసానంగా రష్యా ఆర్థిక వ్యవస్థ బలహీనపడి వణుకుతోంది. ఆ దేశంతో ఎవరు లావాదేవీలు సాగించినా చర్యలు తీసుకుంటామని అమెరికా హెచ్చరిస్తోంది. రెండేళ్ల క్రితం రష్యా ఉక్రెయిన్‌పై దండెత్తటానికి కొన్ని రోజులముందు రష్యా-చైనాల మధ్య 'హద్దుల్లేని వ్యూహాత్మక ఒప్పందం' కుదిరింది. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఆ రెండు దేశాలూ ఇప్పటికీ 'హద్దులెరగని' బంధాన్ని కొనసాగిస్తాయా... రష్యాపై అమలవుతున్న ఆంక్షలకూ, అమెరికా హెచ్చరికలకూ చైనా తలొగ్గుతుందా అనే ప్రశ్నలు గత కొన్ని రోజులుగా పాశ్చాత్య ప్రపంచాన్ని వేధిస్తున్నాయి. పుతిన్‌కు బీజింగ్‌లో దక్కిన ఘనస్వాగతమూ, ఇరు దేశాల ఉమ్మడి ప్రకటనా, ఉభయ దేశాధినేతల ప్రసంగాలూ గమనించాక అమెరికా, యూరోప్ దేశాలకు అసంతృప్తే మిగిలి వుంటుందన్నది వాస్తవం.

అయితే 75 ఏళ్లక్రితం కొత్తగా ఆవిర్భవించిన చైనాను గుర్తించిననాటి సోవియెట్ యూనియన్‌కూ, ఇప్పటి రష్యాకూ పోలికే లేదు. అప్పట్లో అది అమెరికాతో 'నువ్వా నేనా' అన్నట్టు తలపడే తిరుగులేని శక్తి. అనంతర కాలంలో ఆ దేశం కుప్పకూలింది. చీలికలు పేలికలైంది. ఈ మూడు దశాబ్దాల్లో గత వైభవాన్ని సంతరించుకోవాలని చేసిన ప్రయత్నాలు ఎంతో కొంత ఫలిస్తున్న వైనం కనబడుతుండగానే క్రిమియా ఆక్రమణ, ఆ తర్వాత ఉక్రెయిన్‌పై దురాక్రమణ యుద్ధం రష్యాను సంక్షోభంలోకి నెట్టాయి. చైనా మాదిరే భద్రతామండలిలో రష్యా శాశ్వతసభ్య దేశమే కావొచ్చు. కానీ ఇప్పుడది దాదాపు ఒంటరి. చెప్పాలంటే చైనాకు జూనియర్ భాగస్వామి. తమది కూటమి కాదని, తమ స్నేహం వెనకున్న ఉద్దేశం దశాబ్దాల బంధాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లటమేనని ఉభయ దేశాలూ చెబుతున్నాయి. కానీ ఆ రెండు దేశాల ఉమ్మడి ప్రత్యర్థి అమెరికాయేనని ప్రపంచానికంతకూ తెలుసు. డ్రోన్‌లు, క్షిపణి సాంకేతికత, ఉపగ్రహ నిఘా నివేదికలు, ఫైటర్ జెట్లకు పనికొచ్చే విడిభాగాలు, మైక్రోచిప్‌లు సరఫరా చేస్తూ దురాక్రమణ యుద్ధానికి చైనా ఆజ్యం పోస్తున్నదని అమెరికా అనుమానం. ఈ చైనా సంస్థలను నిషేధ జాబితాలో పెడతామని హెచ్చరిస్తోంది. ఇది ఎంతోకొంత పనిచేసింది. చైనా బ్యాంకులు రష్యా సంస్థలతో మొన్న మార్చినుంచి లావాదేవీలు బాగా తగ్గించాయి. పర్యవసానంగా ఇటీవల వాణిజ్యం మందగించింది. దీన్ని మళ్లీ యథాస్థితికి తీసుకెళ్లటం పుతిన్ ప్రాధాన్యాంశాల్లో ఒకటి. అందుకే ఆయన వెంట భారీ ప్రతినిధి బృందం బీజింగ్ వెళ్లింది. గత ఆర్థిక సంవత్సరం గణాంకాలు గమనిస్తే చైనాతో రష్యా వాణిజ్యం రికార్డు స్థాయిలో 24,000 కోట్ల డాలర్లకు చేరుకుంది. ఉక్రెయిన్ యుద్ధం మొదలయ్యే నాటికున్న వాణిజ్యంతో పోలిస్తే ఇది 60 శాతం అధికం. రష్యా ఎగుమతుల్లో చైనా వాటా 30శాతం కాగా,దాని దిగుమతుల్లో చైనా వాటా 40శాతం. ఆంక్షల బారిన పడకుండా వ్యాపార, వాణిజ్యాలను ఎలా కొనసాగించాలన్నదే ప్రస్తుతం రష్యా, చైనాల ముందున్న ప్రశ్న. ఇంధనం, పరిశ్రమలు, వ్యవసాయం, నిర్మాణ రంగాల్లో తమకు సహకరించాలని పుతిన్ అర్థించారు. అలాగే ఆంక్షల తర్వాత ఎలక్ట్రానిక్ ఉపకరణాల నుంచి కార్ల వరకూ అన్ని మార్కెట్లనుంచీ పాశ్చాత్య దేశాలు తప్పుకున్నాయి. ఆ లోటును చైనా తీరుస్తోంది. దాన్ని మరింత పెంచాలని ఉభయ దేశాలూ నిర్ణయించాయి. డాలర్లలో కాక తమ తమ కరెన్సీల్లోనే లావాదేవీలు జరుపుకుంటున్నాయి. జార్ చక్రవర్తుల కాలం నుంచీ పాశ్చాత్య దేశాలతో రష్యాకున్న వాణిజ్య బంధం ఇప్పుడు పూర్తిగా స్తంభించిపోయింది. ఇన్నాళ్లూ యూరోప్ దేశాలకు వెళ్లిన సహజవాయు ఎగుమతుల్ని చైనాకు మళ్లించేందుకు పుతిన్ సిద్ధపడినా ప్రస్తుతానికైతే ఒప్పందం ఖరారు కాలేదు.

వ్లాదిమిర్ సోరోకిన్ అనే రచయిత 2028 నాటికి రష్యా పోకడలెలా వుంటాయో చిత్రిస్తూ 2006లో 'డే ఆఫ్ ఆప్రిష్నిక్' అనే నవల రాశాడు. అప్పటికల్లా చైనా సాంకేతికతే అన్ని రంగాల్లోనూ వర్ధిల్లుతుందనీ, కానీ జార్ సామ్రాజ్యానికి ఆద్యుడిగా భావించే మధ్యయుగాలనాటి మాస్కో ప్రిన్స్ ఇవాన్‌ను తలపించే అత్యంత క్రూరమైన పాలన సాగుతుందనీ ఆ కాల్పనిక ఇతివృత్తం చెబుతుంది. పుతిన్ ఎలా పరిణమిస్తారన్న సంగతలావుంచి చైనా సాంకేతికతలు ఇప్పటికే రష్యాకు వచ్చాయి. చైనా కార్లు రష్యా రోడ్లపై పరుగులెడుతున్నాయి. ప్రపంచం గతంలో మాదిరి లేదని, ఎవరినీ ఎవరూ శాసించలేరని అమెరికా, పాశ్చాత్య దేశాలు గుర్తించాలి. ఉద్రిక్తతలు ఉపశమింపజేసేందుకూ, శాంతి సాధనకూ ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో వ్యవహరించటం, రాజీకి సిద్ధపడటం అవసరమని ఇరు పక్షాలూ తెలుసుకోవాలి. అందుకు భిన్నమైన వినాశకర మార్గంలో పోతామంటే ప్రపంచ ప్రజానీకం క్షమించదు.

కోవిడ్ టీకాను ఎలా చూడాలి?

విశ్లేషణ



శైలజా చంద్ర

'ఆస్ట్రా–జెనెకా' తన కోవిడ్–19 టీకాలను ప్రపంచవ్యాప్తంగా ఉపసంహరించుకోవడం చర్చనీయాంశం అయింది. ఆ టీకా వల్ల రక్తం గడ్డకట్టడం లాంటి దుష్ప్రభావాలు అరుదుగానైనా కలగడమే ఆ నిర్ణయానికి కారణం. ఇదే టీకాను 'కోవిషీల్డ్' పేరుతో ఇండియాలో కోట్లాది డోసులు వేయడం సహజంగానే ఆందోళన కలిగిస్తుంది. కానీ ఈ టీకా కేవలం పది నెలల్లోనే ఆమోదం పొందిన వాస్తవాన్ని విస్మరించకూడదు. మహమ్మారులు దాడి చేసినప్పుడు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజారోగ్య నిపుణులు, ప్రభుత్వాలు ప్రమాదంలో ఉన్న జనాభాను కాపాడుకోవాల్సి ఉంటుంది. భారత్ లాంటి పెద్ద దేశంలో ఆసుపత్రుల్లో పడకలు కూడా అందుబాటులో లేని కాలంలో, ఈ టీకా లక్షలాది మందిని చనిపోకుండా నిరోధించిందని మరిచిపోరాదు.

ఆంగ్లో–స్వీడిష్ ఔషధ తయారీదారు అయిన 'ఆస్ట్రా–జెనెకా' తన కోవిడ్–19 టీకాలను ప్రపంచవ్యాప్తంగా ఉపసంహరించుకోవడం ప్రారంభించింది. భారతదేశంలో 'కోవిషీల్డ్' పేరుతో వచ్చిన ఈ టీకాను ఆస్ట్రా–జెనెకా సహకారంతో పుణెకు చెందిన 'సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా' తయారు చేసింది. దేశ వ్యాప్తంగా దాదాపు 175 కోట్ల టీకా డోసులను అందించారు. టీకాల ఉపసంహరణకు 'భిన్న రకాల వేరియంట్లకు బహుళ టీకాల లభ్యత వల్ల కాలం చెల్లిన టీకాలు మిగిలిపోవడం' కారణమని ఆస్ట్రా–జెనెకా సంస్థ పేర్కొంది. సరళంగా చెప్పాలంటే, తీవ్రమైన దుష్ప్రభావాల కేసులకు సంబంధించిన కోర్టు విచారణలు, కంపెనీ ఎదుర్కొంటున్న 100–మిలియన్ పౌండ్ల(సుమారు వెయ్యి కోట్ల రూపాయలు) మేరకు క్లాస్ యాక్షన్ వ్యాజ్యం(ఎక్కువమందికి సంబంధించిన కేసు) నేపథ్యంలో ఇది కేవలం వ్యాపార నిర్ణయం.

కోవిడ్–19 టీకా 'చాలా అరుదైన సందర్భాల్లో, టీటీఎస్‌కు కారణం కావచ్చు' అని కంపెనీ, ఫిబ్రవరిలో అంగీకరించినట్లు నివేదించబడింది.'టీటీఎస్' అంటే థ్రాంబోసైటోపెనియా సిండ్రోమ్‌తో థ్రాంబోసిస్. ఇది శరీరంలో ప్లేట్‌లెట్లు పడిపోవడానికీ, రక్తం గడ్డకట్టడానికీ కారణమవుతుంది. ఊపిరి ఆడకపోవడం, ఛాతీ నొప్పి, తలనొప్పులు, సులభంగా గాయపడటం వంటి లక్షణాలు దీంట్లో ఉంటాయి. బ్రిటన్‌లో చాలా మంది వ్యక్తులు తాము వివిధ రకాల గాయాలతో బాధపడుతున్నామని పేర్కొన్నారు. భారతదేశంలో కూడా, కొన్ని కుటుంబాలు ఆస్ట్రా–జెనెకాపై, సీరమ్ సంస్థపై చట్టపరమైన చర్యలను కొనసాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, ప్రభుత్వాలు ఏమి చేయాలని ప్రజారోగ్యం నిర్దేశిస్తుంది, భారతదేశంలో దీనికి ఏదైనా భిన్నంగా చేయగలిగి ఉండేవాళ్లమా అనేదాని గురించి నేను ఆలోచిస్తున్నాను. మాజీ ప్రజారోగ్య పాలనాధికారిగా నా అభిప్రాయాలను ఇచ్చే ముందు, ఇద్దరు అత్యంత పరిజ్ఞానం ఉన్న వ్యక్తులతో మాట్లాడాను.

నేను మొదటగా భారతదేశ ప్రముఖ మైక్రోబయాలజిస్టు, వైరాలజిస్టులలో ఒకరైన డాక్టర్ గగన్‌దీప్ కాంగ్‌తో మాట్లాడాను. ఆమె సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖలోని ట్రాన్స్‌లేషనల్, హెల్త్, సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్నప్పుడు నాకు తెలుసు. ఆమె అభిప్రాయం మేరకు, ప్రపంచ ఆరోగ్య సంస్థ 2021 మార్చిలో ఆస్ట్రా–జెనెకా టీకా టీటీఎస్ దుష్ప్రభావం కలిగించే ప్రమాదం గురించి ప్రకటించింది. 2021 మే నాటికి దానిని ధ్రువీకరించింది. 2021 అక్టోబర్‌లో 'కోవిషీల్డ్'కు సంబంధించిన ప్రమాద కారకాన్ని చేర్చడానికిగానూ సీరమ్ సంస్థ తన టీకా లేబుల్‌ను నవీకరించింది. టీటీఎస్ వల్ల, కొందరు రోగులు దుష్ప్రభావాలను ఎదుర్కొన్నట్లు, కొన్ని సందర్భాల్లో చివరికి మరణాలు సంభవించాయని మనకు పాడికథలుగా మాత్రమే తెలుసు. అలాంటప్పుడు టీకాను కొనసాగించడం లేదా కొనసాగించకపోవడం వల్ల కలిగే నష్టం ఏమిటి? మనకు ప్రత్యామ్నాయం ఉందా?



గగన్‌దీప్ కాంగ్ మనకు తెలియని వాటి గురించి వివరించారు. ''ప్రమాదం వయస్సుపై ఆధారపడి ఉంటుంది. ఇది భౌగోళికతపై కూడా ఆధారపడి ఉండొచ్చు. భౌగోళికత సమస్యను రోటావైరస్ టీకాల కోసం మనం చేసినట్లుగా ఫార్మావిజిలెన్స్ ద్వారా మాత్రమే లెక్కించవచ్చు. నిష్క్రియాత్మకంగా అంటే ప్రజలు సమస్యను నివేదించే వరకు వేచి ఉండటం మరొక మార్గం. ఈ విధానంలో ఉన్న సమస్య ఏమిటంటే, టీకా వేసిన మొదటి కొన్ని గంటలలో లేదా రోజులలో దుష్ప్రభావం చూపకుంటే అది టీకాతో సంబంధం ఉన్నదిగా గుర్తించబడకపోవచ్చు.

ప్రమాదం–ప్రయోజనం నిష్పత్తి, ముఖ్యంగా డెల్టా వేవ్ విషయంలో చూస్తే, ప్రయోజనమే ఎక్కువగా ఉండింది; ముఖ్యంగా వృద్ధులకు ఎక్కువగా, యువకులకు కొంత తక్కువగా. పాశ్చాత్య దేశాలను అనుసరించి, 40 ఏళ్ల కంటే తక్కువ వయసు ఉన్నవారికి కోవిషీల్డ్‌ను వేయడం నిలిపివేసి ఉంటే, మన ప్రత్యామ్నాయం 'కోవాక్సిన్' అయి వుండేది. ఇది తక్కువ సరఫరాలో ఉంది. ఫలితంగా యువకులకు రోగనిరోధక శక్తి విస్తరించేది. భారతదేశానికి నిర్దిష్టంగా టీటీఎస్ డేటా లేనందున, పర్యవేక్షించడం కష్టంగా ఉండేది'' అని ఆమె చెప్పారు.

న్యూఢిల్లీలోని ఎయిమ్స్‌కు చెందిన సెంటర్ ఆఫ్ కమ్యూనిటీ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ ఆనంద్ కృష్ణన్ దీనిని విభిన్నంగా చెప్పారు: ''అరుదైన దుష్ప్రభావం ప్రయోజనకరమైన కార్యక్రమాన్ని అడ్డుకోలేకపోవడానికి భారీస్థాయి ప్రజారోగ్య ప్రయోజనం కారణమైంది. దుష్ప్రభావాలపై దృష్టి కేంద్రీకరించడం వలన టీకా వేసుకోవాలా వద్దా అనే సంకోచం ఏర్పడుతుంది. అంటే మనం ఆ దుష్ప్రభావాలను దాచిపెట్టాలని కాదు... వెనక్కి చూసుకుంటే, మెరుగైన, మరింత సూక్ష్మమైన, సమతుల్యమైన సమాచారం సహాయపడి ఉండేదని చెప్పడం మెరుగు. అరుదైన దుష్ప్రభావాలను ఎదుర్కొన్న వారికి పరిహారం కోసం కూడా మనం ప్లాన్ చేసి ఉండవచ్చు.''

దుష్ప్రభావాల క్లెయిమ్‌లను పరిశీలించే ప్రక్రియ రాష్ట్ర ప్రభుత్వాలకు ఒక పీడకలగా మారేదని చెప్పడానికి నాకు ఎలాంటి సంకోచమూ లేదు. టీకాలు అత్యంత వేగంగా పూర్తి చేయడానికి అవి పూర్తిగా కట్టుబడి ఉన్నాయి. మహమ్మారి దాడి చేసినప్పుడు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజారోగ్య నిపుణులు, ప్రభుత్వాలు ప్రమాదంలో ఉన్న జనాభాను కాపాడుకోవాల్సి ఉంటుంది. అత్యంత హాని కలిగే వారికి ప్రాధాన్యతనిచ్చి టీకాలు వేసేలా చూసుకోవాలి. భారతదేశంలో ఆసుపత్రుల్లో పడకలు అందుబాటులో లేని కాలంలో వేలాది మంది ప్రజలు చనిపోకుండా టీకాలు నిరోధించాయి.

ఇక టీకాను అభివృద్ధి చేయడానికి తీసుకునే సాధారణ సమయం పదేళ్లు. దీనికి భిన్నంగా ఆస్ట్రా–జెనెకా టీకా కేవలం పది నెలల్లోనే ఆమోదం పొందిన వాస్తవాన్ని మనం విస్మరించకూడదు. దానిని తప్పక గుర్తించి, గౌరవించాలి. ఇది కచ్చితంగా లక్షలాది మందిని తీవ్రమైన అనారోగ్యాలకు గురికాకుండా లేదా చనిపోకుండా నిరోధించింది. తీవ్రమైన దుష్ప్రభావాల గురించి బాగా అర్థం చేసుకుని, నిర్ణయాలు తీసుకున్నవారు పట్టించుకుని ఉంటే పరిస్థితి భిన్నంగా ఉండేది. కానీ అంతేనా? ఏదైనా నిపుణుల సంఘం ఇచ్చిన ప్రతికూల సలహా దేన్నయినా అణచిపెట్టారా? రాష్ట్ర ప్రభుత్వాలతో పంచుకోవాల్సిన ముఖ్యమైన, చర్య తీసుకోదగిన సమాచారం ఏదైనా ఉండిందా? అలా కాదంటే మాత్రం వ్యాక్సిన్ డ్రైవ్‌ను వేగవంతం చేయడానికి ప్రయోజనపు సమతూకం స్పష్టంగా అనుకూలంగా ఉంది.

భారతదేశంలోని భారీ జనాభాకు టీకాలు వేయకుండా ఆటంకం కలిగించే శక్తిమంతమైన టీకా వ్యతిరేక ఉద్యమాన్ని మనం అదృష్టవశాత్తూ చూడలేదు. రద్దీగా ఉండే నగరాలు, ఆరు లక్షలకు పైగా గ్రామాలలో ప్రజలు చెదిరిపోయి ఉన్నందున ప్రజారోగ్య స్పందన అనేది సహజంగానే పెద్ద ఎత్తున వ్యాధిగ్రస్తులను మరియు మరణాలను నిరోధించడానికి ఉద్దేశించారు. అందులో చర్చకు తావులేదు. కుటుంబాలు, సంఘాల ఎంపికకు టీకాను వదిలేసివుంటే, లక్షలాదిమందిని ప్రమాదంలో పడేసేది. వయసు లేదా భౌగోళికతపై లేని డేటాను వెతుకుతూ పోతే, టీకా కార్యక్రమం పట్టాలు తప్పివుండేది. ఒక్కో జిల్లాలో దాదాపు 20 లక్షల జనాభా కలిగిన భారతదేశంలోని దాదాపు 800కు పైగా జిల్లాల్లోని జిల్లా ఆరోగ్య కార్యకర్తలు అప్పటికే తీవ్ర పని ఒత్తిడిలో ఉన్నారు.

కొన్ని సమయాల్లో, మంచి (ఈ సందర్భంలో, దుష్ప్రభావాలను పర్యవేక్షించడం) అనేది కూడా గొప్ప శత్రువుగా (లక్షలాదిమందికి టీకాలు అందని అపాయం ఉండటం) మారవచ్చు. భారతదేశానికి సంబంధించి, ఈ క్షణపు వాస్తవం ఇది!

వ్యాసకర్త కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి; మాజీ ప్రధాన కార్యదర్శి ('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

బిగ్ ఆద్మీ పార్టీ



ఆమ్ ఆద్మీ పార్టీ ఒక రియాలిటీ టీవీ షో అయిపోయింది. ప్రతి రోజూ బిగ్ బాస్ కొత్త ఎపిసోడ్ చూస్తున్నట్టుగా ఉంది.

– కార్తికేయ తన్నా, రచయిత

మారిన ధోరణి



నార్త్ ఇండియాలో ఒకప్పుడు ఏ 5–స్టార్ హోటల్‌కు వెళ్లినా నేను కావాలని హిందీలోనే మాట్లాడేవాడిని. అయినా తరచుగా వాళ్లు ఇంగ్లిష్‌లోనే బదులిచ్చేవారు. కానీ ఈ మధ్య వాళ్లు చాలా సౌకర్యంగా హిందీలో జవాబిస్తున్న ధోరణిని గమనించాను. ఏమైనా మార్పు వచ్చిందా?

– సంక్రాంత్ సాను, ఆంట్రప్రెన్యూర్

ఇంత ఘోరమా?



దేవుడా! ప్రతిరోజూ తిండి, నీళ్ల కోసం పోరాటమే. ఏడు నెలల కనికరం లేని నరమేధం తర్వాత మా జీవితాలు ఆరిపోతున్నాయి. ఇక నా వల్ల కావడం లేదు. నేను ఎప్పటికీ పుట్టకపోతే బాగుండు అనిపిస్తోంది.

– మొహమ్మద్ ఎ. మనస్రా, గాజా గొంతుక

పెద్దాళ్లు...



ఈ భూగ్రహానికి వచ్చి 23 ఏళ్లు అయిన తర్వాత నేను గ్రహించినది ఏమంటే, త్వరగా నిద్రలేవడమే ప్రతిదానికీ పరిష్కారం.

– మీనాల్ జైన్, ఫెసిలిటేటర్

ఆగిన పత్రిక



'రీడర్స్ డైజెస్ట్' మరి లేదు. (బ్రిటన్‌కు చెందిన రీడర్స్ డైజెస్ట్ మ్యాగజైన్ 86 ఏళ్ల తర్వాత ఆగిపోయిందని వార్త.) అంత పెద్దగా తెలియని దాని కజిన్ 'హ్యూమన్ డైజెస్ట్'కు ఏమైంది? బహుశా అది కూడా ఆగిపోయి ఉంటుంది.

– అర్ణబ్ రే, స్క్రీన్ రైటర్

ఇదెందుకు కాలేదో!



ఎన్నో ప్రపంచ యుద్ధాలను ఆపిన మనిషి మణిపుర్ హింసను మాత్రం ఎందుకో ఆపలేకపోయారు. అదీ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వమే ఉన్నప్పటికీ. ఏడాదిగా అలాగే ఉంది పరిస్థితి. (రంజాన్ సమయంలో గాజాలో యుద్ధం ఆపానని నరేంద్ర మోదీ అన్న నేపథ్యంలో.)

– సుశాంత్ సింగ్, సీనియర్ ఫెలో

అసలు రహస్యం



ఇజ్రాయెల్ ఇప్పటివరకూ రఫాలో 70 సొరంగాలను కనుక్కుంది. అందులో 50 వరకు ఈజిప్టు సరిహద్దును దాటుతాయి. ఈ విషయాన్నే ఈజిప్ట్ దాస్తోంది. ఈ సొరంగాల నుంచే ఆయుధాలు, మందుగుండు సామగ్రి గాజాకు దొంగరవాణా అయ్యాయి. ఈజిప్ట్, బైడెన్(అమెరికా అధ్యక్షుడు) రఫా ఆక్రమణకు వ్యతిరేకమంటే ఆశ్చర్యం లేదు!

– ఇంతియాజ్ మహమూద్, వ్యాఖ్యాత

చిత్రమైన కాలం



నాలుగేళ్ల క్రితం బ్రిటన్‌లో ఈ రోజు: ఒక ఇంట్లోకి వారి ఆయానో, పనిమనిషో వెళ్లడానికి అనుమతి ఉండేది. కానీ అదే ఎంతో దగ్గరి బంధువులు వేరే చోట ఉంటే వాళ్లు రావడానికి మాత్రం అనుమతి ఉండేది కాదు. ఆధునిక చరిత్రలో కోవిడ్ కాలం విచిత్రమైన, అర్థంపర్థంలేని ఎన్నో వెర్రి నియమ నిబంధనలను తెచ్చింది.

– జేమ్స్ మెల్‌విల్, ఇంటర్నెట్ పర్సనాలిటీ

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు వైశాఖ మాసం, తిథి: శు.దశమి ఉ.11.09 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం: ఉత్తర రా.12.19 వరకు, తదుపరి హస్త వర్జ్యం: ఉ.5.41 నుండి 7.25 వరకు, దుర్ముహూర్తం: ఉ.5.31 నుండి 7.08 వరకు, అమృతఘడియలు: సా.4.14 నుండి 6.01 వరకు.

సూర్యోదయం : 5.31
సూర్యాస్తమయం : 6.21
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

ఇన్ బాక్స్

అభ్యుదయ సాహితీ నయాగరా

అభ్యుదయ సాహిత్యంలో గొప్ప రచయితగా, వక్తగా పేరుగాంచినవారిలో చందు సుబ్బారావు ఒకరు. వృత్తిరీత్యా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో భూభౌతిక శాస్త్ర ఆచార్యునిగా ఉద్యోగ విధులు నిర్వహించారు. వృత్తి సంబంధమైన పరిజ్ఞానంతో కొన్ని అపురూపమైన శాస్త్రీయ విజ్ఞాన రచనలు చేశారు. అలాగే తాను నమ్మిన ప్రగతిశీల భావజాలంతో ఎన్నో రచనలు చేశారు. అన్నిటికి మించి బాబాసాహెబ్ డా॥ బి.ఆర్. అంబేడ్కర్ జీవిత చరిత్రను అత్యున్నతంగా తెలుగులోకి అనువదించారు (వసంత అబాజీ దహాకే సంపాదకత్వంలోని ఆంగ్ల రచన).



చందు సుబ్బారావు

గుంటూరు జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమంతో మంచి అనుబంధమున్న కుటుంబంలో జన్మించారు. మేనమామ, సుప్రసిద్ధ నాటక, సినీ రచయిత బొల్లిముంత శివరామకృష్ణ ప్రభావంతో రచనా వ్యాసంగం ప్రారంభించి నాలుగు దశాబ్దాలుగా కొనసాగిస్తున్నారు. ఎంతటి నిరాశావాదులనైనా ఉత్తేజితుల్ని చేసి, కార్యోన్ముఖుల్ని చేసేలా సాగే చందు సుబ్బారావు ప్రసంగం తీరుతెన్నులు వినవలసిందే. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) సారథిగా ఆచార్య చందు చేసిన సాహిత్య, సాంస్కృతిక సేవ అంతా ఒక ఎత్తు, ఆధునిక నాటక రంగానికి ఎనలేని సేవ చేసిన డా॥ కేవీ గోపాలస్వామి శతజయంత్యుత్సవ కమిటీ కన్వీనర్‌గా ఆయన చేసిన కృషి మరో ఎత్తు. విశాఖ నగర 'అరసం' శాఖ అధ్యక్షునిగా ఆచార్య చందు సుబ్బారావు ఆధ్వర్యంలో అరసం అరవై ఏళ్ళ సభ నిర్వహించారు. బహుశా ఆ సభలోనే చివరిగా ప్రసిద్ధ రచయిత ఆవంత్స సోమసుందర్, దిగంబర కవి జ్వాలాముఖి పాల్గొని 'అభ్యుదయ సాహిత్యం– కవులు, రచయితల కర్తవ్యం' గురించి చిరస్మరణీయమైన ప్రసంగాలు చేశారు. ఆ తర్వాత అరసం విశాఖ శాఖకు అధ్యక్షునిగా అనేక సాహితీ సభలు దిగ్విజయంగా నిర్వహించారు.

2016లో ఆచార్య చందు సుబ్బారావు లిటరరీ కల్చరల్ ట్రస్టు స్థాపించారు. ప్రతి ఏటా ఉత్తమ సాహితీవేత్తకు ఆచార్య చందు పేరిట పురస్కారం ప్రదానం చేస్తున్నారు. ఈ ఏడాది ఆంధ్ర విశ్వ విద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య జర్ర అప్పారావుకు ఈ నెల 18వ తేదీన దీనిని ప్రదానం చేస్తున్నారు.

– బి. వి. అప్పారావు, విశాఖపట్టణం
(నేడు ఆచార్య చందు సుబ్బారావు జన్మదినం)

వేషాల మురిపెం తీర్చే జాతర

సందర్భం



నాగపట్ల భక్తవత్సల రెడ్డి

గంగమ్మ జాతర అంత జాతర, తిరుమల కొండంత కొండ లేవన్నది స్థానికుల మాట. తిరుపతిలో ఏటా చిత్రి నెల నాలుగో మంగళవారం చాటింపు వేస్తారు. చాటింపు అంటే ప్రారంభం. తర్వాతి మంగళవారం రాత్రి గంగమ్మ నిల్చిన బుధవారంతో జాతర పూర్తవుతుంది. అయితే ఈ ఏడాది ఎన్నికల వల్ల ఒకవారం ఆలస్యంగా మే 14న జాతర ప్రారంభమయ్యింది. వారంపాటు వివిధ వేషాలతో, ఆచారాలతో, మొక్కుబడులతో జాతర జరుగుతుంది. తిరుపతిలో పల్లెవీధి గంగమ్మ, మంచాలవీధి గంగమ్మ, తాతయ్యగుంట గంగమ్మ, తాళ్లపాక గంగమ్మ, వేషాలమ్మ ఉన్నా జాతర మాత్రం తాతయ్యగుంట, తాళ్లపాక గంగమ్మలకి సంబంధించింది. తిరుపతి చుట్టూ ఉన్న చాలా గ్రామాల్లో గంగ జాతర్లు జరిగేవి.



'శ్రీ తాతయ్యగుంట గంగమ్మ... కంటకుడైన పాలెగాణ్ణి చంపిన శక్తి స్వరూపిణి. కోరిన కోర్కెలు తీర్చే దేవత. చల్లగా చూసే తల్లి. అనుకున్నది తీరుస్తుంది. ఊరిలో అమ్మోరు అవీ లేకుండా చేస్తుంది. పిలిస్తే పలికే దైవం. పెదగంగమ్మ (తాళ్లపాక గంగమ్మ) క్షమిస్తుంది. చిన్న గంగమ్మ (తాతయ్యగుంట గంగమ్మ) మహిమ గలది, మొక్కుబడి తీర్చకపోతే శిక్షిస్తుంది. పెద్దామె చూపుల గంగమ్మ, చిన్నామె మేపుల గంగమ్మ. వేషాలమ్మ మంచిది. మంచినీళ్ల గుంట కాడి గంగమ్మ (తాతయ్యగుంట గంగమ్మ) మంచిది కాదు' – ఇవీ గంగమ్మ తల్లి మీద భక్తులకున్న ఆరాధనాపూర్వక నమ్మకాలు.

శ్రీ తాతయ్యగుంట గంగమ్మ జాతర నిర్వహణలో మొక్కుబళ్లు, వేషాలు, బూతుపాటలు, దీవెనలకు ప్రాధాన్యత ఉంటుంది. దున్నపోతు, బద్దిగొర్రెల్ని బలి ఇవ్వడం (గుడి ఆవరణలో ప్రస్తుతం బలుల నిషేధం), పొలి చల్లడం ఆచారం. గంగమ్మ తల్లికి ఎదుర్కోలు, వీడ్కోలు ప్రధాన కార్యక్రమాలు. ఒకనాడు బసివి లేదా మాతను వదలడం కొన్ని కులాల్లో ఆచారంగా ఉండేదట. జాతర నిర్వహణలో కొన్నికులాలకు, కుటుంబాలకు, వ్యక్తులకు మిరాశీ హక్కులు, బాధ్యతలు, మర్యాదలు ఉంటాయి.

చాటింపు జరిగాక రోజూ రెండు పూటలా వేషాలతో మిరాశీదారులు, భక్తులు వీధులు తిరుగుతూ తాతయ్యగుంట గంగమ్మ గుడికి వచ్చి చుట్టూ మూడు సార్లు తిరిగి, వేషాలమ్మ గుడికి వెళ్లి వేషాలు తీసేయడం, చివరి రోజు గంగమ్మ తల్లి బొమ్మ తయారీ, పేరంటాలు గంగమ్మ తల్లి చెవి నరకడం (దేవతకు వీడ్కోలు)తో జాతర పూర్తవుతుంది.

ప్రతి వేషానికీ ప్రత్యేక వేషధారణ, పాడడానికి ఒక్కో పాట ఉంది. మొదటి మూడు రోజుల్లో వచ్చే వేషాలకు మాత్రమే బూతుపాటలు (ఒకప్పుడు అవి కూడా గుడి ప్రాంతంలోనే) పాడేవారట. ప్రస్తుతం భక్తుల వేషాల్లో వైవిధ్యం కనబడుతుంది.

జాతరలో వేపాకు తోరణాలు, వేపకొమ్మలు, వేపచీరలు అంతా వేపాకుమయం. అంబళ్లు పోయడం మరో ప్రధాన అంశం. పులియబెట్టి వండిన అంబలి ఇంటి దగ్గర, గుడి దగ్గర అండాల్లో పోయడం, తాగడం తప్పనిసరి ఆచారం. గొల్ల వేషం మజ్జిగ దుత్తతో ఇంటింటికి పోయినపుడు ఆ ఇంటి వారు అందులో మజ్జిగ పోస్తుంటారు. ఆ మజ్జిగని గొల్ల వేషం కొబ్బరి చిప్పతో ఆ ఇంటి వారికి, జనానికి పోస్తుంటుంది. బైరాగి వేషానికి చల్లదనం కల్గించే నాంకొమ్ము పూసుకుంటారు. జాతరలో వేప, పానకం, అంబలి, మజ్జిగలకు ఎంతో ప్రాధాన్యం ఉంది.


శ్రీ తాతయ్యగుంట గంగమ్మ జాతర ప్రజల నమ్మకానికి ప్రతీకాత్మక ప్రదర్శన. జాతర జరిగితే వర్షం పడుతుంది, పేరంటాలు వస్తే చల్లగాలి వీస్తుంది– ఇది ఈ జాతర వెనక ఉన్న ప్రధానాంశంగా గుర్తించాల్సి ఉంది. శిశిరం నుంచి వసంత ఋతువుకు– అంటే చలి నుంచి వేడికి మారుతున్న కాలం, వేసవికాలం మొత్తం జాగ్రత్తలు పాటించాలన్న ఉద్బోధ దీని వెనక ఉండేమోననిపిస్తుంది. ఇక్కడ రెండు ఋతువుల సంధి కాలంలో పాటించాల్సిన నియమాలను చెప్పడమో, లేక వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రతీకాత్మకంగా తెలియజేయడమో కనబడుతుంది.

వ్యాసకర్త విశ్రాంత తెలుగు ఆచార్యులు

భాషా సేవా మకుటం!

తెలుగు భాషకు చిరస్మరణీయ సేవలందించిన భాషా సేవకుడు కొమర్రాజు వెంకట లక్ష్మణరావు. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల మధ్య సామరస్యతకు జీవితాంతం కృషి చేసిన సౌజన్యమూర్తి. తెలుగులో చరిత్ర పరిశోధనలు, విజ్ఞాన రచనలు చేయడానికి తొలి అడుగులు వేసినవారు. నిద్రాణమై ఉన్న తెలుగు జాతిని మేల్కొలిపిన మహనీయుల్లో ఎన్నదగిన వారు.

క్రీ.శ. 1876 మే 18న ఉమ్మడి కృష్ణాజిల్లా పెనుగంచిప్రోలు గ్రామంలో జన్మించారు. తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాల్లో విద్యాభ్యాసం చేశారు. విద్యార్థిగా ఉన్నపుడు 'సమాచార్', 'వివిధ విజ్ఞాన్ విస్తార్' వంటి మరాఠీ పత్రికలకు సంపాదకత్వ బాధ్యతలు వహించారు. 'కేసరి', 'మహారాష్ట్ర' వంటి పత్రికలకు విరివిగా వ్యాసాలు రాశారు. అనేక చర్చల్లో క్రియాశీలక పాత్ర పోషించారు. తెలుగులో 'జనరంజని' పత్రిక స్వయంగా నడిపించారు. విజయవాడలో స్త్రీ విద్యావ్యాప్తి కొరకు రాయసం వెంకట శివుడు నిర్వహణలో వెలువడిన 'తెలుగు జనానా' పత్రికలో సోదరి బండారు అచ్చమాంబతో కలిసి అనేక రచనలు చేశారు.



కొమర్రాజు వెంకట లక్ష్మణరావు

బ్రిటిష్ తత్వవేత్త హెర్బర్ట్ స్పెన్సర్ సూచించిన అజ్ఞాత వాదాన్ని నమ్మిన లక్ష్మణరావు మతాతీత లౌకికవాద సిద్ధాంతాన్ని జీవితాంతం అనుసరించారు. హైదరాబాదులోని 'శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం' స్థాపించడంలోనూ; 'విజ్ఞాన చంద్రికా మండలి', 'విజ్ఞాన చంద్రికా పరిషత్', 'ఆంధ్ర సారస్వత పరిషత్తు' వంటి సంస్థల నిర్వహణలోనూ ఆయన పాత్ర కీలకమైనది. లక్ష్మణరావు సాహిత్య, సామాజిక ఉద్యమ నేపథ్యానికి వారి సోదరి అచ్చమాంబ అందించిన ప్రోత్సాహం ఎంత ఉన్నతమైందో, తొలి తరం తెలుగు కథా రచయిత్రిగా అచ్చమాంబ ఎదుగుదలలో ఆయన ప్రోత్సాహం కూడా మరువలేనిది. 'ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం' ఆయనకు విశేష కీర్తిని తెచ్చిపెట్టింది. 'శివాజీ చరిత్ర', 'హిందూ మహా యుగము', 'మహమ్మదీయ మహా యుగము' వంటి రచనలు చేశారు. 'జ్ఞానమొక భాషయొక్క యబ్బ సొమ్ము కాదు' అని నినదించారు.

– ర్యాలి ప్రసాద్, కాకినాడ
(నేడు కొమర్రాజు లక్ష్మణరావు జయంతి)

అంతర్జాతీయ ప్రమాణాలతో ఖమ్మం మార్కెట్ ఆధునీకరణ

- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వెల్లడి
- కోహెడ మార్కెట్ నుంచి అంతర్జాతీయంగా పండ్ల ఎగుమతులు
- గోదాములపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు


ఖమ్మం ఆధునిక మార్కెట్ నమూనా

సాక్షి, హైదరాబాద్: ఖమ్మం మార్కెట్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునీకరించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అధికారులను ఆదేశించారు. అలాగే కోహెడ మార్కెట్ నుంచి అంతర్జాతీయంగా పండ్ల ఎగుమతులు జరిగేలా అన్ని మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. ఈ మేరకు మంత్రి శుక్రవారం వ్యవసాయ, మార్కెటింగ్, జౌళి శాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్, జౌళి శాఖల్లో ఒకే రకమైన పనితీరు కలిగిన కార్పొరేషన్లను సంఘటితపరిచి ఒకే కార్పొరేషన్ ఏర్పాటుచేసి, వాటిని బలోపేతం చేసేందుకు ప్రతిపాదనలు తయారుచేసి త్వరలోనే ముఖ్యమంత్రి ఆమోదానికి పంపిస్తామని తెలిపారు. అకాల వర్షాలు, ఇతర ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు నష్టపోకుండా పంటల ఉత్పత్తులకు సంబంధించిన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, బయోమాస్‌కు సంబంధించిన యూనిట్లను కూడా ప్రోత్సహించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. మార్కెటింగ్, గిడ్డంగుల సంస్థల గోదాములపై సోలార్ ప్యానెల్స్‌ను ఏర్పాటు చేయాలని, దీనికోసం విద్యుత్ అధికారులతో సంప్రదించి తగిన ఒప్పందాలు చేసుకోవాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు టెస్కో ద్వారా తప్పనిసరిగా వస్త్రాలను కొనుగోలు చేయాలని మంత్రి చెప్పారు. ఈ ఆదేశాల ప్రకారం ఇప్పటివరకు వివిధ ప్రభుత్వ శాఖల నుంచి సుమారు రూ.255 కోట్ల విలువైన ఆర్డర్లు వచ్చాయన్నారు. ప్రతి సంవత్సరం బతుకమ్మ చీరలతో కలపి 5.70 కోట్ల మీటర్ల ఆర్డర్లు నేత కార్మికులకు వచ్చేవని, కానీ ఈ సంవత్సరం బతుకమ్మ చీరలు కాకుండానే 2.50 కోట్ల మీటర్ల ఆర్డర్లు వచ్చాయనీ, ఇంకా 80 లక్షల మీటర్ల ఆర్డర్లు రావాల్సి ఉందన్నారు. పవర్ లూమ్స్ పరిశ్రమకు విద్యుత్ సబ్సిడీ ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా అధికారులను మంత్రి కోరారు. సమావేశంలో పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, టీఎస్ఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, జౌళిశాఖ సంచాలకులు అలుగు వర్షిణి, ఉద్యాన సంచాలకులు అశోక్‌రెడ్డి, మార్కెటింగ్ శాఖ సంచాలకులు లక్ష్మీబాయి పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలతో డీసీసీబీ చైర్మన్ల భేటీ

ఖమ్మం, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, మెదక్, వరంగల్, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాల డీసీసీబీ చైర్మన్లు శుక్రవారం సెక్రటేరియట్‌లో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా వారు ఆయా బ్యాంకుల స్థితిగతులు, ఆర్థిక విధానాలను వివరించారు.



రుణమాఫీపై నేడు నిర్ణయం

- మంత్రివర్గ భేటీలో చర్చించే అవకాశం
- ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే శాఖలపై కూలంకషంగా చర్చ
- కాళేశ్వరం బ్యారేజీలకు మరమ్మతులపై కీలక నిర్ణయం తీసుకునే చాన్స్
- విద్యార్థులకు యూనిఫామ్‌లు, పుస్తకాలపైనా దృష్టి పెట్టనున్న కేబినెట్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మంత్రివర్గ సమావేశం శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన అంబేడ్కర్ సచివాలయంలో జరగనుంది. లోక్ సభ ఎన్నికల అనంతరం జరుగుతున్న ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా రైతు రుణమాఫీకి నిధుల సమీకరణ అంశంపై చర్చించి ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంది. ఆగస్టు 15వ తేదీలోగా రైతు రుణాలను మాఫీ చేస్తామని సీఎం ప్రకటించిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలోనే నిధుల సమీకరణ, రుణమాఫీ కటాఫ్ తేదీలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. రెండు లక్షల రూపాయల వరకు పంట రుణాలు తీసుకున్న వారి రుణాలు మాఫీ చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. కాగా ఈ మేరకు చేపట్టాల్సిన కార్యాచరణపై ఒక నిర్ణయం తీసుకుని.. నిధులు సమకూర్చే బాధ్యతను అధికార యంత్రాంగంపై పెట్టే అవకాశం ఉంది.

ప్రస్తుతం కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్ల పురోగతిని సమీక్షించడంతోపాటు, వచ్చే ఖరీఫ్ పంటల ప్రణాళికపై కూడా మంత్రివర్గం చర్చించనుంది. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తి కానుండటంతో పునర్విభజన చట్టానికి సంబంధించిన పెండింగ్ అంశాలు, తెలంగాణ, ఏపీ

ధాన్యం కొనుగోళ్లపై చర్చ

మధ్య అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై కూడా చర్చించనున్నారు. రాష్ట్ర ఆదాయం పెంచుకునే దిశగా వనరుల సమీకరణ, ఆదాయ పెంపునకు ఉన్న అవకాశాలపై చర్చించే అవకాశం ఉంది. కుంగిపోయిన మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల (కాళేశ్వరం) రిపేర్లకు సంబంధించి నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇటీవలే మధ్యంతర నివేదికను సమర్పించింది. ఇందులోని సిఫారసులు పరిశీలించి తదుపరి చేపట్టాల్సిన కార్యాచరణపై కేబినెట్‌లో చర్చించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. జూన్ నుంచి కొత్త విద్యాసంవత్సరం ఆరంభమవుతున్న నేపథ్యంలో పాఠశాలలు, కళాశాలల ప్రారంభానికి ముందే అవసరమైన సన్నాహక చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. విద్యార్థుల నమోదు, పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌ల పంపిణీ తదితర అంశాలను చర్చించి విద్యాశాఖ అధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వనున్నట్లు సమాచారం.

మేడిగడ్డ ఏడో బ్లాకులో ఒక గేటు ఎత్తివేత

సాక్షి, హైదరాబాద్/కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడి గడ్డ బ్యారేజీలో కుంగిన ఏడో బ్లాకుకు చెందిన ఒక గేటును నీటిపారుదలశాఖ అధికారులు శుక్రవారం విజయవంతంగా పైకి ఎత్తారు. మేడిగడ్డ బ్యారేజీలో మొత్తం 8 బ్లాకులు, 85 గేట్లు ఉండగా.. గతేడాది అక్టోబర్ 21న 7వ బ్లాక్ కుంగిన వెంటనే 77 గేట్లను ఎత్తి నీళ్లను కిందికి వదిలారు. 7వ నంబర్ బ్లాక్‌లోని 15–22 నంబర్ గేట్లు మొరాయించడంతో అప్పట్లో ఎత్తలేకపోయారు. వర్షాకాలం ప్రారంభం కావడానికి ముందే వీటిని పూర్తిగా ఎత్తివేయాలని, ఎత్తడానికి సాధ్యం కాని గేట్ల భాగాలను విడదీసి తొలగించాలని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) నియమించిన నిపుణుల కమిటీ ఇటీవల సూచించింది. శుక్రవారం ఏడో బ్లాకులోని ఒక గేటును ఎత్తారు. బ్లాకులో 2 పియర్లకు పగుళ్లు వచ్చాయి. అయితే 19, 20, 21 పియర్ల మధ్యన గేట్లను మాత్రం జాగ్రత్తగా ఎత్తాలని, పిల్లర్లపై భారం పడకుండా క్రేన్ల సహాయంతో తొలగించాలని, గేట్లు ఎత్తడానికి వీలుకాకపోతే వాటిని తొలగించాలని ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ సూచించింది. దీంతో ఎన్డీఎస్ఏ నివేదికకు అనుగుణంగా గేట్లను ఎత్తే ప్రక్రియను జాగ్రత్తగా నీటిపారుదల శాఖ ప్రారంభించింది. ఇక బ్యారేజీ ఎగువతో పాటు దిగువ భాగంలో వరద ప్రవాహానికి అడ్డంగా ఉన్న ఇసుక మేటలను తొలగించే ప్రక్రియను ముమ్మరం చేసింది. 2019 జూన్‌లో బ్యారేజీ నిర్మాణం పూర్తికాగా కాఫర్ డ్యామ్ తాలూకు అవశేషాలు ఇప్పటికీ అలాగే ఉన్నాయని, ఇవి కూడా వరద ప్రవాహానికి ప్రతిబంధకంగా మారాయని ఎన్డీఎస్ఏ కమిటీ గుర్తు చేసింది. అలాగే షీట్ ఫైల్స్, రాళ్లు అడ్డంగా ఉండటంతో వాటిని తొలగిస్తున్నారు. ఏడో బ్లాకులోని మిగిలిన గేట్లను వర్షాకాలం ప్రారంభానికి ముందే ఎత్తేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

సారా కనిపించకూడదంతే..

మూడు నెలల్లో నిర్మూలనకు ఆదేశం

- పార్టీల్లో నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యంతో జాగ్రత్త
- ఎక్సైజ్ శాఖ కమిషనర్ శ్రీధర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో పూర్తిగా నిర్మూలించిన సారా మళ్లీ అక్కడక్కడా కనిపిస్తోందని, మూడు నెలల్లో రాష్ట్రంలో సారా కనిపించకూడదని ఎక్సైజ్ శాఖ కమిషనర్ ఇ.శ్రీధర్ ఆదేశించారు. రాష్ట్ర అబ్కారీ శాఖ కార్యాలయంలో శుక్రవారం సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 26 ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో సారా ఆనవాళ్లు కనిపిస్తున్నాయని తెలిపారు. ఎక్సైజ్‌తో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ పోలీసులు కలిసి దాడులు నిర్వహించి తెలంగాణను సారా రహిత రాష్ట్రంగా మార్చేందుకు కృషి చేయాలని సూచించారు. సారా నిర్మూలనతో పాటు నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌పై అప్రమత్తతతో ఉండాలని కోరారు. పట్టణ ప్రాంతాలు, ఫంక్షన్‌హాళ్లు, ఫామ్‌హౌజ్‌లలో జరిగే పార్టీలకు అనుమతులు తీసుకుని సగం మేరకు నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యం వినియోగిస్తున్నారనే సమాచారం ఉందని చెప్పారు. దీన్ని నివారించేందుకు ఫంక్షన్ హాళ్లు, పార్టీలపై నిఘా పెంచాలని ఆదేశించారు. వేసవి కాలంలో మద్యం దుకాణాల్లో బీర్లు అందుబాటులో లేవనే వార్తలు వస్తున్నాయని, రికార్డుల ప్రకారం గత వేసవి కంటే ఇప్పుడు బీర్లు ఎక్కువ నిల్వలున్నాయని స్పష్టం చేశారు. అవసరమైన చోట్ల దాడులు చేసైనా వైన్ దుకాణాల్లో బీర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ సారా నిర్మూలనకు పెద్ద ఎత్తున కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యంతో పాటు కల్తీ కల్లు తయారీ, గంజాయి, ఇతర మత్తు మందుల తయారీ, రవాణా, అమ్మకాలపై నిఘా పెట్టాలని ఆదేశించారు. తెలంగాణ జిల్లాల్లోని సివిల్ పోలీసుల సహకారం తీసుకుని ఉక్కుపాదం మోపాలని ఎక్సైజ్ అధికారులకు సూచించారు. సమావేశానికి రాష్ట్రంలోని అసిస్టెంట్, డిప్యూటీ కమిషనర్లు, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు హాజరయ్యారు.

ఆవేశంతో తండ్రిపై చేయి చేసుకుని..

- మనస్తాపంతో పురుగు మందు తాగిన కుమారుడు
- చికిత్స పొందుతూ మృతి


శేఖర్

చిన్నకోడూరు(సిద్దిపేట): ఆవేశంతో తండ్రిపై చేయి చేసుకున్నాడు.. ఆపై మనస్తాపంతో పురుగు మందు తాగి మృతి చెందాడు. సిద్దిపేట జిల్లాలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ గ్రామానికి చెందిన వల్లెపు శేఖర్ (24) కూలి పనులు చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 11న మధ్యాహ్నం ఇంట్లో అమ్మ యాదవ్వ, నాన్న మల్లయ్య గొడవ పడుతున్నారని సోదరి ఫోన్ చేసి శేఖర్‌కు చెప్పింది. దీంతో ఆవేశంగా ఇంటికి వచ్చిన శేఖర్ తండ్రిని కొట్టాడు. తరువాత తీవ్ర మనస్తాపం చెందాడు. అదేరోజు అర్ధరాత్రి గ్రామ శివారులో పురుగు మందు తాగాడు. అది గుర్తించిన కుటుంబసభ్యులు శేఖర్‌ను సిద్దిపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 16న అర్ధరాత్రి మృతి చెందాడు.

పోస్టుమార్టంపై పోలీసులతో వాగ్వాదం

కుటుంబ సభ్యులు శేఖర్ మృతదేహానికి పోస్టుమార్టం చేయకుండానే ఇంటికి తరలించి శుక్రవారం అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. ఇది తెలిసిన పోలీసులు గ్రామానికి చేరుకుని పోస్టుమార్టం నిర్వహించాల్సిందేనని స్పష్టం చేశారు. అలా చేస్తే అరిష్టమని మృతుని కుటుంబీకులు వాగ్వాదానికి దిగడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు యువకుడి మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనంతరం యువకుడి మృతదేహానికి కుటుంబ సభ్యులు దహన సంస్కారాలు పూర్తి చేశారు.

పోలీసు విచారణకు భయపడి..

- చోరీ కేసులో వ్యక్తి బలవన్మరణం


వెంకటయ్య

తెలకపల్లి: బంగారం చోరీ కేసుకు సంబంధించి పోలీసుల విచారణకు భయపడి ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు అందించిన వివరాలివి. నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లికి చెందిన నారిమల్ల వెంకటయ్య(45) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 8న నాగర్‌కర్నూల్‌లో ఆటో నడుపుతుండగా కొల్లాపూర్ గేటు వద్ద ఓ మహిళ ఆటోలో ఎక్కింది. ఆటోలో తన బంగారు నాను పోయిందని నాగర్‌కర్నూల్ పోలీసుస్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు ఈ నెల 15న వెంకటయ్యను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారించి మందలించి పంపారు. శుక్రవారం మళ్లీ పోలీసు స్టేషన్‌కు రమ్మని కోరడంతో భయపడిన వెంకటయ్య శుక్రవారం చెరువుకట్ట వద్ద చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందాడు. పోలీసులు మందలించడం వల్లే భర్త ఉరి వేసుకున్నాడని వెంకటయ్య భార్య వాపోయింది. ఈ విషయమై ఎస్ఐను వివరణ కోరగా ఆటోలో ఓ మహిళ బంగారు వస్తువు పోయిందని ఫిర్యాదు ఇవ్వడంతో స్టేషన్‌కు పిలిపించి మాట్లాడి పంపించామన్నారు. వెంకటయ్య మృతిపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని, మృతదేహం నాగర్‌కర్నూల్ ఆస్పత్రి మార్చురీలో ఉందని చెప్పారు. వెంకటయ్యకు భార్య అలివేలు, కూతురు శిరీష ఉన్నారు.

గీత కార్మికుడికి తప్పిన ముప్పు



మోత్కూరు: ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుండి జారి మధ్యలో తలకిందులుగా వేలాడిన ఓ గీత కార్మికుడిని జేసీబీతో గ్రామస్తులు రక్షించారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం ముశిపట్ల గ్రామానికి చెందిన గీత కార్మికుడు ఎరుకల పాపయ్య ఎప్పట్లాగే శుక్రవారం కల్లు తీయడానికి వెళ్లాడు. తాటిచెట్టుపై నుండి ప్రమాదవశాత్తు జారి మధ్యలో తలకిందులుగా వేలాడాడు. చుట్టు పక్కల రైతులు గమనించి జేసీబీని తీసుకొచ్చి పాపయ్యను కిందకు దించడంతో క్షేమంగా ప్రాణాలతో బయట పడ్డాడు.


రాయ్‌బరేలీ సభలో ప్రసంగిస్తున్న సోనియా గాంధీ. చిత్రంలో ప్రియాంక, రాహుల్

రాహుల్‌ను మీకు అప్పగిస్తున్నా

రాయ్‌బరేలీ ప్రచారంలో సోనియా గాంధీ భావోద్వేగం

రాయ్‌బరేలీ: 'నా కుమారుడిని రాయ్‌బరేలీ ప్రజలకు అప్పగిస్తున్నా. రాహుల్ మిమ్మల్ని నిరాశపర్చడు' అని కాంగ్రెస్ నేత సోనియా గాంధీ శుక్రవారం రాయ్‌బరేలీలో ప్రచార సభలో పేర్కొన్నారు. ఎంపీగా 20 ఏళ్లు మీకు సేవ చేసుకునే అవకాశం ఇచ్చినందకు ధన్యావాదాలని అన్నారు. 'నాకున్న ప్రతిదీ మీరిచ్చిందే. కాబట్టి సోదరసోదరీమణులారా నా బిడ్డను మీ చేతుల్లో పెడుతున్నా. మీరంతా నన్ను మీ దానిగా భావిస్తారు' అని అన్నారు. ఓటర్లతో భావోద్వేగ పూరితమైన బంధాన్ని నెలకొల్పే ప్రయత్నంలో రాహుల్‌నీ మీ సొంత వాడిగా భావించాలని విజ్ఞప్తి చేశారు. వేదికపై రాహుల్, ప్రియాంక గాంధీలు సోనియా పక్కన నిలబడ్డారు. 'ఇందిరా గాంధీ, రాయ్‌బరేలీ ప్రజలు నాకు నేర్పిన విలువలు, పాఠాలనే నేను రాహుల్, ప్రియాంకలకు నేర్పాను. అందరినీ గౌరవించండి. బలహీనుల పక్షాన నిలబడి వారిని కాపాడండి. అన్యాయాలను ఎదిరించండి. ప్రజల హక్కుల కోసం పోరాడండి. భయపడొద్దు. పోరాటాలు, సంప్రదాయాల్లో మీ మూలాలు బలంగా ఉన్నాయి' అని వారిద్దరికీ నేర్పానని సోనియా గాంధీ అన్నారు. సోనియా తొలిసారిగా 2004లో రాయ్‌బరేలి ఎంపీగా గెలిచారు. రాజ్యసభకు ఎన్నికై ఇటీవల రాజీనామా చేసేదాకా 20 ఏళ్ల ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. ఇప్పుడు రాహుల్ గాంధీ రాయ్‌బరేలీ బరిలో ఉన్నారు. 20 ఏళ్ల ఎంపీగా సేవ చేసుకునే అవకాశాన్ని తనకు రాయ్‌బరేలీ ప్రజలు కల్పించారని, ఇది తన జీవితంలో అమూల్యమైన ఘట్టమని సోనియా పేర్కొన్నారు. గత 100 ఏళ్లుగా తన కుటుంబం మూలాలు ఇక్కడి నేలతో ముడిపడి ఉన్నాయన్నారు. ఈ బంధం ఎంతో పవిత్రమైనదని, గంగా మాతతో అవధ్, రాయ్‌బరేలి రైతులకు ఉన్న బంధం లాంటిదే ఇదని పేర్కొన్నారు. రాయ్‌బరేలీకి ఇందిరా గాంధీ హృదయంలో ప్రత్యేక స్థానముందని, ఆమె పనిని తాను దగ్గరగా గమనించానని, రాయ్‌బరేలీ ప్రజల పట్ల ఇందిరకు ఎనలేని అభిమానమని పేర్కొన్నారు. అనారోగ్య కారణాలు వల్ల సోనియా గాంధీ ఈ లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారానికి దూరంగా ఉన్నప్పటికీ కుమారుడి కోసం శుక్రవారం ప్రచారం చేయడం గమనార్హం. సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ కూడా ఈ సభలో పాల్గొన్నారు. సోనియాకు ముందు మాట్లాడిన రాహుల్ దేశంలోని యువత ఒక నిశ్చితాభిప్రాయానికి వచ్చారని, వారు మోదీని కోరుకోవడం లేదని తెలిపారు. జూన్ 4 తర్వాత ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పడుతుందని, అది ప్రజాప్రభుత్వమని చెప్పారు. భారత రాజ్యాంగ ప్రతిని చూపుతూ దీన్ని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు చింపి పాడేయాలని చూస్తున్నాయని ఆరోపించారు.

రాయ్‌బరేలీతో సమానంగా అమేథీని చూస్తా

తాను గెలిస్తే అభివృద్ధి విషయంలో రాయ్‌బరేలి, అమేథీలను సమానంగా చూస్తానని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అమేథీలో మూడుసార్లు ఎంపీగా నెగ్గిన రాహుల్ 2019లో స్మృతి ఇరానీ చేతిలో ఓడిపోయిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ అభ్యర్థి, తమ కుటుంబానికి నమ్మినబంటు కిశోరీలాల్ శర్మ తరఫున రాహుల్, ఎస్పీ చీఫ్ అఖిలేశ్‌తో కలిసి శుక్రవారం ప్రచారం నిర్వహించారు. 'రాయ్‌బరేలిలో అభివృద్ధి పనులకు రూ. 10 ఖర్చు చేస్తే అదే పది రూపాయలు అమేథిలోనూ ఖర్చు పెడతాం.. అది నా హామీ' రాహుల్ పేర్కొన్నారు. అమేథీ ప్రజలకు 40 ఏళ్ల పాటు నిస్వార్థంగా సేవలందించినందుకు కిశోరీలాల్ శర్మకు ధన్యవాదాలు చెప్పారు. అగ్నివీర్ నియామక విధానాన్ని రద్దు చేసి పర్మినెంట్ నియామక పద్ధతిని తీసుకొస్తామని.. దీంట్లో పెన్షన్‌కు కూడా అవకాశం ఉంటుందని తెలిపారు.

ప్రతిపక్షాలు గెలిస్తే అయోధ్యపైకి బుల్డోజర్లే

- బాలరాముడు మళ్లీ టెంట్‌లోకే..
- ఉత్తరప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో మోదీ



బారాబంకీ/ఫతేపూర్/హమీర్‌పూర్: కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలను ఈ ఎన్నికల్లో గెలిపిస్తే అయోధ్య రామమందిరంపైకి బుల్డోజర్లను పంపిస్తాయని, బాల రాముడు మళ్లీ టెంట్‌లోకి వెళ్లాల్సి వస్తుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. బుల్డోజర్లను ఎక్కడికి పంపించాలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వద్ద ట్యూషన్ చెప్పించుకోవాలని ఆ రెండు పార్టీలకు సూచించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఒక్కో దశ పోలింగ్ జరుగుతున్నకొద్దీ ప్రతిపక్ష 'ఇండియా' కూటమి పేకమేడలా కూలిపోతోందని చెప్పారు. ఈ ఎన్నికల్లో తాము హ్యాట్రిక్ సాధించబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వంలో పేదలకు, యువతకు, మహిళలకు, రైతులకు మేలు చేసే కీలక నిర్ణయాలు తీసుకుంటామని ప్రకటించారు. శుక్రవారం ఉత్తరప్రదేశ్‌లోని బారాబంకీ, ఫతేపూర్, హమీర్‌పూర్‌లో సార్వత్రిక ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మోదీ ప్రసంగించారు. జూన్ 4వ తేదీ ఇక ఎంతోదూరంలో లేదని, మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమన్న సంగతి కేవలం మనకే కాదు, మొత్తం ప్రపంచానికి తెలుసని స్పష్టంచేశారు. ఎన్నికల బహిరంగ సభల్లో ప్రధానమంత్రి ప్రసంగాల్లోని విశేషాలివీ..

ఎన్నుకోవాల్సిన ఏకైక పార్టీ బీజేపీ

''దేశ ప్రయోజనాల పరిరక్షణ కోసం అంకితమైన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ఒకవైపు, దేశంలో అస్థిరత సృష్టించడమే లక్ష్యంగా పెట్టుకున్న 'ఇండియా' కూటమి మరోవైపు ఈ ఎన్నికల బరిలో నిలిచాయి. మనకు మంచి చేసే ఎంపీలు, మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసే ఎంపీలు కావాలి. కేవలం మోదీని దూషిస్తూ ఐదేళ్ల కాలం గడిపే ఎంపీలు మనకు అవసరమా? 100సీసీ ఇంజన్‌తో 1,000 సీసీ వేగం సాధ్యమా? బలమైన ప్రభుత్వమే అత్యంత వేగవంతమైన అభివృద్ధిని సాధించగలదు. అలాంటి అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం. నిజంగా దేశ ప్రగతిని కోరుకుంటే మనం ఎన్నుకోవాల్సిన ఏకైక పార్టీ బీజేపీ.

అయోధ్య రామమందిరంపై సమాజ్‌వాదీ పార్టీ పెద్దలు అనుచితంగా మాట్లాడారు. రామాలయం విషయంలో సుప్రీంకోర్టు నిర్ణయాన్ని తిరగదోడాలని కాంగ్రెస్ భావిస్తోంది. వారికి సొంత కుటుంబ ప్రయోజనాలు, రాజకీయ అధికారమే ముఖ్యం. కాంగ్రెస్–సమాజ్‌వాదీ పార్టీలకు అధికారం అప్పగిస్తే అయోధ్యలో అలయాన్ని బుల్డోజర్లతో కూల్చేస్తారు. రామ్‌లల్లా మళ్లీ టెంట్‌లోకి పంపిస్తారు. ఆ రెండు పార్టీలకు ఓటు బ్యాంకు కంటే ఏదీ ఎక్కువ కాదు.

రిజర్వేషన్లపై ప్రతిపక్ష నేతలు దారుణంగా మాట్లాడుతున్నారు. మొత్తం రిజర్వేషన్లను ముస్లింలకే ఇవ్వాలని బిహార్ మాజీ ముఖ్యమంత్రి(లాలూ ప్రసాద్ యాదవ్) అన్నారు. అంటే దళితులు, గిరిజనులు, ఓబీసీలకు అన్యాయం చేయాలా? వారు ఉన్నత స్థాయికి చేరుకోవద్దా?'' అని మోదీ ప్రశ్నించారు.

నిందితుల జాబితాలో ఆప్, కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ఢిల్లీలో ఎక్సయిజ్ విధానంలో అవకతవకల కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ శుక్రవారం తాజాగా మరో చార్జిషీట్‌ను దాఖలుచేసింది. ఇందులో ఆమ్ ఆద్మీ పార్టీ, సీఎం అరవింద్ కేజ్రీవాల్ పేర్లను చేర్చింది. మనీ లాండరింగ్ ఆరోపణలపై ఇలా ఒక జాతీయ రాజకీయ పార్టీ, ఒక ముఖ్యమంత్రి పేర్లను చార్జిషీట్‌లో చేర్చడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఢిల్లీలో ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజాకు ఈడీ 200 పేజీల అభియోగపత్రాలను సమర్పించింది. వీటిని పరిగణనలోకి తీసుకోవాలా వద్దా అనే అంశాన్ని జడ్జి త్వరలో పరిశీలించనున్నారు. ఆప్ కన్వీనర్‌గానే కాకుండా వ్యక్తిగతంగానూ ఈ కుట్రలో కేజ్రీవాల్ భాగస్వామి అయ్యారని తాజా చార్జిషీట్‌లో ఈడీ ఆరోపించింది. మద్యం కేసులో మొత్తంగా ఈడీ ఇప్పటిదాకా ఎనిమిది చార్జిషీట్‌లు దాఖలుచేసింది. 18 మందిని అరెస్ట్‌చేసింది. 38 సంస్థలకు ఈ నేరంతో సంబంధముందని పేర్కొంది. రూ.243 కోట్ల విలువైన ఆస్తులను జప్తుచేసింది. '' కేజ్రీవాల్ బసచేసిన ఏడు నక్షత్రాల హోటల్ బిల్లును ఈ కేసు నిందితుల్లో ఒకరు చెల్లించారు. ఆ బిల్లులు మా వద్ద ఉన్నాయి'' అని అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు గురువారం సుప్రీంకోర్టులో తెలిపారు. మనీ లాండరింగ్ కేసులో తనను అన్యాయంగా అరెస్ట్ చేశారంటూ కేజ్రీవాల్ దాఖలుచేసిన పిటిషన్‌పై తీర్పును సుప్రీంకోర్టు శుక్రవారం రిజర్వ్‌చేసింది. ఈ పిటిషన్‌ను జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం శుక్రవారం విచారించింది. కేజ్రీవాల్ తరఫున అభిషేక్ సింఘ్వీ, ఈడీ తరఫు అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపించారు. వాదనలు ముగిశాయి. తీర్పును రిజర్వ్‌చేస్తున్నాం.

భారత్‌లో 'రష్యా' పరిస్థితులు

- అక్కడ నియంతృత్వం ఉంది
- విపక్ష నేతలను జైల్లో పడేశారు
- మోదీ సర్కార్‌పై కేజ్రీవాల్ ఆరోపణ



అమృత్‌సర్: మోదీ సర్కార్ హయాంలో దేశపరిస్థితులు రష్యాను తలపిస్తున్నాయని ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. శుక్రవారం అమృత్‌సర్‌లో ఆప్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలు, కార్యకర్తలతో సమావేశం సందర్భంగా కేజ్రీవాల్ ప్రసంగించారు. '' భారత్‌లో కొనసాగుతున్న ఈ నియంతృత్వ పాలనకు ఇంక ఎంతమాత్రం ఆమోదించేదిలేదు. గత 75 ఏళ్ల స్వాతంత్ర్య భారతావనిలో ఇలా పనిగట్టుకుని విపక్షనేతలను జైల్లో పడేయడం ఎన్నడూ చూడలేదు. రష్యాలో అయితే కీలక విపక్షనేతలందర్నీ జైలుకు పంపేసి, కొందర్ని చంపేసి పుతిన్ దేశాధ్యక్ష ఎన్నికలు జరిపి 87 శాతం ఓట్లు గుప్పిట బిగించారు. ఎన్నికల్లో విపక్షాలు లేకపోవడంతో ఓట్లు పొందడానికి నువ్వు ఒక్కడివే మిగులుతావు'' అని మోదీనుద్దేశించి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. '' వాళ్లు(బీజేపీ) నన్ను, ఢిల్లీ మాజీ డెప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా జైల్లో పడేశారు. కాంగ్రెస్ ఖాతాలను స్తంభింపజేశారు. తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే మంత్రులను జైలుకు పంపారు. విపక్ష నేతలను చెరసాలలో వేశాక ఒకే పార్టీ, ఒక్కడే అగ్రనేత సాధ్యం. అప్పుడు ప్రజాస్వామ్యం అసాధ్యం. ఇది జరక్కుండా మనం ఆపాలి'' అని అన్నారు. ' నేను జైలు గదిలో ఉన్నపుడు గదిలో రెండు సీసీటీవీ కెమెరాలతో 13 మంది అధికారులు అనుక్షణం గమనించేవారు. ఒక పుటేజీ నేరుగా ప్రధాని మోదీకి వెళ్లేది. అక్కడ రెండు టీవీల్లో గమనించేవారు. నన్ను ఎలాగైనా అణచేస్తామని విశ్వప్రయత్నం చేశారు. అరెస్ట్‌తో అంతా అయిపోతుందని, పార్టీ ముక్కలు చెక్కలై ప్రభుత్వం కూలుతుందని ఆశపడ్డారు. కానీ వారి ఆశలు అడియాసలయ్యాయి. ఆప్ ఒక కుటుంబం. కుటుంబానికి ఏదైనా కష్టమొస్తే కుటుంబసభ్యులంతా ఏకమై పోరాడతారు. నా అరెస్ట్ తర్వాత ప్రతి ఒక్క కార్యకర్త కేజ్రీవాల్‌గా మారి పోరాడారు'' అని అన్నారు.

నన్ను నిరుత్సాహపరచకండి

''ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి జైలులో ఎవరినైనా కలవడానికి వస్తే గదిలో మాట్లాడే ఏర్పాటుచేయాలని జైలు నియమావళిలో ఉంది. పంజాబ్ సీఎం భగవంత్‌మాన్ వచ్చినపుడు ఒక గదిలో జైలు సూపరింటెండెంట్ భేటీ ఏర్పాట్లుచేయలేదు. పంజాబ్‌లో మొత్తం 13 లోక్‌సభ స్థానాలను గెల్చుకునేలా ఆప్ నేతలు కష్టపడాలి. జూన్ రెండో తేదీన జైలుకెళ్తా. జూన్ 4 నాటి ఫలితాలను అక్కడి టీవీలో చూస్తా. టీవీలో 'పంజాబ్‌లో అన్ని సీట్లు ఆప్ గెలిచింది' అనే వార్త కోసం ఎదురుచూస్తుంటా. నన్ను నిరుత్సాహ పరచకండి'' అని ఓటర్లకు విజ్ఞప్తిచేశారు.

స్లొవాకియా ప్రధానికి మరో శస్త్రచికిత్స

బ్రాటిస్లావా: హత్యాయత్నానికి గురైన స్లొవాకియా ప్రధానమంత్రి రాబర్ట్ ఫికోకు శుక్రవారం మరో శస్త్రచికిత్స జరిగింది. 59 ఏళ్ల ఫికో పరిస్థితి ఇంకా విషమంగానే ఉందని అధికారవర్గాలు తెలిపాయి. రెండు రోజుల క్రితం హండ్లోవా పట్టణంలో ప్రభుత్వ సమావేశం తర్వాత బయటికి వచ్చి అభిమానులకు అభివాదం చేస్తుండగా ఒక దుండగుడు ఫికోపై నాలుగైదు రౌండ్ల కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. వెంటనే ఆయన్ను బన్‌స్కా బిస్ట్రికాలోని ఎఫ్.డి.రూజ్‌వెల్ట్ ఆసుపత్రికి తరలించారు. ఫికోకు సి.టి. స్కాన్ తీశామని, ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉన్న ఆయన పరిస్థితి నిలకడగానే ఉన్నప్పటికీ విషమంగానే ఉందని రూజ్‌వెల్ట్ ఆసుపత్రి డైరెక్టర్ మిరియమ్ లపునికోవా తెలిపారు. ఫికో స్పృహలోనే ఉన్నారని చెప్పారు. శరీరంలో మృత టిష్యూను తొలగించడానికి శుక్రవారం శస్త్రచికిత్స నిర్వహించినట్లు వెల్లడించారు.

సీతా సోరెన్ బహిష్కరణ

రాంచీ: జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ వదిన, శిబూసోరెన్ పెద్ద కోడలు అయిన సీతా సోరెన్‌ను పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి ఆరేళ్లపాటు తొలగిస్తున్నట్లు జార్ఖండ్ ముక్తి మోర్చా శుక్రవారం ప్రకటించింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందుకు శిక్షగా సీతను బహిష్కరించినట్లు పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. జామా శాసనసభ నియోజకవర్గం నుంచి మూడోసారి గెలిచిన సీత మార్చి 20న బీజేపీలో చేరిన సంగతీ, దుమ్కా లోక్‌సభ స్థానం నుంచి బరిలోకి దిగిన సంగతి తెల్సిందే. దుమ్కా ఎంపీ స్థానానికి జూన్ 1న పోలింగ్ జరగనుంది.

కొట్టాడు.. పొట్టలో తన్నాడు

- చెంప ఛెళ్లుమనిపించాడు
- స్వాతి మలివాల్ ఫిర్యాదులో సంచలన విషయాలు

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ నివాసంలో ఆయన వ్యక్తిగత కార్యదర్శి బిభవ్ కుమార్ తనపై చేసిన దాడిపై ఆప్ రాజ్యసభ సభ్యురాలు స్వాతి మలివాల్ సంచలన విషయాలు బయటపెట్టారు. విచక్షణారహితంగా ఛాతిపై కొట్టాడని, పొట్టలో తన్నాడని, చంపి పూడ్చిపెడతా అని బెదిరించాడని ఆమె ఇచ్చిన వాంగ్మూలం వివరాలు ఎఫ్ఐఆర్ ద్వారా తాజాగా వెలుగులోకి వచ్చాయి.

దెబ్బలకు తాళలేక నడవలేకపోయా

గురువారం బిభవ్‌పై ఢిల్లీ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో స్వాతి ఇచ్చిన వాంగ్మూలం వివరాలు ఉన్నాయి. '' కేజ్రీవాల్‌ను కలిసేందుకు డ్రాయింగ్ రూమ్‌లో కూర్చున్నా. పట్టరాని ఆవేశంతో నా వైపు దూసుకొచ్చిన బిభవ్ ' మా మాట ఎందుకు వినట్లేవు? మాకు ఎదురుచెప్పడానికి ఎంత ధైర్యం? నీచమైన దానివి నువ్వు. నీకు గుణపాఠం చెప్తాం' అని తిట్టడం మొదలెట్టాడు. తర్వాత 7–8 సార్లు చెంపమీద కొట్టాడు. దీంతో షాక్‌కు గురయ్యా. సాయం కోసం అరిస్తే ఎవ్వరూ ముందుకు రాలేదు. కూర్చున్న నన్ను షర్ట్ పట్టుకుని కిందకు తోశాడు. టేబుల్‌కు తల తగిలి కింద పడ్డా. అంతటితో ఆగకుండా వీరావేశంతో నా ఛాతి, పొట్ట, పొత్తికడుపు, కటి భాగంపై కాలితో పలుమార్లు తన్నాడు. నిలువరించబోతే షర్ట్ పట్టుకుని లాగాడు. షర్ట్ బటన్స్ కొన్ని ఊడిపోయాయి. షర్ట్ పైకి లేస్తోంది ఆపు అని అరిచినా బలంగా నెట్టేసి కొట్టాడు. పీరియడ్ నొప్పికితోడు ఈ దెబ్బల ధాటికి బాధతో విలవిల్లాడిపోయా. పీరియడ్స్ విషయం చెప్పినా అతను ఆగలేదు. దెబ్బల నొప్పికి కనీసం నడవలేకపోయా. ఎలాగోలా అక్కడి నుంచి బయటపడి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి విషయం చెప్పా. లిఖితపూర్వక ఫిర్యాదు అడిగారు. భయంకరమైన నొప్పుల బాధతో రాసే ఓపికలేక అక్కడి నుంచి వెళ్లిపోయా'' అని స్వాతి చెప్పారు. 'ఏం చేసుకుంటావో చేస్కో. నువ్వు మమ్మల్ని ఏమీ చేయలేవు. నీ అంతుచూస్తా. ఎముకలు విరగ్గొట్టి పూడ్చిపెడతా. ఎక్కడ పూడ్చామో ఎవరూ కనిపెట్టలేరు' అని బిభవ్ నన్ను బెదిరించాడు'' అని మలివాల్ వాంగ్మూలం ఇచ్చారు.

ముఖంపై అంతర్గత గాయాలు

శుక్రవారం మలివాల్ ఢిల్లీ ఎయిమ్స్‌లో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆమె ముఖంపై అంతర్గత గాయాలు ఉన్నట్లు వైద్యులు మెడికో లీగల్ కేస్ రిపోర్ట్‌లో పేర్కొన్నారు. ఈ కేసు విషయమై మలివాల్ శుక్రవారం తీస్ హజారీ కోర్టు మేజిస్ట్రేట్ ఎదుట హాజరై తన వాంగ్మూలం ఇచ్చారు. మరోవైపు కేజ్రీవాల్ సెక్యూరిటీ సిబ్బందితో మలివాల్ వాగ్వాదానికి దిగిన మే 13నాటి 52 సెకన్ల వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా షేర్ అవుతోంది. '' నన్నెవరైనా టచ్‌చేస్తే బాగుండదు. ఉద్యోగం నుంచి తొలగిస్తా. పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేశా. వాళ్లు వచ్చేదాకా ఆగండి. డీసీపీతో మాట్లాడి మీ సంగతి తేలుస్తా'' అని మలివాల్ అంటున్నట్లు వీడియోలో ఉంది.

పొలిటికల్ హిట్‌మ్యాన్..

మలివాల్ శుక్రవారం 'ఎక్స్'లో ఒక వీడియో పోస్ట్‌చేశారు. '' పొలిటికల్ హిట్‌మ్యాన్ మళ్లీ తనను తాను కాపాడుకునే పనిలో పడ్డాడు. విషయం లేకుండా సొంత మనుషులతో ట్వీట్లు, వీడియోలు షేర్ చేయిస్తాడు. నేరాలు చేసి కూడా తప్పించుకోవచ్చని ఆయన ధీమా. ఇంటిలోపలి సీసీటీవీ ఫుటేజీ బహిర్గతమైతే నిజం అందరికీ తెల్సిపోతుంది'' అని పోస్ట్‌చేశారు. ఎవరిని ఉద్దేశించి ఈ పోస్ట్ చేశారో ఆమె పేర్కొనలేదు.

కేజ్రీవాల్ ఇంటికి ఫోరెన్సిక్ బృందం

కేసు విచారణలో భాగంగా ఢిల్లీ పోలీసు ఫోరెన్సిక్ బృందం ఘటన జరిగిన కేజ్రీవాల్ నివాసానికి వెళ్లింది. సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం మలివాల్‌ను వెంట తీసుకెళ్లారు. అక్కడి సాక్ష్యాధారాలు, సీసీటీవీ ఫుటేజీని ఐదుగురు సభ్యుల ఫోరెన్సిక్ నిపుణులు స్వాధీనం చేసుకున్నారు. కాగా, తమ ఎదుట హాజరై వివరణ ఇవ్వాలని జాతీయ మహిళా కమిషన్ ఇచ్చిన సమన్లను బిభవ్ బేఖాతరు చేశారు.


ఢిల్లీలోని తీస్ హజారీ కోర్టులో వాంగ్మూలమిచ్చి వెళ్లిపోతున్న మలివాల్

దీంతో ఆయన జాడ తెల్సుకునేందుకు ఢిల్లీ పోలీసు బృందాలు బయల్దేరాయి. ఒక బృందం ఇప్పటికే అమృత్‌సర్‌కు వెళ్లింది. మహారాష్ట్రకు వచ్చాడేమో అనే అనుమానంతో ఆ రాష్ట్ర పోలీసు విభాగాన్ని సంప్రదించారు.

ఇంత జరిగితే మాట్లాడరా?: సీతారామన్

'' ఇంట్లో సొంత పార్టీ మహిళా ఎంపీపై ఇంత ఘోరమైన దాడి జరిగితే కేజ్రీవాల్ ఎందుకు మాట్లాడట్లేరు? నిందితుడు బిభవ్‌ను ఇంకా వెంటేసుకుని తిరగడం నిజంగా సిగ్గుచేటు. ఈ విషయంలో కేజ్రీవాల్ ఒక బహిరంగ ప్రకటన చేసి క్షమాపణ చెప్పాలి' అని బీజేపీ నాయకురాలు, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ డిమాండ్‌చేశారు.

ఇదంతా బీజేపీ కుట్ర: అతిశి

మలివాల్‌ను అడ్డుపెట్టుకుని కేజ్రీవాల్‌ను ఈ కేసులో ఇరికించేందుకు బీజేపీ కుట్ర పన్నిందని ఆప్ నాయకురాలు అతిశి ఆరోపించారు. '' ఈ రోజు ఒక వీడియో చక్కర్లు కొడుతోంది. అందులో మలివాల్ సోఫాలో కూర్చుని వాగ్వాదానికి దిగారు. కొట్టారని, నొప్పితో బాధపడ్డానని, షర్ట్ బటన్లు ఊడిపోయాయని ఎఫ్ఐఆర్‌లో చెప్పారు. కానీ ఆ వీడియో చూస్తుంటే అదంతా అబద్ధమని తేలిపోయింది. సీఎం బిజీగా ఉంటే కలుస్తానని బిభవ్‌ను ఆమెనే కేకలేసి నెట్టేశారు. ఈ ఉదంతం వెనుక బీజేపీ హస్తముంది'' అని అతిశి ఆరోపించారు.

ఎలక్షన్ బీట్

రాజకీయ పర్యాటకుల ప్రభావం సున్నా

ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వ్యాఖ్య

భువనేశ్వర్: ఎన్నికల సమయంలో ఇతర రాష్ట్రాల నుంచి, కేంద్ర ప్రభుత్వం నుంచి రాజకీయ పర్యాటకులు తమ రాష్ట్రానికి తరలివస్తున్నారని, తమపై వ్యక్తిగత దూషణలు, అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తున్నారని ఒడిశా ముఖ్యమంత్రి, బిజు జనతాదళ్ అధినేత నవీన్ పట్నాయక్ మండిపడ్డారు. తమ ప్రజలపై ఈ రాజకీయ పర్యాటకుల ప్రభావం ఏమాత్రం ఉండదని తేల్చి చెప్పారు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు పొలిటికల్ టూరిస్టులుగా మారిపోయారని, కేవలం ఎన్నికల సమయంలోనే వారు ఒడిశాలో కనిపిస్తారని, ఆ తర్వాత మటుమాయం అవుతారని ఎద్దేవా చేశారు. నవీన్ పట్నాయక్ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. రాజకీయ పర్యాటకులు అనుచితమైన భాష ఉపయోగిస్తున్నారని, అది తమ రాష్ట్ర ప్రజలు సహించబోరని హెచ్చరించారు.

మాకు 'ప్లాన్–బి' అవసరం లేదు: అమిత్ షా

న్యూఢిల్లీ: మోదీ అత్యధిక మెజార్టీతో వరుసగా మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టబోతున్నారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. ఈ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు ప్రజలు పూర్తి మెజార్టీ కట్టబెడతారని ధీమా వ్యక్తం చేశారు. మెజార్టీ తగ్గడం అనే ప్రశ్నే ఉత్పన్నం కాదని, 'ప్లాన్–బి'తో తమకు అవసరం లేదని పేర్కొన్నారు. ఆయన తాజాగా ఓ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ప్లాన్–ఎ విఫలం కావడానికి 60 దాకా శాతం అవకాశాలు ఉన్నప్పుడే ప్లాన్–బితో అవసరం పడుతుందని పేర్కొన్నారు. ఆ అవసరం తమకు ఉండదని స్పష్టం చేశారు.

రాయ్‌బరేలీ నియోజకవర్గం ప్రజలదే

రాయ్‌బరేలీ తమ కుటుంబ నియోజకవర్గం అంటూ ప్రియాంకా గాంధీ చేసిన వ్యాఖ్యలను అమిత్ తిప్పికొట్టారు. అది ఒక కుటుంబ నియోజకవర్గం కాదని, కేవలం ప్రజలదేనని తేల్చిచెప్పారు. రాయ్‌బరేలీపై పూర్తి హక్కు స్థానిక ప్రజలకే ఉందన్నారు. మనం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నామని, ఒక కుటుంబానికి ఒక నియోజకవర్గం అంటూ ఉండదని స్పష్టం చేశారు.

ఆదివాసీలకు అన్యాయం: మమత

గోపీవల్లభ్‌పూర్/ దాస్‌పూర్: గిరిజనుల హక్కులను లాగేసుకొని, వివిధ వెనుకబడిన తరగతుల మధ్య చిచ్చుపెట్టాలని నరేంద్ర మోదీ సర్కారు ప్రణాళికను రచిస్తోందని పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. తృణమూల్ జార్‌గ్రామ్ లోక్‌సభ అభ్యర్థి కలాపాద సోరెన్‌కు మద్దతుగా శుక్రవారం నిర్వహించిన ఎన్నికల సభలో ఆమె మాట్లాడుతూ .. జాతీయ పౌరసత్వ పట్టికను అమలు చేయడం ద్వారా గిరిజనుల భూ హక్కులను బీజేపీ హరించాలని చూస్తోందని అన్నారు. ఆదివాసీలు, కుర్మీలకు మధ్య ఉద్రిక్తతలను బీజేపీ పెంచుతోందని ఆరోపించారు. తమ ప్రభుత్వం గిరిజనుల భూ హక్కులను కాపాడటానికి అంకితభావంతో పని చేస్తోందని తెలిపారు. పూర్వీకుల నుంచి సంక్రమించిన స్థలాల్లో ఆదివాసీలు నివసించవచ్చని తాము చట్టం చేశామని చెప్పారు. యూనిఫామ్ సివిల్ కోడ్‌ను తేవడం ద్వారా ఆదివాసీలు, కుర్మీలు, ఇతర వెనుకబడిన వర్గాల మధ్య గొడవలు పెట్టాలని బీజేపీ చూస్తోందని, తన చివరి శ్వాస వరకు వీరిని కాపాడుతానని హామీ ఇస్తున్నానని తెలిపారు.

సోనియాలా మోదీ ఇటాలియన్ కాదు: కంగన

షిమ్లా: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కాంగ్రెస్ నేత సోనియా గాంధీలాగా హిందీ మాట్లాడలేని ఇటాలియన్ కాదని బీజేపీ నాయకురాలు, హిమాచల్ ప్రదేశ్‌లోని మండీ లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి, సినీ నటి కంగనా రనౌత్ అన్నారు. మోదీ నిఖార్సైన భూమి పుత్రుడు, దేశ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న నాయకుడని చెప్పారు. శుక్రవారం కులూ జిల్లాలోని జగత్‌ఖానాలో ఎన్నికల ప్రచార సభలో కంగనా రనౌత్ ప్రసంగించారు. సుపరిపాలనకు పర్యాయపదం మోదీ అని ప్రశంసించారు.

అభిజిత్ గంగోపాధ్యాయ్‌కు ఈసీ నోటీసులు

మమతా బెనర్జీపై అనుచిత వ్యాఖ్యలకు..

న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు హైకోర్టు మాజీ జడ్జి, బీజేపీ లోక్‌సభ అభ్యర్థి అభిజిత్ గంగోపాధ్యాయ్‌కు ఎన్నికల సంఘం షోకాజ్ నోటీసు జారీచేసింది. 'మమతా బెనర్జీ మీరు ఎంతకు అమ్ముడుపోయారు? మీ రేటు 10 లక్షలు, ఎందుకంటే మీరు కేయా సేథ్‌తో మేకప్ చేయించుకుంటున్నారు. మమత అసలు మహిళేనా? అని నేను కొన్నిసార్లు ఆశ్చర్యపోతుంటా' అని అభిజిత్ ఇటీవల ప్రచారసభలో వ్యాఖ్యానించారు. దీనిపై తృణమూల్ కాంగ్రెస్ నేత డెరెక్ ఒబ్రియాన్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. న్యాయవ్యవస్థలో ఉన్నత పదవిని నిర్వహించిన వ్యక్తి మహిళల గౌరవానికి భంగం కలించేలా మాట్లాడటం దురదృష్టకరమన్నారు. దీనిపై స్పందించిన ఈసీ ఈనెల 20వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా వివరణ ఇవ్వాలని అభిజిత్ గంగోపాధ్యాయ్‌కు నోటీసులు జారీచేసింది.

సగటు జీవితకాలం పైపైకి..

- పురుషుల్లో ఐదేళ్లు, మహిళల్లో నాలుగేళ్లు
- 2.6 ఏళ్లు పెరగనున్న ఆరోగ్యకర జీవితకాలం
- దాంతోపాటే పెరుగుతున్న వ్యాధుల ముప్పు
- అంతర్జాతీయ అధ్యయనంలో వెల్లడి



న్యూఢిల్లీ: మానవాళికి శుభవార్త. ప్రపంచ వ్యాప్తంగా మనుషుల సగటు జీవితకాలం పెరుగుతున్నట్లు అంతర్జాతీయ అధ్యయనం ఒకటి వెల్లడించింది. 2022 నుంచి 2050 మధ్య పురుషుల్లో 4.9 సంవత్సరాలు, మహిళల్లో 4.3 సంవత్సరాలు పెరుగుతుందని తేల్చింది. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్‌కు చెందిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ మెట్రిక్స్, ఎవాల్యుయేషన్(ఐహెచ్‌ఎంఈ) నిర్వహించిన గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజెస్(జీబీడీ)–2021 అధ్యయనం వివరాలను లాన్సెట్ జర్నల్‌లో ప్రచురించారు. ''మొత్తమ్మీద ప్రపంచవ్యాప్తంగా సగటు జీవితకాలం ఐదేళ్ల దాకా పెరుగుతుంది. కానీ అదే సమయంలో వ్యాధుల ముప్పు కూడా బాగా పెరుగుతుంది. గుండె సంబంధిత వ్యాధులు, క్యాన్సర్, డయాబెటిస్ వంటివి ఎక్కువ ప్రభావం చూపనున్నాయి. ముఖ్యంగా స్థూలకాయం, అధిక రక్తపోటు వంటివి బాగా వేధిస్తాయి'' అని అధ్యయనం హెచ్చరించింది. ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవడం ద్వారా ఈ ముప్పును వీలైనంతగా తగ్గించుకోవచ్చని అధ్యయనం సూచించింది. అధ్యయనం ఇంకా ఏం తేల్చిందంటే...

- సగటు జీవితకాలం పురుషుల్లో ఐదేళ్లు, మహిళల్లో నాలుగేళ్లు పెరుగుతుంది. స్త్రీలలో 71.1 నుంచి 76 ఏళ్లకు, పురుషుల్లో 76.2 నుంచి 80.5 ఏళ్లకు పెరుగుతుంది.
- పూర్తి ఆరోగ్యవంతమైన జీవితకాలం ప్రపంచవ్యాప్తంగా సగటున 2.6 ఏళ్లు పెరుగుతుంది. ఇది 2022లో 64.8 ఏళ్లుండగా 2050 నాటికి 67.4 ఏళ్లకు చేరుతుంది.
- భారత్‌లో 2050 నాటికి పురుషుల సగటు జీవిత కాలం 75 ఏళ్లకు కాస్త పైకి, మహిళల్లో 80 ఏళ్లకు చేరుకుంటుంది.
- మన భారతదేశంలో ఆరోగ్యవంతమైన జీవితకాలం స్త్రీ పురుషులిద్దరిలోనూ సమానంగానే ఉంటుంది. 2050 నాటికి 65 ఏళ్లు దాటేదాకా ఆరోగ్యంగా జీవిస్తారు.
- జీబీడీ–2021 అధ్యయనం కోసం ప్రపంచవ్యాప్తంగా 11,000 సంస్థల సహకారం తీసుకున్నారు. 204 దేశాల నుంచి 371 రకాల వ్యాధులకు సంబంధించిన అంచనాలు, 88 రిస్క్ ఫ్యాక్టర్లను పరిగణనలోకి తీసుకున్నారు.
- ప్రపంచవ్యాప్తంగా వైద్య సదుపాయాలతోపాటు ఆరోగ్యకరమైన జీవనశైలిపై జనంలో అవగాహన పెరుగుతుండడం సగటు జీవితకాలం పెరుగుదలకు దోహదపడుతోంది.
- జీవితకాలం పెరుగుదల విషయంలో ప్రపంచ దేశాల మధ్య అసమానతలు చాలావరకు తగ్గుతున్నట్లు గుర్తించామని ఐహెచ్‌ఎంఈ డైరెక్టర్ క్రిస్ ముర్రే చెప్పారు.
- సగటు జీవనకాలం ప్రస్తుతం తక్కువగా ఉన్న దేశాల్లో 2050 నాటికి బాగా పెరగనుందన్నారు. హృద్రోగాలు, కరోనాతో పాటు తీవ్రమైన అంటు రోగాలతో పాటు పౌష్టికాహార లోపం తదితరాలను తట్టుకునే సామర్థ్యం పెరుగుతుండటమే అందుకు కారణమని ముర్రే చెప్పారు.
- భావి తరాలు స్థూలకాలం, అధిక రక్తపోటుతో బాగా బాధపడే ఆస్కారముందని అభిప్రాయపడ్డారు.



రాజన్నకు కోడెమొక్కులు

వేములవాడ: రాజన్నను శుక్రవారం 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తుల ద్వారా రూ.14 లక్షల ఆదాయం సమకూరింది.



సహస్ర కలశాభిషేకం

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహుని నవ రాత్రోత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం సహస్ర కలశాభిషేకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

గరిష్టం/కనిష్టం 37.0/28.0

వాతావరణం

జిల్లాలో నేడు స్వల్పంగా ఉక్కపోత ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

స్తంభించిన 'రవాణా' సేవలు

- ఇబ్బంది పడ్డ వాహనదారులు



ఆర్టీవో కార్యాలయం వద్ద వేచి చూస్తున్న వాహనదారులు

తిమ్మాపూర్: తిమ్మాపూర్‌లోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో శుక్రవారం సాంకేతిక సమస్యతో రెండుగంటల పాటు సేవలు స్తంభించాయి. గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి విద్యుత్ సమస్యకు తోడు సాంకేతిక లోపం తలెత్తడంతో కౌంటర్లు స్తంభించిపోయాయి. మొన్నటి వరకు ఎండల కారణంగా తక్కువ సంఖ్యలో స్లాట్‌బుక్ అయ్యాయి. రెండు రోజుల నుంచి వాతావరణం చల్ల బడుతుండడంతో ప్రజలు ఎక్కువ సంఖ్యలో ఆర్టీఏ సేవల కోసం బారులు తీరుతున్నారు. కంప్యూటర్లు రెండు గంటల పాటు ఆగిపోవడంతో కార్యాలయానికి వచ్చిన వాహనదారులు అసహనం వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా సమస్యతో రెండు గంటల పాటు సర్వర్‌డౌన్ అయినట్లు డీటీసీ పురుషోత్తం వివరించారు.

బెస్ట్ అవేలబుల్ స్కూళ్లలో ప్రవేశాలకు ఆహ్వానం

కరీంనగర్: జిల్లాలోని బెస్ట్ అవేలబుల్ స్కూల్స్ (రెసిడెన్షియల్, నాన్-రెసిడెన్షియల్)లో 2024–25 విద్యా సంవత్సరానికి గానూ 1వ తరగతి(నాన్-రెసిడెన్షియల్), 5వ తరగతి (రెసిడెన్షియల్)లో ప్రవేశాలకు షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి నేతానియల్ ఒక ప్రకటనలో తెలిపారు. 1వ తరగతికి 86 సీట్లు, 5వ తరగతికి 89సీట్లు మొత్తంగా 175 సీట్లు కేటాయించబడినట్లు తెలిపారు. 1వ తరగతి (నాన్-రెసిడెన్షియల్) స్కీంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు హాస్టల్ వసతి సౌకర్యం లేదని, 5వ తరగతి విద్యార్థులకు హాస్టల్ వసతి ఉంటుందన్నారు. ప్రవేశం కోరేవారు కరీంనగర్ జిల్లాకు చెందిన వారై ఉండాలి. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామస్థాయిలో రూ.1,50,000 లోపు, పట్టణ పరిధిలో రూ.2 లక్షలలోపు ఉండాలన్నారు. విద్యార్థులను లాటరీ పద్ధతిలో ఎంపిక చేయబడుతుందని తెలిపారు. శనివారం నుంచి జూన్ 7 వరకు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. కులం, ఆదాయం, నివాసం, రేషన్‌కార్డు, పుట్టినతేదీ ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో జూన్ 7 సాయంత్రం 5 గంటల లోపు జిల్లా కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

పత్తి ధర క్వింటాల్‌కు రూ.7,190



వేలంలో పాల్గొన్న వ్యాపారులు

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ పత్తిమార్కెట్‌లో క్వింటాల్ పత్తిధర గరిష్టంగా రూ.7,190 పలికింది. శుక్రవారం మార్కెట్‌కు ఏడు వాహనాల్లో 86 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తెచ్చారు. మోడల్ ధర రూ.7,100, కనిష్ట ధర రూ.6,100 పలికింది. గన్నీ సంచుల్లో ఐదుగురు రైతులు తొమ్మిది క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తెచ్చారు. గరిష్ట ధర రూ.6,400, మోడల్ ధర రూ.5,800, కనిష్ట ధర రూ.5,000కు ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేశారు క్రయవిక్రయాలను గుగులోతు రెడ్డినాయక్ పర్యవేక్షించారు.

పోలీసుల పిల్లలకు సమ్మర్ క్యాంపులు



సమ్మర్ క్యాంపునకు హాజరైన పిల్లలు

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలోని జాన్ విల్సన్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో పోలీసుల పిల్లలకు సమ్మర్ క్యాంపులను శుక్రవారం సీపీ అభిషేక్ మహంతి ప్రారంభించి మాట్లాడారు. ఈ క్యాంపు రెండు వారాలపాటు కొనసాగుతుందని తెలిపారు. పిల్లలకు డ్రాయింగ్, పెయింటింగ్, డాన్స్, సింగింగ్, అథ్లెటిక్స్, కరాటే, ఫుట్‌బాల్, క్రికెట్ వంటి అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందుకోసం సుశిక్షితులైన టీచర్లు, కోచ్‌లను నియమించామని తెలిపారు. పిల్లలు చదువులతో పాటు ఆటలకూ ప్రాధాన్యం ఇచ్చేలా తల్లిదండ్రులు చూసుకోవాలని సూచించారు. అడిషనల్ డీసీపీ ఏ.లక్ష్మీనారాయణ, ఆర్‌ఐలు సురేశ్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ నకిలీ మకిలీ?



రైతులకు నకిలీ విత్తనాలు, నిషేధిత పురుగు మందులు అమ్మితే పీడీ యాక్ట్ ప్రయోగిస్తాం. డీలర్లు నకిలీ, కాలం చెల్లిన విత్తనాలు, ఎరువులు, నిషేధిత పురుగు మందులు అమ్మొద్దు. మార్కెట్లోకి నకిలీ విత్తనాలు, పురుగుమందులు రాకుండా వ్యవసాయ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలి. ప్రభుత్వం నిషేధించిన బీటీ–3 పత్తి విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించవద్దు.

– ఇటీవల జరిగిన విత్తనాలు, ఎరువుల డీలర్ల సమావేశంలో కలెక్టర్ పమేలా సత్పతి



గతంలో పట్టుబడిన కల్తీ పత్తి విత్తనాలు

- కల్తీ విత్తన దందాలో అక్రమార్కులు
- టాస్క్‌ఫోర్స్ కమిటీల జాడేదీ ..?
- ఏటా రైతన్నకు శఠగోపం
- ప్రచారం లేదు.. తనిఖీల్లేవ్

కరీంనగర్ అర్బన్:

అన్నదాతలకు కీలకమైన విత్తనదశను అభాసుపాలు చేస్తున్నారు పలువురు వ్యాపారులు. క్షేత్రస్థాయి అధికారుల నిర్లక్ష్యం.. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం వెరసి అక్రమార్కులకు కాసుల వర్షం కురుస్తోంది. రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని గతంలో నకిలీ విత్తనాలు అంటగట్టి నిలువునా ముంచిన ఘటనలు కోకొల్లలు. తక్కువ ధరకు విత్తనాలొస్తున్నాయని ఆశ చూపడం, పూత, కాత అద్భుతంగా ఉంటుందంటూ మాటల గారడీతో మభ్యబెట్టడం రివాజుగా సాగుతోంది. హెచ్‌టీ, బీటీ–3 పత్తి విత్తనాలతో పాటు వరివిత్తనాల్లో లోపాలు ఏటా వెలుగుచూస్తుండగా కఠినచర్యలు లేకపోవడంతోనే దందా నిరాటంకంగా సాగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. అనతికాలంలోనే కోట్లు గడించవచ్చనే దురాశే కర్షక లోకానికి పెనుముప్పుగా మారుతుండగా వ్యవస్థలో లోపాలే అక్రమ వ్యాపారులకు వరమవుతోంది. ఈ క్రమంలో ఈ సారైనా అక్రమార్కులకు అడ్డుకట్టపడుతుందా.. షరామామూలుగా వ్యవహరిస్తారా చూడాలి.

టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఇంకెప్పుడు?

కల్తీ విత్తన విక్రేతలు సీజన్‌కు రెండు నెలల ముందే వ్యాపారం విస్తరిస్తుంటారు. గ్రామాల్లో, పట్టణాల్లో నమ్మకమైన వ్యక్తుల వద్ద విత్తనాలు నిల్వచేసి చాప కింద నీరులా రైతులకు చేరుస్తుంటారు. ఏప్రిల్, మే రెండోవారం కల్లా చేరాల్సిన చోటికి చేరిపోతాయి. ఏప్రిల్ నుంచే వ్యవసాయశాఖ క్షేత్రస్థాయిలో నిఘాను ఏర్పాటు చేస్తే అడ్డుకట్ట పడే అవకాశముంటుంది. జిల్లాలో నేటికీ టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేయకపోవడం విడ్డూరం. డివిజన్, జిల్లా స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి ఫిర్యాదు చేయాల్సిన నంబర్లను ఇప్పటికే విస్తృతంగా ప్రచారం చేయాల్సింది. గతేడాది నకిలీ విత్తనాలే దొరకలేదని అధికారులు చెబుతున్నా కల్తీదందా యథేచ్ఛగా సాగిందని రైతులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో పోలీస్, వ్యవసాయశాఖలు సంయుక్తంగా కమిటీలు ఏర్పాటు చేయాల్సి ఉండగా తదనుగుణ చర్యలు లేకపోవడం దారుణ పరిణామం.

అనధికారిక గోడౌన్లే అడ్డాలు

జిల్లాలో అనధికారిక గోడౌన్లలో కల్తీ విత్తన దందా సాగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లా వ్యవసాయశాఖలోని ఓ అధికారి సంపూర్ణ సహకారంతోనే నిషేధిత మందులు, విత్తనాల అమ్మకాలు సాగుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విత్తన వ్యాపారులు తమ దుకాణం వివరాలతో పాటు గోడౌన్ వివరాలను ఏటా సమర్పించాల్సి ఉంటుంది. అధికారికంగా చూపించే గోడౌన్ ఒకటైతే అనధికారికంగా రెండు, మూడు నిర్వహిస్తున్నారన్నది పక్కా సమాచారం. గతంలో వ్యాపారి రమణారెడ్డి పట్టుబడిన సందర్భంలో ఇదే స్పష్టమవగా మరో నలుగురు బడా వ్యాపారులున్నారని సమాచారం. కరీంనగర్ మార్కెట్లో పత్తి కొనుగోలు చేసే ఓ వ్యాపారి భారీ భవనం నిర్మించగా నకిలీ విత్తనాల సొమ్మేనన్న ఆరోపణలు వినిపించాయి. రాజీవ్‌చౌక్, కూరగాయల మార్కెట్ సమీపంలోని పలు దుకాణాలు, కంపెనీ విత్తనాలు విక్రయించే వ్యాపారులు ఇందులో భాగస్వాములని తెలుస్తోంది. అధికారిక గోడౌన్లలో కంపెనీ విత్తనాలు, ప్రైవేట్‌గా నిర్వహించే భవనాల్లో నకిలీ విత్తనాలను సెల్వ చేయడం.. ఆకర్షణీయమైన ప్యాకెట్లలో నింపి రాత్రికి రాత్రే మాయం చేయడం వీరికి వెన్నతో పెట్టిన విద్య. వ్యవసాయశాఖ ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తే నకిలీ ముప్పే ఉండదు.

వరి విత్తనాలు సక్రమమేనా?

ప్రభుత్వంతో పాటు ప్రయివేట్‌గా సరఫరా అయ్యే వరివిత్తనాల్లో వేటిని నమ్మాలో తెలియని పరిస్థితి. గతంలో మానకొండూర్ సీడ్స్ కంపెనీలో నిర్వహించిన తనిఖీల్లో వరి విత్తనాల నిల్వలో 796 బ్యాగుల తేడా రాగా హుజూరాబాద్ మండలం సింగాపూర్ సీడ్‌ప్లాంట్‌లో 350 క్వింటాళ్లను రికార్డుల్లో నమోదు చేయకపోవడంతో 6ఏ కేసులు నమోదు చేశారు. దమ్మక్కపేట సమీపంలోని సీడ్ ప్లాంట్‌లో విత్తన ధ్రువీకరణ లేకుండా గతంలో జారీ చేసిన లేబుళ్ల (ట్యాగులు) అంటించి విత్తన సంచులను మార్కెటింగ్ చేస్తున్నట్లు తేలింది. జేజీఎల్‌కు సంబంధించి జారీ చేసిన లేబుళ్లను బీపీటీ విత్తన సంచులకు వినియోగించడం అధికారుల పర్యవేక్షణ తీరును చాటింది. అయితే నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం మోపుతామని, ఎట్టి పరిస్థితుల్లో సహించేదిలేదని సంబంధిత విభాగాల అధికారులు చెబుతున్నారు.

ఈ నీళ్లు తాగేదెలా?

- మున్సిపల్ నల్లా నుంచి కలుషితనీరు
- ప్రశాంత్‌నగర్‌లో నెలరోజులుగా సరఫరా
- ఇప్పటికీ సమస్యను గుర్తించని నగరపాలక అధికారులు



నాలుగు రోజుల క్రితం సరఫరా అయిన నల్లా నీరు

కరీంనగర్ కార్పొరేషన్: నల్లా విప్పితే చాలు పసుపు వర్ణంలో నీరు.. భరించలేని దుర్వాసన.. సెప్టిక్ ట్యాంక్ నీటి ఆనవాళ్లు.. ఇది నగరంలోని ప్రశాంత్ నగర్‌లో నెల రోజులుగా తాగునీటి సరఫరా దుస్థితి. సమస్యను గుర్తించలేని నగరపాలక సంస్థ సిబ్బంది, అధికారుల నిర్లక్ష్యం కారణంగా నెల రోజులకు పైగా ఈ ప్రాంతవాసులు నల్లానీరు అంటేనే జడుసుకుంటున్న పరిస్థితి. నగరంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ఎదురుగా ఉన్న ప్రశాంత్‌నగర్ కాలనీలో నెలరోజుల నుంచి మురికినీరు వస్తుండడంతో ఈ ప్రాంత వాసులు గుక్కెడు తాగునీటిని గొంతులో పోసుకోలేకుండా ఉంది. మంచినీటి సరఫరా వేళల్లో నల్లా విప్పితే చాలు భరించలేని వాసన, సెప్టిక్ ట్యాంక్ నీటి ఆనవాళ్లు కనిపించడంతో నల్లా నీరంటేనే హడలిపోతున్నారు. ఈ ప్రాంతంలో ఇటీవల డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులు జరిగాయి. వీధుల వెంట తవ్వి పైప్‌లైన్లు వేశారు. కొద్ది రోజుల తర్వాత మట్టితో ఆ గుంతలు పూడ్చి సిమెంట్‌తో ప్యాచ్‌వర్క్ పూర్తి చేశారు. అయితే ఈ పనులు జరిగిన అనంతరం ప్రశాంత్‌నగర్‌లో నల్లానీరు మురికిగా రావడం మొదలైందని కాలనీవాసులు చెబుతున్నారు. డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ సమయంలో ఎక్కడో తాగునీటి పైప్‌లైన్ పగిలి, అందులోకి ఈ డ్రైనేజీ నీళ్లు కలిసిపోతున్నాయని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గతంలో లేని విధంగా నెల రోజులకు పైగా నల్లా నీళ్లు దుర్గంధభరితంగా సరఫరా అవుతున్నాయని వారంటున్నారు. గత నెలలోనే ఈ సమస్యను నగరపాలక సిబ్బంది దృష్టికి తీసుకురాగా, నాలుగు రోజుల తర్వాత సమస్య పరిష్కారమైందని అన్నారు. ఆ తర్వాత కూడా ఇప్పటివరకు నల్లా నీళ్లు మురికిగానే వస్తున్నాయి. దీంతో నల్లా నీళ్లు అంటేనే కాలనీవాసులు దూరంగా ఉంటున్నారు. బోర్‌వెల్ సదుపాయం లేనివారు మాత్రం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొంతమంది సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న బోర్‌వెల్ నుంచి నీటిని తెచ్చుకొంటున్నారు. ఇప్పటికైనా నల్లానీరు మురికిగా మారడానికి కారణం గుర్తించి, సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

రైతు సమస్యలపై బీజేపీ రణభేరి

- నేడు ధాన్యం కల్లాల సందర్శన
- 20న తహసీల్దార్, కలెక్టర్లకు వినతిపత్రాలు
- 21న అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో దీక్షలు
- బీజేపీ నేతలతో బండి సంజయ్ టెలీకాన్ఫరెన్స్



కరీంనగర్‌టౌన్: కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రైతు సమస్యలపై బీజేపీ రణభేరి మోగించింది. ఇందులో భాగంగా బీజేపీ నేతలు తమ ప్రాంతాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు అండగా నిలవాలని నిర్ణయించింది. ఈ మేరకు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ శుక్రవారం రాత్రి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గపరిధిలోని మండల కమిటీలు, ఆ పైస్థాయి నేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతుల వివరాలు సేకరించేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని సంజయ్ కోరారు. రైతులకు ఇచ్చిన హామీలతోపాటు ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీన వైఖరి అవలంబిస్తోందని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే 'స్థానిక సంస్థల' ఎన్నికలను తెరపైకి తీసుకొస్తోందన్నారు. రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్ తీరుకు నిరసనగా శనివారం బీజేపీ నేతలు ధాన్యం కొనుగోలు కేంద్రాలు సందర్శించాలని సూచించారు. 19న అన్ని మండల, నియోజకవర్గకేంద్రాల్లో మీడియా సమావేశాలు నిర్వహించి రైతులు పడుతున్న బాధలను వివరించాలన్నారు. 20న తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్లకు రైతు సమస్యలపై వినతిపత్రం అందజేయాలని ఆదేశించారు. 21న అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో రైతుదీక్షలు చేపట్టాలని కోరారు.

వేగంగా ధాన్యం కొనుగోళ్లు

- ఆదర్శ పాఠశాలల్లో సత్వరమే పనులు పూర్తి చేయండి
- ప్రజావాణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై దృష్టి
- వీసీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి



వీసీలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్

కరీంనగర్ అర్బన్/కరీంనగర్: ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పనులను సత్వరమే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. పాఠశాలల ప్రారంభానికి ముందే విద్యుత్, తాగునీరు సరఫరా, కలరింగ్, టాయిలెట్స్, అదనపు తరగతి గదుల నిర్మాణం పనులు పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్ త్వరగా అందించాలని పేర్కొన్నారు. యూనిఫామ్స్, పుస్తకాలు అందించే విషయంలో జాప్యం జరగవద్దని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. పార్లమెంటు ఎన్నికల కోడ్ పూర్తయిన తర్వాత యథావిధిగా ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ధరణికి సంబంధించిన దరఖాస్తులను సైతం పరిష్కరించాలని సూచించారు. వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు. తరుగు పేరిట రైతులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా సీఎంఆర్ డెలివరీ చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఆర్‌వో పవన్ కుమార్, ఆర్డీవో కే.మహేశ్వర్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, సివిల్ సప్లై జీఎం రజనీకాంత్, ఇన్‌చార్జి డీఎస్‌వో సురేశ్‌రెడ్డి, డీఆర్డీవో శ్రీధర్, డీఈవో జనార్దన్‌రావు పాల్గొన్నారు.

హైపర్ టెన్షన్‌పై అవగాహన కార్యక్రమాలు



కరీంనగర్‌టౌన్: హైపర్‌టెన్షన్‌పై నెల రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో సుజాత తెలిపారు. వరల్డ్ హైపర్‌టెన్షన్ డే సందర్భంగా శుక్రవారం డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఇండియా న్యూఢిల్లీ అధికారులు వెబ్‌నార్ ద్వారా చేసిన సూచన మేరకు కార్యక్రమం చేపట్టనున్నట్లు వెల్లడించారు. అధిక రక్తపోటుకు గల కారణాలు, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. తీవ్ర తలనొప్పి, దృష్టిలోపం, శ్వాస తీసుకోవడంలో సమస్య, ఛాతినొప్పి, అలసట, మూత్రంలో రక్తం రావడం, గుండెవేగంగా కొట్టుకోవడం వంటి లక్షణాలు ఉన్నవారు సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిని సంప్రదించి, మందులు పొందవచ్చన్నారు. అధిక రక్తపోటు గురికాకుండా ఉండాలంటే మంచి ఆహారం, ఆకుకూరలు, గుడ్లు, రోజు ఉదయం 30నిమిషాలు నడక, యోగా లాంటివి దినచర్యలో భాగంగా చేసుకోవాలని కోరారు. ఆహారంలో అధిక ఉప్పును నివారించి, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండాలని సూచించారు.

ఇటు విచారణ.. అటు బిల్లు చెల్లింపు

- ప్రిన్సిపల్ సెక్రటరీకి బీఆర్‌ఎస్ కార్పొరేటర్ ఫిర్యాదు

కరీంనగర్ కార్పొరేషన్: ఓ వైపు స్మార్ట్‌సిటీ పనులపై విచారణ సాగుతుండగానే, మరోవైపు పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించడం నగరపాలకసంస్థలో వివాదాస్పదంగా మారింది. స్మార్ట్‌సిటీ పనుల్లో అంచనాలు పెంచడం, పనుల్లో నాణ్యతాలోపం, అక్రమాలపై రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టాక పలు ఫిర్యాదులు అందాయి. ఆ ఫిర్యాదులపై విజిలెన్స్ విచారణ సాగుతోంది. ఈ సమయంలోనే గీతాభవన్ జంక్షన్ అభివృద్ధి పనులకు సంబంధించి సుమారు రూ.కోటి బిల్లు నగరపాలకసంస్థ చెల్లించడం ప్రస్తుతం వివాదాస్పదమైంది.

కార్పొరేటర్ ఫిర్యాదు

నగరపాలకసంస్థ పరిధిలో స్మార్ట్‌సిటీ, సీఎంఏ నిధులతో చేపట్టిన పనుల్లో కోట్లాది రూపాయల కుంభకోణం జరిగిందని, ఓ వైపు విజిలెన్స్ విచారణ జరుగుతుండగానే బిల్లులు చెల్లించిన వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని బీఆర్‌ఎస్‌కు చెందిన 41వ డివిజన్ కార్పొరేటర్ బండారి వేణు శుక్రవారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ, కలెక్టర్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌లకు ఫిర్యాదు చేశారు. కాంట్రాక్టర్లతో కుమ్మక్కైన ఇంజినీరింగ్ అధికారి ఒకరు నగరంలోని గీతాభవన్, హౌసింగ్‌బోర్డు, బైపాస్ జంక్షన్‌లతో పాటు, కిసాన్‌నగర్ సమీకృత మార్కెట్, వివిధ ప్రాంతాల్లో ఇంకుడుగుంతల నిర్మాణాల్లో నాలుగైదురెట్లు అంచనాలు పెంచారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారాలపై తాను గతంలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజిలెన్స్ విచారణ జరుగుతోందని అన్నారు. ఓ వైపు విచారణ జరుగుతున్న సమయంలో కమీషన్లకు కక్కుర్తి పడి సదరు కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించారని ఆరోపించారు. ఇంతపెద్ద మొత్తంలో ఎప్పుడూ అవినీతి జరగలేదని, విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

పిడుగులు పడుతున్నయ్.. జాగ్రత్త

- మేఘాల్లోని పాజిటివ్, నెగెటివ్ కణాల వల్లే..
- వర్షం పడుతుంటే చెట్ల కిందకు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లొద్దు
- మెరుపులను చూసేందుకు ప్రయత్నించొద్దు



జగిత్యాల అగ్రికల్చర్: కొద్దిరోజులుగా ఉమ్మడి జిల్లాలో అకాల వర్షాలు కురుస్తున్నాయి. ఆకాశం మేఘావృతమై, బలమైన ఈదురుగాలులతో వాన పడేటప్పుడు మెరుపులు వచ్చి, పెద్ద శబ్దాలతో పిడుగులు పడతాయి. వీటికి బలమైన అయస్కాంత శక్తితో కూడిన విద్యుత్ శక్తి ఉంటుంది. అందుకే మనుషులతోపాటు జంతువులు చనిపోతాయి. పిడుగుల ప్రభావానికి పచ్చని చెట్లు సైతం కాలిపోతుంటాయి. ఎక్కువగా వ్యవసాయ పనులకు వెళ్లే రైతులే పిడుగుపాటుకు బలవుతుంటారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో కురిసిన వర్షానికి తంగళ్లపల్లి మండలం ఇందిరానగర్‌కు చెందిన రుద్రారపు చంద్రయ్య, వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని శాత్రాజుపల్లెకు చెందిన కంబోళ్ల శ్రీనివాస్ అనే రైతులు, మూడు పశువులు పిడుగు పడి మృతిచెందగా మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి.

పిడుగు అంటే..?

మేఘాల్లో ఉష్ణోగ్రత చాలా తక్కువగా ఉండటం వల్ల వర్షపు నీరు చిన్న మంచు కణాలుగా విడిపోతుంది. విపరీతమైన గాలులు వచ్చినప్పుడు వాటి మధ్య రాపిడి జరిగి, ఒక ఎలక్ట్రికల్ చార్జ్ విడుదలవుతుంది. ఇందులోని పాజిటివ్ కణాలు తేలికగా ఉండటం వల్ల మేఘాల పైకి వెళ్తుంటే, నెగెటివ్ కణాలు బరువుగా ఉండి కిందికి వెళ్తుంటాయి. అయస్కాంతంలో ఉత్తర, దక్షిణ ధృవాలు ఆకర్షించుకున్నట్లుగానే రెండు మేఘాలు దగ్గరగా వచ్చినప్పుడు పాజిటివ్, నెగెటివ్ కణాలు ఆకర్షించుకొని మెరుపులు వస్తాయి. ఈ సమయంలో మేఘంలోని నెగెటివ్ కణాలు, భూమిలోని పాజిటివ్ కణాలను ఆకర్షిస్తుంటాయి. అప్పుడు భూమిపై ఎత్తుగా ఉండే చెట్లు, గుట్టలు, మనుషుల ద్వారా మెరుపుతో కూడిన పిడుగు పడుతుంది.

అప్రమత్తంగా ఉండాలి..

వర్షాలు పడే సమయంలో బయటకు వెళ్లకపోవడమే ఉత్తమం. ముఖ్యంగా వ్యవసాయ పనులకు వెళ్లిన రైతులు, రైతు కూలీలు అప్రమత్తంగా ఉండాలి. ఆకాశంలో ఉరుములు, మెరుపులు వస్తుంటే చెట్ల కిందకు, విద్యుత్ టవర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలోకి వెళ్లొద్దు. పిడుగుపడే సమయంలో ఆకాశంలోని మెరుపులు అత్యధిక శక్తిని కలిగి ఉంటాయి. కాబట్టి, ఆ వెలుతురును చూసేందుకు ప్రయత్నించొవద్దు. పిడుగుకు కొన్ని మిలియన్ మెగావాట్ల శక్తి ఉంటుందనే విషయాన్ని ప్రతీ ఒక్కరూ గుర్తుంచుకోవాలి.

రైతులు సమయస్ఫూర్తితో వ్యవహరించాలి

వ్యవసాయ పనులు చేసేటప్పుడు ఉరుములు, మెరుపులు వస్తుంటే పిడుగులు పడతాయని భావించి, రైతులు మరింత జాగ్రత్తగా ఉండాలి. వెంటనే సురక్షిత ప్రాంతానికి చేరుకోవాలి. ఒకవేళ వీలు కాకపోతే సమయస్ఫూర్తితో వ్యవహరించి, మోకాళ్లపై చేతులు, తలపెట్టి, దగ్గరగా ముడుచుకొని కూర్చోవాలి. దీనివల్ల, సమీపంలో పిడుగు పడినా అందులోని విద్యుత్ ప్రభావం తక్కువగా ఉండి, బతికేందుకు అవకాశాలు ఉంటాయి. పిడుగు పడుతుందని అనిపించినప్పుడు రబ్బర్ చెప్పులు వేసుకోవడం మంచిది. ఒకవేళ వేసుకోలేని పరిస్థితి ఉన్నప్పుడు కాలును భూమి మీద పూర్తిగా ఆనించొద్దు. కాలి వేళ్ల మీద ఉండేందుకు ప్రయత్నించాలి.

విద్యుత్ పరికరాలకు నష్టం..

పిడుగు పడినప్పుడు విద్యుత్ పరికరాలకు ఎక్కువ నష్టం జరిగే అవకాశం ఉంటుంది. ఉరుములు, మెరుపులు వస్తుంటే విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలి. ఇంట్లోని ఎలక్ట్రానిక్ పరికరాలైన టీవీ, రిఫ్రిజిరేటర్, సెల్‌ఫోన్ వంటి వాటిని వినియోగించకపోవడం ఉత్తమం. అలాగే, మెరుపులు వస్తున్నప్పుడు ఆరుబయట స్నానం చేయడం, వంట పాత్రలు కడగడం చేయవద్దు. లోహపు వస్తువుల ద్వారా విద్యుత్ ప్రవహించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

పిడుగుపాటుకు గురైన వ్యక్తిని ముట్టుకుంటే షాక్ రాదు



పిడుగుపాటుకు గురైన వ్యక్తిని ముట్టుకుంటే షాక్ రాదు. వెంటనే బాధితుడికి ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రికి తరలించాలి. పిడుగుల సమయంలో విద్యుత్ పరికరాల కనెక్షన్ తీసివేయడం మంచిది.

– సత్యనారాయణ, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ, జగిత్యాల

సూర్యుడికన్నా ఎక్కువ వేడి



సూర్యుడి ఉపరితలం మీద 5 వేల డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉంటే, పిడుగు పడినప్పుడు 29 వేల డిగ్రీలు ఉత్పత్తి అవుతుంది. పిడుగుకు సూర్యుని ప్రభావం కన్నా 5 రెట్లు ఎక్కువ వేడి ఉంటుంది.

– శ్రీలక్ష్మి, వాతావరణ శాస్త్రవేత్త, పొలాస పరిశోధన స్థానం

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


కవిత (ఫైల్)

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం ఎదురుగట్లకు చెందిన పొన్నం మణెవ్వ-నర్సయ్య దంపతుల కుమార్తె పొన్నం కవిత (36) అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు. కవిత మానసిక స్థితి సరిగ్గా ఉండదు. ఫిట్స్ కూడా వస్తుంటాయి. నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన ఆమె శుక్రవారం వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి శివారులో మృతిచెంది కనిపించింది. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ పరిశీలించి, కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరుచోట్ల ఆటోలు బోల్తా.. ఇద్దరి మృతి

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): ఇదులాపూర్ - పెద్దరాతుపల్లి గ్రామాల మధ్య గురువారం రాత్రి మట్టలవాగు కల్వర్టుపై ఆటో బోల్తాపడి ఒకరు మృతి చెందగా మరొకరు గాయాలపాలయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. ఓదెల మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన కూరగాయల వ్యాపారి బీస రజిత.. చెలుకాని రాజు ఆటో అద్దెకు తీసుకుని కాల్వశ్రీరాంపూర్ మండలం ఇదులాపూర్‌లో జరిగే వారసంతకు వచ్చింది. తిరుగు ప్రయాణంలో ఇదులాపూర్ - పెద్దరాతుపల్లి మధ్య ఆటో ప్రమాదవశాత్తు మట్టలవాగుపై బోల్తాపడింది. ఈప్రమాదంలో ఆటో నడుపుతున్న రాజు(30) అక్కడికక్కడే మృతి చెందాడు. బీస రజితకు గాయాలయ్యాయి. బైక్‌పై అటుగా వెళ్తున్న నెట్టం కిరణ్ ఇందుర్తి గ్రామ సర్పంచ్‌కు ఫోన్‌ద్వారా సమాచారం తెలిపాడు. కుటుంబ సభ్యులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని 108 వాహనం ద్వారా రాజు మృతదేహాన్ని, రజితను సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రజిత కోలుకుంటోంది. రాజు భార్య భవాని శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై ఓంకార్ యాదవ్ తెలిపారు. మృతుడికి భార్య భవాని, కూతురు, కుమారుడు ఉన్నారు.

పాలితం గ్రామం వద్ద..

పెద్దపల్లిరూరల్: పాలితం గ్రామం వద్ద శుక్రవారం ఆటో అదుపుతప్పి బోల్తాపడ్డ ఘటనలో ఆలేటి భూమయ్య(42) మృతిచెందినట్లు ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. ఆటో నడుపుతూ జీవనం సాగించే భూమయ్య.. పెద్దపల్లికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా అదుపు తప్పి ఆటో నడుపుతున్న భూమయ్యపైనే బోల్తాపడింది. గాయాలు కావడంతో వెంటనే పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య జయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

చికిత్స పొందుతూ దివ్యాంగురాలు..

పట్టణ శివారు చందపల్లికి చెందిన కొండి స్వరూప(42) అనే దివ్యాంగురాలు చికిత్స పొందుతూ మృతి చెందిందని ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. రెండురోజుల బీపీ అధికం కావడంతో కిందపడి గాయపడ్డ స్వరూపను ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణించిందని ఎస్సై తెలిపారు.

గుండెపోటుతో రంగస్థల నటుడు..


శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

హుజూరాబాద్ రూరల్: మండలంలోని పెద్దపాపయ్యపల్లికి చెందిన రంగస్థల నటుడు, సీనియర్ కళాకారుడు పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి(68) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయన గ్రామంలో మొట్టమొదట శివరామకృష్ణ భజన మండలిని స్థాపించి, ఎంతోమంది కళాకారులను తయారు చేశారు. హైదరాబాద్‌లో నటరాజ కళాకారుల సంక్షేమ సంఘాన్ని స్థాపించి, అధ్యక్షుడిగా పని చేశారు. శ్రీనివాస్‌రెడ్డి రంగస్థల కళాకారుడిగా రాష్ట్రస్థాయిలో పేరు పొందారు. ప్రభుత్వ కార్యక్రమాలైన అక్షర ఉజ్వల, నిరక్షరాస్యత, మూఢనమ్మకాల నిర్మూలనపై నాటకాలతో ప్రజల్లో చైతన్యం కలిగించాడు. ఆయనకు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. శ్రీనివాస్‌రెడ్డి మృతికి గ్రామంలోని ప్రజాప్రతినిధులు, రంగస్థల కళాకారులు తమ సంతాపం వ్యక్తం చేశారు.

ప్రాణం తీసిన పాతకక్షలు

- ఇంటి కొనుగోలు విషయంలో వివాదం
- కత్రలు, ఇనుపరాడ్‌లతో దాడి
- ఘటన స్థలంలో ఒకరు.. చికిత్స పొందుతూ మరొకరు మృతి


ఘటన వివరాలు తెలుసుకుంటున్న ఏఎస్పీ వినోద్‌కుమార్, పోలీసులు

బుగ్గారం(ధర్మపురి): పాతకక్షలు ఇద్దరి ప్రాణాలు తీశాయి. ఇంటి కొనుగోలు, స్థల వివాదం నేపథ్యంలో జరిగిన ఘటన ఫ్యాక్షన్ హత్యలను తలపించింది. గ్రామస్తులు, పోలీసుల వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం గోపులాపూర్ గ్రామానికి చెందిన దీటి శ్రీనివాస్(36), బుర్ర నవీన్ మధ్య కొద్దిరోజులుగా ఇంటి కొనుగోలు విషయంలో వివాదం కొనసాగుతోంది. ఈ కేసు ప్రస్తుతం కోర్టులో ఉంది. అప్పటి నుంచి ఇద్దరి మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం రాత్రి శ్రీనివాస్, నవీన్ మధ్య గొడవ జరుగగా స్థానికులు కల్పించుకొని ఇరువురిని శాంతింపజేశారు. అయినా అర్ధరాత్రి సమయంలో నవీన్ తన అనుచరులతో కలిసి శ్రీనివాస్‌పైకి దాడికి పాల్పడగా అక్కడే ఉన్న వరుసకు సోదరుడైన దీటి మహేశ్ (38) అడ్డుకునేందుకు ప్రయత్నించాడు. దీంతో కోపోద్రిక్తుడైన నవీన్ తన అనుచరులతో కలిసి ఇరువురిపై కత్రలు, ఇనుపరాడ్‌లతో విచక్షణరహితంగా దాడికి పాల్పడగా శ్రీనివాస్ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్ర గాయాలైన మహేశ్‌ను చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్స చేస్తుండగా శుక్రవారం ఉదయం మృతిచెందాడు. శ్రీనివాస్‌కు భార్య,


శ్రీనివాస్ మృతదేహం

మహేశ్‌కు భార్య, నాలుగేళ్ల వయస్సుగల కుమారుడు ఉన్నారు.

ఏఎస్పీ పరిశీలన

గోపులాపూర్‌లో జరిగిన హత్య ఘటన స్థలాన్ని శుక్రవారం ఏఎస్పీ వినోద్‌కుమార్, సీఐ రామ్‌నర్సింహారెడ్డి, ఎస్సైలు శ్రీధర్‌రెడ్డి, ఉమాసాగర్, సతీశ్ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. శ్రీనివాస్ సోదరి మమత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పెద్దంపేటలో ఈతవనం దహనం


ఈతవనం పరిశీలిస్తున్న ఎక్సైజ్ పోలీసులు


కాలిపోయిన ఈతచెట్లు

- గుర్తుతెలియని వ్యక్తుల దుశ్చర్య
- కాలిబూడిదైన 600 చెట్లు

రామగుండం: అంతర్గాం మండలం పెద్దంపేట గ్రామ శివారు అటవీ ప్రాంతంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఈతవనం తగులబెట్టారు. ఈ ఘటనలో సుమారు 600 చెట్లు కాలిబూడిదయ్యాయని గీత కార్మిక సంఘం ప్రతినిధులు మేర్గు రమేశ్‌గౌడ్, బండి మహేశ్‌గౌడ్ తెలిపారు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ శాఖ సీఐ మంగమ్మ, ఎస్సై శ్రీనివాస్ శుక్రవారం తమ సిబ్బందితో క్షేత్రస్థాయిలో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. చెట్లు కాలిపోవడంతో గీత కార్మికుల ఉపాధిపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధితులకు పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

ఈతవనం దగ్ధం

మేడిపల్లి(వేములవాడ): భీమారం మండలంలో వరుస ప్రమాదాలతో గౌడన్నల జీవనోపాధికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నాలుగు నెలల క్రితం కమ్మరిపేటలో నిప్పంటుకొని ఈతవనం దగ్ధమైంది. 15 రోజుల క్రితం దేశాయిపేటలో 5 వేల ఈతచెట్లు అగ్నికి ఆహుతైనాయి. శుక్రవారం బీమారం మండల కేంద్రంలో గౌడ కులస్తులకు చెందిన ఐదెకరాల భూమిలో 3,000 ఈతచెట్లు నిప్పంటుకొని దగ్ధమయ్యాయి. వరుస ఘటనలతో గీత కార్మికులు ఆవేదన చెందుతున్నారు. అందుబాటులో ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఆరోగ్య సమస్యలకు హైపర్‌టెన్షనే కారణం

- మెడికవర్ వైద్యులు నాగరాజు, ప్రతిష్టారావు


హెల్త్‌టాక్‌లో పాల్గొన్న వైద్యులు, పీఎఫ్ సిబ్బంది

కరీంనగర్‌టౌన్: మనిషిలో వచ్చే అనేక ఆరోగ్య సమస్యలకు హైపర్‌టెన్షనే కారణమని మెడికవర్ ఫిజీషియన్ నాగరాజు, గైనకాలజిస్టు ప్రతిష్టారావు అన్నారు. వరల్డ్ హైపర్‌టెన్షన్ డే సందర్భంగా మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రీజినల్ పీఎఫ్ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం, హెల్త్‌టాక్‌తో అవగాహన కల్పించారు. 150 మందికి బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు నిర్వహించారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ హైపర్ టెన్షన్ సమస్యతో ఎంతో మంది ఇబ్బంది పడుతున్నారని, దీనికి శారీరక, మానసిక ఒత్తిడి, ఆల్కహాల్ తీసుకోవడం కారణమన్నారు. హైబీపీని నిర్లక్ష్యం చేస్తే రక్తనాళాలపై ఒత్తిడి పెరిగి గుండె సంబంధ, స్ట్రోక్ వంటి సమస్యలు వస్తాయన్నారు. చిన్నచిన్న జాగ్రత్తలు తీసుకుంటూ ప్రతీరోజు వ్యాయామం, మెడిటేషన్ చేస్తూ, ఒత్తిడిలేకుండా జీవించడం వల్ల బ్లడ్ ప్రెషర్‌ను అదుపులో పెట్టవచ్చన్నారు. పీఎఫ్ కమిషనర్ ఎస్.తానయ్య మాట్లాడుతూ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం మెడికవర్ ఆసుపత్రి ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఎమర్జెన్సీ హెచ్‌వోడీ డాక్టర్ సత్యనారాయణ బీఎల్ఎస్ ట్రైనింగ్‌పై అవగాహన కల్పించారు. మెడికవర్ సెంటర్‌హెడ్ గుర్రం కిరణ్, మార్కెటింగ్ మేనేజర్ కర్ణాకర్, హెచ్‌ఆర్ మేనేజర్ ఈశ్వర్ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో లక్కీ డ్రా నిర్వాహకులు


అదుపులోకి తీసుకుంటున్న తంగళ్లపల్లి పోలీసులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): 'కాయ్ రాజా కాయ్' అంటూ లక్కీడ్రా పేరుతో ప్రజలను బురిడీ కొట్టించి డబ్బులు దండుకుంటున్న కేటుగాళ్లను తంగళ్లపల్లి పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రధాన రహదారి పక్కన శుక్రవారం సాయంత్రం కొందరు వ్యక్తులు లక్కీడ్రా పేరుతో ప్రజల నుంచి డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై సుధాకర్.. పోలీస్ సిబ్బందిని పంపించి వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఏఎస్సై ముఖీద్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎంసీలో ధాన్యం చోరీ


స్థానికులు పట్టుకున్న ధాన్యం బస్తాలు

సుల్తానాబాద్‌రూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో అశోక్‌నగర్‌వాసి జునగరి కుమార్‌కు చెందిన ధాన్యం గురువారం రాత్రి చోరీకి గురైంది. సన్నరకం ధాన్యం మర పట్టించేందుకు ఏఎంసీలో ఆరబోశాడు. ఇందులో దాదాపు 8బస్తాల ధాన్యం చోరీకి గురైంది. ఈక్రమంలో స్థానిక మార్కండేయకాలనీలో వెతకగా ఓ ఆటోలో ధాన్యం బస్తాలు లభించాయి. దీంతో బాధితుడు పోలీసులకు సమాచారం అందించాడు. ఏఎంసీ కార్యదర్శి హమీద్ సైతం చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

చేపలవేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి


వెంకటేశ్(ఫైల్)

రామగుండం: చేపల వేటకు వెళ్లి నీట మునిగి మత్స్యకారుడు మృతి చెందిన ఘటన లింగాపూర్ శివారు గోదావరి నదిలో చోటు చేసుకుంది. అంతర్గాం ఎస్సై వెంకట్ కథనం ప్రకారం.. ఆబాది రామగుండానికి చెందిన బింగి వెంకటేశ్(50)తోపాటు మరో ముగ్గురు బంధువులు శుక్రవారం గోదావరినదిలోకి వెళ్లారు. చేపలుపట్టేందుకు వలలతో నదిలో తెప్పపై తిరుగుతున్నారు. తెప్పపై నిలబడి వల విసిరే క్రమంలో కాళ్ల తగిలి అదుపు తప్పిన వెంకటేశ్.. నీటిలో పడిపోయాడు. బంధువులు అప్రమత్తమై వెంకటేశ్‌ను నీటిలో నుంచి ఒడ్డుకు చేర్చారు. అప్పటికే ఊపిరి ఆడక మృతిచెందాడు. మృతుడికి భార్య పద్మ, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు..

సారంగాపూర్(జగిత్యాల): కాలిన గాయాలతో చికిత్స పొందుతూ ఓ వృద్ధురాలు మృతిచెందింది. ఎస్సై దత్తాద్రి కథనం ప్రకారం.. మండలంలోని ఒడ్డెరకాలనీ గ్రామానికి చెందిన గద్దల బక్కవ్వ (60) భర్త నర్సయ్య ఏడాది క్రితం మృతిచెందాడు. దీంతో బక్కవ్వ ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. ఈ నెల 15న వంట చేస్తున్న క్రమంలో గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్ నుంచి మంటలు వెలువడి బక్కవ్వ చీరకు అంటుకున్నాయి. ఇంటి సమీపంలో ఉండే ఆమె బంధువులు మంటలు ఆర్పివేసి వెంటనే జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎంబీఏ, ఎంసీఏ ఫలితాల్లో ఎస్ఆర్ఎం విద్యార్థుల ప్రతిభ

కొత్తపల్లి: శాతవాహన యూనివర్సిటీ ప్రకటించిన ఎంబీఏ, ఎంసీఏ మొదటి, మూడో సెమిస్టర్ ఫలితాల్లో కొత్తపల్లి మండలం చింతకుంట శివారులోని ఎస్ఆర్ఎం విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సి.వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఎంబీఏ మొదటి సెమిస్టర్‌లో గుంటి త్రివేణి 6.97, వేల్పుల శ్రీవాణి 6.73, ఎంసీఏలో ఏ.సుధీక్ష 8.0, వి.స్పందన 7 .9 సాధించగా, ఎంబీఏ మూడో సెమిస్టర్‌లో ఎం.హర్షిత 6.81, పి.నవ్య 6.73, ఎంసీఏలో వి.శ్రీజ 7.72, బి.సౌమ్య 7.58 జీపీఏలతో మొదటి, ద్వితీయ స్థానాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా మొదటి, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ ఎం.తిరుపతిరెడ్డి అభినందించారు.

గుంతలో పడ్డ ట్రాక్టర్

జ్యోతినగర్(రామగుండం): రోడ్డుపై ప్రమాదకరంగా ఏర్పడిన గుంతను పూడ్చకపోవడంతో ట్రాక్టర్ ట్రాలీ అందులో పడింది. ఎన్టీపీసీ సింధూర కళాశాల రోడ్డులో చాలా రోజుల క్రితం సీసీ రోడ్డుపై గుంత ఏర్పడింది. స్థానికులు దా ని చుట్టూ ఇటుకలు రక్షణగా ఏర్పాటు చేశా రు. అయినా.. శుక్రవారం ఇసుక లోడ్‌తో వెళ్తు న్న ట్రాక్టర్ ట్రాలీ అందులోపడిపోయింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

అట్టహాసంగా లయన్స్‌క్లబ్ మల్టికాన్



మాట్లాడుతున్న గట్టమనేని బాబూరావు

కరీంనగర్‌టౌన్: తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల లయన్స్ ఇంటర్నేషనల్ వార్షిక సమావేశం 'మల్టికాన్' శుక్రవారం స్థానిక ప్రతిమ మల్టీప్లెక్స్‌లో అట్టహాసంగా జరిగింది. కౌన్సిల్ చైర్మన్ తీగల మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన సదస్సుకు ముఖ్యఅతిథిగా ఇంటర్నేషనల్ డైరెక్టర్ గట్టమనేని బాబురావు, గ్యాట్‌ఏరియా లీడర్ సునీల్‌కుమార్ హాజరై మాట్లాడారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నడుస్తున్న కంటి ఆసుపత్రుల ద్వారా అందిస్తున్న సేవలు, మీల్స్ ఆన్ వీల్స్ ద్వారా అందిస్తున్న అన్నదాన కార్యక్రమాలు ప్రజలకు మరింత దగ్గర కావాలని సూచించారు. అనంతరం 2024–25 సంవత్సరానికి రెండు రాష్ట్రాల ఉమ్మడి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా హన్మండ్ల రాజిరెడ్డి, వైస్‌చైర్మన్‌గా కె.హరీశ్‌రెడ్డి, సెక్రటరీగా ఎస్.వెంకటేశ్వర్‌రావు, కోశాధికారిగా రేసు మల్లారెడ్డి, జాయింట్ సెక్రటరీగా శివప్రసాద్‌ను నియమించారు.

లింగాపూర్‌కు వైద్య విధాన పరిషత్ అధికారులు

- నాలుగు క్లినిక్‌ల తనిఖీ
- మహిళా ఆర్ఎంపీ హైడోస్ స్టిరాయిడ్స్, పెయిన్ కిల్లర్స్ ఇచ్చినట్లు గుర్తింపు

సాక్షి స్పందన


ఆర్ఎంపీ మమతను విచారిస్తున్న అధికారులు

మానకొండూర్ రూరల్: వైద్య విధాన పరిషత్ అధికారులు శుక్రవారం మానకొండూర్ మండలంలోని లింగాపూర్‌కు వచ్చారు. 'వికటించిన మహిళా ఆర్ఎంపీ వైద్యం' శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి వారు స్పందించారు. తెలంగాణ రాష్ట్ర వైద్యమండలి చైర్మన్ డాక్టర్ మహేశ్‌కుమార్ ఆదేశాల మేరకు స్థానికంగా నలుగురు ఆర్ఎంపీలకు చెందిన క్లినిక్‌లను తనిఖీ చేశారు. ఆర్ఎంపీ కోల మమత కనకవ్వ అనే వృద్ధురాలికి యాంటీబయాటిక్స్, ఇతర మందులను సెలైన్‌లో కలిపి ఇచ్చినట్లు గుర్తించారు. గ్రామంలోని ఇతర పేషెంట్లకు కూడా విరివిగా హైడోస్ స్టిరాయిడ్స్, పెయిన్ కిల్లర్ ఇంజెక్షన్లు ఇస్తున్నట్లు నిర్ధారించారు. ఆమె క్లినిక్‌లో లభ్యమైన యాంటీబయాటిక్స్, స్టిరాయిడ్స్‌ను సీజ్ చేశారు. వాటితోపాటు ఇతర ఆధారాలను టీఎస్ఎంసీ రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి పంపించి, ఎన్ఎంసీ చట్టం ప్రకారం మహిళా ఆర్ఎంపీపై కేసు నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో ఐఎంఏ సెక్రటరీ వెంకట్‌రెడ్డి, హెచ్‌ఆర్‌డీఏ కరీంనగర్ సెక్రటరీ శరన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకుంటాం

చాలా మంది ఆర్ఎంపీ, పీఎంపీలు వారి స్థాయికి మించి వైద్యం చేస్తున్నారు. దీనివల్ల ప్రజారోగ్య వ్యవస్థ దెబ్బతింటోంది. విద్యార్హత లేకున్నా పరిధి దాటి వైద్యం చేసేవారిపై నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశాం. ఇకనుంచి క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టి, ఎన్ఎంసీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ రాజ్‌కుమార్, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ మెంబర్

'జ్యోతిష్మతి' విద్యార్థులతో వెబినార్


హాజరైన విద్యార్థులు విద్యార్థులు


మాట్లాడుతున్న లూసియానా వర్సిటీ ప్రతినిధి

- ఎంఎస్ అడ్మిషన్స్‌పై లూసియానా వర్సిటీ ప్రతినిధుల అవగాహన

తిమ్మాపూర్(మానకొండూర్): మండల కేంద్రంలోని జ్యోతిష్మతి అటానమస్ ఇంజినీరింగ్ కళాశాల, అమెరికాలోని లూసియానా టెక్ యూనివర్సిటీ మధ్య ఇటీవల ఎంవోయూ కుదిరింది. ఈ మేరకు జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు వర్సిటీ ఇంటర్నేషనల్ ఎఫైర్స్ డైరెక్టర్ జేఆర్.లిగాన్, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ ఫర్ రీసెర్చ్ డీన్ ఆఫ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ప్రొఫెసర్ బి.రాము రామచంద్రన్ ఎంఎస్ కోర్సు అడ్మిషన్స్‌పై శుక్రవారం వెబినార్ నిర్వహించారు. ఇంజినీరింగ్ విద్యార్థులు ఉన్నత విద్యలో భాగంగా అడ్మిషన్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, స్కాలర్‌షిప్స్, ప్రాంగణ నియామకాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఏటా ఫిబ్రవరి, సెప్టెంబర్ నెలల్లో నిర్వహించే అడ్మిషన్ల ప్రక్రియకు సన్నద్ధం కావాలని, ఏజెంట్లను సంప్రదించి ఇబ్బందుల్లో పడొద్దని సూచించారు. జ్యోతిష్మతి కళాశాల విద్యార్థులు లూసియా టెక్ యూనివర్సిటీలో ఉన్నత విద్యను సులభంగా అభ్యసించవచ్చని తెలిపారు. అనంతరం కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు మాట్లాడుతూ.. లూసియానా యూనివర్సిటీతో తమ కళాశాల ఒప్పందం కుదుర్చుకోవడం ఆనందంగా ఉందన్నారు. విదేశాలకు వెళ్లి, ఉన్నత చదువులు చదువుకోవాలనుకునేవారికి ఇది మంచి అవకాశమని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ జువ్వాడి సుమిత్ సాయి, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, డీన్ అకాడమిక్స్ పీకే.వైశాలి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పండ్ల కోసం వచ్చి.. అనంతలోకాలకు

- రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి
- పది గంటలు సంఘటన స్థలంలోనే
- రాత్రి 8 గంటలకు చివరి ఫోన్
- కోరుట్లపేట శివారులో సంఘటన


రాజు (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మామిడిపండ్లు తీసుకొస్తానని ఇంటి నుంచి బయలుదేరిన అతనికి అదే చివరి రోజైంది. పండ్ల కోసం వచ్చిన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఆ కుటుంబ సభ్యులకు అంతులేని వేదన మిగిలింది. ద్విచక్ర వాహనం అదుపుతప్పింది. విగతజీవిగా పది గంటలపాటు సంఘటన స్థలంలోనే పడి ఉన్నాడు. ఈ హృదయ విదారకర సంఘటనకు సంబంధించిన వివరాలు ఎస్సై రమాకాంత్ వెల్లడించారు. గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన బహుజన పార్టీ నాయకుడు కర్రోళ్ల రాజు(42) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం మామిడి పండ్లు తీసుకొస్తానని ఇంట్లో చెప్పి తన బైక్‌పై ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్ల పల్లికి వచ్చాడు. గొల్లపల్లిలో పండ్లు తీసుకొని మిగతా పనులు చూసుకున్నాడు. ఈక్రమంలోనే రాత్రి 8 గంటలకు ఇంటి నుంచి ఫోన్ రాగా.. బయలుదేరుతున్నట్లు చెప్పాడు. అదే చివరి మాటలు అయ్యా యి. కుటుంబ సభ్యులు రాత్రంతా ఫోన్ చేస్తే రాజు లిఫ్ట్ చేయలేదు. రాత్రి సుమారు 9 గంటల ప్రాంతంలో మండలంలోని కోరుట్లపేట శివారులో వాహనం అదుపుతప్పి పొలాల్లో పెద్ద ఒడ్డు కింద పడిపోయాడు. దీంతో రాత్రంతా రాజు సంఘటన స్థలంలోనే పడి ఉన్నాడు. ఉదయం ఉపాధి పనులకు వెళ్తున్న కూలీలు అపస్మారక స్థితిలో పడి ఉన్న రాజును చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రమాకాంత్, ఏఎస్సై కిషన్‌రావు సంఘటన స్థలానికి చేరుకొని చూడగా.. రాజు మృతి చెంది ఉన్నాడు. రాత్రి ఎవరైనా గుర్తించి ఆస్పత్రికి తరలిస్తే బతికేవాడేమోనని పలువురు సంఘటన స్థలంలో చర్చించుకున్నారు. మృతునికి భార్య లక్ష్మి, కూతురు వైష్ణవి ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

నేరెళ్లలో దొంగల బీభత్సం

- మూడిళ్లలో చోరీ.. బంగారం, నగదు అపహరణ


బీరువాను పగలగొట్టిన దొంగలు

ధర్మపురి: మండలంలోని నేరెళ్లలో అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. మూడిళ్లలో చొరబడి, బంగారం, వెండి, నగదు ఎత్తుకెళ్లారు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరెళ్లకు చెందిన కనికరపు రాజేశ్వరి, బొనకంటి రాజవ్వ గురువారం అర్ధరాత్రి ఉక్కపోతతో ఇంటి వెనుకవైపున్న తలుపులు తెరిచి పడుకోగా దొంగలు చొరబడ్డారు. ఇరువురి ఇళ్లలో రూ.2.40 లక్షల నగదు, రెండు తులాల బంగారం చోరీ చేశారు. అనంతరం గ్రామానికి చెందిన కాసారపు రాజాగౌడ్ ఇంట్లో చొరబడి అరతులం బంగారం, రూ.5 వేల నగదు, 20 తులాల వెండి ఎత్తుకెళ్లారు. ఎస్సై ఉదయ్‌కుమార్ ఘటన స్థలాలను పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. క్లూస్ టీం సభ్యులు వివరాలు సేకరించారు.

మద్యం మత్తులో భార్యపై దాడి

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): మద్యం మత్తులో భర్త తన భార్యపై దాడిచేశాడు. గోదావరిఖని టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక బంగ్లాస్ ఏరియాలోని సర్వెంట్ క్వార్టర్‌లో శ్రీను-స్వప్న దంపతులు నివాసం ఉంటున్నారు. శ్రీను మేషన్ పనిచేస్తున్నాడు. స్వప్న బంగ్లాస్ ఏరియాలోని క్వార్టర్లలో పనిచేస్తోంది. తరచూ మద్యం తాగి వచ్చి భార్యతో గొడవపడేవాడు. ఈక్రమంలో శుక్రవారం మద్యం తాగి మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. ఆ మత్తులో భార్యపై దాడి చేశాడు. ఈక్రమంలో అతి చేతిలోని బ్లేడ్ తగిలి స్వప్న గాయపడింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు.. ఇద్దరిని గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

మెడికో హెల్త్‌కేర్‌కు 'శ్రీచైతన్య' విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

కరీంనగర్‌సిటీ: నగరంలోని మంకమ్మతోటలో గల శ్రీచైతన్య డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం మెడికో హెల్త్ కేర్ సర్వీస్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 21 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి తెలిపారు. 110 మంది చివరి సంవత్సరం విద్యార్థులు పాల్గొనగా వివిధ దశల్లో జరిగిన ఎంపిక ప్రక్రియలో 21 మంది ఉద్యోగాలు సాధించారని, వారికి వార్షిక వేతనం రూ.2.5లక్షలు ఉంటుందని అన్నారు. విద్యార్థులకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా తమ సంస్థ పనిచేస్తోందని, ఏటా దాదాపు 100 మంది వివిధ బహుళ జాతి సంస్థలకు ఎంపిక కావడమే దీనికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్ ఎల్.శ్రీనివాస్, వి.స్వర్ణలత, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, కళాశాల సిబ్బంది, కంపెనీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రానైట్ అసోసియేషన్ అడ్వయిజరీ కమిటీ ఎన్నిక

కొత్తపల్లి: గ్రానైట్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ జిల్లా తాత్కాలిక అడ్వయిజరీ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కొత్తపల్లి మండలం ఎలగందుల పంచాయతీ పరిధిలోని గ్రానైట్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం సభ్యులు సీహెచ్.శ్రీనివాస్, మధుసూదన్, అడ్వకేట్ వేణుగోపాల్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో 18 మంది సభ్యులతో కమిటీని నియమించారు. జిల్లా గ్రానైట్ ఇండస్ట్రీస్ అసోసియేషన్‌కు ఎన్నికలు జరిగే వరకు ఈ వర్కింగ్ కమిటీ పనిచేస్తుందని వారు ప్రకటించారు. అసోసియేషన్ సభ్యులుగా జువ్వాడి ప్రణీత్‌రావు, నరేస్ రాచకొండ, బూర సాగర్, గుడిపాటి సుదర్శన్‌రెడ్డి, విక్రం, టి.సతీష్‌రావు, పెద్ది సత్యనారాయణ, సోమినేని కనకయ్య, జుట్టు మధు, కె.సత్యనారాయణరెడ్డి, సోమినేని కరుణాకర్, ఆర్.మహేశ్‌కుమార్, షేక్ భాష, సిరి గోపాల్, సాగి సాగర్‌రావు, ఆర్.రామ్‌భూపాల్ రెడ్డి, టి.శ్యాంరావు, ఈశ్వర్‌రెడ్డి దువ్వాడిలు ఎన్నికయ్యారు.

గడువు దాటిన స్టాక్ విక్రయించొద్దు



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న డీఏవో

చొప్పదండి: మండల కేంద్రంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను డీఏవో శ్రీనివాస్ శుక్రవారం తనిఖీ చేశారు. ఎరువులు, విత్తనాల స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడువు దాటిన స్టాక్ విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విత్తనాలు, ఎరువుల వివరాలను ఎప్పటికప్పుడు స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట ఏవో వంశీకృష్ణ, డీలర్లు ఉన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



హుజూరాబాద్: పట్టణంలోని పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శుక్రవారం బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వీరబ్రహ్మేంద్రస్వామి సజీవ సమాధి జరిగి, 331 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నవగ్రహ పూజ, హోమం, బ్రహ్మంగారి సజీవ సమాధి ఘట్టం, పూజా కార్యక్రమాలను కోటగిరి ప్రవీణ్ శర్మ చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు కస్తూరి నరేంద్రాచారి, మునిగంటి నాగరాజు, రావుల వేణు, తేలుకుంట్ల వేణు, శ్రీను, రావుల భిక్షపతి, స్వర్ణకార సంఘం, మనుమయ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. స్వర్ణకార సంఘం అధ్యక్షుడు గుగ్గిల రాజేంద్రప్రసాద్, పాన్నోజు సుధాకరాచారి, రంగు పండరి, వలబోజు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య

- ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారికి వరం
- కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత విద్య, వసతికి అవకాశం
- ఎస్సెస్సీలో 7 జీపీఏ ఆపైన సాధించిన ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, దివ్యాంగ విద్యార్థులు అర్హులు
- 30 వరకు దరఖాస్తుల స్వీకరణ



కరీంనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేసి పదోతరగతిలో 7 జీపీఏకు పైగా సాధించిన విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ కోర్సును ఉచితంగా చదివే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. దరఖాస్తులను పరిశీలించి పదో తరగతిలో సాధించిన జీపీఏ, రిజర్వేషన్లను పరిగణనలోకి తీసుకొని 2024–25లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరేందుకు అవకాశం కల్పించనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్ చదివే అవకాశం దక్కించుకున్న విద్యార్థుల ఫీజును ప్రభుత్వం కళాశాల యాజమాన్యాలకు చెల్లిస్తుంది. ఒక్కొక్క విద్యార్థికి ఫీజు కింద రూ.35 వేలు, ఖర్చుల కింద ఏడాదికి రూ.3వేలు అందిస్తోంది. ఏటా కార్పొరేట్ కళాశాలల్లో చదివే అవకాశాన్ని కల్పిస్తుండటంతో ప్రతిభావంతులైన పేద విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు ఈ పథకం తోడ్పాటును అందిస్తోంది. మీ సేవా కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో ఈనెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించింది. దరఖాస్తు చేసుకునేటప్పుడు విద్యార్థులు ప్రాధాన్యత క్రమంలో మూడు కళాశాలలను ఎంపిక చేసుకోవాలి. జూన్ 3న తొలిజాబిత ప్రకటిస్తారు. 6వ తేదీ నుంచి ధ్రువపత్రాల పరిశీలన ఉంటుంది.

ఎంపిక ఇలా..

నిరుపేద కుటుంబాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ విద్యార్థులకు ఉచిత కార్పొరేట్ విద్యను అందించేందుకు ఈ పథకాన్ని ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. విద్యార్థులు పదోతరగతిలో సాధించిన జీపీఏతో పాటు రిజర్వేషన్ల ఆధారంగా ఎంపిక చేస్తారు. ఎంపిక చేసిన వారికి కేటాయించిన కార్పొరేట్ కళాశాలల వివరాలతో సమాచారం పంపిస్తారు. ఎంపికైన విద్యార్థులు అన్ని ధ్రువీకరణ పత్రాలతో కళాశాలకు వెళ్లి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో నిర్ణీత గడువులోగా చేరాల్సి ఉంటుంది.

నియమ నిబంధనలు

తల్లి దండ్రుల వార్షిక ఆదాయ పత్రాన్ని దరఖాస్తుతో జతచేయాలి. గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షలు వార్షికాదాయం మించరాదు. కుల, స్థానిక ధ్రువపత్రాలు జత చేయాలి. దివ్యాంగులు వైకల్యానికి సంబంధించిన ధ్రువపత్రం అందజేయాలి. బ్యాంకు పాస్‌బుక్, రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల వసతి గృహాల విద్యార్థులు మూడు సంవత్సరాల బోనోఫైడ్ ధ్రువీకరణ పత్రం విధిగా జత చేయాలి.

అర్హులు వీరే..

- ఈ విద్యాసంవత్సరం పదో తరగతి పరీక్షల్లో 7 జీపీఏకు పైగా సాధించాలి.
- ప్రభుత్వ, జెడ్పీ, ఎయిడెడ్, కేజీబీవీ, నవోదయ, గురుకులాలు, ఆదర్శ పాఠశాలలు, బెస్ట్ అవైలబుల్ పథకం కింద చదివిన విద్యార్థులు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, మైనార్టీ, ఈబీసీ వర్గాలకు చెందిన వారై ఉండాలి.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 7 జీపీఏపైగా గ్రేడ్ సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. సీట్లు కేటాయింపబడ్డ విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలలో సీట్లతో పాటు అన్ని వసతులకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది. 2024–25 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఈనెల 30 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

– నేతానియల్, ఎస్సీ సంక్షేమ శాఖ డీడీ

క్రైస్తవ ఉజ్జీవ మహాసభలు



కరీంనగర్‌కల్చరల్: నగరంలోని సెయింట్ మార్క్స్ చర్చి గ్రౌండ్‌లో శుక్రవారం సీఎస్ఐ సంఘాల ఆధ్వర్యంలో క్రైస్తవ ఉజ్జీవ మహాసభలు ప్రారంభమయ్యాయి. జాతీయ, అంతర్జాతీయస్థాయిలో విశేష ఆదరణ కలిగిన బ్రదర్ జెన్నీ క్రిస్టాఫర్ మాట్లాడుతూ క్రీస్తు చూపించిన మార్గంలో నడిస్తే భూమి భూపల స్వర్గం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రూబెన్ మార్క్, ప్రిసిల్ల పరిమళ రూబెన్ మార్క్, పాల్ కొమ్మాలు, ఎస్.జాన్, ఆర్.ప్రసాద్, బి.ప్రసాద్, ఎ.మధుమోహన్, డీకన్ పింటు, డీకన్ రోజి, రెనాల్డ్, పాస్టర్ తిమోతి, పాస్టర్ క్రిస్టాఫర్, ఇండిపెండెంట్ పాస్టర్స్, స్థానిక సంఘాల పెద్దలు, ఇవాంజిలిస్టులు పాల్గొన్నారు.

ఇటుకలకు రక్షణగా టార్పాలిన్లు



కరీంనగర్‌రూరల్: అకాల వర్షాలు అన్నదాతలనే కాకుండా ఇటుక బట్టీల వ్యాపారులను సైతం కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. కరీంనగర్ మండలంలోని మొగ్దుంపూర్, చెర్లభూత్కూర్, నగునూరు తదితర గ్రామాల్లోని ఇటుకబట్టీల నిర్వాహకులు వేసవికాలంలో ఒడిస్సా, ఛత్తీస్‌ఘడ్ కార్మికులతో ఇటుకలను తయారీ చేయిస్తారు. గతంలో అకాల వర్షాలతో ఇటుకలు తడిసిపోవడంతో బట్టీల నిర్వాహకులు ఆర్థికంగా నష్టపోయారు. వర్షాల భయంతో ఇటుకలు తడిసిపోకుండా రక్షణగా టార్పాలిన్లు, కవర్లు కప్పారు.

అకాల వర్షంతో ఆందోళన



జూబ్లీనగర్‌లో ధాన్యం కుప్పలపై నీళ్లు



జూబ్లీనగర్‌లో వృథాగా ఉన్న కాంటాలు

- కొనుగోలు కేంద్రాల్లో నిలిచిన కాంటాలు

కరీంనగర్‌రూరల్: రైతులకు వరిపంట పండించడం ఒక ఎత్తయితే, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించడం మరొక ఎత్తవుతోంది. అకాల వర్షాలు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. గురువారం సాయంత్రం, రాత్రి వేళల్లో కురిసిన వర్షంతో శుక్రవారం కరీంనగర్ మండలంలోని పలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. చెర్లభూత్కూర్, జూబ్లీనగర్, దుబ్బపల్లి గ్రామాల్లోని కేంద్రాల్లో నిర్వాహకులు కాంటా పెట్టలేదు. రైతులు తడిసిన ధాన్యం ఆరబెట్టేందుకు పడరానీపాట్లు పడుతున్నారు. ధాన్యం కుప్పలపై కప్పిన టార్పాలిన్లను తొలగించి ధాన్యం ఆరబెట్టారు. తేమ ఎక్కువగా ఉందంటూ కాంటా పెట్టకపోవడంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోయిందని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. నగునూరులో గురువారం కురిసిన వర్షానికి 1500 బస్తాల లోడింగ్ నిలిచిపోయింది. శుక్రవారం కాంటా పెట్టడంతో మొత్తం 3500 బస్తాలు, వ్యవసాయ మార్కెట్‌లో 2వేల బస్తాలను హమాలీలు లారీల్లో లోడింగ్ చేసి పంపించారు. అయితే వర్షాలకు ధాన్యం తడవడంతో పాటు ఆలస్యంగా వరికోతలతో ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉండటంతో జూబ్లీనగర్, దుబ్బపల్లి, చెర్లభూత్కూర్‌లో కాంటా పెట్టడం లేదని కరీంనగర్ సింగిల్‌విండో సీఈవో రమేశ్ తెలిపారు.



జూబ్లీనగర్‌లో తడిసిన ధాన్యం ఆరపెడుతున్న రైతు

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి



నగునూరులో రైతులతో మాట్లాడుతున్న రజనీకాంత్

కరీంనగర్‌రూరల్: కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం బస్తాలను వెంటనే రైసుమిల్లులకు తరలించాలని సివిల్ సప్లయి డీఎం రజనీకాంత్, డీఎస్‌వో సురేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కరీంనగర్ మండలం నగునూరు, వ్యవసాయ మార్కెట్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి తడిసిన ధాన్యం బస్తాలను పరిశీలించారు. రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నగునూరులో త్వరగా కాంటా పెట్టాలని నిర్వాహకులకు సూచించారు. ప్రస్తుతం మూడు రైసుమిల్లులకు ధాన్యం తరలిస్తుండగా అదనంగా మరో రెండు మిల్లులను కేటాయిస్తున్నట్లు తెలిపారు. అకాల వర్షాల దృష్ట్యా కాంటా పెట్టిన వెంటనే ధాన్యం బస్తాలను లారీల్లో రైసుమిల్లులకు తరలించేందుకు తగిన చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ సింగిల్‌విండో సీఈవో రమేశ్, డైరెక్టర్ సాయిల్ల మహేందర్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

నవధాన్యాలు చల్లుకుంటే మేలు

ఇల్లందకుంట: భూమిలో నవధాన్యాలు చల్లుకుంటే ఎంతో మేలని భారత సుస్థిర సంస్థ క్షేత్ర సహాయకుడు రావుల రాకేశ్ అన్నారు. శుక్రవారం ఇల్లందకుంట మండలం రాచపల్లిలో పెనుకుల దేవేందర్ వ్యవసాయ క్షేత్రంలో సంస్థ ఆధ్వర్యంలో నవధాన్యాలు చల్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవధాన్యాలు వేసుకోవడం వల్ల భూమిలో సేంద్రియ కర్బనం పెరుగుతుందని తెలిపారు. గొర్రెలు, పశువుల ఎరువు, చెరువు మట్టి చల్లితే సూక్ష్మజీవుల సంఖ్య పెరిగి, నేల సారవంతం అవుతుందని పేర్కొన్నారు. వరి కొయ్యకాలును కాల్చడం వల్ల భూమికి మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయని, కాల్చకుండా నేలలోనే కలియదున్నాలని సూచించారు. సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

మట్టి ట్రాక్టర్లు సీజ్

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామంలో శుక్రవారం అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు కేశవపట్నం ఎస్సై లక్ష్మారెడ్డి తెపారు. మైనర్లు ట్రాక్టర్లను నడపడాన్ని గమనించిన స్థానికులు తమకు సమాచారం ఇచ్చారన్నారు. వెంటనే తనిఖీలు చేపట్టి, పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

చొప్పదండి: పట్టణంలోని అంగడి బజార్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ కమిసనర్ నాగరాజు శుక్రవారం ప్రారంభించారు. వారసంతకు వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు దారుల్ ఖైర్ సొసైటీ సభ్యులు దీన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జహీరుద్దీన్, అబిద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

పవర్ కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: కరీంనగర్‌లోని సబ్‌స్టేషన్‌లలో నెలవారి విద్యుత్ మరమ్మతు పనులతో పాటు విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు 33/11 కేవీ బ్యాంక్ కాలనీ, వావిలాలపల్లి, వాటర్ వర్క్స్, ఉజ్వల పార్కు, సప్తగిరికాలనీ సబ్‌స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–1, 2 ఏడీఈలు ఎస్.నరేందర్, ఎం.సుధీర్ కుమార్ తెలిపారు. అదేవిధంగా ఉదయం 8 నుంచి 10 గంటల వరకు 11కేవీ సంతోష్‌నగర్ ఫీడర్ పరిధిలో వార్షిక మరమ్మతులో భాగంగా దెబ్బతిన్న ఇన్సూలేటర్ల మార్పు, క్రాస్ ఆర్మ్స్ తదితర నిర్వహణ పనులు చేపడుతున్నందున కొత్త లేబర్ అడ్డా, సెయింట్ జాన్స్ స్కూల్, శివ థియేటర్, భాగ్యనగర్, జ్యోతినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ తెలిపారు.

కొత్తపల్లి, రూరల్ పరిధిలో..

విద్యుత్ సబ్‌స్టేషన్లలో నెలవారి విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు 33/11 కేవీ కొత్తపల్లి, రేకుర్తి, బొమ్మకల్, నగునూర్, శాతవాహన యూనివర్సిటీ, చెర్లభూత్కూర్, మొగ్దుంపూర్, సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కరీంనగర్ రూరల్ ఏడీఈ కొలుపుల రాజు తెలిపారు.

పంట పెట్టుబడికి నిరీక్షణ

- 'పీఎం కిసాన్ నిధి' కింద ఏటా రూ.6 వేలు ఇస్తున్న కేంద్రం
- ఐదేళ్లుగా కొత్త రైతులకు అందట్లే..
- వ్యవసాయాధికారి కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు
- కరీంనగర్ మండలంలో పరిస్థితి



ఈ–కైవేసీ నమోదు దరఖాస్తు స్వీకరిస్తున్న ఏఈవో స్వర్ణలత (ఫైల్)

కరీంనగర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం రైతులకు పంట పెట్టుబడి సాయాన్ని అందించేందుకు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన ప్రారంభించింది. ఐదెకరాలలోపు ఉన్న భూమి ఉన్న రైతులకు ఏటా మూడు విడతల్లో రూ.2 వేల చొప్పున మొత్తం రూ.6 వేలు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. అయితే, ప్రభుత్వ నిబంధనతో కొత్త రైతులకు పెట్టుబడి సాయం అందని ద్రాక్షగా మారింది. 2019 ఫిబ్రవరి 1 వరకు కటాఫ్ తేదీగా నిర్ణయించడమే ఇందుకు కారణం. 2019 తర్వాత భూములు కొనుగోలు చేసి, కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు పొందినవారు సమ్మాన్ నిధికి దరఖాస్తు చేసుకున్నప్పటికీ పెట్టుబడి సాయం మంజూరవడం లేదు. పలువురు రైతులు వ్యవసాయాధికారి కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది.

656 మందికి రావట్లే..

కరీంనగర్ మండలంలో మొత్తం 5,250 మంది రైతులు కిసాన్ సమ్మాన్ నిధి కింద ప్రయోజనం పొందుతున్నారు. మొదటి విడతలో 6,322 మందికి సాయం అందింది. తర్వాత కేంద్ర ప్రభుత్వ నిబంధనల కారణంగా ఆ సంఖ్య 5,250 మందికి తగ్గింది. అయితే, పలువురు రైతులకు సరైన అవగాహన లేకపోవడంతో సాయానికి నోచులేకపోతున్నారు. ఆధార్ నంబర్‌కు మొబైల్ నంబర్ లింకేజీ చేయకపోవడం, పీఎం కిసాన్‌కు ఒకటి కంటే ఎక్కువ ఫోన్ నంబర్లు లింక్ చేయడం, రద్దు చేసిన బ్యాంకు ఖాతాలను తొలగించకపోవడం, బ్యాంకు ఖాతాలకు ఆధార్ లింక్ లేకపోవడం, ఈ–కేవైసీ చేసుకోకపోవడంతో పెట్టుబడి సాయానికి దూరమవుతున్నారు. ప్రస్తుతం 656 మంది రైతులకు పలు కారణాలతో పెట్టుబడి అందడం లేదు.

గైడ్‌లైన్స్ విడుదల చేయలేదు

కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజనలో కొత్త రైతుల వివరాలను నమోదు చేసేందుకు గైడ్‌లైన్స్ విడుదల చేయలేదు. 2019 కంటే ముందు పట్టాదారులైన రైతులకు మాత్రమే డబ్బులు మంజూరవుతున్నాయి. విరాసత్ పొందినవారికి అవకాశముంది. కటాఫ్ తేదీ తొలగిస్తే కొత్త రైతులకు లబ్ధి చేకూరుతుంది.

– బి.సత్యం, మండల వ్యవసాయాధికారి, కరీంనగర్

అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలి



మాట్లాడుతున్న వాసుదేవరెడ్డి

హుజూరాబాద్: రైతులు పండించిన అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని, అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం హుజూరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సన్న వడ్లకే రూ.500 బోనస్ చెల్లించనున్నట్లు ప్రకటనలు వస్తున్నాయన్నారు. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నా ప్రభుత్వ యంత్రాంగం అందుకు తగ్గట్లు చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. రాష్ట్ర రైతులు 80 శాతం దొడ్డు వడ్లను, 20 శాతం మాత్రమే సన్న వడ్లను పండిస్తారనిన్నారు. కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో బోనస్ విషయమై సన్న, దొడ్డు వడ్లు అంటూ ఎక్కడా ప్రస్తావించలేదని తెలిపారు. అన్ని రకాల వడ్లకు బోనస్ చెల్లించాలని, ఈ యాసంగి సీజన్ నుంచే వర్తింపజేయాలని, మామిడి రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు. జిల్లా కమిటీ సభ్యులు వెలమారెడ్డి రాజిరెడ్డి, జిల్లా నాయకుడు గుండేటి వాసుదేవ్, మండల నాయకులు ఎండీ.హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చని తోరణం.. పూలహారం

కరీంనగర్ మండలం మొగ్దుంపూర్–నగునూరు రహదారి పచ్చదనంతో ఆకట్టుకుంటోంది. హరితహారంలో రోడ్డుకు ఇరువైపుల గతంలో నాటిన మొక్కలు ప్రస్తుతం వృక్షాలుగా మారి చల్లటి నీడనిస్తున్నాయి. రహదారికి ఇరువైపులా పచ్చదనం, పూలచెట్లతో వాహనదారులకు కనువిందు చేస్తోంది. చెర్లభూత్కూర్ సమీపంలో గుల్‌మోహర్ చెట్లు కాషాయవర్ణం పూలతో, జూబ్లీనగర్ శివారులో రోడ్డుకు ఇరువైపుల ఉన్న భారీ వృక్షాలు ఆకట్టుకుంటున్నాయి. వేసవి ఎండలో ఈ దారి వెంట ప్రయాణించే ద్విచక్రవాహనదారులు, భారీ వాహనాల డ్రైవర్లకు నీడ, చల్లదనం, ఆహ్లాదం పంచుతున్నాయి. – కరీంనగర్‌రూరల్



జూబ్లీనగర్ రోడ్డులో ఇరువైపులా పెరిగిన చెట్లు



చెర్లభూత్కూర్ రహదారిలోని గుల్‌మోహర్ పూలు

మంత్రి ఉత్తమ్ రాజీనామా చేయాలి

ఈ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోంది: బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బంది పెడుతోందని, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను రకరకాలుగా మోసం చేస్తోందని, ధాన్యం కొనుగోలు చేయకుండా గోస పెడుతోందని మండి పడ్డారు. రైతులు ధాన్యాన్ని కల్లాల్లో పోసుకుని ఎదురు చూస్తున్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సమయానికి ధాన్యం కొనుగోలు చేయడం లేదన్నారు. శుక్రవారం బీజేపీ ఎమ్మెల్యేలు పైడి రాకేశ్‌రెడ్డి, రామారావు పటేల్, డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబులతో కలసి మహేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా స్పందించడం లేదన్నారు. ఆయనకు వ్యవసాయంపై అవగాహన లేదని.. ఇదంతా చూస్తుంటే. రైస్ మిల్లర్లతో ప్రభుత్వానికి లావాదేవీలు ఉన్నాయా? అన్న అనుమానం కలుగుతోందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లంచాలు తీసుకుంటున్నారని, త్వరలోనే ఆధారాలు బయట పెడతామని చెప్పారు. ఐదెకరాల వరకే రైతు భరోసా అని చెప్పడం కూడా మోసం చేయడం కాదా? అని ప్రశ్నించారు.

కిషన్‌రెడ్డిది ఓట్ల ఆరాటమే!

టీపీసీసీ కిసాన్ సెల్ నేతలు కోదండరెడ్డి, అన్వేశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి బాధ్యతా రాహిత్యంగా మాట్లాడుతున్నారని టీపీసీసీ కిసాన్ సెల్ ధ్వజమెత్తింది. ఏఐసీసీ కిసాన్‌సెల్ వైస్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, టీపీసీసీ కిసాన్ సెల్ అధ్యక్షుడు ఎస్.అన్వేశ్‌రెడ్డి శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కరువు ఏర్పడిందని, భూగర్భజలాలు అడుగంటిపోయి రైతు కూలీలకు ఉపాధి కరువైన పరిస్థితులు నెలకొన్నా కిషన్‌రెడ్డి కనీసం సమీక్ష నిర్వహించలేదని విమర్శించారు. రాష్ట్రంలో ప్రకృతి విపత్తు కారణంగా 97మంది చనిపోతే వారిని ఆదుకోవాలని రాష్ట్ర ప్రభు త్వం కేంద్రాన్ని కోరిందని, అయినా కిషన్‌రెడ్డి మాత్రం కనీసం ప్రధానికి ఒక్క లేఖ కూడా రాయలేదని దుయ్యబట్టారు. ఆయన ఆరాట మంతా ఓట్ల కోసం మాత్రమేనని, ప్రజల కోసం కాదని విమర్శించారు. బీఆర్‌ఎస్ నేత లు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్ నాం చేసే పనిలో పడ్డారని కోదండరెడ్డి, అన్వేశ్ రెడ్డిలు విమర్శించారు.



భద్రాద్రి జిల్లా ఇల్లెందు మండలం పోలారంలో నేలవాలిన వరి



ఆసిఫాబాద్ జిల్లా ఎల్లూర్‌లోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడవకుండా కాలువ తీస్తున్న రైతు

ధాన్యం.. దయనీయం

- అన్నదాతను దెబ్బతీసిన అకాల వర్షాలు.. తడిసిపోయిన కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం
- కొన్నిచోట్ల ధాన్యం రాశులు కొట్టుకుపోయిన వైనం
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న రైతులు

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాలతో రైతులు అతలాకుతలం అవుతున్నారు. గత రెండురోజులుగా పలు జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా గురు, శుక్రవారాల్లో పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. దీంతో కోత దశలో ఉన్న వరి పంట నేలవాలింది. ముఖ్యంగా కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లో ఉన్న ధాన్యం రాశులు తడిచిపోయాయి. భద్రాద్రి కొత్తగూడెం, కామారెడ్డి జిల్లాల్లోని పలు మండలాల్లో.. కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం రాశులు తడిచిపోయాయి. ఇంతకుముందు వర్షానికి తడవడంతో ఆరబోసుకున్న వడ్లు వర్షపు నీటికి కొట్టుకుపోయాయని రైతులు వాపోయారు. సిద్దిపేట జిల్లా తొగుట మండలంలో మార్కెట్ యార్డు, కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిచిపోయింది. మహబూబాబాద్, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో కూడా వర్షం కారణంగా రైతులకు నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి కరీంనగర్‌లోని పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో శుక్రవారం సుమారు గంటపాటు ఏకధాటిగా వర్షం కురిసింది. పలు మండలాల్లో క్వింటాళ్ల కొద్దీ వడ్లు తడిచిపోయాయి. ఖమ్మం, మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలకు మామిడి కాయలు రాలిపోయాయి. ప్రభుత్వం నష్టాన్ని అంచనా వేయాలని, కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.



భువనగిరి జిల్లా రహీంఖాన్‌పేట కొనుగోలు కేంద్రంలో కాంటా వేసిన ధాన్యం బస్తాలు తడిసిపోయిన దృశ్యం

రైతులను పట్టించుకోకుండా విహారయాత్రలా?

బీజేపీ ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీశ్‌బాబు



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ముగియగానే రాష్ట్ర మంత్రులు విహార యాత్రలకు వెళుతున్నారే కానీ రైతుల సమస్యలను పట్టించుకునేవారు కరువయ్యారని సిర్పూర్ బీజేపీ ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీశ్‌బాబు మండిపడ్డారు. ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలు తెరిచి నెల రోజులు గడిచిన 25శాతం మాత్రమే కొనుగోలు చేశారని, దీనిపై గత 15 రోజులుగా అధికారులకు ఫోన్ చేస్తే ఎన్నికల తర్వాత అని చెప్పారన్నారు. దీనికి సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహిస్తున్న సమీక్షల వల్ల ఏ మాత్రం ఉపయోగం ఉండటం లేదన్నారు. వ్యవసాయ శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష చేస్తే ఆ శాఖ మంత్రే వెళ్లలేదన్నారు.

ఎప్పుడు పడితే అప్పుడు రావడానికి మాకు భార్యాపిల్లలు లేరా?

- కల్లాల్లో పేరుకుపోయిన ధాన్యాన్ని రవాణా చేయాలంటూ వారం రోజులుగా రైతుల ఆందోళన
- తమ ఆందోళన గురించి వివరించడానికి వెళ్తే తహసీల్దార్ నిర్లక్ష్యపు వ్యాఖ్యలు.. రాస్తారోకోకు దిగిన రైతులు



పోలీసులతో రైతుల వాగ్వాదం

పాపన్నపేట (మెదక్): ధాన్యం రవాణా చేయాలని కోరుతూ వారం రోజుల నుంచి రైతులు ఆందోళన చేస్తున్నా అధికారుల నుంచి స్పందన కరువైంది. వారి ఆందోళనను పట్టించుకోకపోగా ఓ తహసీల్దార్ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. మెదక్ జిల్లా పాపన్న పేట సమీపంలో మిన్‌పూర్‌లో శుక్రవారం జరిగిన ఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో వారం రోజులుగా రవాణా జరగక వందలాది క్వింటాళ్ల ధాన్యం కల్లాల్లో పేరుకుపోయింది. అయితే గురువారం రాత్రి కురిసిన వర్షానికి ధాన్యం తడిసి మొలకలెత్తాయి. దీంతో ధాన్యం రవాణా చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు పాపన్నపేట తహసీల్దార్ లక్ష్మణ్‌బాబుకు రైతుల ఆందోళన గురించి వివరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ 'ఎప్పు డంటే అప్పుడు వచ్చేయడానికి మాకు మాత్రం భార్యా పిల్లలు లేరా' అంటూ నిర్లక్ష్యంగా సమాధానమివ్వడంతో ఆగ్రహించిన రైతులు బొడ్మట్‌పల్లి రోడ్డుపై రాస్తారోకో చేశారు. దీంతో రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఎస్సై సురేశ్ అక్కడకు చేరుకుని రైతులకు నచ్చజెప్పినప్పటికీ ఆందోళన విరమించలేదు. పోలీ సులు ఫోన్ చేసి తహసీ ల్దార్‌ను ఘటనా స్థలానికి పిలిపించారు. రైతులతో తహసీల్దార్ కొద్దిసేపు మాట్లాడి వారికి క్షమాపణ చెప్పారు. అదేవిధంగా గంటలో ధాన్యం రవాణా ప్రారంభిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.



రైతులకు క్షమాపణ చెబుతున్న తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు

ప్రకృతి సేద్యంతోనే పౌష్టికాహార భద్రత

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన 8 రాష్ట్రాల శాస్త్రవేత్తలు



శాస్త్రవేత్తలకు ప్రకృతి సాగు విశేషాలను వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ నిపుణుడు జగదీశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ప్రకృతి వ్యవసాయ విస్తరణ ద్వారానే భవిష్యత్తులో దేశ ప్రజలకు సంపూర్ణ పౌష్టిక విలువలు కలిగిన ఆహార భద్రత, రైతులకు ఆదాయ భద్రత చేకూరు తుందని ప్రకృతి వ్యవసాయ దారుడు, న్యూఢిల్లీలోని భారతీయ వ్యవసాయ పరిశో ధనా సంస్థ (ఐఏఆర్‌ఐ) నుంచి నేష నల్ ఇన్నోవేటివ్ ఫార్మర్ పురస్కార గ్రహీత వై.జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం గట్టుపల్లిలోని 60ఎకరాల ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని శుక్రవారం 8 రాష్ట్రాలకు చెందిన కృషి విజ్ఞాన కేంద్రాలలో పనిచేస్తున్న 54 మంది వ్యవసాయ శాస్త్రవేత్తలు సందర్శించారు. రాజేంద్రనగర్‌లోని భారతీయ వ్యవసాయ విస్తరణ యాజమాన్య సంస్థ (మేనేజ్)లో ఈ శాస్త్రవేత్తలు ప్రకృతి వ్యవసాయ విస్తరణపై 5 రోజుల శిక్షణ పొందుతూ క్షేత్రస్థాయి పర్యటనకు వచ్చారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత సుభాష్ పాలేకర్ పద్ధ తుల్లో ఈ క్షేత్రంలో ఘనజీవామృతం, జీవామృతం, కషాయాలతో అనేక రకాల పండ్ల తోటలతోపాటు వరి, కూరగాయలు సాగు చేస్తున్నామని జగదీశ్‌రెడ్డి శాస్త్ర వేత్తలకు వివరించారు. కొర్ర మీను చేపలు, నాటు కోళ్లు, ఆవుల పెంపకం ద్వారా బహుముఖ ఆదాయం పొందటం ద్వారా రైతులు ఆదాయాన్ని పెంచుకోవచ్చన్నారు. శాస్త్రవేత్తల బృందానికి మేనేజ్ శాస్త్రవేత్త, కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ సంతోష్ నేతృత్వం వహించారు. మేనేజ్ ద్వారా 425 కేవీకేల శాస్త్రవేత్తలకు ప్రకృతి వ్యవసాయ శిక్షణ ఇస్తున్నామని, ఇప్పటికి పది బ్యాచ్‌లకు శిక్షణ పూర్తిచేశామని సంతోష్ తెలిపారు.

అనాథలు 'కారా'దని..!

- చట్టబద్ధంగా బాలబాలికల దత్తత
- దశాబ్దకాలంలో 36,857 మంది చిన్నారులు
- విదేశాలకు 5,457మంది
- వీరిలో ఆడపిల్లలే అధికం



సాక్షి, మంచిర్యాలడెస్క్: అనాథ పిల్లలు, సంతానం లేని దంపతులకు మధ్య కారా(సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ) వారధిగా నిలుస్తోంది. చట్టబద్ధమైన దత్తత ద్వారా పిల్లలకు అమ్మానాన్నలను, దంపతులకు పిల్లలను అందిస్తూ కుటుంబ బంధం ఏర్పరుస్తోంది. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో స్వయంప్రతిపత్తితో కారా వ్యవహరిస్తోంది. దత్తతను సులభతరం చేయడానికి 1990లో ఏర్పాటైంది. ప్రతీయేటా ఆర్థిక సంవత్సరంలో కారా నివేదిక వెల్లడిస్తుంది. ఇటీవల వెల్లడైన ఆ నివేదిక ప్రకారం .. గత దశాబ్ద కాలంలో దేశంలోని రాష్ట్రాల్లో ఉన్న స్టేట్ అడాప్షన్ రిసోర్స్ ఏజెన్సీలు, జిల్లాల్లోని బాలల సంరక్షణ అధికారుల ఆధ్వర్యంలో 36,857మంది ఆడ, మగపిల్లలను దత్తత ఇచ్చారు. విదేశాలకు దత్తత ఇచ్చిన వారిలో 5,457మంది ఉన్నారు.

బాలికలే అధికం

అధిక సంతానం, మరో ఆడపిల్లను పోషించలేమనో కొందరు పిల్లలను శిశుగృహకు అప్పగిస్తున్నారు. వివాహేతర సంబంధమో, మళ్లీ ఆడపిల్ల జన్మించిందనో, కారణమేమిటో గానీ మరికొందరు చెత్తకుప్పల్లో పడేస్తున్నారు. ఇలా చాలామంది అనాథలుగా మారి శిశుగృహకు చేరుతున్నారు. బాలల సంరక్షణ అధికారుల ఆధ్వర్యంలో శిశుగృహాల్లో పిల్లల ఆలనా పాలనా చూస్తున్నారు. సంతానం లేని, సంతానం కలిగే యోగ్యం లేని వారు కారా వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే ప్రాధాన్యత క్రమంలో పిల్లలను చట్టబద్ధంగా దత్తత ఇస్తున్నారు. ఇలా దత్తత ఇస్తున్న వారిలో ఆడపిల్లలే అధికంగా ఉంటున్నారు. గత దశాబ్ద కాలంలో దేశంలో దత్తత ఇచ్చిన వారిలో 19,587మంది, విదేశీయులు దత్తత తీసుకున్న వారిలో 3,111మంది ఆడపిల్లలు ఉన్నారు. వీరిలో తెలంగాణకు చెందిన 938మందిని దేశంలో దత్తత తీసుకోగా, 205మందిని విదేశీయులు దత్తత తీసుకున్నారు.

మహారాష్ట్ర నుంచే ఎక్కువ..

దేశంలోని మహారాష్ట్ర రాష్ట్రం నుంచి గత దశాబ్ద కాలంలో ఎక్కువ మంది బాలబాలికలను దత్తత ఇచ్చారు. దేశంలో గానీ, విదేశాలకు గానీ దత్తతలో మహారాష్ట్ర మొదటి స్థానంలో ఉండగా పశ్చిమబంగాల్, కర్ణాటక ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. మహారాష్ట్ర నుంచి గత దశాబ్ద కాలంలో 7,484మంది దేశంలో దత్తత ఇవ్వగా, 1,219మందిని విదేశీయులు దత్తత తీసుకున్నారు.

భారీగా దరఖాస్తులు

2024–25 ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా 458మందిని దత్తత ఇచ్చారు. వీరిలో 385మందిని దేశంలో, 28మందిని విదేశీయులు దత్తత తీసుకున్నారు. దత్తత కోసం కారా వెబ్‌సైట్‌కు 34,322మంది దరఖాస్తు చేసుకున్నారు. 2,158మంది పిల్లల దత్తతకు సిద్ధంగా ఉండగా, వీరిలో 746మంది సాధారణ పిల్లలు, 1,412మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఉన్నారు.

తెలంగాణకు సంబంధించిన వారి సంఖ్య..

	దేశంలో..		విదేశాలకు..	
	మగపిల్లలు	ఆడపిల్లలు	మగపిల్లలు	ఆడపిల్లలు
2013–14	0	0	–	14
2015–16	76	163	6	17
2016–17	24	125	5	37
2018–19	34	117	17	50
2019–20	32	81	4	12
2020–21	41	85	9	12
2021–22	61	117	13	19
2022–23	60	129	17	19
2023–24	56	121	14	25
	384	938	85	205

2017–18లో దేశంలో 141మందిని, విదేశీయులు 45మంది బాలబాలికలను దత్తత తీసుకున్నారు.

చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు

- జూలైలో నిర్వహణకు ఏర్పాట్లు
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 30 సంఘాలు
- చేనేతకార్మికుల సంఖ్య 1,035 మంది



సిరిసిల్లలోని చేనేత సహకార సంఘం

సిరిసిల్ల: చేనేత సహకార సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. చేనేత సహకార సంఘాలకు జూలైలో ఎన్నికల నిర్వహణకు చేనేత, జౌళిశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఐదేళ్లకోసారి నిర్వహించాల్సిన చేనేత సహకార సంఘాల ఎన్నికలను పాలకులు విస్మరించారు. కానీ ఇప్పుడు ఎన్నికలకు ఆదేశాలు అందడంతో అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 30 చేనేత సహకార సంఘాలు ఉండగా.. జియో ట్యాగ్ చేసిన చేనేతమగ్గాలు 1,949 ఉన్నాయి. వీటిపై ప్రస్తుతం 1,035 చేనేతకార్మికులు పని చేస్తున్నారు. వీటి అనుబంధంగా మరో 650 మంది పని చేస్తున్నారు. చేనేత సహకార సంఘాల్లో వీరంతా సభ్యులుగా ఉండి.. ఓటుహక్కు కలిగి ఉంటారు.

11 ఏళ్ల కిందట ఎన్నికలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 2013లో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు జరిగాయి. 2018 ఫిబ్రవరి 12వ తేదీతో ఆ పాలకవర్గాల గడువు ముగిసిపోయినా.. కొన్ని సంఘాలను పర్సన్ ఇన్‌చార్జీలు, కొన్నింటిని పాత పాలకవర్గాల వారే నిర్వహిస్తున్నారు. 2023 ఆగస్టు 12వ తేదీతో అన్ని పాలకవర్గాల పదవీకాలం ముగిసిపోయినా.. ప్రభుత్వం పొడగింపు ఉత్తర్వులు ఇవ్వలేదు. ఎన్నికల ప్రక్రియను చేపట్టలేదు. ఫలితంగా జిల్లాలో చేనేత సహకార సంఘాలకు పాలకవర్గాల ఎన్నికల అనివార్యమైంది. వ్యవసాయ సహకార సంఘాల(సింగిల్‌విండో) ఎన్నికలతో చేనేత సహకార సంఘాల ఎన్నికల నిర్వహించాల్సి ఉండగా.. ప్రభుత్వం ఆ ఊసే లేకుండా వాయిదా వేసింది. ఫలితంగా చేనేత కార్మికులు ఓటింగ్‌కు దూరం కాగా.. చేనేత సంఘాల అభివృద్ధి కుంటుపడింది.

క్షీణించిన చేనేతరంగం

సిరిసిల్లలో చేనేతరంగం ఒకప్పుడు బాగా విస్తరించి ఉండేది. 1980 దశకంలో 10వేల చేనేత మగ్గాలు ఉండేవి. ప్రస్తుతం సిరిసిల్లలో 175 చేనేత మగ్గాలు ఉండగా.. ఆరు సంఘాలు ఉన్నాయి. వీటి పరిధిలో 65 మంది కార్మికులు ఉన్నారు. చాలా మంది చేనేత కార్మికులు ఇప్పటికే మరణించారు. కొత్తతరం చేనేతకు దూరం కావడంతో వృద్ధులు మాత్రమే చేనేత మగ్గాలపై కాటన్ వస్త్రాన్ని నేస్తున్నారు. ప్రస్తుతం చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహణకు ప్రభుత్వం సిద్ధమైన నేపథ్యంలో ఓటర్ల జాబితాను అధికారులు సిద్ధం చేస్తున్నారు. చేనేత సహకార సంఘాలను బలోపేతం చేసే లక్ష్యంతో ప్రభుత్వం ముందుగా చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని భావిస్తుంది. ఈమేరకు జూలై ఎన్నికల నిర్వహణకు సన్నాహాలు సాగుతున్నాయి.

ఆత్మవిశ్వాసం సాధికారతకు కీలకం

- ఎన్టీపీసీ కృషి అభినందనీయం
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



సహస్రను అభినందిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఈడీ రంజన్‌పాండు

జ్యోతినగర్(రామగుండం): ఆత్మవిశ్వాసం సాధికారతకు కీలకమని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. ఎన్టీపీసీ కాకతీయ ఆడిటోరియంలో బాలికా సాధికారత మిషన్–2024లో శిక్షణ పొందుతున్న 120 మంది బాలికలతో సీఎస్సార్–సీడీ ద్వారా ఏర్పాటు శుక్రవారం చేసిన సదస్సును ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు ఈడీ కేదార్ రంజన్ పాండుతో శుక్రవారం ఆయన ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ, బాలికను చదివిస్తే కుటుంబం అంతా బాగుపడుతుందన్నారు. తన కుటుంబంలో అమ్మమ్మ ఆ కాలంలో చదువు ప్రాముఖ్యత గుర్తించి లా కోర్సు పూర్తి చేశారని, తన అమ్మ చదివించిందని, ఆ మెతోనే తమ కుటుంబమంతా బాగుపడిందని కలెక్టర్ అన్నారు. ఆడపిల్లలను మగపిల్లలతో సమానంగా చూడాలని కోరారు. ఎన్టీపీసీలో ప్లాంట్ ఏర్పాటు, భూసేకరణ అంశంలో తన తండ్రి కూడా విధులు నిర్వహించారని ఆయన గుర్తుచేశారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ మాట్లాడుతూ, సంస్థ అందిస్తున్న శిక్షణను బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాలికలకు జ్ఞానం, నైపుణ్యంతోపాటు ఆత్మవిశ్వాసం పెంపొందుచుకోవాలని కోరారు. జెమ్ శిక్షణ పొంది, ఇటీవల ఎస్సెస్సీలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సహస్ర, అక్షరకు పుష్పగుచ్ఛాలు అందించి సన్మానించారు. అనంతరం బాలికల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎన్టీపీసీ ఉన్నతాధికారులతోపాటు తహసీల్దార్ కుమారస్వామి, ఉద్యోగ గుర్తింపు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల కృష్ణయ్య, జనరల్ సెక్రటరీ ఆరెపల్లి రాజేశ్వర్, కందుల స్వామి, సీఎస్సార్ ప్రతినిధులు, వివిధ యూనియన్ల ప్రతినిధులు, జెమ్ శిక్షణ పొందుతున్న బాలికల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు

- ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో కేటాయింపు
- మంథని ఆర్డీవో హనుమా నాయక్



మాట్లాడుతున్న ఆర్డీవో హనుమా నాయక్

మంథని: లద్నాపూర్‌లోని సింగరేణి నిర్వాసితులకు పన్నూర్, రత్నాపూర్ గ్రామాల్లోని ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో ఇళ్ల స్థలాలు కేటాయించామని ఆర్డీవో హనుమా నాయక్ తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం రామగిరి మండలం లద్నాపూర్ సింగరేణి నిర్వాసితులతో సమావేశమయ్యారు. కాలనీల్లో చట్టప్రకారం చేయాల్సిన పనులు త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. వినాయక మండపం, చేతిపంపు, ప్రాథమిక పాఠశాల భవనం, అంగన్‌వాడీ కేంద్రం, రామాలయం, కమ్యూనిటీహాల్ నిర్మాణం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, దోబీఘాట్ పనులు పూర్తిచేసేందుకు అధికారులు హామీ ఇచ్చారు. రామగిరి తహసీల్దార్ రామచందర్, సింగరేణి అధికారులు రఘుపతి, లక్ష్మీనారాయణ, రాజేందర్, ఐలయ్య, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు దూరంగా ఉండాలి

రామగిరి(మంథని): సింగరేణి నిర్వాసితులు ఈనెల 20 నుంచి చేపట్టే సమ్మెకు అద్దె వాహన యజమానులు దూరంగా ఉండాలని ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు కోరారు. శుక్రవారం జీఎం కార్యాలయంలో అద్దె వాహనాల యాజమానులతో సమావేశం నిర్వహించారు. జీఎం మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సమ్మెలు చట్ట వ్యతిరేకమన్నారు. నిర్వాసితులు సమ్మె విరమించుకోవాలని, వాహనాలను యథావిధిగా నడిపించాలని సూచించారు. ఎస్‌వోటూ జీఎంలు రఘుపతి, సత్యనారాయణ, ఫైనాన్స్ ఏజీఎం శ్రీనివాసులు, ప్రాజెక్టు అధికారులు రాధాకృష్ణ, రాజేందర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



సద్దిమూటతో చేనుబాట పట్టిన మహిళలు



వ్యవసాయ క్షేత్రంలో అరకపడుతున్న రైతు

చేనుకు పోదాం .. చలో చలో

వానకాలం సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. జనవరిలో వేసిన జొన్న పంట తీసేసి ఈ సీజన్‌లో పత్తి వేసేందుకు చేలను సిద్ధం చేస్తున్నారు. గ్రామాల్లో ఉదయాన్నే సద్దిమూట కట్టుకొని రైతులు, కూలీలు పొలంబాట పడుతుండగా కనిపించిన దృశ్యాలివి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



ఎడ్లబండిపై పొలానికి వెళ్తున్న రైతు



కొయ్యలను తొలగిస్తూ..

క్లుప్తంగా...



తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జువ్వాది శ్రీదేవి శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

నేడు ఈఏపీ సెట్ ఫలితాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇంజనీరింగ్ అగ్రికల్చర్ ఫార్మసీ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఈఏపీ సెట్) ఫలితాలు శనివారం ఉదయం 11 గంటలకు విడుదల కానున్నాయి. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం వీటిని విడుదల చేస్తారు. ఫలితాలను త్వరగా అందించేందుకు 'సాక్షి' ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సాక్షి ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో ఫలితాలు చూడొచ్చు. కాగా, ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు ఈఏపీ సెట్ పరీక్షలు నిర్వహించారు. అన్ని విభాగాలకు కలిపి దాదాపు 3 లక్షలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. ఇంజనీరింగ్ విభాగం నుంచి 94 శాతం మంది, అగ్రికల్చర్, ఫార్మసీ నుంచి 90 శాతం మంది పరీక్ష రాశారు.

స్కూళ్లు తెరిచేలోగా పుస్తకాలు సిద్ధంగా ఉండాలి

- ధాన్యం కొనుగోళ్లు వెంటనే పూర్తి చేయండి
- అధికారులకు సీఎస్ శాంతికుమారి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: పాఠశాలలు తెరిచేలోగా విద్యార్థులకు అందివ్వాల్సిన పుస్తకాలు, యూనిఫాం, నోట్‌బుక్‌లు స్కూళ్లలో పంపిణీకి సిద్ధంగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి విద్యాశాఖ అధికారులను, జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. కలెక్టర్లు కూడా దీనిపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించాలని స్పష్టం చేశారు. శుక్రవారం శాంతి కుమారి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అమ్మ ఆదర్శ పాఠశాలల కింద చేపట్టిన పనుల పురోగతి, ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన అంశాలపై సమీక్షించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పనులను వేగవంతం చేసినందుకు కలెక్టర్లను సీఎస్ అభినందించారు. పాఠశాలలు పునః ప్రారంభమయ్యేలోగా వాటిని పూర్తి చేయాల్సిన అవసరం ఉందని ఆమె సూచించారు.

ధాన్యం త్వరగా సేకరించాలి..

ధాన్యం సేకరణ గురించి సీఎస్ ప్రస్తావిస్తూ.. మిగిలిపోయిన ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను కోరారు. అలాగే కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యాన్ని మిల్లులకు వేగంగా తరలించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వర్షంలో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టడానికి కొంత మంది కలెక్టర్లు తీసుకున్న చర్యలను ఆమె ప్రశంసించారు. ఇదే విధానాన్ని అనుసరించి రాష్ట్ర వ్యాప్తంగా రైతులు నష్టపోకుండా ఉండేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బి.వెంకటేశం, పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్, మున్సిపల్ శాఖ డైరెక్టర్ దివ్య, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్, ఇతర అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- ఇంజనీర్లకు సందీప్ కుమార్ సుల్తానియా హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో తాగు నీటి సరఫరాకు సంబంధించిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి పరిష్కరించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా అధికారులను హెచ్చరించారు. ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి తాగు నీటిని సరఫరా చేయడం మిషన్ భగీరథ ఇంజనీర్ల బాధ్యత అని, పైపులైన్లు లీకైనా, పగిలినా వెంటనే వాటిని సరిదిద్ది నీటి సరఫరాను అదే రోజు పునరుద్ధరించాలని ఆదేశించారు. క్రమం తప్పకుండా ప్రతీ రోజూ ప్రమాణాలకు అనుగుణంగా తాగు నీటిని సరఫరా చేయాలని సూచించారు. శుక్రవారం మిషన్ భగీరథ ఇంజనీర్-ఇన్-చీఫ్ కార్యాలయంలో చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లతో సుల్తానియా రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మిషన్ భగీరథ నీటి సరఫరాతో పాటు గ్రామాలలో ఇప్పటికే ఉన్న చేతి పంపులు, సింగిల్ ఫేజ్ మోటార్లు, స్కీమ్ బోర్లు తదితర గ్రామ మౌలిక వ్యవస్థలను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. అత్యవసరమైన పరిస్థితులలో ఈ వనరులను ఉపయోగించి తాగునీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇంజనీర్ ఇన్ చీఫ్ కృపాకర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చేతులు కాలాక 'సిట్'!

ఏపీలో పరిస్థితులకు ఈసీ పక్షపాత వైఖరే ప్రధాన కారణం

రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గడంతో చెలరేగిన హింసాకాండ

- చంద్రబాబు, పురందేశ్వరి జాబితాకు ఈసీ ఆమోదంతో రెచ్చిపోయిన పచ్చమూకలు
- అనుకూల అధికారుల అండతో తెగబడిన అల్లరిమూకలు
- శాంతిభద్రతలకు విఘాతం వాటిల్లాక తాపీగా మేలుకున్న ఈసీ
- వినీత్ బ్రిజ్‌లాల్ నేతృత్వంలో 13 మంది అధికారులతో 'సిట్'.. రెండు రోజుల్లో నివేదికకు ఆదేశం



సాక్షి, అమరావతి: ఎన్నికల హింసపై ఎన్నికల కమిషన్ (ఈసీ) వ్యవహరిస్తున్న తీరు చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా తయారైంది! రాష్ట్రంలో పోలింగ్ రోజు, ఆ తరువాత జరిగిన హింసాకాండకు ఏకైక కారణం రాజకీయ ఒత్తిళ్లతో పోలీస్ ఉన్నతాధికారులను ఈసీ ఏకపక్షంగా బదిలీ చేయడమే! ఆ స్థానంలో వచ్చిన అధికారులకు క్షేత్రస్థాయి పరిస్థితులపై సరైన అవగాహన లేకపోవడంతోపాటు పచ్చమూకల ఆగడాలను ఉపేక్షించడం వల్ల భయానక పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో నష్ట నివారణ చర్యలకు దిగిన ఈసీ ఆదేశాల మేరకు హింసాత్మక ఘటనలపై విచారణకు శుక్రవారం ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఏర్పాటైంది. ఎస్ఐబీ ఐజీ వినీత్ బ్రిజ్‌లాల్ నేతృత్వంలో 13 మంది పోలీసు అధికారులతో ఏర్పాటైన 'సిట్' రెండు రోజుల్లోగా నివేదిక సమర్పించాలని ఈసీ ఆదేశించింది. పల్నాడు, అనంతపురం, తిరుపతి జిల్లాల్లో పోలింగ్ సందర్భంగా చెలరేగిన హింసపై 'సిట్' దర్యాప్తు చేయనుంది. హింస చెలరేగడంలో పోలీసు అధికారుల పాత్రను కూడా 'సిట్' నిగ్గు తేల్చనుంది. ఆయా చోట్ల నమోదు చేసిన కేసులు, విచారణ తీరుతెన్నులపై పరిశీలించి వాస్తవాలు తేల్చాలని సిట్‌కు స్పష్టం చేసింది. అదనపు సెక్షన్లు, అవసరమైతే కొత్త ఎఫ్ఐఆర్‌ల నమోదును సూచించాలని పేర్కొంది. ఎస్పీలు, ఇతర పోలీసు అధికారులు సిట్ విచారణకు సహకరించాలని స్పష్టం చేసింది.

అనుకూల అధికారుల అండతో..

'సిట్' ఏర్పాటు చేసి నష్టనివారణ చర్యలకు దిగేలా పరిస్థితులు మారడానికి ఈసీ తీసుకున్న నిర్ణయాలే ముఖ్య కారణంగా ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు ముందు చంద్రబాబు, పురందేశ్వరి ఒత్తిళ్లకు తలొగ్గి ఎడాపెడా పోలీస్ అధికారులను మార్చేసి, వారి సూచనల మేరకు ఈసీ నియామకాలు చేపట్టింది. అనుకూల అధికారుల అండ చూసుకుని పల్నాడు, రాయలసీమతో పాటు ఇతర ప్రాంతాల్లో టీడీపీ శ్రేణులు రెచ్చిపోయాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు, ఆ పార్టీకి ఓటు వేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీలు, మహిళలే లక్ష్యంగా దాడులకు తెగబడ్డాయి. పరిస్థితులు చేయి దాటాక ఈసీ మేల్కొంది. దిద్దుబాటు చర్యల్లో భాగంగా అనంతపురం, పల్నాడు ఎస్పీలపై సస్పెన్షన్ వేటు వేయడంతో పాటు పల్నాడు కలెక్టర్, తిరుపతి ఎస్పీని బదిలీ చేసింది. మూడు జిల్లాల్లో 12 మంది పోలీసులపై సస్పెన్షన్ కొరడా ఝుళిపించింది. ఈ క్రమంలో సిట్ ఏర్పాటైంది. మొత్తం వ్యవహారంలో ఈసీ తీరు చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో చెలరేగిన హింస, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ఈసీ పక్షపాత వైఖరి ఫలితమేనని పరిశీలకులు పేర్కొంటున్నారు.

ఒత్తిళ్లకు తలొగ్గి ఉదాసీనత..

గత ఐదేళ్లుగా అన్ని వర్గాల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి పెద్దపీట వేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన అందించారు. ప్రజాదరణ కోల్పోయి దిక్కుతోచని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఏం చేయాలో పాలుపోక దుష్ప్రచారాలతో పేట్రేగిపోయింది. ఎన్ని కుట్రలు చేసినా ప్రజాదరణ దక్కకపోవడంతో పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో పెద్ద ఎత్తున హింసకు చంద్రబాబు ప్రణాళిక రచించారు. ఆయా జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పట్టున్న సమర్థులైన పోలీసు అధికారులు ఉంటే తమ పన్నాగాలు పనిచేయవని పసిగట్టి నిరాధారణ ఆరోపణలతో ఈసీకి ఫిర్యాదులు చేశారు. పురందేశ్వరి సహకారంతో పల్నాడు, ప్రకాశం, తిరుపతి తదితర జిల్లాల్లో ఎవరిని నియమించాలో కూడా సూచిస్తూ ఏకంగా జాబితాను అందచేశారు. పచ్చముఠా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి డీజీపీ, నిఘా విభాగం ఇన్‌చార్జ్‌తో పాటు పలువురు డీఐజీ, ఎస్పీలను ఈసీ పక్కనపెట్టింది. టీడీపీతో సత్సంబంధాలున్న వారిని రాజకీయ ఒత్తిళ్లతో అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో నియమించింది. పల్నాడు ఎస్పీగా గరికపాటి బిందు మాధవ్‌ను నియమించడమే ఇందుకు నిదర్శనం. ఈ అధికారి నరసరావుపేట టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు కుటుంబానికి అత్యంత సన్నిహితుడు కావడం గమనార్హం. ఈ పార్లమెంట్ స్థానంలో వైఎస్సార్‌సీపీకి గట్టి పట్టు ఉంది. 2019లో ఈ పార్లమెంట్ పరిధిలోని ఏడు స్థానాలను పార్టీ స్వీప్ చేసింది. దీంతో అధికార పార్టీకి పట్టున్న ప్రాంతాల్లో పోలింగ్ సజావుగా జరగకుండా నిలువరించేలా కృష్ణదేవరాయలు స్కెచ్ వేశారు. క్షేత్ర స్థాయిలో తన సామాజికవర్గానికి చెందిన వారిని నియమించుకుని పల్నాడులో అరాచకానికి కృష్ణదేవరాయలు ముఖ్యకారణం అయ్యారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపిస్తున్నారు.

13 మందితో 'సిట్'

సాక్షి, అమరావతి: ఎన్నికల సందర్భంగా చోటు చేసుకున్న హింసాత్మక సంఘటనలపై విచారణకు ఈసీ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం 'సిట్' ఏర్పాటు చేసింది. ఎస్ఐబీ ఐజీ వినీత్ బ్రిజ్‌లాల్ నేతృత్వంలో 13 మంది పోలీసు అధికారులతో ఏర్పాటైన 'సిట్' పల్నాడు, అనంతపురం, తిరుపతి జిల్లాల్లో జరిగిన హింసపై విచారణ జరిపి రెండు రోజుల్లో ఎన్నికల కమిషన్‌కు నివేదిక ఇవ్వాలని ఉత్తర్వుల్లో డీజీపీ ఆదేశించారు.

'సిట్' సభ్యులు...

1. రమాదేవి, ఎస్పీ, ఏసీబీ
2. సౌమ్యలత, ఏఎస్పీ, ఏసీబీ
3. రమణమూర్తి, డీఎస్పీ, ఏసీబీ, శ్రీకాకుళం
4. పి.శ్రీనివాసులు, డీఎస్పీ, సీఐడీ
5. వి.శ్రీనివాసరావు, డీఎస్పీ, ఏసీబీ, ఒంగోలు
6. రవి మనోహరా చారి, డీఎస్పీ, ఏసీబీ, తిరుపతి
7. వి.భూషణం, ఇన్‌స్పెక్టర్, గుంటూరు రేంజి
8. కె.వెంకట్రావు, ఇన్‌స్పెక్టర్, ఇంటెలిజెన్స్, విశాఖ
9. రామకృష్ణ, ఇన్‌స్పెక్టర్, ఏసీబీ
10. జీఎల్ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్, ఏసీబీ
11. మొయిన్, ఇన్‌స్పెక్టర్, పీటీసీ, ఒంగోలు
12. ఎస్.ప్రభాకర్, ఇన్‌స్పెక్టర్, ఏసీబీ, అనంతపురం
13. శివప్రసాద్, ఇన్‌స్పెక్టర్, ఏసీబీ

చోద్యం చూసిన అధికారులు..

అనుకూల అధికారి అండ చూసుకుని పల్నాడులోని నరసరావుపేట, మాచర్ల, గురజాల, కొత్త గణేశుని పాడులో టీడీపీ రౌడీ మూకలు రెచ్చిపోయాయి. పెట్రోలు బాంబులు, వేట కొడవళ్లు, బరిసెలు, బాకులు, ఇనుప రాడ్లతో స్వైర విహారం చేశాయి. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు, ఆ పార్టీకి ఓటు వేసినట్లు భావించిన వారిపై యథేచ్ఛగా దాడులకు తెగబడ్డాయి. ఇంత జరుగుతున్నా పల్నాడు ఎస్పీ బిందు మాధవ్‌తోపాటు ఆయన ఆధ్వర్యంలోని డీఎస్పీలు, సీఐలు చోద్యం చూశారు. టీడీపీ మూకల నుంచి తమకు, ప్రజలకు రక్షణ కల్పించాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఫోన్లు చేసినా పోలీసులు పెడచెవిన పెట్టారు.

సీమలో వివాదాస్పదం

అనంతపురం జిల్లాలో కొందరు పోలీసుల తీరు వివాదాస్పదంగా మారింది. పోలింగ్‌కు ముందు ఈ జిల్లాకు అమిత్ బర్దర్‌ను ఎస్పీగా నియమించారు. తొలి నుంచి ఆయన టీడీపీకి కొమ్ముకాశారు. కదిరి టీడీపీ అభ్యర్థి కందికుంట ప్రసాద్ వాహనంలో రూ.2 కోట్లు లభ్యమైతే కేసు నమోదు చేయకుండా తాత్సారం చేయడం ఆయన పచ్చపాత వైఖరికి నిదర్శనం. ఎన్నికల రోజు తాడిపత్రిలో టీడీపీ నాయకులు జేసీ ప్రభాకర్‌రెడ్డి, అస్మిత్‌రెడ్డి, దీపక్‌రెడ్డి పోలింగ్ కేంద్రాల్లో చొరబడి అక్రమాలకు పాల్పడ్డారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి నివాసంపై టీడీపీ గూండాలు రాళ్ల వర్షం కురిపించారు. ఈ ఘటనలను నియంత్రించడంలో ఎస్పీ పూర్తిగా విఫలం అయ్యారు. మరోవైపు పోలీసులు పెద్దారెడ్డి నివాసంలోకి చొరబడి విధ్వంసానికి పాల్పడ్డారు. వారి చర్యలు సీసీ కెమెరాల్లో రికార్డు కాకుండా ముందుగానే ధ్వంసం చేసిన ఫుటేజీలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. తిరుపతి జిల్లాలో చంద్రగిరి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిపై టీడీపీ గూండాలు దాడి చేసి ఆయన వాహన శ్రేణిలోని వాహనానికి నిప్పుపెట్టారు. ఇక్కడ కూడా అల్లర్లను కట్టడి చేయడంలో ఈసీ నియమించిన పోలీసు అధికారులు దారుణంగా విఫలమయ్యారు.



విదేశీ పర్యటనకు ఏపీ సీఎం జగన్

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విదేశీ పర్యటనకు బయలుదేరి వెళ్లారు. శుక్రవారం రాత్రి 10.30 గంటలకు ఆయన గుంటూరు జిల్లా తాడేపల్లిలోని తన నివాసం నుంచి సతీసమేతంగా గన్నవరం విమానాశ్రయానికి వెళ్లారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో లండన్ వెళ్లినట్లు సీఎం కార్యాలయ వర్గాలు తెలిపాయి. తిరిగి ఆయన జూన్ 1న రాష్ట్రానికి వస్తారని వెల్లడించాయి. కాగా గన్నవరం విమానాశ్రయంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు సీఎం వైఎస్ జగన్‌కు వీడ్కోలు పలికారు.

అధికారులను మార్చిన చోటే అల్లర్లు
మీడియా సమావేశంలో మంత్రి బొత్స

వైఎస్సార్‌సీపీకే మళ్లీ అధికారం
పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి

వివరాలకు, వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

రోడ్డుపైనే సీపీఆర్

ఆరేళ్ల బాలుడికి పునర్జన్మ

సోషల్ మీడియాలో వీడియో వైరల్



రోడ్డుపైనే బాలుడికి సీపీఆర్ చేస్తున్న డాక్టర్ రవళి

లబ్బీపేట (విజయవాడ తూర్పు): విద్యుత్ షాక్‌కు గురైన ఆరేళ్ల బాలుడు అపస్మారక స్థితికి చేరుకోగా, అటుగా వెళ్తున్న యువ వైద్యురాలు దాన్ని గుర్తించి కారు దిగి వచ్చి రోడ్డుపైనే సీపీఆర్ చేసి బాలుడి ప్రాణాలను నిలబెట్టింది. ఈ సంఘటన 5 రోజుల క్రితం విజయవాడ అయ్యప్పనగర్ మొదటి లైన్ వద్ద జరగ్గా తాజాగా వెలుగులోకి వచ్చింది. విజయవాడలోని సంతాన సాఫల్య కేంద్రంలో డాక్టర్ రవళి వైద్యురాలు. 4 రోజుల క్రితం ఆమె కారులో కోదాడ వెళ్లి, తిరిగి వస్తూ తనతో వచ్చిన బంధువులను దింపేందుకు అయ్యప్పనగర్‌కు వెళ్లింది. వారిని ఇంటి వద్ద దించి తిరిగి వస్తుండగా అపస్మారక స్థితిలో ఉన్న ఆరేళ్ల బాలుడు సాయిని ఆతృతతో తల్లిదండ్రులు తీసుకెళ్తుండటాన్ని చూసి కారు ఆపి అడిగింది. విద్యుత్ షాక్‌కు గురైనట్లు వారు చెప్పడంతో వెంటనే బాలుడిని రోడ్డుపై పడుకోబెట్టి కార్డియో పల్మనరీ రీససిటేషన్ (సీపీఆర్) చేసింది. ఇలా రెండు, మూడు నిమిషాలు చేయగా, అప్పటి వరకూ కోమాలో ఉన్న బాలుడిలో కదలిక ప్రారంభమైంది. హార్ట్‌బీట్ ప్రారంభమైందని నిర్ధారించుకుని వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లమని సలహా ఇచ్చింది. ఇప్పుడు ఆ వీడియో వైరల్‌గా మారింది. పటమట డొంక రోడ్డులోని విజయ ఎమర్జెన్సీ ఆస్పత్రికి బాలుడిని చికిత్సకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స అనంతరం బాలుడు పూర్తిగా కోలుకున్నట్లు ఫిజీషియన్ డాక్టర్ రాజేష్ తెలిపారు. బ్రెయిన్ సీటీ స్కాన్ చేయగా నార్మల్ రావడంతో డిశ్చార్జి చేశామన్నారు. కాగా ఆ దంపతులకు బాలుడు పెళ్లయిన చాలా రోజులకు పుట్టినట్లు డాక్టర్ రాజేష్ చెప్పారు. నిర్మాణంలో ఉన్న భవనం కిటికీ వద్ద విద్యుత్ షాక్‌కు గురైనట్లు వివరించారు.

వృత్తి ధర్మం నిర్వర్తించా: డాక్టర్ రవళి

మెడిసిన్ (ఎంబీబీఎస్) చదివేటప్పుడు బేసిక్ లైఫ్ సపోర్ట్ విధానాలపై శిక్షణ తప్పనిసరి అని ప్రొఫెసర్లు చెప్పారు. ప్రాణాపాయంలో ఉన్నప్పుడు సీపీఆర్‌తో రక్షించవచ్చు. నేను కూడా ఒక వైద్యురాలిగా వృత్తి ధర్మాన్ని నిర్వర్తించాను. బాలుడిలో కదలిక రాగానే సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లమని సూచించాను. ప్రస్తుతం బాలుడు ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిసింది.

టీవీ నటుడు చంద్రకాంత్ ఆత్మహత్య

టీవీ నటి పవిత్ర మరణంతో మనస్తాపం



మణికొండ: టీవీ సీరియల్ నటుడు చంద్రకాంత్ తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్‌లో శుక్రవారం రాత్రి ఈ సంఘటన జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. త్రినయని, రాధమ్మ కూతురు, కార్తీక దీపం లాంటి పలు సీరియళ్లలో నటిస్తున్న చంద్రకాంత్ (40) అలకాపూర్ టౌన్‌షిప్‌లో నివసిస్తున్నారు. 2015లో శిల్పను ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. త్రినయని సీరియల్‌లో తనతో నటించిన పవిత్ర ఇటీవల బెంగళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడాన్ని తట్టుకోలేక చంద్రకాంత్ తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఆయన పవిత్రతో ఆరేళ్లుగా సహజీవనం చేస్తున్నట్టు సమాచారం. పవిత్ర మృతితో తీవ్ర మనస్తాపానికి గురై శుక్రవారం ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చంద్రకాంత్ ఆత్మహత్యకు గల కారణాలపై విచారణ జరుపుతున్నామని, పూర్తి వివరాలు వచ్చాకే విలేకరులకు వెల్లడిస్తామని పోలీసు అధికారులు తెలిపారు.

టీడీపీ దాష్టీకానికి పరాకాష్ట

కుట్ర రాజకీయానికి మహిళా వాలంటీర్ బలి

- వైఎస్సార్‌సీపీ తరఫున ప్రచారం చేశారనే ఆరోపణలతో ఫిర్యాదు
- ఆగమేఘాలపై కేసు నమోదు
- పోలీసుల విచారణ.. ఆందోళనతో ఆగిన గుండె

సాక్షి ప్రతినిధి, విజయనగరం : వైఎస్సార్‌సీపీ తరఫున ప్రచారం చేశారనే ఆరోపణలతో టీడీపీ నేతలు చేసిన ఫిర్యాదు ఓ మహిళ వాలంటీర్ నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. ఊళ్లో అందరికీ తలలో నాలుకలా వ్యవహరించిన ఓ సేవకురాలిని టీడీపీ స్వార్థ రాజకీయాల కోసం పొట్టన పెట్టుకోవడం దిగ్భ్రాంతి పరుస్తోంది. తప్పుడు ఆరోపణలతో వేధింపులు, ఫిర్యాదు, పోలీసుల విచారణతో తీవ్ర భయాందోళనకు గురై విజయనగరం రూరల్ మండలం దుప్పాడ గ్రామంలో వాలంటీర్ బొబ్బాది సంతోషి (36) గుండె ఆగిపోయింది. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం మేరకు ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సంతోషి భర్త బొబ్బాది కృష్ణ విజయనగరం కూరగాయల మార్కెట్‌లో పని చేస్తుంటారు. వీరికి ఇద్దరు పిల్లలు. అబ్బాయి జయదీప్ ఇటీవలే పదో తరగతి ఉత్తీర్ణుడయ్యాడు. అమ్మాయి లహరి ఎనిమిదో తరగతి చదువుతోంది. సంతోషి వాలంటీర్‌గా చేరిన తర్వాత గ్రామంలో తనకు అప్పగించిన 50 కుటుంబాలకు నిత్యం అందుబాటులో ఉండేది. ప్రభుత్వం ఇచ్చిన ప్రతి పథకాన్ని అర్హులకు చేర్చుతూ వారి మన్ననలు అందుకుంది. తనది పేద కుటుంబమే అయినా గ్రామంలో ఏ పేద వారూ ఇబ్బంది పడకూడదనే సంకల్పంతో సేవలందించింది. ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుజామునే అవ్వాతాతలకు పింఛన్ అందించడంలో పోటీ పడేది. సీఎం వైఎస్ జగన్ అంటే అభిమానం. ఇవన్నీ అదే గ్రామంలోని టీడీపీ నాయకులకు కంటగింపుగా మారాయి. ఏదో విధంగా వాలంటీర్లపై కక్ష సాధింపు లక్ష్యంతో ఉన్న టీడీపీ నేతలు ఎన్నికల కమిషన్‌ను అడ్డు పెట్టుకుని కుట్రలు, కుతంత్రాలకు తెర లేపారు.

టీడీపీ నేతల బెదిరింపులు

టీడీపీ ప్రభుత్వం వస్తే వాలంటీర్ ఉద్యోగం ఇప్పిస్తామంటూ స్థానిక టీడీపీ నేతలు గ్రామంలో 50 మంది యువకులను మభ్యపెట్టి ఎన్నికల ప్రచారానికి వాడుకున్నారు. మరోవైపు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ప్రచారం చేస్తున్నారంటూ వాలంటీర్లు బొబ్బాది సంతోషి, నారాయణమ్మ, రామలక్ష్మి, స్వాతి, కృష్ణవేణి, కోటమ్మలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.



భర్త కృష్ణ, పిల్లలతో వాలంటీర్ సంతోషి (ఫైల్)

పూర్వాపరాలు సరిగా విచారించకుండానే టీడీపీ నేతల ఒత్తిళ్లతో అధికారులు ఆగమేఘాలపై ఆ ఆరుగురు వాలంటీర్లను సస్పెండ్ చేశారు. పోలీసులతో ఎఫ్ఐఆర్ నమోదు చేయించారు. పుట్టుమచ్చలు, తదితర వివరాలు చెప్పాలని పోలీసులు మూడు రోజుల కిందట సంతోషికి ఫోన్ చేసి అడిగారు. అంతకు ముందు గ్రామంలో నిర్వహించిన టీడీపీ ప్రచార సభలో కూడా ఆ నాయకులు వాలంటీర్ల ప్రస్తావన తీసుకొచ్చారు. ఇప్పుడు ఉద్యోగాలు ఊడగొట్టి కేసులు పెట్టించామని, తమ టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వదిలి పెట్టబోమని హెచ్చరించారు. పోలీసులు గ్రామంలోకి వచ్చి ఇంటింటి విచారణ చేశారు. ఇవన్నీ సంతోషినిని ఆందోళనకు గురి చేశాయి. ఇదిలా ఉండగా పుట్టుమచ్చలు తదితర వివరాలు చెప్పాలని పోలీసులు మూడ్రోజుల కిందట ఆమెకు ఫోన్ చేయడంతో తీవ్రంగా భయాందోళనకు గురైంది. గురువారం ఛాతీలో పట్టేసినట్టు ఉండటంతో తొలుత గ్యాస్ తాలూకు నొప్పిగా భావించింది. కొంత సేపటి తర్వాత గుండెల్లో నొప్పిగా ఉందని కుటుంబ సభ్యులకు చెప్పింది. వారు విజయనగరంలో డాక్టర్లకు చూపించారు. వారి సూచనలతో విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ వైద్యం అందిస్తుండగా పరిస్థితి విషమించి శుక్రవారం ఆ పేదరాలి గుండె ఆగిపోయింది. సంతోషి హఠాన్మరణం ఆమె కుటుంబాన్ని తీవ్ర విషాదంలో నింపింది. గ్రామంలో పెద్ద ఎత్తున ప్రజలు ఆమె అంతిమ యాత్రలో పాల్గొని కంట నీరు పెట్టారు. కాగా, ఇంత జరిగినా టీడీపీ నాయకులకు వ్యతిరేకంగా ఒక్క మాట మాట్లాడటానికి ఆ కుటుంబం భయపడిపోతోంది. తోటి వాలంటీర్లంతా లోలోన కుమిలిపోతున్నారు.

'మిల్లెట్ సిస్టర్స్' ఆదర్శం

20 వేల మందికి జీవనోపాధితో స్ఫూర్తినిస్తున్న విజయనగరం వాసి

- సీఐఐ వుమెన్ ఎగ్జంప్లర్ 2024 అవార్డు అందుకున్న సరస్వతి మల్లువలస
- ఢిల్లీలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నుంచి అవార్డు స్వీకరణ
- ప్రశంసాపత్రం, ట్రోఫీతో పాటు రూ.మూడు లక్షల నగదు ప్రదానం



ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సరస్వతి మల్లువలస

సాక్షి, అమరావతి: నిజ జీవితంలో పేదరికం, సామాజిక, లింగ వివక్ష వంటి రుగ్మతలను సమర్థంగా ఎదుర్కొని తోటి మహిళలకు ఆదర్శంగా నిలిచిన విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన సరస్వతి మల్లువలస జాతీయ స్థాయి పురస్కారానికి ఎంపిక య్యారు. సీఐఐ ఫౌండేషన్ మహిళా సాధికారతను ప్రోత్సహించడంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం, సామాజిక లింగ - ఆధారిత వివక్షను ఎదుర్కొన్న అట్టడుగు మహిళా నాయకులను గుర్తించి ఎగ్జంప్లర్ పేరుతో అవార్డునిస్తోంది. ఇందులో భాగంగా సీఐఐ వుమెన్ ఫౌండేషన్ 19వ ఎడిషన్‌లో సూక్ష్మ మధ్య చిన్నతరహా పరిశ్రమలు(ఎంఎస్ఎంఈ) రంగంలో సరస్వతి ఎంపిక కాగా శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన సీఐఐ వార్షిక బిజినెస్ కార్యక్రమంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ అవార్డును అందించారు. మొత్తం మూడు విభాగాల్లో అవార్డులను ప్రకటించగా విద్యారంగం నుంచి మహారాష్ట్రకు చెందిన రంజిత పవార్, ఆరోగ్యరంగంలో బిహార్‌కు చెందిన రుమీ పర్వీన్, ఎంఎస్ఎంఈ రంగంలో మన రాష్ట్రానికి చెందిన సరస్వతి ఎంపికయ్యారు. అవార్డు గ్రహీతలకు ట్రోఫీ, సర్టిఫికెట్‌తో పాటు రూ.మూడు లక్షల నగదును అందజేశారు. ఈ అవార్డు కోసం దేశవ్యాప్తంగా మొత్తం 300 పోటీపడగా వాటిలో తుది పోటీకి 16మందిని ఎంపిక చేసి స్వయంగా వెళ్లి పరిశీలించి, వారిని ఇంటర్వ్యూ చేసి ఎంపిక చేసినట్లు సీఐఐ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

మహిళా రైతులతో నెట్‌వర్క్

విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన సరస్వతి మల్లువలస నిజజీవితంలో గృహ హింస, లింగ వివక్షను ఎదుర్కొన్నారు. ఆహార భద్రత, ఆర్థిక అవసరాల కోసం ఇతరులపై ఆధారపడాల్సి రావడమే ఈ వివక్షకు ప్రధాన కారణమని గుర్తించిన ఆమె ఇంకెవ్వరూ ఇలాంటి కష్టాలు ఎదుర్కోకూడదని మిల్లెట్ సిస్టర్స్ పేరుతో చిన్న స్థాయి మహిళా రైతుల నెట్‌వర్క్‌ను స్థాపించారు. దీని ద్వారా 20,000 మంది మహిళలకు ఆదాయాన్ని మెరుగుపర్చేలా జీవనోపాధిని కల్పించి ఆదర్శంగా నిలిచారు. మహిళా సాధికారితలో అయిదు 'ఈ'లు ఎడ్యుకేషన్, ఈక్వాలిటీ, ఎంప్లాయిమెంట్, ఎకనామిక్ డెవలప్‌మెంట్, ఎంపవర్‌మెంట్ ప్రధానమైనవిగా గుర్తించి ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. సీఐఐ 19వ ఎడిషన్‌లో ఎంపికైన 16 మందితో కలిపి ఇప్పటి వరకు 120 కంటే ఎక్కువ మందిని గుర్తించామని, వీరి ద్వారా 30 లక్షల మంది జీవితాల్లో స్పష్టమైన మార్పులను గమనిస్తున్నట్లు సీఐఐ పేర్కొంది.

ఆయుర్వేదమంటూ అల్లోపతి మందుల విక్రయం

ముఠా ఆట కట్టించిన డీసీఏ

సాక్షి, హైదరాబాద్: అల్లోపతి మందు పౌడర్ మిక్స్‌ను 'మధుమేహానికి ఆయుర్వేద మందు'గా విక్రయిస్తున్న ఒక ముఠాను తెలంగాణ డ్రగ్ కంట్రోల్ విభాగం (డీసీఏ) ఆట కట్టించింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ గ్రామంలోని సంపూర్ణ ఆయుర్వేద నిలయంపై డీసీఏ దాడులు జరిపి రూ.1.5 లక్షల విలువైన అల్లోపతి మందులను స్వాధీనం చేసుకుంది. ఇందులో యాంటీ-డయాబెటిక్ మందులు... మెట్‌ఫార్మిన్, గ్లిమీపిరైడ్, గ్లిక్లాజైడ్ వంటివి ఉన్నాయని డీసీఏ ఒక ప్రకటనలో తెలిపింది. గోదావరిఖని, నర్సంపేటలలో అధిక ధరకు విక్రయిస్తున్న ఈ మందులను స్వాధీనం చేసుకున్నట్టు తెలియజేసింది. తప్పుడు ప్రకటనలకు జడ్జెర్లలో ఒక ఆయుర్వేద మందు స్వాధీనంతో పాటు మెదక్ జిల్లా నిజాంపేట గ్రామంలో ఓ దొంగవైద్యుడి క్లినిక్‌లోనూ మందులను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించింది.

బీజేపీకి సవాల్

ఒడిశాలో 20న రెండో విడత ఎన్నికలు

5 లోక్‌సభ, 35 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్

బీజేడీ, బీజేపీ హోరాహోరీ

ఒడిశాలో రెండో విడత ఎన్నికలకు రంగం సిద్ధమైంది. రాష్ట్రంలో 21 లోక్‌సభ స్థానాలుండగా నాలుగింటికి 13న పోలింగ్ ముగిసింది. ఈ నెల 20న రెండో విడతలో ఐదు లోక్‌సభ స్థానాలు, వాటి పరిధిలోని 35 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఈ ఐదు లోక్‌సభ స్థానాల్లో మూడు బీజేపీ సిట్టింగ్ సీట్లే కావడం విశేషం. ఆ పార్టీకి గట్టి మద్దతున్న ఈ స్థానాల్లో అధికార బీజేడీ నుంచి సవాలు ఎదురవుతోంది...

- సాక్షి, నేషనల్ డెస్క్



ఆస్తుల్లో టాప్ జిందాల్

- రూ.1,241 కోట్లతో మొదటి స్థానం
- 21 శాతం మందికి నేరచరిత్ర
- ఆరో దశలో 866 మంది పోటీ



లోక్‌సభ ఎన్నికల ఆరో విడతలో పోటీ చేస్తున్న అభ్యర్థులందర్లో బీజేపీ నేత, ప్రముఖ వ్యాపారవేత్త నవీన్ జిందాల్ అత్యధిక ఆస్తులతో తొలి స్థానంలో ఉన్నారు. జిందాల్ స్టీల్ అండ్ పవర్ కంపెనీ చైర్మన్ అయిన నవీన్ హరియాణాలోని కురుక్షేత్ర నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. తనకు రూ.1,241 కోట్ల ఆస్తులున్నట్టు అఫిడవిట్లో వెల్లడించారు. మొత్తం 866 మంది అభ్యర్థుల్లో 39 శాతం మంది కోటీశ్వరులే. వీరికి సగటున రూ.6.21 కోట్ల ఆస్తి ఉన్నట్టు అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రీఫామ్స్ ప్రకటించింది. ఆశ్చర్యకరంగా కురుక్షేత్రలో జిందాల్‌పై ఆప్ కూడా సంపన్న నేతనే పోటీకి దించింది. ఆ పార్టీ అభ్యర్థి సుశీల్‌కుమార్ గుప్తా రూ.169 కోట్ల ఆస్తులతో టాప్-3లో ఉన్నారు. ఒడిశాలో కటక్ బీజేడీ అభ్యర్థి సంతృప్త్ మిశ్రా రూ.482 కోట్లతో రెండో స్థానంలో ఉన్నారు. తనవద్ద కేవలం రెండు రూపాయలే ఉన్నట్టు రోహతక్ లోక్‌సభ స్థానంలో స్వతంత్రుడిగా పోటీ చేస్తున్న రణధీర్ సింగ్ పేర్కొన్నారు!

180 మందిపై క్రిమినల్ కేసులు

ఆరో విడతలో 180 మంది (21 శాతం) అభ్యర్థులపై క్రిమినల్ కేసులు ఉన్నట్టు ఏడీఆర్ వెల్లడించింది. వీరిలో 141 మందిపై సీరియస్ కేసులున్నాయి. 12 మంది తమను దోషులుగా కోర్టు ప్రకటించినట్టు పేర్కొనగా, పలువురు హత్య కేసుల్లోనూ అభియోగాలు ఎదుర్కొంటున్నట్టు వెల్లడించారు. 21 మందిపై హత్యాయత్నం కేసులున్నాయి. 24 మంది మహిళలకు సంబంధించిన కేసుల్లో నిందితులు. ముగ్గురిపై అత్యాచారం కేసులున్నాయి. ఆప్ తరఫున పోటీలో ఉన్న ఐదుగురు, ఆర్జేడీ అభ్యర్థులు నలుగురూ క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. ఎస్పీ అభ్యర్థుల్లో 75 శాతం, బీజేపీ అభ్యర్థుల్లో 55 శాతం మందిపై క్రిమినల్ కేసులున్నాయి. ఆర్జేడీకి చెందిన నలుగురూ, ఆప్‌నకు చెందిన నలుగురు (80 శాతం), ఎస్పీ నుంచి 12 మంది (75 శాతం) బీజేడీ నుంచి 18 మంది (35 శాతం)పై సీరియస్ క్రిమినల్ కేసులున్నాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

★ బోలంగీర్

రాష్ట్రమంతటా ఆసక్తి నెలకొన్న స్థానమిది. బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ, రాజ వంశీకురాలు సంగీతా సింగ్‌దేవ్ బరిలో ఉన్నారు. బీజేడీ గత అభ్యర్థి కల్కేశ్ నారాయణ్ సింగ్‌దేవ్ స్థానంలో సురేంద్ర సింగ్ భోయ్‌ని పోటీకి దింపింది. కాంగ్రెస్ నుంచి మనోజ్ మిశ్రా పోటీలో ఉన్నారు. ఇక్కడ సంగీత నాలుగుసార్లు గెలిచారు. ఆమె భర్త కనకవర్ధన్ సింగ్‌దేవ్ పాట్నాగఢ్-బోలంగీర్ మహరాజు రాజ్‌రాజ్ సింగ్ దేవ్ కుమారుడు. ఒడిశా బీజేపీ చీఫ్‌గా, రాష్ట్ర మంత్రిగా కూడా చేశారు. కరువు బాధిత జిల్లా అయిన బోలంగీర్ నుంచి ఏటా 30 వేల మందికి పైగా ఉపాధి కోసం వలస పోతున్నారు. ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ సీట్లలో నాలుగు బీజేడీ చేతిలో ఉన్నాయి. కాంగ్రెస్ రెండు చోట్ల, బీజేపీ ఒక్క స్థానంలో గెలిచాయి.



మనోజ్ మిశ్రా



సంగీతా కుమారి సింగ్‌దేవ్

★ బార్‌గఢ్

2008 నియోజకవర్గాల పునర్విభజన అనంతరం ఏర్పడిన ఈ స్థానంలో విజయం పార్టీల చేతులు మారుతూ వస్తోంది. 2009లో కాంగ్రెస్ నేత సంజయ్ భోయ్ గెలవగా, 2014లో బీజేడీకి చెందిన డాక్టర్ ప్రవాస్ కుమార్ సింగ్ విజయం సాధించారు. 2019లో బీజేపీని విజయం వరించింది. బీజేడీ సీనియర్ నేత ప్రసన్న ఆచార్యను బీజేపీ నేత సురేశ్ పూజారి ఓడించారు. ఈసారి ఆయనకు బదులు ప్రదీప్ పురోహిత్‌కు బీజేపీ టికెటిచ్చింది. పూజారిని అసెంబ్లీ ఎన్నికల్లో మోహరించింది. బీజేడీ కూడా పరిణీత మిశ్రాకు అవకాశం ఇచ్చింది. కాంగ్రెస్ నుంచి సంజయ్ భోయ్ మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. బీజేడీ ప్రభుత్వ వైఫల్యాలపై బలంగా గళం వినిపించే ప్రదీప్‌కు స్థానికంగా మంచి పేరుంది. మోదీ సర్కారు సంక్షేమ కార్యక్రమాలను ప్రస్తావిస్తూ ఓటర్లకు దగ్గరవుతున్నారు.



పరిణీత మిశ్రా

★ కందమాల్

ఈ స్థానం బీజేడీ కంచుకోట. కందమాల్, బౌద్ జిల్లాలు మొత్తం దీని పరిధిలోకే వస్తాయి. బీజేడీ నుంచి సిట్టింగ్ ఎంపీ, ప్రముఖ విద్యావేత్త అచ్యుతానంద సామంత బరిలో ఉన్నారు. బీజేపీ ప్రతిసారీ కొత్త అభ్యర్థిని నిలుపుతున్నా నిరాశే ఎదురవుతోంది. ఈసారి సుకాంత కుమార్ పాణిగ్రాహికి టికెటిచ్చింది. కాంగ్రెస్ నుంచి అమీర్‌చంద్ నాయక్ పోటీలో ఉన్నా పోటీ బీజేపీ, బీజేడీ మధ్యే ఉంది. సామంతకు విద్యా, దాతృత్వ కార్యక్రమాలు గట్టి దన్ను. కాగా తాగు, సాగునీటి సమస్య, రోడ్ల దుస్థితి తదితర అంశాలను పాణిగ్రాహి ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. ఆయనకు మద్దతుగా ప్రధాని మోదీ ఇప్పటికే ప్రచారం చేశారు.



అచ్యుతానంద సామంత



సుకాంత కుమార్ పాణిగ్రాహి

★ సుందర్‌గఢ్

ఒడిశాలో కీలక లోక్‌సభ స్థానాల్లో ఇదీ ఒకటి. ఇక్కడ బీజేపీదే హవా. గత రెండు ఎన్నికల్లో గెలిచిన బీజేపీ సిట్టింగ్ ఎంపీ జుయల్ ఓరం మళ్లీ బరిలో ఉన్నారు. 1998 నుంచి ఇక్కడ ఆయన ఐదుసార్లు గెలవడం విశేషం. 2009 ఎన్నికల్లో మాత్రం ఓరంపై కాంగ్రెస్ నేత హేమానంద బిశ్వాస్ విజయం సాధించారు. అధికార బీజేడీ ఇక్కడ ఖాతాయే తెరవలేదు! రాష్ట్రంలో ఆ పార్టీ ఇప్పటి దాకా నెగ్గని ఏకైక స్థానమిది. గత మూడుసార్లుగా అభ్యర్థులను మారుస్తున్నా ఫలితం దక్కడం లేదు. ఈసారి భారత హాకీ జట్టు మాజీ కెప్టెన్ దిలీప్ టిర్కీని బీజేడీ మరోసారి బరిలో దింపింది. 2014లో ఆయన 18 వేల ఓట్ల తేడాతో ఓడారు. ఈ గిరిజన ప్రాబల్య నియోజకవర్గంలో బీజేపీని ఓడించడం కష్టమేనని విశ్లేషకులు అంటున్నారు. ప్రపంచ స్థాయి హాకీ స్టేడియం ఏర్పాటు, టిర్కీ ఆదరణ కలిసొచ్చి ఈసారి గట్టెక్కుతామని బీజేడీ భావిస్తోంది. కాంగ్రెస్ నుంచి మాజీ ఎమ్మెల్యే జనార్దన్ దెహూరీ పోటీ చేస్తున్నారు. ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ సీట్లలో మూడు బీజేపీ చేతిలో ఉన్నాయి. రెండింట బీజేడీ, కాంగ్రెస్, సీపీఎం చెరో చోట గెలిచాయి.



జుయల్ ఓరం



దిలీప్ టిర్కీ

ముగ్గురిలో ఒకరిపై కేసు

ఒడిశాలో రెండో విడతలో పోలింగ్ జరిగే ఐదు లోక్‌సభ స్థానాల్లో 40 మంది పోటీలో ఉన్నారు. వీరిలో 13 మంది కోటీశ్వరులే. సంగీతా కుమారి రూ.67.3 కోట్లతో జాబితాలో టాప్‌లో ఉన్నారు. 12 మంది అభ్యర్థులు తమపై క్రిమినల్ కేసులున్నట్టు పేర్కొన్నారు. వీరిలో 8 మంది తీవ్ర నేరాలకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. 21 మంది గ్రాడ్యుయేషన్, అంతకంటే ఉన్నత విద్యావంతులని ఏడీఆర్ సంస్థ ప్రకటించింది.

★ అస్కా

బీజేడీకి కంచుకోట. సీఎం నవీన్ పట్నాయక్‌కు ప్రతిష్ఠాత్మక లోక్‌సభ స్థానం. ఆయన పోటీ చేస్తున్న హింజిలి అసెంబ్లీ స్థానం దీని పరిధిలోనే ఉంది. తండ్రి బిజూ పట్నాయక్ మరణానంతరం 1997 లోక్‌సభ ఉప ఎన్నికల్లో అస్కా నుంచే నవీన్ లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1998, 1999 ఉప ఎన్నికల్లోనూ విజయం సాధించారు. వాజ్‌పేయి ప్రభుత్వంలో ఉక్కు, గనుల శాఖ మంత్రిగా చేశారు. ఇక్కడ ఏ అభ్యర్థినీ రెండోసారి నవీన్ కొనసాగించకపోవడం గమనార్హం. బీజేడీ నుంచి 2019లో ప్రమీలా బిసోయ్ గెలిచారు. ఈసారి ఆమెను కాదని 33 ఏళ్ల రంజితా సాహుకు బీజేడీ టికెట్ దక్కింది. ఆమె వలస కార్మికుల కోసం 'కొడాల యూత్ ఫోరం' అనే స్వచ్ఛంద సంస్థ నడుపుతున్నారు. సామాన్యుల్లో ఆమెకున్న గుర్తింపు చూసే సీఎం టికెటిచ్చారు. బీజేపీ నుంచి మరోసారి అనితా శుభదర్శిని పోటీ చేస్తున్నారు. ఆమె తండ్రి రామకృష్ణ పట్నాయక్ మాజీ మంత్రి. బిజూ, నవీన్ పట్నాయక్‌లకు అత్యంత సన్నిహితుడు. గంజాం జిల్లాలో ఆయనకు మంచి పేరుంది.



అనితా శుభదర్శిని



రంజితా సాహు

ఒపీనియన్లు వేరువేరయా!

ఎన్నికలగానే ముందుగా ఒపీనియన్ పోల్స్ వెలువడుతుంటాయి. ఫలానా పార్టీ అధికారంలోకి వస్తుందన్న అంచనాలు వెల్లువెత్తుతుంటాయి. ఇవి ఓటర్ల అభిప్రాయాలపై ఎంతో కొంత ప్రభావం చూపుతాయి. ఇలాంటి ఒపీనియన్ పోల్స్ ఫలితాల్లో కచ్చితత్వం ఎంతంటే చెప్పడం కష్టమే. ఈసారి ఎన్డీఏ కూటమి 400 పైచిలుకు లోక్‌సభ స్థానాలు సాధిస్తామని చెబుతుండటం తెలిసిందే. ఎన్డీఏ కూటమికి 372 స్థానాలు రావచ్చని ఎన్డీటీవీ పోల్ ఆఫ్ ఒపీనియన్స్ పోల్స్ సర్వే పేర్కొంది. కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ఇండియా కూటమికి 122 దాకా వస్తాయని అంచనా కట్టింది. కానీ, ఒపీనియన్ పోల్స్ ఫలితాలు కొన్నిసార్లు నిజమైనా, బెడిసికొట్టిన సందర్భాలు కూడా ఎన్నో ఉన్నాయి. సెంటర్ ఫర్ ద స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్ (సీఎస్‌డీఎస్) కూడా ఇదే చెబుతోంది. 1998 నుంచి 2009 ఎన్నికల దాకా వెలువడ్డ పలు ఒపీనియన్ పోల్స్‌ను సీఎస్‌డీఎస్ విశ్లేషించగా ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి...

- సాక్షి, నేషనల్ డెస్క్

లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై అంచనాల్లో తేడాలు

2004, 2009ల్లో పూర్తిగా తప్పిన అంచనాలు



ఎగ్జిట్ పోల్స్ కూడా అంతే!

ప్రీ పోల్ సర్వేలకు, ఎగ్జిట్ పోల్ అంచనాలకు పెద్ద వ్యత్యాసం కనిపించదు. 2003 చివర్లో జరిగిన మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్ ఎన్నికల్లో బీజేపీకి అనుకూల ఫలితాలు రావడంతో ఇండియా షైనింగ్ నినాదంతో 2004 కేంద్రంలో బీజేపీ ముందస్తు ఎన్నికలకు వెళ్లింది. బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీఏ కూటమి 240-250 నుంచి స్థానాలు సాధిస్తుందని మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ ప్రకటించగా ఫలితాలు రివర్సయ్యాయి. ఎన్డీఏ 187కే పరిమితమైంది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో కూడా బీజేపీ సొంతంగా స్పష్టమైన మెజారిటీ సాధిస్తుందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేయలేకపోయాయి. 2016 చివర్లో మోదీ సర్కారు పెద్ద నోట్లను రద్దు చేశాక జరిగిన 2017 యూపీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఎగ్జిట్ పోల్స్ తుస్సుమన్నాయి. హంగ్ వస్తుందన్న వాటి అంచనాలకు భిన్నంగా బీజేపీ ఏకంగా 300 సీట్లతో ఘన విజయం సాధించింది.

అంచనాలు ఇలా..

1998 లోక్‌సభ ముందస్తు ఎన్నికల తరుణంలో వచ్చిన ఒపీనియన్ పోల్స్ ఫలితాలకు దగ్గరగానే ఉన్నాయి. కానీ 1999 లోక్‌సభ ఎన్నికలపై వచ్చిన అంచనాలు అంత కచ్చితంగా లేవు. నాడు బీజేపీ సాధించబోయే స్థానాలను ఒపీనియన్ పోల్స్ ఎక్కువ చేసి చూపాయి. అలాగే 2004 లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఒపీనియన్ పోల్స్ జ్యోతిష్యం ఏమాత్రం పండలేదు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో యూపీఏ కూటమి కేంద్రంలో అధికారంలోకి వస్తుందని పోల్స్ అసలే అంచనా వేయలేకపోయాయి. దాదాపు అన్ని ఒపీనియన్ పోల్స్ ఎన్డీఏ అధికారం నిలబెట్టుకుందనే చెప్పాయి. అలాగే 2009 లోక్‌సభ ఎన్నికల ముందు వేసిన అంచనాలు కూడా తప్పాయి. యూపీఏ అధికారాన్ని నిలుపుకుంటుందని మెజారిటీ ఒపీనియన్ పోల్స్ అంచనా వేయలేకపోయాయి. కానీ యూపీఏ కూటమికి 2004లో 222 లోక్‌సభ స్థానాలు రాగా 2009 ఎన్నికల్లో 262కు పెరిగాయి! 2014 లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం ఎన్డీఏ కూటమి 257 నుంచి 340 సీట్ల వరకు గెలుచుకోవచ్చని ఒపీనియన్ పోల్స్ అభిప్రాయపడ్డాయి. ఎన్డీఏకు 336 స్థానాలొచ్చాయి. కాంగ్రెస్ బలం బాగా పడిపోతుందన్న అంచనాలకు అనుగుణంగా 44 స్థానాలకే పరిమితమైంది. మళ్లీ 2019 ఎన్నికల్లో ఒపీనియన్ పోల్స్ అంచనాలు తప్పాయి. ఎన్డీఏకు 285 స్థానాలకు మించి రావని మెజారిటీ పోల్స్ పేర్కొనగా 353 స్థానాలు వచ్చాయి. బీజేపీ ఒంటరిగానే 303 స్థానాలు సాధించడం తెలిసిందే.

ఈసారి అంచనాలేమిటి?

చాలా సంస్థలు మరోసారి బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీఏనే అధికారం వరిస్తుందని, గతంతో పోలిస్తే బలం పెరుగుతుందని అంచనా వేస్తున్నాయి.

ప్రీ పోల్ సర్వే సంస్థ	ఎన్డీఏ	ఇండియా బ్లాక్	శాంపిల్ పరిమాణం
ఏబీపీ-సీవోటర్	373 (బీజేపీకి 323)	155 (కాంగ్రెస్‌కు 65)	57,566
ఇండియా టీవీ-సీఎన్ఎక్స్	393 (బీజేపీకి 343)	99 (కాంగ్రెస్‌కు 40)	1,60,000
టైమ్స్ నౌ-ఈటీజీ సర్వే	358-398	110-130	3,23,337
ఇండియా టుడే-సీవోటర్	335 (బీజేపీకి 304)	166 (కాంగ్రెస్‌కు 71)	35,801
జీన్యూస్-మ్యాట్రిజ్	377	94	1,67,843

వీటిల్లో వాస్తవం పాళ్లు ఎంతన్నది జూన్ 4న ఫలితాల వెల్లడితోనే స్పష్టం కానుంది.

నిబంధనలు ఇలా...

ఎన్నికల్లో ఎవరికి ఓటేసే అవకాశం ఉందంటూ ఓటర్ల అభిప్రాయాలను తెలుసుకుని రూపొందించేవి ఒపీనియన్ పోల్స్. ఓటేసి పోలింగ్ బూత్‌ల నుంచి తిరిగి వెళ్లే ఓటర్లను ప్రశ్నించి వేసే అంచనాలే ఎగ్జిట్ పోల్స్. ఒపీనియన్ పోల్స్ ఫలితాలను ఎన్నికల నోటిఫికేషన్ రావడానికి ముందు వరకు ప్రకటించవచ్చు. తుది దశ పోలింగ్ ముగిశాక ఎగ్జిట్ పోల్స్ విడుదల చేసుకోవచ్చు.

తప్పడానికి కారణమేమిటి?

ఒపీనియన్ పోల్స్ అంచనాలు చాలా వరకు తారుమారు కావడానికి ఎన్నో కారణాలున్నాయి. అంచనాల్లో తప్పులు ఎంత తక్కువగా ఉంటే ఫలితాలు కచ్చితత్వానికి అంత దగ్గరగా ఉంటాయి.

- 1999 లోక్‌సభ ఎన్నికల్లో ఒపీనియన్ పోల్స్ అంచనాలు, వాస్తవ ఫలితాల మధ్య 20 సీట్ల దాకా తేడా ఉంది.
- 2009 ఎన్నికల్లో ఈ అంతరం 25-60 స్థానాలకు పెరిగింది. 2014లోనైతే ఏకంగా 50-100 స్థానాల తేడా వచ్చింది.
- ఓటర్ల అభిప్రాయాలు తెలుసుకుని తదనుగుణంగా ఈ సంస్థలు అంచనాలు వేస్తుంటాయి. అలా ఒక్కో పార్టీ/కూటమికి వచ్చే స్థానాలను లెక్కగడుతుంటాయి.
- ఇది కాలం చెల్లిన పాత విధానమని నిపుణులు అంటున్నారు.
- పోలింగ్ ఏజెన్సీలు సర్వేకు కావాల్సిన బలమైన వసతులు లేకపోవడం కూడా అంచనాల్లో తప్పులు పెరగడానికి కారణం.
- ప్రతి నియోజకవర్గం నుంచి శాంపిల్ సైజు వీలైనంత ఎక్కువగా ఉండాలి. ఇందుకు భారీగా సిబ్బంది, నిధులు, సమయం కావాలి.
- కానీ మన దగ్గర పోల్ ఏజెన్సీలకు ఈ వనరుల్లేవు.
- పార్టీల సంఖ్య ఎంత ఎక్కువగా ఉంటే, ఫలితాల అంచనాలు అంత కష్టమవుతాయని సీఎస్‌డీఎస్ సైతం చెబుతోంది.
- 2014 ఎన్నికల్లో 464 రాజకీయ పార్టీలు పోటీ చేశాయి. 1998తో పోలిస్తే ఇది రెట్టింపు!
- పోలింగ్ ఏజెన్సీలు పోటాపోటీగా పెరుగుతున్నాయి. దాంతో చాలా శాస్త్రీయంగా పోల్ సర్వేలు నిర్వహించకుండానే ఫలితాలు వెల్లడిస్తున్నాయి.
- సర్వే అంచనాలు ఎందుకు తప్పాయని చాలా పోలింగ్ ఏజెన్సీలు విశ్లేషణ చేసుకోవడం లేదు.
- పైగా సర్వే ఫలితాలను ఎలా రూపొందించారో ఆధారాలను కూడా వెల్లడించడం లేదు.
- ప్రీ పోల్ అంచనాలకు సంబంధించి జవాబుదారీ లేకపోవడం కూడా సమస్యకు కారణమే.



భుజాన సంచి. అందులో జాగ్రఫీ పుస్తకం, ఒక జత బట్టలు. మెడలో ఎర్ర కండువా. ముఖాన చెరగని చిరునవ్వు. మండే ఎండల్లోనూ అలుపెరుగని ప్రచారం. వయసు 30 ఏళ్లు. పేరు దీప్సితా ధర్. బెంగాల్ వామపక్ష రాజకీయాల్లో కొత్త ముఖం. సీపీఎం సానుభూతిపరురాలిగా మొదలై, ఢిల్లీలో విద్యార్థి నాయకురాలిగా ఎదిగి ఇప్పుడు సొంత బెంగాల్‌లో శ్రీరాంపూర్ లోక్‌సభ స్థానం అభ్యర్థిగా బరిలోకి దిగారు. 'ఖేలా హోబ్' (గేమ్ ఈజ్ ఆన్) అన్న తృణమూల్ అధినేత్రి, సీఎం మమతా దీదీ ఇచ్చిన నినాదానికి బదులుగా 'నేను సైతం సిద్ధం' అంటూ తలపడుతున్నారు...

- సాక్షి, నేషనల్ డెస్క్

పరిచయం

● దీప్సితా ధర్

యువ పిడికిలి

టామ్ బోయ్...

దీప్సిత పశ్చిమబెంగాల్‌లోని హౌరాలో 1993లో జన్మించారు. తండ్రి పీయూష్ ధర్. తల్లి దీపికా ఠాకూర్ చక్రవర్తి. తాత పద్మనిధి ధర్. అంతా సీపీఎం రాజకీయాల్లో ఉన్నారు. బాల్యం నుంచి టామ్ బోయ్‌లా పెరిగిన దీప్సితకు రాజకీయాలంటే ఆసక్తి ఉండేది కాదు. ఇంట్లో వాళ్లని చూసి రాజకీయాలు చేస్తే కుటుంబానికి సమయం ఇవ్వలేమని నిర్ణయించుకున్నారు. కానీ తర్వాత అభిప్రాయం మారింది. దక్షిణ కోల్‌కతాలోని అశుతోష్ కాలేజీలో జియాలజీ చదివాక ఢిల్లీ జేఎన్‌యూలో జాగ్రఫీలో పీజీ, ఎంఫిల్ చేశారు. పాపులేషన్ జాగ్రఫీలో పీహెచ్‌డీ చేస్తున్నారు.

అసెంబ్లీ ఎన్నికలతో అరంగేట్రం...

కోల్‌కతాలో కాలేజీ రోజుల నుంచీ దీప్సిత విద్యార్థి రాజకీయాల్లో చురుగ్గా ఉన్నారు. తర్వాత ఎస్ఎఫ్ఐ జేఎన్‌యూ అధ్యక్షురాలిగా, కార్యదర్శిగా పనిచేశారు. రోహిత్ వేముల మృతి సందర్భంగా జరిగిన ఉద్యమంలో, సీఏఏ వ్యతిరేక నిరసనల్లో పాల్గొన్నందుకు కేసులు ఎదుర్కొన్నారు. ఇంగ్లిష్, హిందీ, బెంగాలీల్లో అద్భుతంగా, అనర్గళంగా మాట్లాడే దీప్సిత జాతీయ చానళ్లలో రాజకీయ చర్చల్లో తరచూ పాల్గొంటారు. 2011లో బెంగాల్లో సీపీఎం అధికారం కోల్పోవడం ఆమెను బాధించింది. అదే పదేళ్ల తర్వాత ఎన్నికల రాజకీయాలవైపు నడిపించింది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో బల్లి నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఇప్పుడు శ్రీరాంపూర్ లోక్‌సభ స్థానంలో సీపీఎం తరఫున రాజకీయ ఉద్దండులతో పోరాడుతున్నారు.

మిస్టర్ ఇండియా వర్సెస్ మిస్ యూనివర్స్

రెండు నెలల ముందునుంచే దీప్సిత ప్రచారం మొదలుపెట్టారు. తృణమూల్, బీజేపీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు. తృణమూల్‌కు ఓటేయడమంటే బీజేపీకి ఓటేయడమే. తృణమూల్ ఎమ్మెల్యేలు, ఎంపీలు గెలిచాక బీజేపీలో చేరారు. సీపీఎం నుంచి మాత్రం ఎవరూ బీజేపీలోకి వెళ్లలేదు. ''మిస్టర్ ఇండియా సినిమాలో అనిల్ కపూర్ వాచ్ పెట్టుకుంటే మాయమైపోయేవాడు. మన ఎంపీలదీ అదే పరిస్థితి. గెలుస్తారు, మాయమైపోతారు'' అంటూ బీజేపీ అభ్యర్థి కళ్యాణ్ బెనర్జీపై విమర్శలు గుప్పిస్తున్నారు. దీనికి కళ్యాణ్ కౌంటరిస్తూ దీప్సితను మిస్ యూనివర్స్‌గా అభివర్ణించారు. ''దేశమంతా పర్యటించి వచ్చారు. ఇప్పుడు మిస్టర్ ఇండియాను చూసేందుకు శ్రీరాంపూర్ వచ్చారు' అంటూ ఆమెను ఎద్దేవా చేశారు. ఈ వ్యాఖ్యలపై రాష్ట్ర సీపీఎం తీవ్రంగా మండిపడుతోంది.

బాధించిన 'రంగు'

తన బాల్యం కాస్త బాధాకరంగానే గడిచిందంటారు దీప్సిత. తల్లిదండ్రులిద్దరిదీ మంచి రంగు. తాను మాత్రం నల్లగా ఉంటుంది. దాంతో ఇరుగుపొరుగు మొదలు అందరూ 'అమ్మాయేంటి ఇంత నల్లగా ఉం'దని అడిగేవారట. బయటికి వెళ్లినా అదే పరిస్థితి. దాంతో నలుగురిలోకి వెళ్లాలంటే ఒక రకమైన భయం! ఒకసారి చూసిన వారు మళ్లీ పరికించి చూస్తే తన రంగు గురించేమోననే బాధ తెలియకుండానే కలిగేది. తర్వాత ఆ ఆత్మన్యూనత నుంచి బయటపడ్డారామె. ఇప్పుడు బెంగాల్‌లో భయంకరమైన ఎండలు. అయినా ప్రచారంలో దీప్సిత కళ్లజోడు కూడా పెట్టుకోవడం లేదు. ఎందుకంటే, ''అందరూ నా కళ్లలోకి చూడగలగాలి. నా మనసులో ఏముందో అర్థం చేసుకోగలగాలి. కళ్లను అద్దాలతో మూసేస్తే ఎలా?'' అని ప్రశ్నిస్తారామె.

న్యూస్ మేకర్

ఒక సినిమా నిర్మాణంలో మామూలుగా అయితే కొన్ని నగలు తెప్పిస్తారు. కాని 'హీరామండీ' వెబ్ సిరీస్ కోసం 300 కిలోల నగలు అవసరమయ్యాయి. అవి కూడా బ్రిటిష్ కాలం నాటివి. మొగల్ సంస్కృతీ వారసత్వానివి. ఢిల్లీలో శ్రీ పరమణి జువెలర్స్‌కు చెందిన అన్ను గుప్తా భర్త వినయ్‌తో కలిసి మూడేళ్ల పాటు శ్రమించి ఈ నగలు తయారు చేశారు. నత్, ఝూమర్, హాత్ ఫూల్, పస్సా, టీకా... ఎన్నో నగలు. అన్ను గుప్తా పరిచయం.

సినిమా నగల స్పెషలిస్ట్


భర్త వినయ్‌తో అన్ను గుప్తా











స్త్రీలు, అలంకరణ అవిభాజ్యం. స్త్రీలు, ఆభరణం కూడా అవిభాజ్యమే. ఆభరణంతో నిండిన అలంకరణ భారతీయ స్త్రీలలో వేల సంవత్సరాలుగా ఉంది. బంగారం, వెండి, వజ్రాలు, రత్నాలు, కెంపులు, మరకతాలు, ముత్యాలు... వీటితో తయారైన ఆభరణాలు రాచరిక స్త్రీలకు ప్రీతికరమైనవి. ఐశ్వర్యవంతులకు స్థాయిని కలిగించేవి. అయితే వీరే కాకుండా కళాకారులకు కూడా ఆభరణాలు కీలకమైనవి. మొగలుల కాలంలో విరాజిల్లిన తవాయిఫ్‌లు (రాజ నర్తకీమణులు) తమ ప్రదర్శనల్లో ఆకర్షణ కోసం భారీ ఆభరణాలను ఉపయోగించేవారు. మరి వారి గురించిన గాథను తెరకెక్కించేటప్పుడు ఆ ఆభరణాలు ఎక్కడి నుంచి వస్తాయి? వాటిని అందించడానికి ముందుకు వచ్చిన జువెలర్స్ అన్ను గుప్తా, ఆమె భర్త వినయ్ గుప్తా.

హీరా మండి

మొగలుల కాలంలో లాహోర్‌లోని ఒక ఏరియా పేరే హీరా మండి. దాని అంతకు ముందు పేరు షాహీ మొహల్లా. అంటే రాచవాడ. పక్కనే ఉన్న కోట నుంచి నవాబులు నడిచి వచ్చేంత దూరంలో ఉండే కొన్ని భవంతుల సముదాయమే షాహీ మొహల్లా. ఇక్కడ తవాయిఫ్‌లు ఉండేవారు. వీరు ఆట, పాటల్లో నిష్ణాతులు. సాయంత్రమైతే వీరి భవంతుల్లో ప్రదర్శనలు జరిగేవి. నవాబులు, శ్రీమంతులు, రసికులు వీటికి హాజరయ్యి తిలకించేవారు. ఈ తవాయిఫ్‌లకు విశేష పలుకుబడి ఉండేది. వీరి దగ్గర ఐశ్వర్యం ఉండేది. రాచరిక రహస్యాలు మొదట వీరికే తెలిసేవి. వీరు మంత్రాంగం నడిపేవారు. 1857 సైనిక తిరుగుబాటులో కూడా వీరు పాల్గొన్నారు. కాని బ్రిటిష్ కాలం వచ్చేసరికి ఇదంతా గతించిపోయింది. షాహీ మొహల్లా కాస్తా సరుకులు అమ్మే మండీగా హీరా మండీగా మారింది. ఆనాడు వెలిగిన వారంతా అంతరించిపోయారు. వేశ్యలుగా మారారు. వారి గాథనే దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ 'హీరామండీ' పేరుతో భారీ వెబ్ సిరీస్‌గా తీశాడు. నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతోంది.

భారీ నగలు

పర్‌ఫెక్షనిస్ట్ అయిన దర్శకుడు సంజయ్ లీలా బన్సాలీ 'హీరామండీ'లో తవాయిఫ్‌ల కోసం నాటి మొగల్ తరహా నగలు కావాలని భావించాడు. గతంలో తన 'బాజీ రావు మస్తానీ' కోసం పని చేసిన ఆభరణాల శిల్పులైన అన్ను గుప్తా, ఆమె భర్త వినయ్ గుప్తాలను సంప్రదించాడు. వీరు ఢిల్లీవాసులు. వీరికి శ్రీ పరమణి జువెలర్స్ అనే నగల కార్ఖానా, షోరూమ్ ఉన్నాయి. 200 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ కార్ఖానాలో ఖరీదైన ఆభరణాలు దొరుకుతాయి. 'కథ విన్న వెంటనే టైటిల్ దగ్గరి నుంచి ప్రతి పాత్రా ఆభరణాలతో ముడిపడి ఉన్నందుకు ఉత్సాహం వచ్చింది. చరిత్రలోకి వెళ్లి పరిశోధించి నాటి ఆభరణాలు తయారు చేయాలి. మొగలులు కళాప్రియులు. వారి కాలంలో ఆభరణాలలో కెంపులు. ముత్యాలు, వజ్రాలు విరివిగా వాడేవారు. ఆపాదమస్తకం అలంకరించుకోవడానికి వందల రకాల ఆభరణాలు ఉండేవి. అవన్నీ మేము తయారు చేయడానికి ముందుకు వచ్చాం. నేను, నా భర్త వినయ్ మూడేళ్లు కష్టపడి ఈ నగలు తయారు చేయించాం' అని తెలిపింది అన్ను గుప్తా.

అసలు సిసలు బంగారంతో

''హీరామండీ కోసం కొన్ని ముఖ్యమైన నగలు అసలు బంగారంతోనూ, మిగిలినవి బంగారు పూత కలిగిన వెండితోనూ తయారు చేయించాలని నిర్ణయించాం. వజ్రాలు, ముత్యాలు అన్నీ ఒరిజినల్‌వే వాడాం. మా కార్మికులు మూడేళ్ల పాటు శ్రమపడి మూడు గదుల్లో పది వేల చిన్న, పెద్ద ఆభరణాలు తయారు చేశారు. వీటిని తూస్తే 300 కిలోలు ఉంటాయి. నథ్ (ముక్కు పుడక) దగ్గరి నుంచి నెమలి నెక్లెస్ వరకూ వీటిలో ఉన్నాయి. షూటింగ్‌లో ప్రత్యేక గార్డులు వీటికి కాపలా ఉన్నారు. 'మేం చేసిన ఆభరణాలు పాత్ర కోసం ధరించి వీటితో పారిపోతే ఒక సినిమా తీసేన్ని డబ్బులొస్తాయి' అనేది నటి రిచా చద్దా సరదాగా. హీరామండీని చూస్తే ఒక పాత్ర ధరించిన పాపిడి బిళ్లతో మరో పాత్ర ధరించిన పాపిటబిళ్లకు పోలిక ఉండదు. గాజులు, ఉంగారాలు, చెవి కమ్మలు... తెర మీద అద్భుతంగా ఆవిష్కృతమైన తీరుతో మా కష్టం వృథా పోలేదనిపించింది'' అని సంతోషాన్ని వ్యక్తం చేసింది అన్ను గుప్తా.

ఢిల్లీకి చెందిన పవిత్రాచారి గురించి ఒక్క మాటలో చెప్పాలంటే... మల్టీ–టాలెంట్ ఆర్టిస్ట్. ప్లేబ్యాక్ సింగర్, సాంగ్ రైటర్, వోకలిస్ట్, కంపోజర్‌గా రాణిస్తోంది. 'కళ కళ కోసం కాదు. సమాజం కోసం' అని నమ్మిన పవిత్ర తన 'కళ'తో వివిధ స్వచ్ఛందసేవా సంస్థలతో కలిసి పనిచేస్తోంది. తాజాగా 'ఫోర్బ్స్ 30 అండర్ 30 ఆసియా' జాబితాలో 'ఎంటర్‌టైన్‌మెంట్' విభాగంలో చోటు సాధించింది...

అపురూప స్వరాల అన్వేషి

మల్టీ టాలెంట్


పవిత్ర

దశాబ్దకాలం పాటు ఇండిపెండెంట్ ఆర్టిస్ట్‌గా తనదైన గుర్తింపు తెచ్చుకుంది పవిత్ర. ఆ తరువాత సినిమా రంగంలోకి అడుగుపెట్టి ఏఆర్ రెహమాన్‌లాంటి దిగ్గజాలతో కలిసి పని చేసింది.

ప్రతి దిగ్గజం నుంచి కొత్త విషయాలు నేర్చుకోవడంలో ముందుంటుంది పవిత్ర. 'శూన్యం నుంచి కూడా రెహమాన్ సంగీతం సృష్టించగలరు' అంటుంది.

65వ గ్రామీ అవార్డ్‌లలో పవిత్ర పాట 'దువా' బెస్ట్ గ్లోబల్ మ్యూజిక్ ఆల్బమ్ కేటగిరీకి నామినేట్ అయింది. హెచ్‌సీఎల్, ఇండిగో ఎయిర్‌లైన్స్‌లాంటి ప్రముఖ కంపెనీల యాడ్స్‌లో నటించింది.

'అనిరుథ్ వర్మ కలెక్టివ్'లో భాగంగా యూఎస్‌లో ఎన్నో ప్రాంతాలలో తన సంగీతాన్ని వినిపించింది. 'చిత్రహార్ లైవ్' టైటిల్‌తో చేసిన ఇన్‌స్టాగ్రామ్ సిరీస్‌కు మంచి పేరు వచ్చింది. 'ఈ ప్రాజెక్ట్ ద్వారా సంగీతానికి సంబంధించిన నాస్టాల్జియాను హైలైట్ చేశాను. వ్యక్తిగతంగా, ఆన్‌లైన్‌లో ఈ ప్రాజెక్ట్‌కు ఎంతో స్పందన వచ్చింది' అంటుంది పవిత్ర.

గత సంవత్సరం కొన్ని అద్భుతమైన ఓటీటీ ప్రాజెక్ట్‌లలో భాగమైన పవిత్ర ఆ ప్రాజెక్ట్‌ల నుంచి కొత్త విషయాలు నేర్చుకోవడమే కాదు, తన ప్రతిభతో వాటికి కొత్తదనాన్ని తెచ్చింది.

'ఢిల్లీ అమ్మాయి'గా పాపులర్ అయినప్పటికీ పవిత్ర మూలాలు చెన్నైలో ఉన్నాయి. తన సంగీతయాత్రలో భాగంగా ఢిల్లీ, చెన్నై, ముంబై నగరాల మధ్య తిరుగుతుంటుంది. ఇప్పుడు చెన్నైలో ఎక్కువ రోజులు ఉండడానికి ప్రాధాన్యత ఇస్తోంది. హిందీ పాటలే కాదు తమిళం, తెలుగు, కన్నడం, మలయాళంలాంటి భాషల్లోనూ పాడుతోంది.

మల్టిపుల్ ప్రాజెక్ట్‌లలో భాగం కావడమే కాదు వాటిపై తనదైన ముద్ర వేయడంలో ప్రత్యేకత సాధించింది పవిత్ర.

'ఒకేదగ్గర ఉండిపోవడం కంటే నిరంతర అన్వేషణతో కొత్త దారులు వెదుక్కోవడం నాకు ఇష్టం. ప్రతి దారిలో సవాళ్లు ఎదురవుతుంటాయి. వాటిని అధిగమించి ముందుకు వెళ్లడం అంటే ఇష్టం. కొత్త ఆసక్తి అన్వేషణకు కారణం అవుతుంది. ఆ అన్వేషణలో భాగంగా కంఫర్ట్ జోన్ నుంచి బయటికి వచ్చి కొత్త ప్రపంచంలోకి వెళ్లే అవకాశం దొరుకుతుంది. మల్టిపుల్ ప్రాజెక్ట్‌లలో గుర్తింపు తెచ్చుకోవడం అదృష్టంగా భావిస్తున్నాను' అంటుంది పవిత్ర.

సంగీతం, సామాజికం అనేవి రెండు వేరు వేరు ప్రపంచాలని ఎప్పుడూ అనుకోలేదు పవిత్ర. ఆర్ట్స్–బేస్డ్ థెరపిస్ట్‌గా ఎంతో మందికి సాంత్వన చేకూర్చింది. వారి నడకకు కొత్త బలాన్ని ఇచ్చింది.

'లైఫ్‌స్కిల్స్ ఎడ్యుకేషన్ విత్ మ్యూజిక్' కాన్సెప్ట్‌తో వివిధ సంస్థలతో కలిసి పనిచేస్తోంది. వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల కోసం సంగీత కచేరీల ద్వారా నిధుల సేకరణ కార్యక్రమాల్లో పాల్గొంటుంది.

పాటే కాదు పరిశోధన కూడా..

పవిత్రకు సంగీతప్రపంచం అంటే ఎంత ఇష్టమో, సంగీత ధోరణులకు సంబంధించిన పరిశోధన అంటే కూడా అంతే ఇష్టం. ప్రఖ్యాత గాయని శుభాముద్గల్ దగ్గర సంగీతంలో శిక్షణ తీసుకున్న పవిత్ర 'ఖాయాల్'పై ఆసక్తి పెంచుకోంది. ఈ సంగీత ప్రపంచంలోని స్త్రీవాద ధోరణుల గురించి లోతైన పరిశోధన చేసింది.

భారత ఉపఖండంలో హిందుస్థానీ శాస్త్రీయ సంగీతానికి సంబంధించిన ప్రధాన రూపం... ఖాయాల్. అరబిక్ నుంచి వచ్చిన ఈ మాటకు అర్థం... ఊహ.

హిందుస్థానీ శాస్త్రీయ సంగీత విద్యార్థిగా ఖాయాల్ సంగీతంలో భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నాను. పరిశోధన ఫలితంగా కొత్త విషయాల పట్ల అవగాహన ఒక కోణం అయితే నా గానాన్ని స్వీయ విశ్లేషణ చేసుకోవడం మరో కోణం' అంటున్న పవిత్ర ఖాయాల్ సంగీతానికి సంబంధించి రిసోర్స్ బ్యాంక్‌ను తయారు చేసింది. దీనికి ముందు ఖాయాల్ రచనలు, వాటి మూలం, సామాజిక, సాంస్కృతిక నేపథ్యాన్ని అర్థం చేసుకోవడానికి ఎంతో అధ్యయనం చేసింది. ఎంతోమంది నిపుణులతో మాట్లాడింది.

బ్యూటిప్స్

మంచి కాఫీ లాంటి బ్యూటీ

కాఫీ మనకు గుడ్‌మాణింగ్ చెప్పడమే కాదు, గుడ్‌లుక్‌ను కూడా ఇస్తుంది. కాఫీ గింజల పొడి (ఇన్‌స్టంట్ మిక్స్‌లు కాదు)తో బ్యూటీ ప్యాక్‌లను చూద్దాం.





- పొడి చర్మాన్ని ఆరోగ్యవంతం చేయడంలో కాఫీ, ఆలివ్ ఆయిల్ బాగా పని చేస్తాయి. టేబుల్ స్పూన్ కాఫీ పొడిలో సగం టేబుల్ స్పూన్ ఆలివ్ ఆయిల్ వేసి కలపాలి. ఈ ప్యాక్‌ను ముఖం, మెడ, చేతులకు పట్టించాలి. పదిహేను నిమిషాల తర్వాత వేళ్లతో వలయాకారంగా మర్దన చేస్తూ ఆరిన తర్వాత నీటితో శుభ్రం చేయాలి.
- ముఖం మీద మచ్చలు, పిగ్మెంటేషన్ తగ్గిపోయి చర్మం నిగనిగలాడాలంటే... అర టేబుల్ స్పూన్ కాఫీ పొడిలో అంతే మోతాదు తేనె, టీ స్పూన్ నిమ్మరసం కలిపి ముఖానికి పట్టించి సున్నితంగా మసాజ్ చేయాలి. పది నిమిషాల తర్వాత చన్నీటితో శుభ్రం చేయాలి. ఇలా రెండు రోజులకోసారి చేస్తుంటే ముఖం కాంతివంతమవుతుంది.
- కళ్ల కింద నల్లటి వలయాలు, చర్మం ఉబ్బి వేళ్లాడుతున్నట్లయితే (పఫీ ఐస్) రాత్రి పడుకునే ముందు కాఫీ డికాషన్‌లో దూది ముంచి కళ్ల చుట్టూ పట్టించి, కళ్లు మూసుకుని పది నిమిషాల సేపు రెప్పల మీద ఉంచాలి. ఇలా రోజూ చేస్తుంటే వారం రోజుల్లో కళ్లు ఆరోగ్యంగా, అందంగా తయారవుతాయి.
- మొటిమలు పోవాలంటే మూడు టీ స్పూన్‌ల కాఫీ పొడిలో టేబుల్ స్పూన్ పెసరపిండి లేదా శనగపిండి, మూడు టీ స్పూన్‌ల తేనె, రెండు టీ స్పూన్‌ల కలబంద గుజ్జు, లావెండర్ ఎసెన్షియల్ ఆయిల్ రెండు చుక్కలు వేసి కలపాలి. ఈ ప్యాక్‌ను ముఖానికి పట్టించి పదిహేను నిమిషాలకు పూర్తిగా ఆరిపోతుంది. అప్పుడు మెల్లగా వేళ్లతో వలయాకారంగా మర్దన చేస్తూ చన్నీటితో శుభ్రం చేయాలి.

హెల్త్ టిప్స్

మీకు తెలుసా?

జామపండుకు పేదల ఆపిల్ అని పేరు. అయితే పండే కాదు... ఆకుల వల్ల కూడా ఎన్నో ప్రయోజనాలున్నాయి. ఒకటి రెండు జామాకులను తీసుకుని శుభ్రంగా కడిగి వాటిని నీటిలో వేసి పది నిమిషాల పాటు మరిగించాలి. అనంతరం ఆ నీటిని వడకట్టి అందులో కొద్దిగా నిమ్మరసం, తేనె కలిపి హెర్బల్ టీ మాదిరిగా తాగాలి. రోజుకు ఇలా రెండు సార్లు తాగితే చాలు... ఈ కింది ప్రయోజనాలు కలుగుతాయి.



- ముఖం మీద ఉండే మొటిమలు, మచ్చలు పోతాయి. చర్మం కాంతివంతంగా, మృదువుగా మారి మెరుస్తుంది. యవ్వనంగా కనిపిస్తారు.
- డయాబెటిస్ అదుపులో ఉంటుంది
- అధిక బరువును తగ్గించడంలో జామ ఆకులు అద్భుతంగా పనిచేస్తాయి. ఇవి శరీర మెటబాలిజంను పెంచి కొవ్వును కరిగిస్తాయి. దీంతో బరువు తగ్గడం తేలికవుతుంది.
- స్త్రీలు నెలసరి సమయంలో కడుపు నొప్పి, ఒళ్లు నొప్పులతో సతమతం అవుతుంటారు. అలాంటి వారికి జామ ఆకులు ఎంతగానో మేలు చేస్తాయి. నొప్పులను తగ్గిస్తాయి.
- కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గించడంలో జామ ఆకులు ఎంతగానో ఉపయోగపడతాయి. దీంతో రక్తనాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. హార్ట్ ఎటాక్ ముప్పు రాకుండా గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

● మాయా టాండన్

డాక్టర్ రోడ్ సేఫ్టీ

ఉద్యోగ విరమణ తర్వాత చాలామంది విశ్రాంత జీవనాన్ని ప్రశాంతంగా గడపాలనే ఉద్దేశంతో ఇంటికే పరిమితం అవుతుంటారు. కానీ, జైపూర్ వాసి డాక్టర్ మాయా టాండన్ మాత్రం తన రిటైర్మెంట్ జీవితాన్ని రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నవారిని కాపాడేందుకు అంకితం చేసింది. స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి లక్షా ముప్పై మూడు వేల మందికి రోడ్డు భద్రతకు సంబంధించిన శిక్షణ ఇచ్చింది. జీవితం పట్ల ఉత్సాహం, సమాజం కోసం పనిచేయాలనే తపనతో గత ముప్పై ఏళ్లుగా డాక్టర్ మాయా టాండన్ చేస్తున్న కృషికి గానూ ఆమెను ఈ ఏడాది పద్మశ్రీ పురస్కారం వరించింది. వైద్యసేవలోనే తరిస్తున్న టాండన్ గురించి ఆమె మాటల్లోనే...


డాక్టర్ మాయా టాండన్


పద్మశ్రీ అవార్డు అందుకుంటూ...

''అజ్మీర్‌లో పుట్టి పెరిగాను. చిన్ననాటి నుంచి కుటుంబ మద్దతు నాకు ఎక్కువే ఉంది. అన్ని బోర్డ్ పరీక్షలలో మంచి మార్కులు సాధించి, అజ్మీర్‌లోని మెడికల్ స్కూల్‌లో చేరాను. జీవితమంతా నాదైన మార్గాన్ని ఎంచుకునే స్వేచ్ఛ నాకు లభించింది. అజ్మీర్‌లోని హాస్పిటల్‌లో వైద్యురాలిగా చేరాను. అక్కడే టాండన్‌తో జరిగిన పరిచయం పెళ్లికి దారితీసింది. పెళ్లి తర్వాత జైపూర్‌కు వెళ్లాను. కొడుకు పుట్టిన తర్వాత అనస్తీషియాలజీలో డిప్లొమా చేశాను. డిప్లొమా పూర్తయ్యేనాటికి కూతురు కూడా పుట్టింది. ఆ తర్వాత అనస్తీషియాలోనే ఎమ్మెస్ కూడా చేశాను. జైపూర్‌లోని మెడికల్ కాలేజీలో అనస్తీషియాపై స్పీచ్‌లు ఇచ్చేదాన్ని. అందులో భాగంగా పీడియాట్రిక్ అనస్తీషియా కోసం లండన్ ఫెలోషిప్‌కు హాజరయ్యాను. అక్కణ్ణుంచి వచ్చాక జైపూర్‌లో పనిచేయడం ప్రారంభించాను.

మూడు రోజుల కోర్సు తిప్పిన మలుపు

సాధారణంగా అందరికీ అనస్తీషియాలజిస్ట్ పాత్ర తెర వెనుక పనిగా కనిపిస్తుంది. నేను మాత్రం రోగి జీవితం అనస్తీషియాలజిస్ట్ పై ఆధారపడి ఉంటుందని నమ్ముతాను. 1975లో సవాయ్ మాన్‌సింగ్ హాస్పిటల్‌లో సూపరింటెండెంట్‌గా, అనస్తీషియా హెడ్‌గా పనిచేస్తూ దాని నిర్వహణను చూశాను. 1985లో పదవీ విరమణ చేసే సమయంలో జైపూర్‌లోని రాజస్థాన్ పోలీసు అకాడమీ నన్ను సంప్రదించి, రోడ్డు భద్రత, ప్రాణాలను రక్షించడంపై మూడు రోజులు కోర్సు ఇవ్వాలని కోరింది. రిటైర్‌మెంట్ తర్వాత అదే నా జీవిత గమనాన్ని మలుపు తిప్పుతుందని తెలియకనే వారి అభ్యర్థనను అంగీకరించాను. మూడు రోజుల కోర్సు చాలా సక్సెస్ అయ్యింది. దీంతో జైపూర్, చుట్టుపక్కల హైవేలపై పోస్ట్ చేసే సీనియర్ అధికారులందరి కోసం మరొక కోర్సు ఏర్పాటు చేశారు. ఒక ఫొటోగ్రాఫర్ ఆ ఈవెంట్ ఫొటోలు తీయడానికి వచ్చాడు. కొన్ని నెలల తర్వాత అతను నాకు ఫోన్ చేసి, నేను అతని ప్రాణాలను రక్షించానని చెప్పాడు. అదెలా అని ఆశ్చర్యపోయాను. ఆ ఫొటోగ్రాఫర్ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. అతని తొడల వెనక భాగంలో రక్తస్రావం అవుతూ ఉంది. అతని చుట్టూ ఉన్న వ్యక్తులు ఎలా సహాయం చేయాలో తెలియక ప్రమాదం తాలూకు ఫొటోలు తీసుకుంటున్నారు. తనను ఎత్తి, ఒక చోట ఎలా కూర్చోబెట్టాలో చెప్పి, రక్తస్రావం తగ్గేలా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సాటివారికి వివరించి, ప్రమాదం నుంచి బయటపడిన విధం గురించి తెలియజేశాడు. దీంతో ఆ కోర్సు ప్రాముఖ్యత ఎంతటిదో గ్రహించాను. సమయానుకూలంగా తీసుకునే జాగ్రత్తలు మన ప్రాణాలను ఎలా కాపాడతాయో ఆ రోజు మరింతగా కళ్లకు కట్టాయి. ఎక్కడైనా ప్రమాదం జరిగితే చుట్టూ అందరూ గుమికూడుతారు. ఆ గుంపులోని వ్యక్తులలో ఎవరికీ ప్రాణాలను రక్షించే దశలు తెలియవు. దీంతో భారతదేశంలో రహదారి భద్రత తీరుతెన్నులు మార్చాలనే ఉద్దేశ్యంతో 'సహాయ' ట్రస్ట్‌ను ప్రారంభించాను. అప్పటి నుండి 1,33,000 మంది వ్యక్తులకు ఉచిత కోర్సులు, సెమినార్లు, ఉపన్యాసాలు ఇస్తూ వచ్చాను.

కోర్సులు అన్నీ ఉచితమే

కార్డియోపల్మొనరీ రిససిటేషన్ (సీపీఆర్), ప్రమాదాలను ఎదుర్కోవడానికి సరైన నిర్వహణ పద్ధతులు, అవగాహన పెంచడం దీని లక్ష్యం. పోలీసు విచారణ నుండి లైఫ్ సేవర్‌ను రక్షించే వివిధ చట్టాల గురించి కూడా కోర్సులో పాల్గొనేవారికి తెలియజేస్తాం. గాయపడిన వ్యక్తికి సిపీఆర్, ప్రథమ చికిత్స ఎలా అందించాలో మేం చూపిస్తాం. ప్రజలను చేరుకోవడానికి మాకు వివిధ మార్గాలు ఉన్నాయి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో సెమినార్లు ఇస్తాం. వర్క్‌షాప్‌లు, తరగతులను కూడా నిర్వహిస్తాం. అదనంగా ర్యాలీలు చేస్తాం. వీధి నాటకాలు కూడా వేయిస్తాం.

ఒక చిన్న కోర్సులో మొదటి పది సెకన్లలో ఏమి చేయాలో వారికి సూచనలు అందించడానికి ప్రాధాన్యత ఇస్తాం. ఎవరికైనా ప్రమాదం జరిగినప్పుడు తలకు గాయాలు, రక్తస్రావం కోసం తనిఖీ చేయమని చెబుతాం. సమస్య ఏమిటో నిర్ధారించుకున్న తర్వాత ఆ వ్యక్తికి ఊపిరి, గుండెకు సంబంధించిన సమస్య ఉంటే సీపీఆర్‌ని ఆశ్రయించడం ఉత్తమమైన మార్గం. అంతర్గత రక్తస్రావం, కార్డియాక్ అరెస్ట్ వంటి సమస్యలలో సీపీఆర్ మాత్రమే సహాయం చేస్తుంది. మాల్స్, విమానాశ్రయాలు వంటి బహిరంగ ప్రదేశాల్లో అత్యవసర సేవలు ఉండేలా ప్రభుత్వ సంస్థలతో కలిసి ట్రస్ట్ పని చేస్తుంది.

అవగాహన లోపమే ప్రధాన అడ్డంకి

వర్క్‌షాప్‌లకు హాజరయ్యేందుకు ప్రజలను తీసుకురావడం మేం ఎదుర్కొంటున్న ప్రధాన అడ్డంకి. భారతీయ ప్రజానీకం ఎప్పుడూ బిజీ బిజీగా ఉంటారు. కొంత సమయాన్ని అవగాహనకు కేటాయించాలనుకోరు. మా కోర్సులకు వచ్చి, విషయాల పట్ల అవగాహన పెంచుకోకపోవడంతో ఇంకా తక్కువ ప్రతిస్పందన రేటునే చూస్తున్నాం. రోడ్డు ప్రమాదాల్లో భారతదేశం ముందుంది. ప్రతిస్పందనలో మాత్రం చాలా వెనుకుంది. దీంతో మన మూలాలైన గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి, ప్రజలను రక్షించడానికి కావల్సిన శిక్షణ ఇవ్వాలని ప్లాన్ చేస్తున్నాం. కోర్సులో పాల్గొన్న వ్యక్తులు స్వచ్ఛందంగా సేవ చేయడానికి లైఫ్‌సేవర్‌కి తగిన పరికరాలను ట్రస్ట్ అందిస్తుంది. హైవేలకు సమీపంలో నివసించే గ్రామస్థులకు శిక్షణ ఇవ్వడానికి అందరి నుంచి ఆర్థిక సాయం కూడా కోరుతుంటాను. ఎందుకంటే గాయపడిన వారిని చేరుకోవడానికి, మొదటగా స్పందించిన వారికి.. విరాళం ఇవ్వడానికి కూడా మేము సహాయం చేస్తుంటాం' అని వివరిస్తుంది ఈ డాక్టర్.


రోడ్డు సేఫ్టీపై వర్క్‌షాప్ నిర్వహిస్తున్న మాయా టాండన్


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తూ....

లైఫ్@360



ముఖంపై మచ్చలా...
సులువుగా ఇలా తొలగుతాయి!

సూర్య కిరణాలు చర్మానికి నేరుగా తాకడం వల్ల.. చర్మంలో ఉండే మెలనిన్‌లో హెచ్చుతగ్గులు వస్తాయి. ఈ మెలనిన్ శాతం పెరిగినప్పుడు ముఖంపై నల్లటి మచ్చలు ఏర్పడతాయి. చూడటానికి అందవికారంగా అనిపించే ఈ మచ్చలను పోగొట్టుకునేందుకు మార్కెట్టులో దొరికే ఖరీదైన క్రీములను, రకరకాల మందులను ఉపయోగించి, ఆ తర్వాత వాటి వల్ల కలిగే దుష్ఫలితాలతో బాధపడేకన్నా, కొన్ని చిట్కాలను పాటిస్తే మచ్చలు సులువుగా పోవడంతోపాటు.. చర్మం కొత్త మెరుపును కూడా సంతరించుకుంటుంది.

- ఎండిన తమలపాకులను పొడి చేసి దానికి కొంచెం కొబ్బరినూనె కలిపి ఆ మిశ్రమాన్ని మచ్చలపై రాసినా ఉపయోగం ఉంటుంది.
- రాత్రి పడుకునే ముందు కొంచెం నీళ్లలో చపాతీని నానబెట్టి మర్నాడు ఉదయం దాన్ని పేస్ట్‌లాగా చేసి ముఖానికి పట్టించండి. ఇలా కొన్ని రోజులపాటు క్రమం తప్పకుండా చేస్తే బ్లాక్‌హెడ్స్ తొలగిపోతాయి.
- కుంకుమపువ్వును పొడి చేసి దానికి కొంత తేనె కలిపి ముఖానికి రాసుకుంటే బ్లాక్‌హెడ్స్ తొందరగా మాయమవుతాయి.
- కొంచెం నిమ్మరసాన్ని కాటన్‌తో తీసుకుని నల్లటి మచ్చలపై రాసి సుతిమెత్తగా మసాజ్ చేయాలి. దీనిలో ఉన్న విటమిన్–సి మచ్చలపై మంచి ప్రభావం చూపిస్తుంది.
- కాటన్ బాల్ మీద పాలు లేదా మజ్జిగ చుక్కలు వేసి దాన్ని మచ్చలున్న ప్రాంతంపై రాసుకోండి. వీటిలో ఉండే ల్యాక్టిక్ యాసిడ్ చర్మాన్ని తెల్లగా మార్చుతుంది.
- మచ్చలున్న ప్రదేశంలో తేనెను రాసి 20 నిమిషాల తర్వాత కడిగేయండి. తేనెలో ఉండే ఔషధ గుణాలు నల్లమచ్చలను తొలగించడంలో తోడ్పడతాయి.
- విటమిన్–ఇ ఆయిల్‌ను రాత్రి పడుకునే ముందు ముఖానికి రాసుకుని తెల్లారి లేచిన తర్వాత కడుక్కోవాలి. వీటితోపాటు రోజూ సన్‌స్క్రీన్ లోషన్‌ను ముఖానికి తప్పకుండా రాసుకుంటూ ఉండాలి.
- బంగాళాదుంప ముక్కల్ని తీసుకుని ముఖంపై రుద్దుకున్నా... మొటిమలు, వాటి తాలూకు మచ్చలు, వైట్‌హెడ్స్ లాంటివి దూరమవుతాయి.
- అర స్పూన్ నిమ్మరసానికి కాస్తంత గ్లిజరిన్ జోడించి ఆ మిశ్రమాన్ని నల్ల మచ్చలున్న ప్రాంతంలో రాస్తే తొందర్లోనే వాటి బాధ వదిలిపోతుంది.
- చిటికెడు పసుపును అర గుప్పెడు గోరింటాకుతో కలిపి పేస్ట్‌లా చేసి మచ్చలపై రాస్తే మంచి ఫలితం ఉంటుంది.
- కొంచెం పసుపు, కరివేపాకును కలిపి మెత్తని పేస్టులా చేసి మచ్చలపై రాయాలి.
- ఎండిన తులసి ఆకులను పొడి చేసి దానికి వేపాకు పొడి, పుదీనా కలుపుకోవాలి. దానికి కొంత పసుపు, రోజ్‌వాటర్ కలిపి పేస్ట్‌లాగా చేసి రాస్తే నల్లమచ్చలు మాయమవడమే కాకుండా చర్మం మెరుపును సంతరించుకుంటుంది.
- దానిమ్మ తొక్కలను ఎండబెట్టి పొడి చేసుకొని నాలుగు చుక్కల నిమ్మరసం కలిపి నల్లమచ్చలున్న చోట రాయాలి. పదినిమిషాల తర్వాత కడిగేయాలి. ఇలా మచ్చలున్న చోట నిత్యం రాస్తుంటే త్వరలోనే మంచి మార్పు కనిపిస్తుంది.
- తాజా మెంతి ఆకులు మెత్తగా రుబ్బి రాత్రిళ్లు ముఖానికి రాసుకోవాలి. మర్నాడు గోరువెచ్చని నీటితో కడిగేస్తే చాలు. ఇలా తరచూ చేయడం వల్ల నల్ల మచ్చలు దూరమవుతాయి. అలాగే గుప్పెడు మెంతి ఆకుల్ని నీటిలో వేసి బాగా మరిగించి చల్లారాక ముఖానికి రాసుకుని, ఆరిన తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేసుకుంటే ముఖం తాజాగా కనిపిస్తుంది.
- గ్రీన్ టీ లో దూది ముంచి మచ్చలపై రోజూ రాసుకుంటూ ఉండాలి.
- వంటనూనె, నిమ్మరసం సమపాళ్లలో తీసుకుని బాగా కలిపి మచ్చలున్న ప్రాంతంలో సున్నితంగా మర్దన చేయాలి. పది నిమిషాల య్యాక గోరువెచ్చని నీటితో కడిగేస్తే చాలు.
- చెంచా తేనె, ఒక గుడ్డు తెల్లసొనను బాగా కలిపి ముఖానికి పట్టించాలి. ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో ముఖాన్ని శుభ్రంగా కడగాలి. వారానికి రెండుసార్లు ఇలా చేయడం వల్ల నల్లమచ్చలు, మృతకణాలు తొలగిపోతాయి.
- రెండు చెంచాల నిమ్మరసం, తగినంత దాల్చిన చెక్క పొడిని బాగా కలుపాలి. ఆ మిశ్రమాన్ని ముఖం, మెడ, భుజాలు, వీపునకు పట్టించాలి. 20 నిమిషాల తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఈ ప్యాక్‌ను వారంలో నాలుగుసార్లు ప్రయత్నించవచ్చు.
- తాజా అలోవెరా జెల్‌ను ముఖానికి పట్టించి 10 నిమిషాల తర్వాత శుభ్రం చేసుకోవాలి.
- ఒక చెంచా పసుపును రెండు చెంచాల పుదీనా రసంలో కలుపాలి. ఆ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి ఆరిన తర్వాత శుభ్రం చేసుకోవాలి.
- తాజా టొమాటో గుజ్జును రాత్రిపూట నల్లమచ్చలపై రాసి ఉదయం పూట ముఖాన్ని శుభ్రం చేసుకుంటూ ఉండాలి. ఇలా చేస్తే మచ్చలు తొందరగా తొలగుతాయి.

ష్...ష్...
గుర్రు పెట్టకుండా నిద్రపోండి!



హాయిగా నిద్రపోయేవాళ్లను గుర్రుపెట్టి నిద్రపోతున్నారని చెబుతాం కానీ, అది నిజం కాదు. ఎందుకంటే గురక నిద్ర అనేది మంచి నిద్రకు నిదర్శనం కాదు. దానివల్ల అనేక సమస్యలు ఉన్నాయి. ముఖ్యంగా ఇతరులకు నిద్రాభంగం కలుగుతుంది. అందువల్ల గురక నివారణకు సులభ పరిష్కార మార్గాలను తెలుసుకుందాం.

● నిద్రించేటప్పుడు ముక్కుల నుంచి ఊపిరితిత్తుల్లోకి గాలి వెళ్లే మార్గంలో అడ్డంకులు ఏర్పడితే నోటి ద్వారా శ్వాస తీసుకునే ప్రయత్నం జరుగుతుంది. ఆ మార్గంలోనూ అవాంతరాలుంటే అప్పుడు కుచించుకుపోయిన మార్గం నుంచి గాలి వెళ్లే క్రమంలో చుట్టుపక్కల ఉన్న కణజాలాలు కదలికకు గురై చప్పుళ్లు వస్తాయి. ●మానసిక ఒత్తిడి, ఆందోళన కూడా కారణాలే. ● అలర్జీలు, సైనస్ ఇన్ఫెక్షన్, ముక్కులోపలి భాగంలో వాపు, అడినాయిడ్స్... వీటన్నింటి వల్ల శ్వాస మార్గానికి అడ్డం కులేర్పడటమే కారణం ● మధ్య వయసు, ఆపై వయసుకు వచ్చిన తర్వాత గొంతు భాగం సన్నబడుతుంది. దీని వల్ల గురక రావడానికి అవకాశం ఉంటుంది. అలాగే మహిళలతో పోలిస్తే పురుషుల్లో వాయు నాళాలు తక్కువ వ్యాకోచంతో ఉంటాయి. అధిక బరువు ఉండడం వల్ల మెడ, గొంతు భాగంలో అధిక బరువు పడినా గురక వస్తుంది. ● సైనస్ సమస్యలో ముక్కు రంధ్రాలు మూసుకుపోయి గాలి కష్టంగా వెళ్లాల్సి వచ్చి శబ్దం వస్తుంది.

అధికమించడానికి చిట్కాలు

● రోజూ రాత్రి నిద్రపోయేముందు గుప్పెడు పచ్చి అటుకులను తింటే గురక రాకుండా కంట్రోల్ అవుతుంది ● అర టీ స్పూన్ తేనె, అర టీ స్పూన్ ఆలివ్ ఆయిల్ కలిపి రాత్రి నిద్రపోయే ముందు తాగితే మంచి ఫలితం కనిపిస్తుంది ●కొద్దిగా పిప్పర్‌మెంట్ ఆయిల్‌ను చేతివేళ్లకు రాసుకుని వాసన చూస్తుంటే గురక తగ్గుతుంది ●గ్లాసు వేడి నీటిలో అర టీ స్పూన్ యాలకుల చూర్ణం కలిపి రాత్రి నిద్రపోయే ముందు తాగి నిద్రపోతే మంచి ఫలితం కనిపిస్తుంది ● రాత్రి పడుకునే ముందు మరిగే నీటిలో నాలుగైదు చుక్కలు యూకలిప్టస్ ఆయిల్ వేసి ఆవిరి పట్టాలి. తద్వారా చాలా కంట్రోల్ అవుతుంది.

గ్యాస్ట్రిక్ సమస్య
నివారణ మీ చేతుల్లోనే..!

వేళకు తిండి తినకపోవటం, సరైన నిద్ర లేకపోవటం, జంక్‌ఫుడ్ తినడం, నీళ్లు సరిగా తాగకపోవడం, ఒకేసారి ఎక్కువ మొత్తంలో తినటం... లేదంటే గంటలు గంటలు అసలేం తినకపోవడం.... ఫలితంగా కడుపులో మంటలు, ఛాతీలో బరువుగా ఉండటం, పులి తేనుపులు, కాస్త తినగానే కడుపు నిండిపోయినట్లు అనిపించడం, ఏదీ సయించకపోవడం.. ఏదో గందర గోళంగా అనిపించటం... ఇవన్నీ గ్యాస్ట్రిక్ సమస్యలు అయితే, వీటన్నింటినీ దూరం చేసుకోవటం కూడా మన చేతుల్లోనే ఉంది. అదెలాగో చూద్దాం.

- ఈ రోజుల్లో వయసుతో సంబంధం లేకుండా ఎక్కువమంది ఎదుర్కొంటున్న సమస్య గ్యాస్ట్రిక్ సమస్య. ఇది ఏమంత ప్రమాదకరమైనది కాదు కానీ, నిర్లక్ష్యం చేస్తే మాత్రం ప్రాణాలమీదికి వచ్చినంత గందరగోళానికి గురి చేస్తుంది. అంతేకాదు, గుండెపోటు లక్షణాలకు దగ్గరగా ఉండటం వల్ల భయం కలిగిస్తుంది. దీనిని నివారించాలంటే ఏం చేయాలో చూద్దాం.
- గ్యాస్ట్రిక్ సమస్య నివారణకు ముందు చేయాల్సిన పని వేళకు తిండి తినటం.
- ముఖ్యంగా ఇది రాత్రి పది గంటల తర్వాత తిని, ఏ అర్ధరాత్రో పడుకునేవారికి వస్తుంది.
- అందువల్ల రాత్రి భోజనం/ఫలహారం చేసిన గంట తర్వాత నిద్రించాలి.
- బ్రేక్‌ఫాస్ట్ ఉదయం 9 గంటల కల్లా తినాలి. ఎందుకంటే, రాత్రి తిండికి, ఉదయం ఫలహారానికి మధ్య చాలా విరామం ఉంటుంది. దీని వల్ల కడుపులో గ్యాస్ ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉంది. అలాగే ఉదయం ఫలహారం ఎక్కువగానూ, మధ్యాహ్నం తక్కువగానూ, రాత్రి ఇంకా తక్కువగానూ తినడం గ్యాస్ సమస్యతోపాటు చాలా రకాల సమస్యల నుంచి బయట పడేస్తుందని పోషకాహార నిపుణుల అభిప్రాయం.
- సెనగపిండి వల్ల గ్యాస్ పెరిగే అవకాశం ఉంది. దీనివల్ల ఈ ఇబ్బంది ఎదుర్కొంటున్న వారు సెనగపిండితో చేసిన చట్నీ, పకోడీ, బజ్జీలు వంటివి తినకూడదు. పులిసిన పదార్థాలు కూడా గ్యాస్‌ను పెంచుతాయి కాబట్టి వాటికి దూరంగా ఉండటం మంచిది.
- గ్యాస్ట్రిక్ సమస్యతో బాధపడేవారు తమవెంట బిస్కెట్లు, పండ్లు, మంచినీరు ఉంచుకోవడం మంచిది. ఎందుకంటే, తిండివేళ దాటితే, బిస్కెట్లు గానీ, పండ్లుగానీ తిని మంచినీరు తాగితే, గ్యాస్ట్రిక్ ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చు.
- రోజూ రాత్రిపూట ఒక స్పూను జీలకర్రను గ్లాసు నీటిలో నానబెట్టి, ఉదయమే ఆ నీటిని మరిగించి, వడకట్టుకుని తాగితే గ్యాస్ నివారణ అవడంతోపాటు అధిక బరువు నుంచి కూడా తప్పించుకోవచ్చు.
- మంచినీరు ఎక్కువ తాగాలి.

ఇవి తీసుకుంటే మంచిది...

- బ్రెడ్, బ్రౌన్ రైస్, తృణధాన్యాలు, ఓట్స్, బార్లీ, క్వినోవా.
- చేపలు, గుడ్లు, బంగాళదుంప, చిలగడ దుంప, క్యారట్, బీట్‌రూట్, ముల్లంగి వంటి రూట్ ఫుడ్స్, ఆకుపచ్చటి కూరగాయలు, పాలు, పెరుగు, చీజ్ వంటి తక్కువ కొవ్వు ఉండే ఆహారాలు.
- ఆకు కూరలు, చేపలు, గింజలు వంటి ఆహారాలు
- దోసకాయ, పాలకూర, పుచ్చకాయ వంటివి కడుపులోని ఆమ్లాన్ని పలచన చేస్తాయి.
- హెర్బల్ టీలు, పెరుగు, కేఫీర్ వంటి ప్రోబయోటిక్ అధికంగా ఉండే ఆహారాలు.



ఇవి తీసుకోకూడదు

- ఆయిల్ ఉండే ఆహారాలు, బర్గర్‌లు, వేపుళ్లు, చిప్స్
- ఆరెంజ్ జ్యూస్, కాఫీ, టీ, టొమాటోలు, వెనిగర్
- గ్యాస్ ఉత్పత్తి చేసే కూరగాయలు – బ్రోకలీ, క్యాబేజీ, బ్రస్సెల్స్ మొలకలు, బీన్స్, కాలీఫ్లవర్
- మసాలా ఆహారాలు – వేడి, మంటను కలిగించే సుగంధ ద్రవ్యాలు, కడుపు లైనింగ్‌ను మరింత మంటకలిగించే మసాలా పదార్థాలకు నో చెప్పండి.
- పుష్కలంగా ద్రవాలు తాగాలి – అల్లం, పుదీనా వంటివి తీసుకోవాలి.
- లోతైన శ్వాస తీసుకోవడం – లోతైన శ్వాస వ్యాయామాలు చేయడం.

సినిమా

ఎన్టీఆర్ డ్రాగన్?



ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను నిర్మించనుంది. ఈ ఏడాది చివర్లో షూటింగ్ ప్రారంభం అవుతుందని, చిత్రీకరణ ప్రధానంగా విదేశాల్లో ఉంటుందనే టాక్ ఎప్పట్నుంచో వినిపిస్తోంది. ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కావొచ్చనే ఊహాగానాలూ ఇటీవల తెరపైకి వచ్చాయి. తాజాగా ఈ సినిమాకు 'డ్రాగన్' అనే టైటిల్‌ను మేకర్స్ పరిశీలిస్తున్నారని ఫిల్మ్‌నగర్ సమాచారం. కాగా ఈ నెల 20న ఎన్టీఆర్ బర్త్ డే. ఈ సందర్భంగా ఈ సినిమా గురించి సరికొత్త వివరాలు వెల్లడి కానున్నాయని తెలిసింది. మరోవైపు 'డ్రాగన్' టైటిల్ హక్కులు బాలీవుడ్ దర్శక–నిర్మాత కరణ్ జోహార్ దగ్గర ఉన్నాయని, దర్శకుడు ప్రశాంత్ నీల్ అండ్ టీమ్ అడగడంతో ఈ టైటిల్‌ను కరణ్ ఇచ్చేశారని బాలీవుడ్ సమాచారం. మరి.. ఎన్టీఆర్–ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లోని సినిమాకు ఫైనల్‌గా 'డ్రాగన్' టైటిల్ ఖరారవుతుందా? వెయిట్ అండ్ సీ.



● ఐశ్వర్యా రాయ్

ఫ్రాన్స్‌లో జరుగుతున్న 77వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఐశ్వర్యా రాయ్ పాల్గొంటున్నారు. గురువారం నలుపు రంగు డిజైనర్ ఫ్రాక్‌లో రెడ్ కార్పెట్‌పై నడిచారామె. అయితే ఆమె మేకప్, హెయిర్ స్టయిల్ అన్నీ బాగున్నాయనీ, గౌను అంత బాగాలేదనే విమర్శలొచ్చాయి. ఇక శుక్రవారం బ్లూ, సిల్వర్ కలర్స్ మిక్స్‌తో నెమలిని తలపించేలాంటి ఫ్రాక్‌లో ఐష్ తళుకులీనారు. ఈ చిత్రోత్సవాల్లో తొలిసారి పాల్గొనడానికి కియారా అద్వానీ ఫ్రాన్స్ చేరుకున్నారు. ఇంకా అదితీ రావు హైదరీ, శోభితా ధూళిపాళ కూడా హాజరు కానున్నారు.

భైరవ స్పెషల్ పర్సన్ బుజ్జి



● ప్రభాస్

తెలుగు చిత్ర పరిశ్రమలో మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ ఎవరు? అంటే అందరికీ టక్కున గుర్తొచ్చే పేరు ప్రభాస్. తమ అభిమాన హీరో పెళ్లి ఎప్పుడా అని ప్రభాస్ ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు. ప్రభాస్ వివాహంపై ఎప్పటికప్పుడు రూమర్లు చక్కర్లు కొడుతూనే ఉన్నాయి. అయితే పెళ్లి వార్తల గురించి ప్రభాస్ ఎప్పుడూ స్పందించలేదు. తాజాగా శుక్రవారం ఉదయం ''డార్లింగ్స్... ఫైనల్లీ నా జీవితంలోకి చాలా ప్రత్యేకమైన వ్యక్తి ప్రవేశించనున్నారు.. వేచి చూడండి' అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రభాస్ చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. ఈ పోస్ట్ పెళ్లి గురించేనా? ఆయన పరిచయం చేయబోతున్న ఆ ప్రత్యేక వ్యక్తి ఎవరు? అనే చర్చ జరిగింది. కాగా శుక్రవారం సాయంత్రం ప్రభాస్ సోషల్ మీడియా ద్వారా ''డార్లింగ్స్... బుజ్జిని మీకు పరిచయం చేయడానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను'' అని మరో పోస్ట్ షేర్ చేశారు. దాంతో ప్రభాస్ పెట్టిన ఈ రెండు పోస్ట్‌లు 'కల్కి 2898 ఏడీ' సినిమా ప్రచారంలో భాగం అనే టాక్ తెరపైకి వచ్చింది.. ఈ చిత్రంలో భైరవ పాత్రలో ప్రభాస్ నటిస్తుండగా... బుజ్జి పేరుతో ఓ పాత్ర ఉంది. ఆ బుజ్జి ఎవరు అనేది ఈరోజు సాయంత్రం తెలిసిపోతుంది. ఇక నాగ్ అశ్విన్ దర్శకత్వంలో అశ్వినీదత్ నిర్మిస్తున్న 'కల్కి 2898 ఏడీ' జూన్ 27న విడుదల కానుంది.

కన్నప్పలో కాజల్

విష్ణు మంచు టైటిల్ రోల్ చేస్తున్న తాజా చిత్రం 'కన్నప్ప'. శివ భక్తుడు కన్నప్ప జీవితం ఆధారంగా ఈ సినిమాని దర్శకుడు ముఖేష్ కుమార్ సింగ్ తెరకెక్కిస్తున్నారు. మంచు మోహన్‌బాబు నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. కాగా 'కన్నప్ప' సినిమాలో కాజల్ అగర్వాల్ ఓ కీలక పాత్రలో నటించనున్నట్లుగా చిత్ర యూనిట్ శుక్రవారం వెల్లడించింది. ఇంకా ఈ సినిమాలో మోహన్‌బాబు, శరత్‌కుమార్, మోహన్‌లాల్, ప్రభాస్, అక్షయ్ కుమార్, బ్రహ్మానందం కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అలాగే ఈ సినిమా టీజర్ ప్రస్తుతం ఫ్రాన్స్‌లో జరుగుతున్న 77వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో రిలీజ్ కానుంది. ఈ సంగతి ఇలా ఉంచితే... 'మోసగాళ్ళు' (2021) మూవీ కోసం విష్ణు మంచు, కాజల్ అగర్వాల్ స్క్రీన్ షేర్ చేసుకున్న విషయం తెలిసిందే. మళ్లీ ఇప్పుడు 'కన్నప్ప' కోసం కలిశారు.



● కాజల్ అగర్వాల్



● సూర్య, విజయ్ కనిష్క

హిట్ లిస్ట్
టీజర్ బాగుంది – సూర్య

''హిట్ లిస్ట్' మూవీ టీజర్ చాలా బాగుంది. సినిమా ఇంకా బాగుంటుందని ఆశిస్తున్నాను. విజయ్ కనిష్కతో పాటు టీమ్‌కి ఈ మూవీ మంచి సక్సెస్ ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను'' అని హీరో సూర్య అన్నారు. తమిళ దర్శకుడు విక్రమన్ తనయుడు విజయ్ కనిష్క హీరోగా సముద్ర ఖని, శరత్‌కుమార్, గౌతమ్ వాసుదేవ మీనన్ ముఖ్యపాత్రల్లో నటించిన చిత్రం 'హిట్ లిస్ట్'. సూర్య కతిర్ కాకల్లార్, కె. కార్తికేయన్ దర్శకత్వం వహించారు. దర్శకుడు కేఎస్ రవికుమార్ నిర్మించారు. ఈ మూవీని శ్రీ శ్రీనివాస స్క్రీన్స్, శ్రీ శ్రీనివాస ఇన్‌ఫ్రా, బెక్కం ప్రొడక్షన్స్ సంస్థలు తెలుగులో రిలీజ్ చేస్తున్నాయి. త్వరలో రిలీజ్ కానున్న ఈ సినిమా టీజర్‌ని సూర్య లాంచ్ చేశారు. ''యాక్షన్, సస్పెన్స్, క్రైమ్ జానర్‌లో రూపొందిన చిత్రం 'హిట్ లిస్ట్'. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌కి మంచి స్పందన వచ్చింది. తాజాగా విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను పెంచేస్తోంది'' అన్నారు మేకర్స్.

డర్టీ ఫెలో రెడీ



శాంతి చంద్ర హీరోగా, దీపికా సింగ్, 'మిస్ ఇండియా 2022' సిమ్రితి హీరోయిన్లుగా ఆడారి మూర్తి సాయి దర్శకత్వం వహించిన చిత్రం 'డర్టీ ఫెలో'. గూడూరు భద్రకాళీ సమర్పణలో జీయస్ బాబు నిర్మించిన ఈ చిత్రం ఈ 24న రిలీజ్‌కి రెడీ అయింది. ఈ సినిమా ట్రైలర్‌ని 'బింబిసార' మూవీ ఫేమ్ డైరెక్టర్ మల్లిడి వశిష్ఠ్ విడుదల చేసి, మాట్లాడుతూ–''డర్టీ ఫెలో' ట్రైలర్ బాగుంది. ఈ సినిమా విజయం సాధించి, యూనిట్‌కి మంచి పేరు రావాలి'' అన్నారు. శాంతి చంద్ర, మూర్తి సాయి ఆడారి మాట్లాడుతూ– ''వైవిధ్యమైన కథాంశంతో రూపొందిన చిత్రం 'డర్టీ ఫెలో'. మా సినిమాలోని అన్ని పాటలకు మంచి స్పందన వచ్చింది. మా చిత్రంలో అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలు ఉన్నాయి'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: రామకృష్ణ .యస్, సంగీతం: డా. సతీష్ కుమార్ .పి.

యావరేజ్ స్టూడెంట్



● స్నేహా మాలవ్య, పవన్ కుమార్

'మెరిసే మెరిసే' చిత్రంతో దర్శకుడిగా పరిచయమైన పవన్ కుమార్ కొత్తూరి హీరోగా మారారు. ఆయన హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'యావరేజ్ స్టూడెంట్ నాని'. స్నేహా మాలవ్య, సాహిబా భాసిన్, వివియా సంత్ హీరోయిన్లుగా నటించారు. శ్రీ నీలకంఠ మహదేవ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎల్ఎల్‌పి బ్యానర్‌పై పవన్ కుమార్ కొత్తూరి, బిషాలీ గోయెల్ నిర్మించిన ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా పవన్ కుమార్ కొత్తూరి మాట్లాడుతూ– ''యూత్‌ఫుల్ లవ్, యాక్షన్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'యావరేజ్ స్టూడెంట్ నాని'. అన్ని వర్గాల ప్రేక్షకులకు మా సినిమా నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ఝాన్సీ, రాజీవ్ కనకాల, 'ఖలేజా' గిరి తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: కార్తీక్ బి. కొడకండ్ల, కెమెరా: సజీష్ రాజేంద్రన్.

సాక్షి బిజినెస్

శనివారం
18-5-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	253	73,917
నిఫ్టీ ▲	62	22,466

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	16,687	▽ 11
డోజోన్స్	39,953	▲ 84
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,420	▽ 18
డాక్స్	18,704	▽ 34
షాంఘై	3,154	▲ 32
నికాయ్	38,787	▽ 133

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (24 క్యారట్)	71,900 ▽	270
బంగారం (22 క్యారట్)	68,480 ▽	250
వెండి (కిలో)	92,500	0

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.10	84.12
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.57	107.12
€	యూరో	ఎస్‌బీఐ	89.63	91.99
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	53.06	54.23
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.76	56.70
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.54	64.19
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.33	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.08	23.59
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.41	12.48

జేఎస్‌డబ్ల్యూ స్టీల్ రూ. 7.30 డివిడెండ్

- క్యూ4లో లాభం 65 శాతం డౌన్
- రూ. 1,322 కోట్లకు పరిమితం

న్యూఢిల్లీ: ముడి వస్తువుల ధరలు, ఇతర వ్యయాలు పెరగడంతో గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ నికర లాభం 65 శాతం క్షీణించి రూ. 1,322 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం క్యూ4లో ఇది రూ. 3,741 కోట్లుగా నమోదైంది. 2024 ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ రూ. 7.30 తుది డివిడెండ్ ప్రకటించింది. సమీక్షా కాలంలో సంస్థ ఆదాయం రూ. 47,427 కోట్ల నుంచి రూ. 46,511 కోట్లకు తగ్గింది. వ్యయాలు రూ. 43,170 కోట్ల నుంచి రూ. 44,401 కోట్లకు పెరిగాయి. ముడి వస్తువుల వ్యయాలు రూ. 23,905 కోట్ల నుంచి రూ. 24,541 కోట్లకు పెరిగాయి. పూర్తి ఆర్థిక సంవత్సరంలో నికర లాభం రూ. 4,139 కోట్ల నుంచి రూ. 8,973 కోట్లకు చేరింది. ఆదాయం రూ. 1,66,990 కోట్ల నుంచి రూ. 1,78,010 కోట్లకు పెరిగింది.



కొత్త ప్రభుత్వ లక్ష్యం అత్యుత్తమ బడ్జెట్

మంచి మెజారిటీతో మళ్లీ అధికారంలోకి మోదీ ప్రభుత్వం ● సీఐఐ వార్షిక బిజినెస్ సమావేశంలో ఆర్థికమంత్రి

న్యూఢిల్లీ: ఎన్నికల ఫలితాల అనంతరం ఏర్పడే కొత్త ప్రభుత్వ తక్షణ లక్ష్యం.. జూలైలో అత్యుత్తమ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడమేనని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు లోక్‌సభలో మంచి మెజారిటీతో ప్రధాని నరేంద్ర మోదీ మళ్లీ అధికారంలోకి వస్తారని ఆర్థిక మంత్రి ఉద్ఘాటించారు. ఎన్నికల అనంతరం మోదీ వరుసగా మూడోసారి ప్రధాని అవుతారని స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో జరిగిన సీఐఐ వార్షిక వాణిజ్య శిఖరాగ్ర సమావేశంలో ఆమె ఈ మేరకు పారిశ్రామిక దిగ్గజాలను ఉద్దేశించి ప్రసంగించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన వెంటనే జూలైలో పూర్తి సంవత్సర బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం జరుగుతుందని పేర్కొన్న ఆమె, దీనిని అత్యుత్తమంగా రూపొందించడానికి సీఐఐతో చర్చలు జరుపుతామని అన్నారు. భారత్ వృద్ధి తీరు స్థిరంగా కొనసాగుతుందని, దీనికి సంబంధించి దేశం ముందు ఎన్నో అవకాశాలు ఉన్నాయని వివరించారు. దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం కానుందన్నారు. సోలార్, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా రంగాల పురోగతికి కేంద్రం చేస్తున్న ప్రయత్నాలు యువతకు గణనీయమైన ఉద్యోగ అవకాశాలను అందిస్తాయని అన్నారు.



ఆర్థిక మంత్రి నుంచి సీఐఐ ప్రెసిడెంట్ అవార్డు అందుకుంటున్న ఎన్‌ఏబీఎఫ్‌ఐడీ చైర్మన్ కేవీ కామత్

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

18-5-2024	
విశాఖ	550-00
చిత్తూరు	628-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540-00
విజయవాడ	540-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	550-00
వరంగల్	552-00
రిటైల్ ధర	6.10

జీ ఎంటర్‌టైన్‌మెంట్ లాభం రూ. 13 కోట్లు

న్యూఢిల్లీ: జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ (జీల్) నాలుగో త్రైమాసిక నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 13.35 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం క్యూ4లో రూ. 196 కోట్ల నష్టం నమోదైంది. సమీక్షాకాలంలో మొత్తం ఆదాయం రూ. 2,126 కోట్ల నుంచి రూ. 2,185 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయాలు రూ. 2,083 కోట్ల నుంచి రూ. 2,044 కోట్లకు తగ్గాయి. షేరు ఒక్కింటికి రూ. 1 చొప్పున కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫార్సు చేసింది. మరోవైపు, పూర్తి ఆర్థిక సంవత్సరానికి లాభం రూ. 48 కోట్ల నుంచి రూ. 141 కోట్లకు పెరగ్గా, ఆదాయం రూ. 8,168 కోట్ల నుంచి రూ. 8,766 కోట్లకు చేరింది. సబ్‌స్క్రిప్షన్ ఆదాయం, ఇతరత్రా సేల్స్, సర్వీస్‌ల ద్వారా ఆదాయం వృద్ధి చెందినట్లు జీల్ వెల్లడించింది. కొత్త ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో వన్-టైమ్ ప్రాతిపదికన కొన్ని కేటాయింపులు జరపాల్సి రావచ్చని, దీంతో మార్జిన్లపై కొంత ప్రభావం పడొచ్చని పేర్కొంది. అయితే, రెండో త్రైమాసికం నుంచి మార్జిన్ క్రమంగా మెరుగుపడగలదని వివరించింది.

అన్‌లిమిటెడ్ స్టోర్లలో టీ షర్టులు

హైదరాబాద్: ఫ్యాషన్ దుస్తుల సంస్థ 'అన్‌లిమిటెడ్' 10,000 రకాలకు పైగా టీ షర్టులను అందుబాటులోకి తెచ్చింది. అన్ని వయస్సుల వారికి తగ్గట్లు రూపొందించిన ఈ షర్టులు విభిన్న డిజైన్లు, ఆకట్టుకునే రంగులు, సౌకర్యమైన ఫ్యాషన్లతో అకర్షణీయంగా ఉన్నాయి. కొన్ని బ్రాండ్లపై ఒకటి కొంటే మరొకటి ఉచితం ఆఫర్ ఉంది. దేశవ్యాప్తంగా షోరూంలలో ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది.

టీవీఎస్ అపాచీ ఆర్‌టీఆర్ 160 బ్లాక్ ఎడిషన్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ టీవీఎస్ అపాచీ ఆర్‌టీఆర్ సిరీస్‌లో బ్లాక్ ఎడిషన్‌ను భారత్‌లో ప్రవేశపెట్టింది. హైదరాబాద్ ఎక్స్‌షోరూంలో ధర వేరియంట్‌నుబట్టి రూ.1,09,990 నుంచి రూ.1,19,990 వరకు ఉంది. 5 స్పీడ్ గేర్ బాక్స్, ఎస్ఐ, 4 స్ట్రోక్, ఎయిర్ కూల్డ్, ఎస్‌వోహెచ్‌సీ, ఫ్యూయల్ ఇంజెక్షన్ ఇంజిన్, డబుల్ క్రాడిల్ సింక్రో స్టిఫ్ ఫ్రేమ్ పొందుపరిచారు. ఆర్‌టీఆర్ 160 – 2 వాల్వ్ వేరియంట్ 5.3 సెకన్లలో గంటకు 60 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. 4 వాల్వ్ వేరియంట్ 4.8 సెకన్లలో గంటకు 60 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది.

బంధన్ బ్యాంక్ లాభం రూ. 55 కోట్లు



కోల్‌కతా: నాలుగో త్రైమాసికంలో బంధన్ బ్యాంక్ నికర లాభం రూ. 55 కోట్లకు పరిమితమైంది. క్రితం క్యూ4లో ఇది రూ. 808 కోట్లు. తాజాగా రైటాఫ్‌లు, మొండిబాకీలకు అధిక కేటాయింపులు జరపాల్సి రావడం వంటి అంశాలు లాభాలు తగ్గడానికి కారణం. జనవరి-మార్చి త్రైమాసికంలో ప్రొవిజనింగ్ రూ. 735 కోట్ల నుంచి రూ. 1,774 కోట్లకు పెరిగిందని బ్యాంక్ ఎండీ చంద్రశేఖర్ ఘోష్ తెలిపారు. అలాగే రూ. 3,852 కోట్లు రైటాఫ్ చేయాల్సి వచ్చిందని వివరించారు. క్యూ4లో నికర వడ్డీ మార్జిన్ 7.6 శాతంగా ఉంది. స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) 4.9 శాతం నుంచి 3.8 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు 1.1 శాతంగా ఉన్నాయి. జూలైలో ఎండీ, సీఈవో పదవి నుంచి రిటైర్ కానున్న ఘోష్.. రిటైర్మెంట్ తర్వాత హోల్డింగ్ కంపెనీ బంధన్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్‌లో వ్యూహాత్మక బాధ్యతలు పోషించనున్నట్లు తెలిపారు.

మార్కెట్‌లోకి డ్రోగో కొత్త డ్రోన్

ఒకసారి చార్జింగ్‌తో 4 ఎకరాల్లో పిచికారీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డ్రోన్స్ తయారీలో ఉన్న డ్రోగో డ్రోన్స్ కృషి 3 ప్రో డ్రోన్‌కు డీజీసీఏ నుంచి ఆమోదం లభించింది. ఒకసారి చార్జింగ్‌తో నాలుగు ఎకరాల్లో పురుగు మందులను పిచికారీ చేయడం దీని ప్రత్యేకత. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న డ్రోన్స్ కేవలం రెండు ఎకరాల్లో మాత్రమే పిచికారీ చేయగలవని డ్రోగో డ్రోన్స్ సీఈవో యశ్వంత్ బొంతు తెలిపారు. ఎయిర్ ట్యాక్సీ సేవల్లోకి ప్రవేశించే పనిలో నిమగ్నమయ్యామని.. డీజీసీఏ అనుమతి కోసం వేచి చూస్తున్నట్టు వివరించారు. డ్రోన్స్ ద్వారా సర్వే, మ్యాపింగ్, ఉత్పత్తుల రవాణా విభాగాల్లోకి ఎంట్రీ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. డ్రోగో డ్రోన్స్ తాజాగా ఇఫ్కోతో ఒప్పందం చేసుకుంది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా 30 లక్షల ఎకరాల్లో పురుగు మందులను పిచికారీ చేయనున్నారు.

రెండో రోజూ లాభాలు

- మెటల్, ఆటో, కన్జూమర్ షేర్లకు డిమాండ్

ముంబై: మెటల్, ఆటో, కన్జూమర్ డ్యూరబుల్స్ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు రెండో రోజూ లాభపడ్డాయి. సెన్సెక్స్ 253 పాయింట్లు పెరిగి 73,917 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 62 పాయింట్లు బలపడి 22,466 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం నష్టాలతో మొదలయ్యాయి. అధిక వెయిటేజీ ఎంఅండ్ఎం(6%)తో పాటు, ఐటీసీ(1%),రిలయన్స్ ఇండస్ట్రీస్(1%), మారుతీ సుజుకీ(1%) షేర్లు రాణించి సూచీలను లాభాల వైపు నడిపాయి. ఒక దశలో సెన్సెక్స్ 611 పాయింట్లు సెన్సెక్స్ బలపడి 74,070 వద్ద, నిఫ్టీ 98 పాయింట్లు పెరిగి 22,502 ఇంట్రాడే గరిష్టాలను నమోదు చేశాయి. చిన్న, మధ్య తరహా షేర్లను కొనునేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపడంతో



బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 1.18%, 1.39 శాతం చొప్పున లాభపడ్డాయి.

నేడు ఎక్స్ఛేంజీల ప్రత్యేక ట్రేడింగ్

శనివారం (నేడు) సెలవు దినం అయినప్పటికీ స్టాక్ మార్కెట్ పని చేస్తుంది. ప్రాథమిక సైట్‌లో ఏమైనా లోపాలు లేదా అంతరాయాలు తలెత్తితే ఎదుర్కొనే సన్నద్ధతను పరీక్షించేందుకు శనివారం ఈక్విటీ, ఈక్విటీ డెరివేటివ్ విభాగాల్లో ప్రత్యేక ట్రేడింగ్ సెషన్‌ను నిర్వహిస్తున్నట్లు ఎన్ఎస్ఈ, బీఎస్ఈలు తెలిపాయి. ఉదయం 9.15 గంటల నుంచి 10 గంటల వరకు తొలి సెషన్ ప్రధాన ప్రాథమిక సైట్‌లో.., ఉదయం 11.30 నుంచి 12.30 మధ్య మరో సెషన్ డిజాస్టర్ రికవరీ సైట్‌లో ట్రేడింగ్ జరగనుంది. అన్ని సెక్యూరిటీస్, డెరివేటివ్ ఉత్పత్తులను ట్రేడింగ్‌కు అందుబాటులో ఉంటాయి. గరిష్ఠ పరిమితిని 5 శాతంగా నిర్ణయించాయి.



డాలర్ మారకంలో రూపాయి విలువ 13 పైసలు బలపడి 83.37 స్థాయి వద్ద నిలిచింది.

ఒకే ప్లాన్‌తో టీవీ చానళ్లు, ఓటీటీ యాప్‌లు

డిష్ టీవీ స్మార్ట్‌ప్లస్ సర్వీసులు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఒకే ప్లాన్‌తో ఇటు టీవీ చానళ్లు, అటు ఓటీటీ యాప్స్‌ను కూడా పొందే విధంగా డిష్ టీవీ కొత్తగా స్మార్ట్‌ప్లస్ సర్వీసులను అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతం ఉపయోగిస్తున్న ప్లాన్ కిందే వీటిని పొందవచ్చని సంస్థ సీఈవో మనోజ్ దోభల్ తెలిపారు. రూ. 200 ప్యాక్ నుంచి ఇది అందుబాటులో ఉంటుంది. పాత, కొత్త కస్టమర్లు.. స్మార్ట్‌ప్లస్ కింద సదరు ప్లాన్‌లోని టీవీ ఛానళ్లతో పాటు డిఫాల్టుగా లభించే హంగామా వంటి అయిదు ఓటీటీ యాప్లతో పాటు జీ5, డిస్నీప్లస్ హాట్‌స్టార్, సోనీ లివ్ తదితర యాప్‌ల నుంచి ఒకటి ఎంచుకోవచ్చు. కావాలనుకుంటే మూడు రోజుల తర్వాత మరో యాప్‌నకు మారవచ్చు. పూర్తిగా 16 యాప్‌లు పొందాలంటే నెలకు రూ. 179 చార్జీ ఉంటుంది. కొత్త సర్వీసులతో మార్కెట్ వాటా 3-4 శాతం మేర పెంచుకోగలమని ఆశిస్తున్నట్లు మనోజ్ తెలిపారు. ప్రస్తుతం తమకు డీటీహెచ్ మార్కెట్లో 21 శాతం వాటా ఉందని వివరించారు. వచ్చే ఏడాదిన్నర వ్యవధిలో ఆండ్రాయిడ్ 4కే బాక్స్, క్లౌడ్ టీవీ వంటి ఉత్పత్తులు అందుబాటులోకి తెస్తున్నట్లు పేర్కొన్నారు. ఆవిష్కరణ కార్యక్రమంలో సినీ నటి శ్రద్ధా దాస్ పాల్గొన్నారు.

సాక్షి స్పోర్ట్స్



జూన్ 1న బంగ్లాదేశ్‌తో భారత్ వార్మప్ మ్యాచ్

దుబాయ్: ఇప్పుడైతే భారత ఆటగాళ్లంతా ఐపీఎల్ ఫ్రాంచైజీ జట్లలో ఆడుతున్నారు. అయితే టి20 ప్రపంచకప్‌కు ముందు కలిసి కట్టుగా, భారత జట్టుగా రోహిత్ శర్మ బృందం ఏకైక వార్మప్ మ్యాచ్‌ను బంగ్లాదేశ్‌తో ఆడనుంది. జూన్ 2 నుంచి అమెరికా, వెస్టిండీస్‌లలో జరిగే ప్రపంచకప్‌లో టీమిండియా లీగ్ దశ పోటీలన్నీ అమెరికాలోనే షెడ్యూల్ చేశారు. దీంతో ప్రాక్టీస్ మ్యాచ్ కూడా అక్కడే ఆడుతుంది. అయితే వేదికను ఖరారు చేయాల్సి ఉంది. పోటీపడే మొత్తం 20 జట్లలో 17 జట్లు మే 27 నుంచి జూన్ 1 వరకు వార్మప్‌లో పాల్గొంటుండగా... డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్, రన్నరప్ పాకిస్తాన్, సెమీఫైనలిస్ట్ న్యూజిలాండ్‌లు ప్రాక్టీస్ మ్యాచ్‌లు లేకుండానే నేరుగా టోర్నీలోనే బరిలోకి దిగనున్నాయి. ఈ మూడు జట్ల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌ల వల్లే బహుశా వార్మప్ మ్యాచ్‌లకు దూరంగా ఉండొచ్చు. ఈ నెల 22 నుంచి ఇంగ్లండ్ పర్యటనలో పాకిస్తాన్ నాలుగు టి20 మ్యాచ్‌లు ఆడనుంది.



పూరన్

లక్నో విజయంతో ముగింపు

- 18 పరుగులతో ముంబైపై గెలుపు
- పూరన్ విధ్వంసం
- రోహిత్ మెరుపులు వృథా

ముంబై: ఐదుసార్లు ఐపీఎల్ చాంపియన్ అయిన ముంబై ఇండియన్స్ ఈ సీజన్‌లో అందరికంటే ముందుగా ప్లేఆఫ్స్ దశకు దూరమైంది. ఇప్పుడు ఆఖరి స్థానంతో లీగ్ దశను పేలవంగా ముగించింది. మధ్యలో వర్షం ఆటంకం కలిగించిన ఈ మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ 18 పరుగుల తేడాతో ముంబైపై ఘనవిజయం సాధించింది. ముందుగా లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 214 పరుగులు చేసింది. నికోలస్ పూరన్ (29 బంతుల్లో 75; 5 ఫోర్లు, 8 సిక్స్‌లు) సునామీలా చెలరేగిపోయాడు. కెప్టెన్ కేఎల్ రాహుల్ (41 బంతుల్లో 55; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించాడు. పియూష్ చావ్లా, తుషారా చెరో 3 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ముంబై 20 ఓవర్లలో 6 వికెట్లకు 196 పరుగులు చేసి ఓడింది. రోహిత్ శర్మ (38 బంతుల్లో 68; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు), నమన్ ధీర్ (28 బంతుల్లో 62 నాటౌట్; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరిపించారు.

పూరన్ ధనాధన్

పది ఓవర్లలో లక్నో స్కోరు 69/3. పడిక్కల్ (0), స్టొయినిస్ (22 బంతుల్లో 28; 5 ఫోర్లు), దీపక్ హుడా (11) అవుటయ్యారు. ఇంకో 10 ఓవర్లలో వంద కొట్టినా... 170 దాటదు! కానీ పూరన్ తన 29 బంతుల్లో అంతా మార్చేశాడు. రాహుల్‌తో కలిసి విధ్వంసరచన చేశాడు. అన్షుల్ 13వ ఓవర్లో పూరన్ 4, 0, వైడ్, 4, 6, 6, 1లతో 22 పరుగులు రాబట్టాడు. 15వ ఓవర్‌ను అర్జున్ టెండూల్కర్ ప్రారంభించి 2 బంతులేస్తే పూరన్ సిక్సర్లుగా మలిచాడు. కండరాలు పట్టేయడంతో అర్జున్ వెనుదిరిగాడు. మిగతా ఓవర్‌ను నమన్ ధీర్ వేయగా పూరన్ 6, 4, 1 కొట్టాడు. ఆఖరి బంతిని రాహుల్ సిక్స్ బాదడంతో ఈ ఓవర్లో 29 పరుగులు వచ్చాయి. పూరన్ 19 బంతుల్లోనే ఫిఫ్టీ చేసుకోగా... రాహుల్ 37 బంతుల్లో అర్ధసెంచరీ సాధించాడు. ఆఖర్లో బదోని (10 బంతుల్లో 22 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడటంతో లక్నో 200 పైచిలుకు స్కోరు చేసింది.

రోహిత్, ధీర్ ఫిఫ్టీ-ఫిఫ్టీ

భారీ లక్ష్యఛేదనకు అవసరమైన హిట్టింగ్‌తో రోహిత్ ముంబై స్కోరును పరుగుపెట్టించాడు. మరో ఓపెనర్ బ్రెవిస్ (20 బంతుల్లో 23; 1 ఫోర్, 2 సిక్స్‌లు) వేగంలో వెనుకబడినా రోహిత్ బౌండరీలతో జోరు కనబరిచాడు. 28 బంతుల్లో ఫిఫ్టీ సాధించాడు. 88 పరుగుల వద్ద బ్రెవిస్ అవుటయ్యాక ముంబై తడబడింది. సూర్యకుమార్ (0), రోహిత్, హార్దిక్ (16), నేహల్ (1) వికెట్లను కోల్పోవడంతో ముంబై లక్ష్యానికి దూరమైంది. ఈ దశలో నమన్ ధీర్ మెరిపించినా అప్పటికే ఆలస్యమైంది. నమన్ 25 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించినా ముంబైని ఓటమి నుంచి గట్టెక్కించలేకపోయాడు.

స్కోరు వివరాలు

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: రాహుల్ (సి) తుషారా (బి) చావ్లా 55; పడిక్కల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) తుషారా 0; స్టొయినిస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) చావ్లా 28; హుడా (సి) నేహల్ (బి) చావ్లా 11; పూరన్ (సి) సూర్య (బి) తుషారా 75; అర్షద్ (సి) నేహల్ (బి) తుషారా 0; బదోని (నాటౌట్) 22; కృనాల్ (నాటౌట్) 12; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 214. వికెట్ల పతనం:** 1-1, 2-49, 3-69, 4-178, 5-178, 6-178. **బౌలింగ్:** తుషారా 4-0-28-3, అర్జున్ 2.2-0-22-0, అన్షుల్ 3-0-48-0, పియూష్ చావ్లా 4-0-29-3, నేహల్ 2-0- 13-0, హార్దిక్ 2-0-27-0, నమన్ 0.4-0-17-0, షెఫర్డ్ 2-0-30-0.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) మోసిన్ (బి) బిష్ణోయ్ 68; బ్రెవిస్ (సి) కృనాల్ (బి) నవీనుల్ 23; సూర్య (సి) బిష్ణోయ్ (బి) కృనాల్ 0; ఇషాన్ (బి) నవీనుల్ 14; హార్దిక్ (సి) నవీనుల్ (బి) మోసిన్ 16; నేహల్ (సి) కృనాల్ (బి) బిష్ణోయ్ 1; నమన్ (నాటౌట్) 62; షెఫర్డ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 196. వికెట్ల పతనం:** 1-88, 2-89, 3-97, 4-116, 5-120, 6-188. **బౌలింగ్:** అర్షద్ 2-0-11-0, హెన్రీ 2-0-24-0, కృనాల్ 4-0-29-1, మోసిన్ 4-0- 45-1, నవీనుల్ 4-0-50-2, రవి బిష్ణోయ్ 4-0-37-2.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.రే
కోల్‌కతా	13	9	3	1	19	1.428
రాజస్తాన్	13	8	5	0	16	0.273
హైదరాబాద్	13	7	5	1	15	0.406
చెన్నై	13	7	6	0	14	0.528
ఢిల్లీ	14	7	7	0	14	-0.377
లక్నో	14	7	7	0	14	-0.667
బెంగళూరు	13	6	7	0	12	0.387
గుజరాత్	14	5	7	2	12	-1.063
పంజాబ్	13	5	8	0	10	-0.347
ముంబై	14	4	10	0	8	-0.318

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

చివరి బెర్త్ ఎవరిదో?

నేడు చెన్నై, బెంగళూరు మధ్య కీలక పోరు ● మ్యాచ్‌కు వర్ష సూచన



రుతురాజ్, డు ప్లెసిస్

రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

బెంగళూరు: ఐపీఎల్ 17వ సీజన్‌లో డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్... మూడుసార్లు రన్నరప్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్లు 'ప్లే ఆఫ్స్' దశకు అర్హత సాధిస్తాయా లేక లీగ్ దశలోనే నిష్క్రమిస్తాయా ఈరోజే తేలిపోనుంది. ఇప్పటికే కోల్‌కతా నైట్‌రైడర్స్, రాజస్తాన్ రాయల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు 'ప్లే ఆఫ్స్'కు అర్హత పొందగా... చివరిదైన నాలుగో బెర్త్ కోసం చెన్నై, బెంగళూరు జట్లు ఈరోజు చిన్నస్వామి స్టేడియంలో ముఖాముఖి పోరుకు సిద్ధమయ్యాయి. ప్రస్తుతం చెన్నై 14 పాయింట్లతో నాలుగో స్థానంలో... బెంగళూరు 12 పాయింట్లతో ఏడో స్థానంలో ఉన్నాయి.

- చెన్నైపై బెంగళూరు గెలిస్తే... చెన్నై, బెంగళూరు, ఢిల్లీ, లక్నో జట్లు 14 పాయింట్లతో ఉమ్మడిగా నాలుగో స్థానంలో నిలుస్తాయి. ఈ నేపథ్యంలో మెరుగైన రన్‌రేట్ ఉన్న జట్టుకే ప్లే ఆఫ్స్ బెర్త్ ఖరారవుతుంది.
- బెంగళూరు, ఢిల్లీ, లక్నో జట్ల కంటే చెన్నై రన్‌రేట్ మెరుగ్గా ఉంది. చెన్నైపై గెలవడంతోపాటు ఆ జట్టు రన్‌రేట్‌ను అధిగమించాలంటే బెంగళూరు 18 పరుగుల తేడాతో చెన్నైను ఓడించాలి. ఒకవేళ చెన్నై లక్ష్యాన్ని నిర్దేశిస్తే ఆ లక్ష్యాన్ని బెంగళూరు 11 బంతులు మిగిలి ఉండగానే ఛేదించాలి. అయితేనే బెంగళూరుకు ప్లే ఆఫ్స్ బెర్త్ లభిస్తుంది.
- మరోవైపు చెన్నై విజయం సాధించినా లేదా వర్షం వల్ల మ్యాచ్ రద్దయినా ఆ జట్టు ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా ప్లే ఆఫ్స్ బెర్త్‌ను దక్కించుకుంటుంది.
- స్థానిక వాతావరణ శాఖ ప్రకారం శనివారం బెంగళూరు నగరానికి భారీ వర్ష సూచన ఉండటం గమనార్హం. ఫలితంగా బెంగళూరు జట్టు ప్లే ఆఫ్స్ అవకాశాలు ఆ జట్టు ప్రదర్శనపైనే కాకుండా వరుణ దేవుడి దయపై కూడా ఆధారపడి ఉన్నాయి.

అర్జున్‌కు మూడో విజయం



న్యూఢిల్లీ: షార్జా మాస్టర్స్ చెస్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్, భారత రెండో ర్యాంకర్ అర్జున్ ఇరిగేశి మూడో విజయం నమోదు చేశాడు. మాన్యుయల్ పెట్రోసియాన్ (అర్మేనియా)తో శుక్రవారం జరిగిన నాలుగో రౌండ్ గేమ్‌లో అర్జున్ 46 ఎత్తుల్లో గెలుపొందాడు. తెలంగాణకే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ రాజా రిత్విక్ రెండో ఓటమి చవిచూశాడు. అభిజిత్ గుప్తా (భారత్)తో జరిగిన నాలుగో రౌండ్ గేమ్‌లో రిత్విక్ 41 ఎత్తుల్లో ఓడిపోయాడు. భారత మహిళా గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక ఖాతాలో మూడో 'డ్రా' చేరింది. గ్లెబ్ దూడిన్ (హంగేరి)తో జరిగిన నాలుగో రౌండ్ గేమ్‌ను హారిక 26 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది.

సెమీస్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ

- అశ్విని-తనీషా ద్వయం కూడా
- ముగిసిన మిరాబా పోరాటం



బ్యాంకాక్: ఈ సీజన్‌లో తమ జోరు కొనసాగిస్తూ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ నాలుగో టోర్నీలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. థాయ్‌లాండ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో మరో అలవోక విజయంతో సాత్విక్-చిరాగ్ ద్వయం ముందంజ వేసింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ సాత్విక్-చిరాగ్ జంట 38 నిమిషాల్లో 21-7, 21-14తో జునైదీ ఆరిఫ్-రాయ్ కింగ్ యాప్ (మలేసియా) జోడీని ఓడించింది. ఈ ఏడాది ఐదో టోర్నీలో ఆడుతున్న సాత్విక్-చిరాగ్ మలేసియా ఓపెన్, ఇండియా ఓపెన్‌లలో రన్నరప్‌గా నిలిచి, ఫ్రెంచ్ ఓపెన్‌లో టైటిల్ సాధించింది. ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ టోర్నీలో మాత్రం ప్రిక్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించింది. మహిళల డబుల్స్ విభాగంలో పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో (భారత్) ద్వయం సెమీఫైనల్లోకి ప్రవేశించింది. క్వార్టర్ ఫైనల్లో అశ్విని-తనీషా 21-15, 21-23, 21-19తో లీ యు లిమ్-షిన్ సెంగ్ చాన్ (దక్షిణ కొరియా)లపై గెలిచారు. ఈ ఏడాది తొమ్మిదో టోర్నీలో ఆడుతూ తొలిసారి అశ్విని-తనీషా ద్వయం సెమీఫైనల్‌కు చేరుకుంది. పురుషుల సింగిల్స్ విభాగంలో భారత రైజింగ్ స్టార్ మైస్నం మిరాబా లువాంగ్ పోరాటం ముగిసింది. ప్రపంచ 84వ ర్యాంకర్ మిరాబా క్వార్టర్ ఫైనల్లో 12-21, 5-21తో ప్రస్తుత ప్రపంచ చాంపియన్, ప్రపంచ ఎనిమిదో ర్యాంకర్ కున్లావుత్ వితిద్‌సర్న్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయాడు.

పర్వీన్ హుడాపై నిషేధం

- పారిస్ ఒలింపిక్స్‌కు దూరమైన భారత మహిళా బాక్సర్
- 57 కేజీల విభాగంలో మళ్లీ బెర్త్ కోసం పోటీపడనున్న భారత్



న్యూఢిల్లీ: భారత మహిళా బాక్సర్ పర్వీన్ హుడా పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌ను కోల్పోయింది. ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) సస్పెన్షన్ వల్లే ఆమె పారిస్ విశ్వ క్రీడలకు దూరం కానుంది. 'వాడా' రిజిస్టర్డ్ టెస్టింగ్ పూల్ (ఆర్టీపీ) నియమావళి ప్రకారం ఆమె ఎప్పుడు ఎక్కడ ఉన్నారనే సమాచారాన్ని ఇవ్వడంలో విఫలమైంది. గత 12 నెలలుగా మూడుసార్లు పర్వీన్ ఈ సమాచారాన్ని ఇవ్వలేకపోవడంతో 'వాడా' ఆమెపై 22 నెలలు నిషేధం విధించింది. పర్వీన్ ఈ తప్పిదాన్ని ఉద్దేశపూర్వకంగా చేయలేదని 'వాడా' అధికారులకు భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్ఐ) వివరణ ఇచ్చింది. దాంతో 'వాడా' ఈ నిషేధాన్ని 14 నెలలకు కుదించింది. శుక్రవారంతో మొదలైన ఈ నిషేధం వచ్చే ఏడాది జూలై వరకు కొనసాగుతుందని బీఎఫ్ఐ తెలిపింది. గత ఏడాది హాంగ్జౌలో జరిగిన జరిగిన ఆసియా క్రీడల్లో మహిళల 57 కేజీల కేటగిరీలో పర్వీన్ కాంస్య పతకం సాధించి పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. పర్వీన్‌పై నిషేధం నేపథ్యంలో ఇప్పుడు 57 కేజీల విభాగంలో బెర్త్ ఖాళీ అయింది. పారిస్ ఒలింపిక్స్‌లో మహిళల, పురుషుల విభాగాలలో ఏడు చొప్పున ఒలింపిక్ వెయిట్ కేటగిరీలు ఉండగా... భారత్ నుంచి ఇప్పటికే ముగ్గురు మహిళా బాక్సర్లు (నిఖత్ జరీన్-50 కేజీలు; ప్రీతి-54 కేజీలు; లవ్లీనా బొర్గొహైన్- 75 కేజీలు) పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత పొందారు. పురుషుల విభాగంలో భారత్ నుంచి ఎవరూ అర్హత సాధించలేదు. పర్వీన్‌పై నిషేధం కారణంగా... ఈనెల 23 నుంచి జూన్ 3 వరకు బ్యాంకాక్‌లో జరిగే వరల్డ్ ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో భారత్ మహిళల విభాగంలో మూడు వెయిట్ కేటగిరీల్లో (57, 60, 66 కేజీలు), పురుషుల విభాగంలో ఏడు వెయిట్ కేటగిరీల్లో పోటీపడుతుంది.

క్లుప్తంగా...

8న చేప ప్రసాదం పంపిణీ

చార్మినార్/దూద్‌బౌలి (హైదరాబాద్): మృగశిర కార్తె సందర్భంగా ప్రతీ ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఆస్తమా రోగులకు చేప ప్రసాదాన్ని పంపిణీ చేయడానికి బత్తిన కుటుంబ సభ్యులు అంతా సిద్ధం చేస్తున్నారు. మృగశిర కార్తె ప్రవేశం రోజైన జూన్ 8వ తేదీన చేప ప్రసాదం పంపిణీ జరుగుతుందని శుక్రవారం బత్తిన అనురీత్ గౌడ్, గౌరీశంకర్‌గౌడ్‌లు మీడియాకు తెలిపారు. చేప ప్రసాదం తయారీలో భాగంగా జూన్ 7వ తేదీన ఉదయం 11 గంటలకు దూద్‌బౌలిలోని స్వగృహంలో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం, బావి పూజ కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. అనంతరం 8వ తేదీన ఉదయం ఇంట్లోనే తమ కుటుంబ సభ్యులందరూ చేప ప్రసాదాన్ని స్వీకరించిన అనంతరం ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు తరలించి ప్రసాదం పంపిణీ చేస్తామని వివరించారు.

కౌండిన్య అభయారణ్యంలో అరుదైన కప్ప



తిరుపతి మంగళం: తూర్పు కనుమల్లో భాగంగా, పలమనేరు సమీపంలోని కౌండిన్య అభయారణ్యంలో అరుదైన కప్పను గుర్తించినట్టు హైదరాబాద్‌కు చెందిన జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సంస్థ శాస్త్రవేత్తలు డాక్టర్ దీపాపై స్వాల్, డాక్టర్ ఎస్.ఎస్.జాదవ్, డాక్టర్ కరుత పాండి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీలంక తడిభూముల్లో మనుగడ సాగిస్తున్న శ్రీలంక బ్యాక్ ఫ్రాగ్ (కప్ప) భారతదేశంలో రెండు శతాబ్దాల క్రితమే కనుమరుగైన జాతిగా గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. శాస్త్రీయంగా ఈ కప్పను హైలారానా గ్రాసిలిస్గా పిలుస్తారని చెప్పారు. మంచినీటి అనుబంధంగా జీవించే ఈ కప్పను సుదీర్ఘ కాలం చేసిన పరిశోధనల్లో కనిపెట్టడం జీవ వైవిధ్య అధ్యయనాల్లో ఒక ప్రధాన మలుపుగా భావిస్తున్నామని పేర్కొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు మిఠాయిలు

సాక్షి, హైదరాబాద్: ప్రత్యేక సందర్భాల్లో తక్కువ వ్యవధిలో లక్షల మందిని గమ్యం చేర్చడం ద్వారా తెలంగాణ ఆర్టీసీ రికార్డు స్థాయి ఆదాయాన్ని సొంతం చేసుకుంటోంది. ఈ క్రమంలో ఇటీవల పోలింగ్ మరుసటి రోజు ఇదే తరహా రికార్డును సృష్టించింది. బస్‌పాస్ ప్రయాణికులతో కలిసి 14వ తేదీన ఏకంగా 54 లక్షల మందిని ఆర్టీసీ బస్సులు గమ్యం చేర్చాయి. వారి ద్వారా 24 గంటల వ్యవధిలో రూ.24.23 కోట్ల భారీ ఆదాయం నమోదైంది. ఆ రోజు మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉచితంగా ప్రయాణించిన మహిళలకు జారీ చేసిన జీరో టికెట్లతో కలుపుకొని ఈ ఆదాయం నమోదైంది. రికార్డుస్థాయిలో ఆదాయం సాధించటంలో డ్రైవర్లు, కండక్టర్లు సహా వేల మంది ఆర్టీసీ ఉద్యోగులు, అధికారు లు సెలవులు, వీక్లీ ఆఫ్‌లు రద్దు చేసు కుని మరీ పని చేశారు. చాలామంది డ్రైవర్లు డబుల్ డ్యూటీలు కూడా చేశారు. ఇలా ఉద్యోగుల సమష్టి కృషి ఆర్టీసీకి భారీ ఆదాయం రావటానికి కారణమైంది. దీంతో ఉద్యోగులందరికీ మిఠాయిలు పంచాలని సంస్థ నిర్ణయించింది.



హనుమకొండ జిల్లాలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షంతో కాజీపేట జంక్షన్‌లో రైల్వేట్రాక్‌పైకి చేరిన వరద నీరు



కటౌట్‌ను చూసి కొన్ని కొన్ని నమ్మేయాలి అన్నది సినీ డైలాగ్.. కానీ ఈ సీన్ చూస్తే.. నమ్మేటట్లు ఉందా.. ఈ గుడ్లగూబ ఏమో అంతుంది.. ఆ పక్షి చూడండి ఎంతుందో.. కానీ ఇక్కడ అది దాన్ని తరుముతోంది.. దాడి చేస్తోంది.. దాంతో ఆ గుడ్లగూబ వామ్మో వాయ్యో అంటూ తప్పించుకు పారిపోతోంది. ఇక్కడే మన దగ్గరే వికారాబాద్‌లో జరిగిన ఈ అరుదైన ఫైటింగ్ సీన్‌ను హైదరాబాద్‌కు చెందిన ఐటీ ప్రొఫెషనల్ హరి కె పాటిబండ(47) క్లిక్‌మనిపించారు. ఫొటో తీసి ఊరుకోలేదు. అంతర్జాతీయ ఫొటోగ్రఫీ పోటీలకు పంపారు. వారికీ ఈ ఫొటో బాగా నచ్చింది. అందుకే లక్షల్లో ఎంట్రీలు వచ్చినా.. '35 అవార్డ్స్ ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫీ' పోటీల్లో ఈ చిత్రం వైల్డ్ లైఫ్ విభాగంలో విజేతగా నిలిచింది. తెలంగాణకు చెందిన ఓ ఫొటోగ్రాఫర్‌కు ఈ స్థాయి పురస్కారం రావడం ఇదే తొలిసారి.

\- సాక్షి సెంట్రల్ డెస్క్



హరి ఏమంటున్నారు..

''బర్డ్ వాచింగ్ అన్నది నా రియల్ స్ట్రెస్ బస్టర్. వివిధ కారణాల వల్ల హైదరాబాద్ చుట్టుపక్కల పక్షుల సంఖ్య తగ్గిపోతోంది. ప్రతి వీకెండ్ నేను అవి ఉన్న ప్రదేశాలకు వెళ్తుంటాను. ఎలా ప్రవర్తిస్తుంటాయి అన్నదాన్ని గమనిస్తుంటాను. అలాంటి సమయంలో చిక్కినదే ఈ అరుదైన చిత్రం'' అని హరి అన్నారు.

ఇంతకీ ఏమిటా పక్షి..

చూడ్డానికి కాకిలా కనిపిస్తోంది గానీ.. దాని పేరు బ్లాక్ డ్రోంగో. వీటిని పోలీసు పక్షులు లేదా కొత్వాల్ పక్షులు అని కూడా అంటారు. బాగా దూకుడుగా ఉంటాయి. తమ కన్నా చాలా పెద్ద పక్షులు వచ్చినా.. ఢీకొట్టడానికి వెనుకాడవు. తమ ప్రాంతంలోకి వేరే పక్షులు వస్తే ఊరుకోవు. ఇదిగో ఇలా వెంటాడుతాయి.

సైబర్ నేరగాళ్ల మైండ్ 'బ్లాక్'

ఒకప్పుడు కేవలం బ్యాంకు ఖాతాలు మాత్రమే స్తంభన

ఆపై వారి సెల్‌ఫోన్ నంబర్లకూ వర్తించిన ఈ విధానం

తాజాగా హ్యాండ్‌సెట్స్‌నూ బ్లాక్ చేయిస్తున్న కేంద్రం

ఇటీవలే 28,200 హ్యాండ్‌సెట్స్ బ్లాక్ చేయాలంటూ ఆదేశాలు



సైబర్ నేరగాళ్లను కట్టడి చేయడానికి కేంద్రం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటోంది. తొలినాళ్లలో సైబర్ నేరాలతో సంబంధం ఉన్న బ్యాంకు ఖాతాలను బ్లాక్ చేసేది. ఈ విధానం పూర్తిస్థాయిలో ఫలితాలు ఇవ్వకపోవడంతో మరో అడుగు వేసింది. సైబర్ నేరగాళ్లు వినియోగించినట్టు, వినియోగించే అవకాశమున్నట్టు

ఆ రెండింటితో ఉపయోగం లేక...

ప్రాథమిక ఆధారాలు లభించిన సెల్‌ఫోన్ నంబర్లను బ్లాక్ చేయడం మొదలెట్టింది. దీంతో తెలివిమీరి వ్యవహరిస్తున్న ఆ కేటుగాళ్లు అధిక సంఖ్యలో ప్రీ యాక్టివేటెడ్ సిమ్‌కార్డులు సమీకరించడం మొదలెట్టారు. ఒక్కో నేరానికి ఒక్కో సిమ్ వాడుతున్నారని అధికారులు గుర్తించారు.

సాక్షి, హైదరాబాద్

సైబర్ నేరగాళ్లకు చెక్ చెప్పడానికి కేంద్రప్రభుత్వం మరో కీలకనిర్ణయం తీసుకుంది. వీరు వినియోగించే మొబైల్‌ఫోన్లు బ్లాక్ చేయిస్తోంది. తాజాగా 28,200 హ్యాండ్ సెట్స్ బ్లాక్ చేయాలని ఆయా సర్వీస్ ప్రొవైడర్లను ఆదేశించింది. ఈ ఫోన్లలో వాడిన 20 లక్షల ఫోన్‌నంబర్ల పూర్వాపరాలు మరోసారి పరిశీలించాలని స్పష్టం చేసింది. ఈ-కేటుగాళ్లు గత ఏడాది 'గ్రేటర్'పరిధిలోని బాధితుల నుంచి ఏకంగా రూ.621 కోట్లు కాజేశారంటే సైబర్ నేరాల తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

డార్క్‌నెట్‌లో దొరుకుతున్న డేటా

ఉత్తరాదికి చెందిన సైబర్ నేరగాళ్లు అక్కడి నుంచే దేశవ్యాప్తంగా బాధితులను టార్గెట్‌గా చేసుకుంటున్నారు. అయితే దీనికి సెల్‌ఫోన్ వినియోగదారుల వివరాలు అత్యంత కీలకం. వీరి నంబర్లతో కూడిన డేటా సైబర్ నేరగాళ్లకు డార్క్‌నెట్‌లో తేలిగ్గా దొరుకుతోంది. లక్ష మందికి సంబంధించిన ఫోన్ నంబర్లను కేవలం రూ.30 వేలకు విక్రయించేవారు అనేకమంది ఉన్నారు. ఈ డేటా వీరి వద్దకు ఎలా చేరుతోందనేది ఇప్పటికీ అంతుచిక్కడం లేదు.

ప్రీ యాక్టివేటెడ్ సిమ్‌కార్డులు

సైబర్ నేరగాళ్లు తమ ఉనికి బయటపడకుండా జాగ్రత్త పడుతున్నారు. ఒకవేళ బాధితుడు పోలీస్ ఫిర్యాదు చేసినా, దర్యాప్తులో ముందుకు వెళ్లకుండా, వారికి ఎలాంటి ఆధారాలు చిక్కకుండా ఉండేలా ప్లాన్ చేశారు. బ్యాంకు ఖాతాలు, సెల్‌నంబర్లు ఇలా ఏదీ తమ పేరుతో లేకుండా చూసుకుంటున్నారు. వీరికి అవసరమైన బ్యాంకు ఖాతాలు, సిమ్‌కార్డులను సరఫరా చేయడానికి కొన్ని ముఠాలు పని చేస్తున్నాయి. ఇతరుల పేర్లతో ఓపెన్ చేసిన బ్యాంకు ఖాతాలతోపాటు ప్రీ యాక్టివేటెడ్ సిమ్ కార్డులు సేకరించి సైబర్ నేరగాళ్లకు ఈ ముఠాలు అందజేస్తున్నాయి. బ్యాంకు ఖాతాలు ఇచ్చినందుకు కమీషన్లు, సిమ్‌కార్డుకు అధిక రేటు వీరికి దక్కుతోంది.

ఫోన్లు బ్లాక్ చేసేలా తాజా నిర్ణయం

సైబర్ నేరగాళ్లు వినియోగిస్తున్న హ్యాండ్‌సెట్స్‌ను బ్లాక్ చేసేలా కేంద్రం చర్యలు తీసుకుంది. ఈ బాధ్యతల్ని డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ (డీఓటీ) పర్యవేక్షించడం మొదలెట్టింది. సైబర్ నేరాల్లో బాధితులుగా మారినవారు నేరుగా, ఆన్‌లైన్ ద్వారా పోలీసులు లేదా సంబంధిత ఏజెన్సీలను ఆశ్రయిస్తున్నారు. లిఖిత పూర్వకంగా, 1930కు కాల్ చేయడం ద్వారా, వెబ్‌సైట్, యాప్‌ల్లో దాఖలవుతున్న వీరి ఫిర్యాదుల్లో తమను సంప్రదించడానికి సైబర్ నేరగాడు వినియోగించిన ఫోన్ నంబర్ వివరాలు ఉంటున్నాయి. ఈ డేటా ఆధారంగానే డీఓటీ మొబైల్ ఫోన్లు బ్లాక్ చేసేలా చర్యలు తీసుకుంటోంది.

సర్వీసు ప్రొవైడర్ల సహకారంతో..

ఈ సెల్‌ఫోన్ హ్యాండ్‌సెట్లు గుర్తించడం, బ్లాక్ చేయడంలో ఆయా నెట్‌వర్క్ సర్వీస్ ప్రొవైడర్ల పాత్ర అత్యంత కీలకం. ప్రతి సెల్‌ఫోన్‌కు ఇంటర్నేషనల్ మొబైల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిఫికేషన్‌గా (ఐఎంఈఐ) పిలిచే ప్రత్యేక నంబర్ ఉంటుంది. ఏ కంపెనీ సిమ్ వాడుతుంటే ఆ సర్వీస్ ప్రొవైడర్ల వద్ద ఈ ఐఎంఈఐ రిజిస్టర్ అవుతుంది. బాధితుల ఫిర్యాదులో ఉన్న సెల్‌నంబర్ ఆధారంగా సర్వీస్ ప్రొవైడర్ల సహకారంతో డీఓటీ ఐఎంఈఐ నంబర్లను గుర్తిస్తోంది. వీటితో జాబితా రూపొందించి ఆయా సర్వీస్ ప్రొవైడర్లకు పంపిస్తోంది. దీని ఆధారంగా ఈ ఐఎంఈఐ నంబర్లు ఉన్న ఫోన్లు పనిచేయకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇలా ఆ హ్యాండ్‌సెట్ బ్లాక్ అయిపోతోంది. ఇటీవల కాలంలో నేరగాళ్లు స్కైప్ కాల్స్ చేస్తూ బురిడీ కొట్టిస్తున్నారు. ఈ తరహాకు చెందిన స్కైప్ ఖాతాలను కేంద్రం బ్లాక్ చేయిస్తోంది.



తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనాల్లో వివిధ సువాసనలు వెదజల్లే రంగురంగుల పుష్పాలతో భూలోక వైకుంఠాన్ని తలపించే రీతిలో అలంకరించిన మండపంలో శుక్రవారం శ్రీపద్మావతి పరిణయోత్సవాలు శోభాయమానంగా ప్రారంభమయ్యాయి. మే 19వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరగనున్నాయి.

అమ్మ కంటే ఆస్తే ముఖ్యం

తల్లికి అంత్యక్రియలు చేయని కొడుకు, కూతుళ్లు

- మూడు రోజులకు తేలిన ఆస్తి పంపకాల లెక్క
- ఆ తర్వాతే అంత్యక్రియలు పూర్తి

నేరేడుచర్ల: కన్నతల్లి కన్నుమూస్తే అంత్యక్రియలు చేయాల్సిన కొడుకు, కూతుళ్లు.. రెండు రోజుల పాటు ఆస్తి పంపకాల కోసం తగవులాడుకున్నారు. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం కందులవారిగూడెంకు చెందిన వేము లక్ష్మమ్మ (80) అనారోగ్యంతో ఈ నెల 15న రాత్రి 11 గంటల సమయంలో మృతి చెందింది. లక్ష్మమ్మ భర్త వెంకట్‌రెడ్డి కొన్నేళ్ల క్రితం చనిపోయాడు. వెంకట్‌రెడ్డి, లక్ష్మమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. వీరిలో చిన్న కుమారుడు నారాయణరెడ్డి పదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. లక్ష్మమ్మ అయిదేళ్లుగా నేరేడుచర్లలోని చిన్న కుమార్తె వద్దే ఉంటుంది. ఇటీవల లక్ష్మమ్మ ఇంట్లో కాలు జారి కిందపడిపోవడంతో



ఫ్రీజర్‌లో లక్ష్మమ్మ మృతదేహం

మిర్యాలగూడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. బుధవారం రాత్రి ఆరోగ్య పరిస్థితి విషమించి లక్ష్మమ్మ చనిపోయింది. లక్ష్మమ్మ మృతదేహాన్ని చిన్న కుమార్తె నేరేడుచర్లలోని తన ఇంటికి తీసుకెళ్లింది. ఈలోగా కుమారుడు వేము సైదిరెడ్డి నేరేడుచర్ల చేరుకొని తల్లి శవాన్ని కందులవారిగూడెంకు తీసుకెళ్తానని పెద్ద మనుషుల సమక్షంలో చెప్పాడు. కుమార్తెలు.. తల్లి లక్ష్మమ్మ వద్ద ఉన్న నగదు, బంగారంలో తమకు కూడా వాటా ఇవ్వాలని శవం ఉన్న అంబులెన్స్‌ను అడ్డుకున్నారు. పెద్ద మనుషులు మృతదేహాన్ని కందులవారిగూడెంకు తరలించాక పంపకాలపై మాట్లాడుదామని నచ్చజెప్పి శవాన్ని తీసుకెళ్లారు. గురువారం కూడా పంపకాల్లో లెక్క తేలక పోవడంతో తల్లి మృతదేహాన్ని ఫ్రీజర్‌లో ఉంచి అంత్యక్రియలు నిలిపివేశారు. శుక్రవారం ఉదయం పెద్ద మనుషుల సమక్షంలో లక్ష్మమ్మ కుమారుడు సైదిరెడ్డి, ముగ్గురు కుమార్తెలు పెద్ద మనుషులు చెప్పినట్లుగా పంపకాలకు అంగీకరించడంతో అంత్యక్రియలు పూర్తి చేశారు. లక్ష్మమ్మ వద్ద ఉన్న రూ.21 లక్షల్లో రూ.15 లక్షలు కుమారుడు సైదిరెడ్డికి, తల్లిని సాకిన చిన్న కుమార్తెకు రూ.6 లక్షలు, 20 తులాల బంగారం ముగ్గురు కుమార్తెలు తీసుకునే విధంగా ఒప్పందం కుదిరింది.

కిడ్నాప్ పేరుతో కొత్త మోసాలు

రూటు మార్చిన సైబర్ నేరగాళ్లు

- మీ పిల్లాడిని కిడ్నాప్ చేశాం.. అడిగినంత డబ్బు ఇస్తేనే వదిలేస్తామని బెదిరిస్తున్న సైబర్ నేరస్తులు
- విదేశాల్లో చదువుతున్న విద్యార్థుల సమాచారం సేకరణ
- ఆపై వారి తల్లిదండ్రులకు ఫోన్ కాల్స్



సాక్షి, హైదరాబాద్

ఇప్పటివరకు ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్, పార్ట్‌టైం జాబ్స్, క్రెడిట్/డెబిట్ కార్డుల అప్‌గ్రేడ్ వంటి పలు రకాల మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరస్తులు ప్రస్తుతం రూటు మార్చారు. కిడ్నాప్ ముసుగులో విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేసి వారిని బెదిరించి వారి నుంచి అందినంత దోచుకుంటున్నారు. తల్లిదండ్రుల నుంచి దూరంగా వేరే ప్రాంతాలు, విదేశాల్లో చదువుకుంటున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సమాచారాన్ని సేకరించి అంతర్జాతీయ నంబర్ల నుంచి వాట్సాప్ కాల్స్ చేస్తున్నారు. మీ పిల్లలను కిడ్నాప్ చేశామని, సురక్షితంగా వదిలి పెట్టాలంటే డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు పలు సూచనలు జారీ చేశారు.

ఏం చేయాలంటే...

→ మీ పిల్లల్ని కిడ్నాప్ చేశామంటూ గుర్తు తెలియని వ్యక్తుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తూ ఫోన్లు వస్తే భయపడకుండా వెంటనే డయల్ 100 లేదా 1930కు ఫోన్ చేయాలి. లేదా సమీపంలోని పోలీసు స్టేషన్‌లో సంప్రదించి, విషయాన్ని వివరించాలి.

→ అంతర్జాతీయ కాల్స్ నుంచి ఫోన్లు వస్తే ముందుగా పిల్లలు చదువుతున్న విద్యా సంస్థ అధికారులతో మాట్లాడి, నిర్ధారించుకోవాలి.

→ గుర్తు తెలియని వ్యక్తులు, నంబర్ల నుంచి ఫోన్ కాల్స్ వస్తే సంభాషణలను రికార్డు చేయాలి. దీంతో విచారణలో పోలీసులకు సహాయం అవుతుంది.

అర్ఫాత్‌ను హత్య చేసి..

హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ అర్ఫాత్ అమెరికాలోని క్లీవ్‌ల్యాండ్‌లో ఉన్నత విద్యకోసం వెళ్లాడు. ఈ ఏడాది మార్చి7 కిడ్నాప్‌కు గురయ్యాడు. పది రోజుల తర్వాత అర్ఫాత్‌ను వదిలిపెట్టాలంటే 1,200 డాలర్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సైబర్ నేరస్తులు అర్ఫాత్ తల్లిదండ్రులకు ఫోన్ చేశారు. తీరా చూస్తే..గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో అర్ఫాత్ హత్యకు గురయ్యాడు. ఇలా చదువు కోసం విదేశాల్లో ఉన్న పలువురు భారతీయ విద్యార్థులు ఈ ఏడాది ప్రారంభంలో అపహరణకు గురై, మృత్యువాత పడ్డారు.

ఫీజు రాయితీ పేరుతో మోసం

అమెరికా విద్యార్థులకు కుచ్చుటోపీ

నిందితుడిని అరెస్టు చేసిన హైదరాబాద్ సైబర్ పోలీసులు

సాక్షి, హైదరాబాద్



అశోక్ కుమార్


అమెరికాలోని విశ్వ విద్యాలయాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఫీజులో రాయితీ కల్పిస్తామని మాయమాటలు చెప్పి మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరస్తుడిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ ఎస్.బోస్‌కిరణ్ వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కనోళ్ల అశోక్ కుమార్, అమెరికాకు చెందిన తరుణ్, ఢిల్లీకి చెందిన వక్వార్ స్నేహితులు. వీరికి కన్సల్టెన్సీ ఏజెన్సీలలో పనిచేసిన అనుభవం ఉండటంతో విదేశాల్లోని భారతీయ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సమాచారం సేకరించారు. తల్లిదండ్రులకు ఫోన్లు చేసి మీ పిల్లల యూనివర్సిటీ ఫీజులో 10 శాతం రాయితీ కల్పిస్తామని వారిని నమ్మించేవారు. అనంతరం వారి సెమిస్టర్ ఫీజును నిందితుల సొంత బ్యాంకు ఖాతాలకు మళ్లించుకునేవారు. ఆ తర్వాత క్రెడిట్, డెబిట్ కార్డులతో సెమిస్టర్ ఫీజులను చెల్లించేవారు. దీంతో ఫీజు చెల్లించినట్లుగా పేరెంట్స్‌కు సమాచారం వచ్చేది. కానీ, కొన్ని రోజుల తర్వాత మోసగాళ్లు చెల్లించిన ఫీజును 'ఛార్జ్ బ్యాక్' కోసం ఆయా యూనివర్సిటీలకు దరఖాస్తు చేసుకునేవారు. దీంతో తల్లిదండ్రులకు సెమిస్టర్ ఫీజు పెండింగ్ చూపించేది. ఈ క్రమంలోనే అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ వెస్ట్ ఫ్లోరిడాలో చదువుకుంటున్న తిరుమలగిరికి చెందిన ఓ బాధితుడు వీరి చేతిలో రూ.4.38 లక్షలు మోసపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు.. సాంకేతిక ఆధారాలను సేకరించి నిందితుడు అశోక్‌ను అరెస్టు చేశారు. అతని నుంచి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

మరో రెండ్రోజులు వానలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పలుచోట్ల మరో రెండ్రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సూచించింది. కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కూడా కురుస్తాయని హెచ్చరించింది. మధ్యప్రదేశ్‌కు నైరుతి ప్రాంతంలో చక్రవాతపు ఆవర్తనం (సైక్లోనిక్ సర్క్యులేషన్) కేంద్రీకృతమై ఉందని, ఇది సముద్ర మట్టం నుంచి సగటున 0.9 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోందని తెలిపింది. అదే విధంగా రాయలసీమ, ఉత్తర తమిళనాడు పరిసర ప్రాంతంలో మరో చక్రవాతపు ఆవర్తనం కేంద్రీకృతమై ఉన్నట్లు వాతావరణ శాఖ వివరించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగుడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. శుక్రవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు నమోదయ్యాయి. అత్యధికంగా నాగర్ కర్నూల్ జిల్లా జటప్రోలులో 6.75 సెంటీమీటర్ల వర్షం కురిసింది. రాష్ట్రవ్యాప్తంగా 1.71 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అన్ని జిల్లాల్లోనూ సాధారణ వర్షపాతం మించి వానలు కురవడం గమనార్హం.

పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

- 19న దక్షిణ అండమాన్ సముద్రం లోకి నైరుతి..
- రాష్ట్రవ్యాప్తంగా 1.71 సెం.మీ సగటు వర్షపాతం
- 2 నుంచి 4 డిగ్రీల వరకు తగ్గిన ఉష్ణోగ్రతలు



తగ్గిన ఉష్ణోగ్రతలు: శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ తక్కువగా నమోదయ్యాయి. ప్రధాన నగరాలను పరిశీలిస్తే..ఆదిలాబాద్‌లో అత్యధికంగా 37.8 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత, మెదక్‌లో అతి తక్కువగా 21.3 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న రెండురోజుల్లో కూడా రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వివరించింది. మరోవైపు నైరుతి రుతుపవనాలు ఈనెల 19న దక్షిణ అండమాన్ సముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాలు, నికోబార్ దీవుల వరకు ప్రవేశించే అవకాశం ఉన్నట్లు తెలిపింది.

శుక్రవారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం	కేంద్రం	గరిష్టం
ఆదిలాబాద్	37.8	ఖమ్మం	35.0
భద్రాచలం	35.2	మహబూబ్‌నగర్	34.9
దుండిగల్	31.8	మెదక్	33.8
హకీంపేట్	31.8	నల్లగొండ	36.0
హనుమకొండ	30.0	నిజామాబాద్	35.3
హైదరాబాద్	31.9	రామగుండం	33.2

4 రోజుల్లో అరకోటి మంది ప్రయాణం

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే నాలుగు రోజుల్లో అరకోటి మందిని గమ్యం చేర్చింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభ ఎన్నికలు జరుగుతున్నందున ఆ రాష్ట్రానికి వివిధ ప్రాంతాల నుంచి ఎక్కువ మంది ప్రయాణించారు. ఈ నెల 13న పోలింగ్ జరగ్గా, దానికి నాలుగు రోజుల ముందు దక్షిణ మధ్య రైల్వే దాదాపు 30 వరకు ప్రత్యేక రైళ్లను నడిపింది. అలాగే రెగ్యులర్ రైళ్లకు అదనపు కోచ్‌లను ఏర్పాటు చేసి వీలైనంత ఎక్కువ మందిని తరలించింది. ఆ నాలుగు రోజుల్లో రైళ్లలో సీటు దొరకటమే గగనంగా మారింది. గరిష్ట స్థాయికి వెయిటింగ్ జాబితా చేరుకోవటంతో చాలా ఎక్స్‌ప్రెస్ రైళ్లలో టికెట్ల విక్రయాన్ని కూడా రద్దు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రత్యేకంగా వెళ్లిన వారితోపాటు, స్వంత పనుల మీద వివిధ రాష్ట్రాలకు వెళ్లిన ప్రయాణికులను కలిపి.. పోలింగ్‌కు ముందు నాలుగు రోజుల్లో అన్ని రకాల రైళ్లలో 50 లక్షల మంది ప్రయాణించినట్టు రైల్వే అధికారులు తెలిపారు. ఇది కేవలం దక్షిణ మధ్య రైల్వే నడుపుతున్న రైళ్లకు సంబంధించిన సంఖ్య కాగా, ఇవి కాకుండా, ఇతర జోన్లకు సంబంధించి దక్షిణ మధ్య రైల్వే మార్గాల మీదుగా ప్రయాణించిన రైళ్లలోని వారి సంఖ్య దీనికి అదనంగా ఉంటుందని తెలుస్తోంది. దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు నడిపిన ప్రత్యేక రైళ్లలోని అన్‌రిజర్వ్‌డ్ కోచ్‌లలోనే ఏకంగా 4.3 లక్షల మంది ప్రయాణించారు. ఇక ఆర్టీసీ బస్సులు కూడా ఆ నాలుగు రోజులు కిక్కిరిసి తిరిగాయి. పోలింగ్ మరుసటి రోజు ఒక్క రోజే తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో 54 లక్షల మంది ప్రయాణించిన విషయం తెలిసిందే. పోలింగ్‌కు నాలుగు రోజుల ముందు నుంచి పరిశీలిస్తే, తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో దాదాపు కోటిన్నర మంది ప్రయాణించారు.

- పోలింగ్‌కు ముందు ద.మ.రైల్వే నడిపిన రైళ్లలో కిక్కిరిసిన జనం



Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.